RNI No. APTEL/2003/12253

భావవీణ


కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

Vol : 18 Issue No. 8 Monthly August 2021 ISSN No. : 2456-4702 Rs. : 15/-



గురజాడ అప్పారావు



గిడుగు రామ్మూర్తి



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 18 - Issue. 8 - August 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు

వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు గిడుగు రామ్మూర్తి పంతులు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త, హేతువాది. శిష్ట జన వ్యవహారిక భాషను గ్రంధ రచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషి చేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు రామ్మూర్తి 1860 సంవత్సరం ఆగష్టు 29న శ్రీముఖలింగం సమీపంలో ఉన్న పర్వతాలపేట అనే గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు వీర్రాజు, వెంకమ్మ. తండ్రి వీర్రాజు పర్వతాలపేట రాణాలో రెవెన్యూ అధికారిగా పనిచేశారు. ఉద్యోగ రీత్యా విజయనగరం జిల్లా చోడవరం బదిలీ అవ్వడంతో గిడుగు విజయనగరం జిల్లా వాసిగా గుర్తింపు పొందారు. పర్లాకిమిడి రాజావారి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ఓ వైపు ఉన్నత చదువులు అభ్యసిస్తూ చుట్టు ప్రక్కల నివసించే సవరజాతి ప్రజలతో పరిచయాన్ని పెంచుకున్నారు. సవర భాషలో వాచకాలు నిఘంటువులు తయారుచేశారు. నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించి విద్యావంతులను చేయటం కోసం బ్రిటీష్ ప్రభుత్వంతో పోరాడారు. ఆయన పోరాట పటిమకు జేజేలు పలుకుతూ 'రావుసాహెబ్' బిరుదుతో సత్కరించారు. అప్పటి జె.ఎ. ఏట్స్ దొర ఆధ్వర్యంలో గురజాడ, గిడుగు, శ్రీనివాస అయ్యంగార్ ఈ నలుగురు ఆలోచనల వలన వ్యావహారిక భాషోద్యమం ప్రారంభమైంది. వీరికి వీరేశలింగం పంతులు ఊతం కూడా లభించింది. 1919-20 సంవత్సరాల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కోసం 'తెలుగు' అనే మాస పత్రికను గిడుగు నడిపించాడు. ఈ పత్రికలో తన ఉపన్యాసాలను ప్రచురిస్తూ పోరాటం సాగించాడు. విశాఖ జిల్లా పర్యవేక్షణాధికారికగా వచ్చిన జె.ఎ. ఏట్స్ ఆలోచనలు గిడుగుని శిష్ట వ్యవహారికం వైపు నడిపించాయి.

తెలుగు భాషాభివృద్ధికి సమరశంఖం పూరించిన ఆయన భాషలోకి సరళత్వాన్ని సామాన్యుల చెంతకు తీసుకెళ్ళారు. అమ్మ భాషకు కమ్మనైన అర్థంతోపాటు అందలాన్ని ఎక్కించిన భాషా భగీరథుడిగా పేరొందారు. భాషకు జీవం పోసిన గిడుగు భాషలో సరళత్వాన్ని, మాధుర్యాన్ని బయట ప్రపంచానికి చూపారు. అప్పటి వరకు మహా ఉద్ధండులు వద్దనే ఉండిపోయిన అమ్మ భాష కమ్మదనం దశదిశలా వ్యాపించింది. ఆధునిక సాహితీ యజ్ఞంతో వాడుకలో అనేక ప్రయోగాలు చేసి తెలుగు జాతికి మార్గనిర్దేశం చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు పుట్టిన రోజునే మనం తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాము. తెలుగు భాషకు పునరుజ్జీవనం చేసి గిడుగు 1940 సంవత్సరం జనవరి 20వ తేదీన పరమపదించారు.

- సంపాదకవర్గం

Contents (విషయ సూచిక)

1. పగటివేషాలు - ప్రదర్శనారీతులు	- డా॥. ఎం. మునిరత్నం	5
2. వెలుగుబాటలో ఆధునిక సాహిత్యం	- డా॥. వి. అనిత	14
3. టెలివిజన్ ప్రసారాలు - భాషా స్వరూపం	- డా॥. వి.గోపాల్	18
4. ప్రజాకవి సుంకర సత్యనారాయణ గేయ సాహిత్యం	- పాత శ్రీనివాసరావు	22
5. తెలుగు సాహిత్యంలో వ్యవసాయం	- ఆకుల లక్ష్మణ్	26
6. తెలుగు గజల్ - కవి - కవితాత్మకత	- డా॥. నందిరెడ్డి పురుషోత్తమ రెడ్డి	29
7. నియోగి జీవితం - రచనల వైవిధ్యం	- నాగెల్లి ప్రభాకర్	31
8. ప్రాంతీయ కథా సంకలనాలు - రచయిత్రుల పాత్ర	- పరుచూరి మౌనిక	34
9. మరుభూమిలో మల్లెతీగలు నవల - వేశ్యా స్త్రీల జీవిత చిత్రణ	- డా॥. కడియాల వెంకటరమణ	37
10. ఆధునిక కథాసాహిత్యం - కవులు, కథానికలు	- వి. వెంకటేశన్	42
11. రాయలవారి యోగ దర్శన పాండిత్యం	- పతివాడ ధనంజయరావు	46
12. స్నేహలతా కవితాసంఘ ప్రస్తావన	- డా॥. సి. నర్సింహులు	49
13. మహిళా ఔన్నత్య ముకురం - మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ	- డా॥. జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి	54
14. ఆముక్త మాల్యద రాజనీతి	- పెరుగుపల్లి బలరామ్	60
15. జానపద సంగీతం - ప్రాముఖ్యత	- గాదె చంద్రశేఖర్	63
16. వేణుసంకోజు సాహిత్యం - పరిశీలన	- డా॥. జి. భాస్కర్ యాదవ్	65
17. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు భవితవ్యం	- డా॥. చవ్వా వెంకటరెడ్డి	69
18. తెలుగు తమిళ తొలి నవలలు - సమాజం	- డా॥. కె.చంద్రశేఖరరావు	73
19. నన్నయ దేవయాని ఒక పరిశీలన	- మినుకూరి శ్రీనివాస్‌రెడ్డి	89
20. జానపద సామెతల్లో స్త్రీ	- సోనబోయిన సతీష్	92
21. తెలుగు - వెలుగు	- డా॥. పెండ్యాల లావణ్య & డా॥. బూసి వెంకటస్వామి	95
22. Neglecting Women's Human Rights in Kondapalli...	- Dr. Venkata Ramaiah Gampa	99
23. The Impact of using Social Media on Academic..	- Dr. Kotaiah Veturi	103
24. Aerobics Dance on Flexibility of High School Boys	- Dr. Jayakumar K.	113
25. Triggering theForest Memories of Kerala...	- Dr. Lekha Pillai	117
26. Pokkali Cultivation in An Environmental ...	- Dr. Sebastian Joseph & - JiyaTharian	124
27. Role of temples in the Social Formation of the	- Nisha Ann Jacob	129
28. Problem of TranslatingGoreti Venkanna's Songs ...	S Parsharamulu	143
29. Evolution of Film as a Source of History	- Dr. Sebastian Joseph & - RadhikaLal	144
30. Spoken Histories on Periyar : River, Life World....	- Thara V M. & - Dr. Sebastian Joseph	153
31. Men in Shashi Deshpande's Roots and Shadows	- Prof. G. Sheela Swarupa Rani	160
32. Pandemics and the Colonial State in India..	- Lijo Sebastian & - Dr. Sebastian Joseph	166

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పగటివేషాలు – ప్రదర్శనారీతులు

– డా॥. ఎం. మునిరత్నం, తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై, తమిళనాడు.

పరిచయం :

తెలుగు ప్రజలకున్న అపూర్వ జానపద కళా సంపదలలో పగటివేషం ఒకటి. సంగీతం,సాహిత్యం మరియు నృత్యం మెదలయిన కళల్ని అభినయిస్తూ పండితుల్ని పామరుల్ని కలగలిపి గ్రామ దేవతల జాతరలు దసరాఉత్సవాల సంధర్భంగా వివిధ దేవుళ్ళ వేషాలకు ఆధునిక నాగరిక చిహ్నాలు కొన్ని జోడించి ప్రజల్ని ఆనంద పరుస్తుంటారు. ప్రజావినోదం ప్రధానమైన ఆశయంగా, ప్రజల ఆశలకూ, ఆశయాలకూ దర్పణంగా ఇవి దేశంలో ప్రచారం పొందాయి. వీటిని గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. ఈ పగటి వేషాల గురించి, జానపద ప్రదర్శన కళలను గురించి పరిశోధన చేసిన "శ్రీ బద్రి కూర్మారావు ఇలా చెబుతున్నారు. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కళియుగాలకు సంబంధ మైనవి, పగటివేషాలు.కృతయుగంలో దేవతలు,రాక్షసులు సాగర మధనం చేస్తున్నప్పుడు అమృతం పుడుతుంది ఆ అమృతం రాక్షసుల పాలుకాకుండా చేసేందుకు సాక్షాత్తు ఆ మహావిష్ణువే మోహినీ వేషం వేసుకిని అమృతం దేవతలకు పంచి పెట్టడం జరిగింది. త్రేతాయుగంలో శ్రీరాముని ధర్మపత్ని సీతాదేవిని అపహరించుకుపోవడానికి లంకాధిపతి రావణుడు జంగమ వేషాదారియై తన కార్యం నెరవేర్చుకున్నాడు. ద్వాపరయుగంలో ఊర్వశి శాప ఫలితంగా అర్జునుడు బృహన్నల వేషంతో రక్తి కట్టించాడు. కలియుగంలో కళింగరాజు గంగరాజు వేషం వేశాడని చరిత్ర చెబుతోంది. ఈ అంశమే కాకుండా పగటివేషాలు వేసే కళాకారులు పౌరాణిక పాత్రలతో పాటు కొన్ని చారిత్రక పాత్రలు కూడా వేస్తుంటారు. ఈ సమయంలో సమకాలీన సమాజానికి సంబంధించిన అంశాలను సంభా షణలను జోడించి ప్రజలను మెప్పిస్తుంటారు. ఆనాటి పరిపాలకుల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకు రావడానికి, వర్తమానాలను చేరవేయడానికీ, ఈ ప్రదర్శనలు ప్రధానంగా ప్రచారంలోకి వచ్చాయని ప్రసిద్ధి.

పగటివేషాల ద్వారా రాజులలో మార్పును తేవడం, ప్రజలలో చైతన్యాన్ని కల్గించడం, ప్రత్యేకించి పేర్కొనాలి. కాకతీయ యుగంలో యుగంధర మంత్రి పిచ్చివాడుగా నటించి పగటావేషంతోనే ఢిల్లీ సుల్తానలను జయించాడు. కళింగ గంగరాజు, పగటివేషాల వాని సాయంతోనే శత్రువు లను జయించాడన్న కథవిన్నదే. భారతదేశంలో స్వతంత్ర రాజుల పాలనలోనూ, సామంత రాజుల పాలనలోనూ చిత్రవిచిత్రమైన ఈ వేషాలు ప్రచారంలోకీ, వ్యాప్తిలోకీ వచ్చాయని అంటారు. రకరకాల మారువేషాలను ధరించి, గూఢాచారులుగా వీరు సమాచారం అందించే వారని చరిత్ర చెబుతోంది. వీరు వర్తకులుగా రత్నాలు, వజ్రాలు, అమ్మేవ్యాపారులుగా కెటలోకి ప్రవేశించి, రాజును వంచించి, అక్కడి విషయాలు చూసి, అక్కడి బలహీనత లను సేకరించి, దంబయాత్రలు చేయడం జరిగేది. పగటివేషాలు అలా బయలుదేరాయి. వీటిని ఒకప్పుడు "బహురూపాలు" అని పిలిచేవారు. పగటివేషదారులకు కృష్ణాజిల్లా "కూచిపుడి నిలయం" నృత్యనాటకాలు ఆడేవారు నాట్యమేళముగా ఏర్పడి, తమకున్నా కళా ఔనత్యంతో ప్రదర్శనలు ఇస్తున్నారు. కూచిపుడి వారిలో కొందరు సంవత్సరములో కొన్ని నెలలు సంచార మేళము లుగా ఏర్పడి, ప్రజలకు విజ్ఞానాన్ని ప్రభోదిస్తూ, ఆనం దాన్నీ, ఆలోచననూ కల్గిసున్నారు. కూచాపుడి,భాగవత కళా ప్రదర్శనలకు ప్రత్యేకత కాగా "గడ్డిపాడు" పగటి వేషాలకు ప్రసిద్ధిపొందింది.

పగటివేషాలకు అసలు విలువను చేకూర్చిన వారు "గడ్డిపాడు" వారే అనిపిస్తుంది. గడ్డిపాడు వారు అరవై రకాల వేషాలు ప్రదర్శించేవారు. ఈ వేషాలలో కొన్ని నిత్యజీవితంలో ఉండేవి. మరికొన్ని పౌరాణికమైంది.

మరికొన్ని కల్పిత వేషాలు కొన్ని పూర్తిగా హాస్య ప్రధానమైనవి. "నమ్మించడం" వీరివేషాలలో గొప్పతనం. గొర్రెలు కాచే గొర్రెల కాపరి వేషంవేస్తే , అక్షరాలవారు గొర్రెలకాపరిగానే ఉండేవారు. దేశంలోను కులాలనూ, మతాలనూ, మాండలిక భాషనూ, ఆకలింపూ చేసుకోవడంలో కూచిపుడివారూ, గడ్డిపాడువారూ వారికి వారే సాటి. తెలుగు సాహిత్యంలో పగటివేషం కళ వేములవాడ భీమకవి కాలంలో కనిపించిందని కొంతమంది పరిశోధకుల అభిప్రాయం వ్యక్తం చేసారు. పగటి వేషాల గురించి భరతకోశంలో, సర్వేశ్వర శతకంలో, పండితారాధ్యచరిత్రలో ప్రస్తావన ఉంది. జానపద కళారూపమున పగటివేషాలు ఎప్పుడు ఎక్కడ ప్రారంభమయ్యాయో చెప్పడానికి ఖచ్చితమైన చారిత్రకాధారాలు లేవు. మనకు ఇప్పటి వరకు లభించిన చారిత్రక ఆధారాలను బట్టి మూడు వందల ఏళ్ళనాడు అంటే 19వ శతాబ్దంలో మైసూరు ప్రాంతం నుండి పల్లావఝుల వెంకటరామయ్య అనే ఆయన ఆంధ్రదేశం వచ్చి రేపల్లెలో ఉంటూ మనవారికి ఈ పగటివేషాలు నేర్పాడని అంటున్నారు. అలా నేర్పివుంటే ఆయన ఈ పగటికళలకు ఆద్యుడని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు, చేశారు. తర్వాత వీటికి "గడ్డిపాడు" ప్రధాన కేంద్రం, నివాస స్థానం అయ్యిందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. వీరి భాగవతులకు కూచిపుడి ప్రధాన కేంద్రంగా ఉన్నట్లే, పగటివేషాలకు "గడ్డిపాడు" ప్రధాప కేంద్రం అయ్యింది. పగటివేషాలు ధరించే వారిలో పల్లావఝుల వారూ, శ్రీకారం వారూ, కూచివారూ, కనువూడివారు, బెల్లంకొండల వారూ, బాపట్ల వారూ, కవుల వారూ, మరికొందరూ ప్రసిద్ధులు వీరందరినీ తీర్చిదిద్దింది పైన చెప్పిన మైసూరు బ్రాహ్మణుడు. వీధి నాటకాలు క్రమంగా పగటివేషాలుగా రూపుదిద్దుకొన్నాయని కొందరి అభిప్రాయం. భామకళాపంలోని చిల్లర పాత్రలే క్రమంగా పగటి వేషాలుగా మారి పోయాయని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఇవి ప్రత్యేకంగా పగటిపూట ప్రదర్శించే వేషాలు కావడం వల్ల, వీటికి పగటివేషాలు అనే పేరు వచ్చిందనడంలో ఎట్టి సందేహంలేదు.

పురాణేతిహాసాల పరంగా :

అనేక కథలు పురాణేతిహాసాల్లో ప్రస్తుతం ప్రదర్శిస్తున్న పగటివేషాల్లో కనిపిస్తున్నాయి. ఇవన్నీ ముఖ్యంగా శైవ, వైష్ణవ సంబందాలు. మిగతా ఒకటో రెండో ఏమైనా ఉంటే ఉండవచ్చు. అధిక శాతం శైవ,వైష్ణవ కథలు మాత్రమే. 1.శివుని మాయామునివేషం, 2. అర్ధ నారీశ్వరుని వేషం,3. గొరవయ్య వేషం, 4. గంగిరెద్దుల వేషం, 5.జంగందేవర వేషం, 6. రంభశుక మహర్షి వేషం, 7. శక్తి వేషం, 8. ఎరుకుల సానివేషం, 9. బుడబుక్కల వేషం. దేవతల మారువేషాల్లోని కథలు పగటివేషానికి ఎంతో ఉపయోగపడ్డవి. ఇవన్నీ పగటి వేషాల పుట్టుకకు కొంత వరకు దోహదకారులైనాయి అని చెప్పవచ్చు. ఎంత వరకు దోహదకారులైనాయో వివరంగా తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

శివుని మాయవటుని వేషం :

దక్షుని కుమార్తెగా జన్మించిన పార్వతీ శివుని భర్తగా పొంది తర్వాత దక్షుని కోపాగ్నికి గురై దక్షయజ్ఞంతో తనువు చాలిస్తుంది. మరో జన్మలో మేనకా హిమవంతుల కుమార్తెగా పార్వతీ జన్మిస్తుంది. శివుని పెండ్లి చేసుకోవాలని నిశ్చయించి అడవులలో తపస్సు చేస్తుంది. గతజన్మలోనే సతీదేవి (పార్వతి)ని తలుచుకుంటు శివుడు శ్మశానంలో పిచ్చివానిగా సంచరిస్తుంటాడు మన్మధబాణాన్ని మన్మధుడు ప్రయోగిస్తాడు. ఆ బాణ ప్రయోగంతో కామేచ్ఛ చెందిన శివుడు పార్వతిని వివాహం ఆడాలని అరణ్యంలో తపస్సు చేస్తున్న పార్వతి వద్దకు కపటవటుని వేషంతో వస్తాడు. పార్వతినీ పెండ్లాడతాడు. ఇది పగటి పూట ధరించిన వేషానికి ఉదాహరణ.

శివుని కిరాతకుని వేషం :

శివుడు కిరాతకునిగా అర్జునునితో యుద్ధం చెయ్యడం తర్వాత తన నిజ స్వరూపాన్ని చూపించి పాశుపతాస్త్రాన్ని ప్రసాదించడం శివుని మారువేషానికి మరొక ఉదాహరణ.

అర్ధ నారీశ్వరుని వేషం :

పూర్వం భృంగి అనే గణనాధుడు మోక్షం సాదించాలనే ఆపేక్షతో శివునికి సేవ చేసేవాడు. తనను సేవించడం లేదని పార్వతి భృంగిపై కోపించి అతని శరీరంలోని రక్తమాంసాలను పీల్చి మూర్చిల్లేటు చేస్తుంది. ఈ విషయాన్ని గమనించిన శివుడు తన భక్తునికి అనుగ్రహించి దండాయుధాన్ని పూతకోలగా ఇస్తాడు. అప్పుడు పార్వతి భక్తునిపై ఉన్న ప్రేమ తనపై చూపడంలేదని భావించి బాదపడుతుంది. తర్వాత కేదారం అనే పుణ్య క్షేత్రంలోని గౌతముని ఆశ్రయానికి పోయి, ఆయన ఉపదేశించే ఆ ప్రాంతంలో ఆవిర్భవించి ఉన్న కేదారేశ్వరుని ప్రార్ధించి, ఆ ఈశ్వరుని సాక్షాత్కారం పొందిన పిదప ఈశ్వరుని అర్ధాంగాన్ని సాధించి అర్ధనారీశ్వరుని ఔతుంది. నాటి నుండి శివుడు అర్ధనారీశ్వరునిగా, పార్వతి అర్ధనారీశ్వరునిగా భక్తులతో పూజలందుకుంటున్నాడు. పూర్వం త్రిపురాసురుడనే రాక్షసుడు స్త్రీ చేతిలోను, పురుషుని చేతిలోను చావకుండా వరం పొందుతాడు. శివుడు అతన్ని చంపడానికి స్త్రీ, పురుష శక్తుల్ని రెండింటిని తనలో చేర్చి అతనితో యుద్ధం చేసి సంహరిస్తాడు. త్రిశూలాన్ని, కపాలాన్ని కుడిచేత ధరించి దానితో త్రిపురాసురుణ్ణి పొడిచి వెంటనే వామహస్తంతో త్రిశూలాన్ని ధరించి మరల పొడిచి సంహరిస్తాడు. ఈ అర్ధనారీశ్వరునిలో దక్షిత భాగం శివుడు, వామభాగం పార్వతి అర్ధనారీశ్వర ఆవిర్భావానికి మరోక ఐతిహ్యం.

అర్ధనారీశ్వర వేషంలో స్త్రీ,పురుషలిరువురు సమానం అనే విషయంతో పాటు శైవమత ప్రచారానికి కూడా ఉపయోగపడుతుందీ ఈ పగటివేషం. నెత్తిపై గంగ వుంటుంది. గంగ, పార్వతీ ఈ ఇద్దరితో శివుడు పడేపాట్లు అనగా బహు భార్యత్వం వలన ఏర్పడే చిక్కులను గురించి తెలియజేస్తూ సవతుకలయ్యారు. సమాజంలో ఎలా జరుగుతుంటాయో ఈ కళారూపం తెల్పుతుంది. అంతేకాక త్రిపురాసుర సంహారం, దక్షయజ్ఞం,దేవాసుర, అమృత మధనం, పార్వతీ పరిణయం మెదలైన శైవ సంబంద కథలను భక్తులు ఈ నృత్యం ద్వారా తెలుసుకోవడానికి దోహదపడుతుంది. ఏదైనా కష్టం కలిగితే త్రిమూర్తులు ముగ్గురు సమంగా పంచుకునే వారని అందుకు నిదర్శనం దూవతల రక్షణార్ధమై శివుడు హలహాలాన్ని సేవించడమే అని తెలియజేస్తూ మానవులందరూ కూడా కష్టసుఖాల్లో సమంగా పాలుపంచుకోవాలనే తత్వాన్ని కూడా అర్ధనారీశ్వర వేషం తెలియజేస్తుంది.

జంగం దేవర వేషం :

వైష్ణవ మతప్రచారం హరిదాసులు చేస్తారు. శైవమత ప్రచారం జంగం దేవరలు చేస్తారు. ఈశ్వరుడు జంగం వేషం ధరించి ముల్లోకాలు బిక్షాటన చేసి సిరియాలుడనే శివభక్తుని పరీక్షించి, అనుగ్రహించడం ఈ కథ సారాంశం. కడితే లింగాన్నే కట్టాలి. పెడితే జంగానికే పెట్టాలి అని గ్రామీణులకు తెలియజేస్తూ యాచించుకుంటారు. జానపదుల విశ్వాసాన్ని విస్మరించకుండా చేయడానికి , జానపదుల్లో ఉండే భయాన్ని పొగొట్టడానికి సహకరించే వేషం జంగం దేవర వేషం. భగవంతుడైన శివుడే సర్వాన్ని కోల్పోయి శ్మశానంలో బూడిద పూసుకొని సంచరించాడని కనుక మానవులకు మనకు శ్మశానం తప్పదని గుర్తు చేయడనికే వైరాగ్య నిదర్శనమైన విభూతిని పూసుకొని ఉన్నత విలువలతో జివించమని తెలియజేసే వేషం జంగందేవర వేషం.

కుల ప్రధాన కథలపరంగా :

పగటివేషాలల్లో విభిన్న కులాలకు సంబంధించిన అనేక వేషాలు ప్రదర్శిస్తుంటారు. 1. లంబాడివేషం, 2. వీరబాహుమాదిగవేషం, 3. భట్రాజు వేషం, 4. ఎరుకులసాని వేషం, 5. కోమటిలింగ బల్జవేషం, 6. కోయ వేషం, 7. బోడిబ్రాహ్మణ వేషం, 8. వడ్డిఉప్పర వేషం, 9. గొల్ల బోయడు వేషం, 10. బుడబుక్కల వేషం, 11. జంగం దేవర వేషం,12. దేవాంగుల వేషం,మొదలైన అనేక కులాల గురించి వారు సమాజంలో అనుభవిస్తున్న కష్టనష్టాలను గురించి వీరు ప్రదర్శనరూపంగా జానపదులకు తెలయజేస్తారు.

చారిత్రక కథలపరంగా :

చారిత్రక పరంగా ఆలోచిస్తే పూర్వం భారతదేశంలో చక్రవర్తులు, రాజులు, మారువేషాలు ధరించి సామంత రాజుల కార్యకలాపాలను, ప్రజల క్షేమ సమాచారాలను తెలుసుకొన్నట్లు చరిత్ర తెలియజేస్తుంది.

యుగంధర మహామంత్రి :

కాకతీయయుగంలో యుగంధర మహామంత్రి పిచ్చి యుగంధరునిగా నటించి ఢిల్లీ సుల్తాన్ పట్టుకుపోతాన్ అంటూ ఢిల్లీ సుల్తానులను జయించింది మారువేషంలోనే.

కళింగ గంగు :

క్రీ.శ 1132 లో కళింగ గంగు కూచిపూడి భాగవతుల ఆటపాటల చేతనే తన శత్రువైన ఉత్కలరాయలును జయించడం సంభవించింది. అంతేకాక కళింగ గంగరాజు పగటివేషాల వారి సాయంతో శత్రు రాజుల్ని జయించాడని మాచుపల్లి కైఫీయత్ కూడా తెలియజేస్తుంది.

సమ్మెట గురవరాజు :

క్రీ.శ 1505 నుండి క్రీ.శ 1509 వరకు విజయ నగరాన్ని పాలించిన వీరనరసింహరాయల సామంత రాజైన సమ్మెట గురవరాజు దుశ్చర్యలను బయటపెట్టి అతన్ని వధించుటకు మార్గం సుగమం చేయుటకు తోడ్పడింది పగటివేష భాగవతులే. ఇది చారిత్రక సత్యం.

ఆధ్యాత్మికపరంగా :

మతమేదైనా తత్వాన్ని ప్రభోదిస్తూ అందరికీ ఆమోద యోగ్యంగా ఉండే ఆధ్యాత్మిక భోదనల సారాన్ని తెలియ జేసే అంశాలను ఆధ్యాత్మికాలుగా తీసుకోవడం జరుగు తుంది. అంటే ఇవి ఆధ్యాత్మిక సంబంధమైన పగటి వేషాలు. 1. ఆదిభైరాగివేషం, 2. ఫకీరు సాయిబుల వేషం, 3. హరిదాసు వేషం, 4. అర్ధనారీశ్వర వేషం, 5. రంభశు కమహర్షి వేషం, 6. చాతాది వైష్ణవుల వేషం, 7. కాశికా విళ్ళవేషం.

ఆదిభైరాగివేషం :

మనమంతా మట్టినుంచి ఆవిర్భవించిన వారమే. కనుక తిరిగి మట్టిలోనే కలిషిపోతామని అడ్డ బట్టుతోనో, కొందరు నిలువ బట్టుతోనో మరికొందరు ఇస్లాంమతస్తుల వలె మీసాలు లేకుండా గడ్డాలు పెట్టుకొని వస్తారు. వీరు ఏ ఒక్క మతానికి చెందిన వారు కాదని జానపదుల నమ్మకం. ఏ మతం వాడైనా చివరకు కలిసేది మట్టిలోనే అనే సందేశం ఇస్తారు.

ఫకీరు సాయిబుల వేషం :

ఫకీరు సాయిబుల వేషం శరీరం శాశ్వతం కాదని దీనిని సుఖ పెట్టడం సమంజసం కాదంటారు. ప్రాణం ఉన్నంత కాలం రకరకాల ఆలోచనలు కలిగి ఉంటాడని తెలియ జేసి ధనం ఉంటేనే జనం చేరుతారని బంధు వర్గం, స్నేహిత వర్గం చేరుతుందని వేదాంత దోరణిని తెలియ జేయడం ఈ పగటి వేషాల లక్షణం.

హరిదాసు వేషం :

భగవంతుని సన్నిధి చేరాలంటే హరినామస్మరణ తప్ప వేరు మార్గంలేదని తెలయజేసే వేషం హరిదాసు వేషం. అక్షయ పాత్రలపై దాల్చి ఆధ్యాత్మిక, త్యాగరాయ, అన్నమయ్య కీర్తనలు పాడుతూ ఇంటింటికి పండుగ సందర్భంలో తిరిగి వారి నామస్మరణ చేసి ఏడెనిమిది గంటలకల్లా వారి స్వగృహానికి చేరుకుంటారు.

అర్ధనారీశ్వర వేషం :

జీవిత గమనంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమనే విషయంతో పాటు శైవ మత ప్రచారంకు ఉపయోగపడే పగటి వేషమిది.

రంభశుకమహర్షి వేషం :

రంభ, శుకమహర్షికి సంబంధించిన సంవాదం ఈ వేషంలో ప్రదాన ఇతివృత్తం. రంభ తన అందచందాలతో శుక మహర్షిని వశం చేసుకోవాలని మోహించడం శుక మహర్షిని గ్రహశక్తితో విజయం సాధించడం రంభ మహర్షిని వదిలి వెల్లడంలో ఈ పగటివేష ప్రత్యేకత. ఈ పగటివేషం వలన మానవుడిని గ్రహశక్తి దేనినైనా సాధించ వచ్చు. ఎటువంటి అందగత్తెలైనా దూరం చేసుకోవచ్చు అనే సందేశం కల్పిస్తుంది.

చాతాది వైష్ణవుల వేషం :

జన్మరహస్యం, వైష్ణవమత ప్రాధాన్యత, తల్లిగర్భంలో ఒక్కొక్క మాంసంలో పిండం ఏ విధంగా అభివృద్ధి చెందేది దశావతార వర్ణన క్రమం, మానవుడు జన్యించిన మొదలు మరణించే వరకు చేసే కార్యక్రమాలను గురించి తెలుపుతుంది. ఇంకా క్లుప్తంగా వివరించాలంటే ధరణి పుట్టుక, ధరణినాశ్రయించి జీవించే జీవుల పరిణామం, ఆ జీవులు సృష్టించుకున్న మతాల గురించి వారు ఆచరించవలసిన నియమాల గురించి తెలయజేస్తారు. అంతేకాక స్త్రీ ఋతుమతి అయిన పదహారు రోజుల తరువాత గర్భంనిలిచినట్లయితే ఆనాటి నుంచి ఏ రోజు గర్భం నిలిస్తే ఏ విధమైనా మానవ జన్మ లభిస్తుందనే విషయాన్ని తెలియజేస్తారు. అనగా జ్యోతిష్య అంశానికి దగ్గరగా ఈ చాతాది వైష్ణవుల పగటివేషం ఉంటుంది.

కాశికావిళ్ళవేషం :

కాశికావిళ్ళవేషం భార్యాభర్తల సంవాదంతో కూడిన హాస్యప్రదానమైన పగటివేషం. రామేశ్వరం పోయినా శనేశ్వరం వదలదన్నట్టు కాశీకి పోయివచ్చిన స్త్రీ బంధం మాత్రం పట్టి పడీస్తుందని, ఏ బంధాన్నైనా తెంచుకోవచ్చేమో కాని సంసార బంధాన్ని వదిలించుకోలేమనే తత్వ జ్ఞానాన్ని ప్రబోదిస్తుంది ఈ పగటివేషం.

వినోదాత్మకాలపరంగా :

జానపదులకు వినోదాన్ని సమకూర్చేవి వినోదాత్మకాల క్రింద వర్గీకరించడం జరిగింది. అవి, 1. గారడివేషం, 2. దేవరపెట్టె వేషం, 3. పాములాట, 4. గంగిరెద్దుల వేషం మొదలైనవి ఉన్నాయి. అవి

గారడి వేషం :

సమాజంలో ఎవరైనా బురిడి మాటలు చెపితే వాడుత్త గారడివాడు అంటారు. అనగా ఉన్నవి లేనట్టు, లేనివి ఉన్నట్లు తెలియజేసేది. ఇదొక రకమైన ఇంద్రజాల విద్య. నెత్తిపై పాయ్యి ముట్టించుకుని దానిపై కలాయి పెట్టి గారెలు లాంటివి వండటం, దారంకట్టి ఆ దారం మీద నడవడం మొదలైనవి చేస్తారు. ఇవి జానపదులకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని రేకెత్తించి ఆలోచనా శక్తిని పెంపొందించు కోవడానికి దోహదమౌతాయి.

కాటికాపరి వేషం :

రాజులకు రాజూ, షట్చక్రవర్తులలో ఒకరైనా సత్య హరిశ్చంద్రునికే కష్టాలు తప్పలేదని సత్య మార్గంలో పయనించేవారికి కష్టాలు అధికంగా ఉంటాయని తెలియజెప్పేది కాటికాపరివేషం. సత్యమార్గంలో పయనిస్తే కొన్ని కొన్ని సార్లు సర్వం కోల్పోవలసి వస్తుందని తెలియజేస్తూ బాధలను బరిస్తే చివరకు విజయం సాధించి మోక్షాన్ని పొందవచ్చని తెల్పుతుంది. కనుక కాటికాపరివేషం నీతితో పాటు వినోదాన్ని సమకూర్చుతుందని చెప్పవచ్చు.

గంగిరెద్దుల వేషం :

గంగిరెద్దు ఆవిర్భావం ప్రదాన ఇతివృత్తం. గజాసురుని భక్తికి మెచ్చి వరమిచ్చి అతను కోరిన విధంగా వక్షస్థలంలో నివసిస్తాడు శివుడు. పతి వియోగంతో పార్వతి విలపిస్తుంది. నారదమహర్షి సూచన మేఱకు విష్ణుమూర్తిని వేడు కుంటుంది. బ్రహ్మాదిదేవతలు ఇంద్రునితో సహా గజాసుర పట్నానికి వెళ్ళి గంగిరెద్దుల ఆటను ఆడిస్తారు. గజా సురుడు తన సమక్షంలో ఆటను ప్రదర్శించమని కోరు తాడు. ఆ సమయం కోసం ఎదురుచూసిన విష్ణుమూర్తి అద్భుతంగా ఆటను నిర్వహిస్తాడు. ఆనందభరితుడైనా గజాసురుడు ఏం కావాలో కోరుకోమంటాడు. ఇది శివుని వాహనం నంది తన స్వామికి దూరమై విలపిస్తుంది. ఆ స్వామిని నంది కడకు చేరనియ్యి అని కోరతాడు. ఇతను అసుర సంహారియైన చక్రదారి అని తనకు చావు తప్పదని తెలుసుకుని శివున్ని ప్రార్థించి నందీశ్వరునికి ఎదరు నిలుస్తాడు గజాసురుడు. విష్ణుమూర్తి నందిని ప్రేరే పించగా కొమ్ములతో గజాసురుని కుమ్మగా గర్భంలోని శివుడు బయటకు వస్తాడు. గజాసురుడు ఆయాసపడుతూ హే..... శంకరా... దేవా... అని ప్రార్థిస్తాడు. శివుడు వానికి ప్రత్యక్షమై నేను అందరికి కావాలసిన వాన్ని నన్ను బంధించడం తగదు మరలా ఏం కావాలో కోరు కోమంటాడూ శివుడు. ముల్లోకాల్లో పూజింపబడాలని తన

చర్మంతోనే నీవు ఎప్పుడూ ఉండాలని కోరుకుంటాడు గజాసురుడు. అలాగే శివుడు వరం ఇచ్చి కైలాసం చేరుకుంటాడు. అక్కడ వినాయకుడు శివుని అడ్డగిస్తాడు. శివుడు కోపంతో వినాయకుని శిరస్సు ఖండిస్తాడు. పార్వతి విలపిస్తుంది. వెంటనే శివుడు గజాసురుని శిరస్సును వినాయకునికి తగిలించి ప్రాణంపోస్తాడు. నాటినుంచి వినాయకుడు గజాననునిగా పిలబడుతూ భక్తులచే పూజింపబడుతున్నాడు. ...

మనుష్యుల మనస్తత్వాలను గురించి ప్రతిబింబించేవి :

అవి 1. మందులవేషం, 2. సోమయాజులు, సోమి దేవమ్మ వేషం, 3. అత్తరసాయిబువేషం, 4. సిద్ధి కంచ నివేషం, 5. పిట్టలదొర వేషం, 6. కొమ్మదాసరివేషం, 7. చిట్టిపంతుల వేషం , 8. కన్నకైరుడు వేషం, 9. పఠాన్ వేషం, 10. శక్తివేషం, 11. శారదవేషం.

జానపదుల అద్భుతకథల పరంగా :

జానపదులకు అద్భుతకథలంటే చాలా ఇష్టం. ఈ కథల్లో భగవంతుడు లేదా దుష్టశక్తి భక్తుని పరిక్షించడం అప్పుడు కొన్ని ఇతర శక్తుల సహాయంతో కథానాయకుడు మారువేషాల ద్వారా వాటిని సాధించడం జరుగుతుంది. భగవంతుడు, దుష్టశక్తులు కూడా మారువేషాలను దరించడం లాంటి అద్భుత సంఘటనలు ఎన్నో అనేకం కనిపిస్తాయి. అవి కొన్ని 1. ఎరుకులసాని వేషం, 2. అంకమ్మవేషం, 3. పోచమ్మవేషం.

ఇతరాలు :

1. భీమాంజనేయయుద్ధం, 2. శ్రీ కృష్ణజాంబవంతుడు, 3. వాలీసుగ్రీవుల యుద్ధం.

పోషకులు :

పగటివేష కళాకారులు ఏదైనా గ్రమానికి ప్రదర్శన నిమిత్తం వెళ్ళినప్పుడు ముందు ఆ గ్రామంలో ఉన్న గ్రామ పెద్దలను కలుస్తారు. గ్రామపెద్దలను కలవడం వలన గ్రామపెద్దలు అదొక గణతగా బావించి వారే ఆ కళాకారులకు పోషకులుగా మారుతారు. అంతేకాక మరికొంతమంది నుంచి ఆర్థిక సహాయం అందేవిధంగా ఆ గ్రామపెద్దలే దోహదపడతారు. ప్రదర్శనలిచ్చే సమయంలో గ్రామంలోని మరికొందరు ఉద్యోగులు, కళాకారులు, యువకులు, కవుల చిరునామాలను తెలుసుకుని వారితో ముచ్చటిస్తారు. దీనివలన గ్రామంలో అనేకమందితో పరిచయాలు ఏర్పడతాయి. ఈ పరిచయం వారికి పోషకులుగా మారడానికి అస్కారం ఉంది. ఇంకా గ్రామంలో పగటివేషాల్ని తిలకించే ఎంతోమందిని పోషకులుగా తయారుచేసుకుంటారు. అందుచేత గ్రామాల్లోని ప్రజలంతా పోషకులగానే చెప్పవచ్చు.

ప్రదర్శనా రంగస్థలం :

పగటి వేష కళారూపానికి ప్రతి ఇంటి ప్రాంగణం ఒక రంగస్థలమే. అది ఎత్తైన ప్రదేశం కావచ్చు లేదా కొంచెం లోతట్టు ప్రదేశంకావచ్చు. నాలుగు వీధుల కూడలైన కావచ్చు లేదా రచ్చబండ కావచ్చు. ఏ ప్రదేశమైనా పగటి వేష కళాకారులకు రంగస్థలమే. ప్రకృతి ప్రసాదించిన స్థలమే వీరి రంగస్థలం. అన్ని ప్రదేశాలు రంగస్థలాలే కనుక ప్రతి ఐదు లేదా పది నిమిషాలకొక రంగస్థలం మారుతుంది. కనుక పగటివేష కళాకారుల రంగస్థలం అనవచ్చు. ఈ రంగస్థలం ఇంటింటికి మారుతుంది. కాబట్టి నిర్మిరహిత రంగస్థలం. పగటివేష కళారూపానకి అసలు రంగస్థలమే లేదు కనుక తెరగడ్డలు, మైకులు, సెట్టింగులు ఉండవు. సహజ సిద్ధమైన ప్రకృతే వీరికి రంగస్థలం.అంతే కాక ప్రేక్షకులలో ఒకవైపున ఎవరైనా గోల చేస్తూ మైకులు, స్పీకర్ల సహయంచే మరొక వైపు వారికి నటుల గాత్రం స్పష్టంగా వినబడుతుంది. ఇది నటులగాత్రలకు మరింత వన్నె చేకూర్చు పరికరాలుగా వర్ణింపవచ్చు. కాని పగటి వేష కళాకారులకు అటువంటి అదృష్టం లేదు. వారు భగవత్ప్రసాదితమైనట్టి గాత్రాన్నే ప్రేక్షకుల మధ్య వినియోగిస్తారు. అంతేగాని మైకులు ఉపయోగించడం జరగదు. కొన్ని కొన్ని ఘట్టాలలో నటులు కూర్చుని ప్రదర్శిలిచ్చినా సంగీత కళాకారులు మాత్రం నిలబడే సంగీతాన్ని సమకూర్చడం పగటివేషాల ప్రత్యేక లక్షణం.

అంటే సంగీత సహకారం ఉంటుంది. పగటివేష కళాకారులు తమ ప్రదర్శనాభినయాన్ని నలువైపుల చూపిస్తుంటారు. ఈ కళారూపానికి, ప్రేక్షకులకు మధ్య ఉన్న మరో అంశం నటులకు ప్రేక్షకులు అత్యంత దగ్గరగా ఉండటం. నటులే ప్రేక్షకుల వద్దకు వెల్లడం జరుగుతోంది. కారణం వీరికి కృత్రిమ రంగస్థలం లేకపోవడం. పగటివేష కళాకారులకు సూర్యకాంతే రంగస్థల విద్యుద్ధీపం. ఇతర ఏ కళారూపాలైన విద్యేద్ధీపాల కాంతితో ప్రదర్శిస్తారు. దీని వలన నటుల సాత్విక అభినయానలను ప్రేక్షకులు నిశితంగా పరిశీలించ వీలుంటుంది. అంతేకాక నటులు తమ నటనను విద్యుద్ధీపాల కాంతితో ప్రదర్శిస్తుండటం, ప్రేక్షకులు వెలుతురు లేని ప్రదేశంలో కూర్చోడం వలన ప్రేక్షకులు ఏదైనా చేస్తున్నా అవి నటులకు కనిపించదు. కనుక పూర్తిగా తమ దృష్టిని అభినయం వైపే కేంద్రీకరించ వీలుంటుంది. కానీ పగటివేష కళాకారులకు ఇటువంటి ఆర్భాటాలేవీ ఉండవు. నటులు, ప్రేక్షకులు అందరూ ప్రకృతి ప్రసాదించిన వెలుతురులో ఉండాల్సిందే. దీని వలన పగటివేష ప్రదర్శనను చూసే ప్రేక్షకులందరు నటుల దృష్టిలో ఉంటారు. ఈ కారణం వలన పగటివేష కళారూపంలో అభినయం ఇతర కళారూపాల కన్నా తక్కువుగా కనిపిస్తుంది.

పగటివేష కళారూప ప్రదర్శన ఫలాన సమయానికి ప్రారంభించాలి, ఫలాన సమయానికి ముగించాలి అనే కాల నిర్ణయం లేదు. ఉదయాన్నే కాల కృత్యాలు ముగించుకొని, ఆయా ప్రదర్శనలకూ అవసరమైన వాటిని సమకూర్చుకొని, వాటి రూపురేఖలు దిద్దుకొని గ్రామంలో ప్రదర్శిస్తారు. కనుక ప్రదర్శన ప్రారంభం ఫలాన సమయానికనే నిర్ణయం ఉండదు. అంతేకాక ఒక్కొక్క ఇంటి ముందు రెండూ, మూడూ నిమిషాలనుంచి అవసరమనుకుంటే పది, పదిహేను నిమిషాలవరకు ప్రదర్శన కొనసాగిస్తారు. పగటివేష కళారూపాన్ని తిలకించే గృహ యజమానులు నుంచి వారైతే ఆ కళాకారులకు ప్రదర్శనా సమయంలోనే ఆహార పానీయాలు సమకూర్చుతారు. అటువంటి సమయంలో, కళాకారులు వేరే ఇల్లు తిరగడం విరమించి ఆహారపానీయాలు సమకూర్చే గృహ యజమానులతోనే గంట, గంటన్నర వరకు వృధాగా కూర్చోడం జరుగుతుంది. కనుక ప్రదర్శనా సమయం పగటివేష కళాకారుల అభిరుచిపై ఆధారపడి ఉంటుంది. పగటివేష కళారూపానికి కాల పరిధి లేదు. అవసరమనుకుంటే ఒకటి, రెండు గంటల్లో ఊరంతా తిరిగి వస్తారు. లేదా ఉదయం నుంచి సాయంత్రం వరుకు ఆయా గ్రాయాల్లోకి ఏదైనా ఒక వీధో లేదా రెండో వీధుల్లో తిరుగుతారు. అంతేకాని దాదాపు ఇన్ని గంటల ప్రదర్శన ఇవ్వాలనేటువంటి నియమనిబంధన పగటివేషాల్లో ఏదీలేదు. ఇది పగటివేష కళాకారుల మనస్తత్వంపై ఆధారపడిఉంటుంది. కనుక ఇది ఒకేరోజు అనేక ప్రదర్శనలతో కూడిన కళారూపంగా చెప్పవచ్చు. ఇందులో కాలనిర్ణయం, కాలపరిమితి ఆప్రధానంగా ఉంటుంది.

జానపద కళారూపాలుగానీ, మిగిలిన కళారూప ప్రక్రియలకుగానీ, ఒక కథ అంటూ నిర్ణయించబడి ఉంటుంది. ప్రదర్శన ఆ కథాంశాన్ని పూర్తిగాకానీ, లేదా కథలోని ఒక ప్రముఖ ఘట్టాన్ని గానీ, విశాదంగా వివరించడం జరుగుతుంది. పగటివేష కళారూపం ఇందుకు భిన్నంగా కనిపిస్తుంది. కళాకారుడు ప్రేక్షకుని బట్టి కథాంశం సృష్టించుకొంటారు. ప్రదేశాన్ని బట్టి కథాంశాన్ని మార్చుకుంటారు. కనిపించే వస్తువును బట్టి తన మనసులోని భావాల్ని వ్యక్తీకరిస్తాడు. పిట్టలదొర, మందులవేషం, భట్రాజువేషం, బుడబుక్కలవేషం, ఎరుకలసాని వేషం, కోయవాళ్ళవేషం, అత్తరు సాయిబులవేషం. ఫకీరువేష, పైన పేర్కొన్నవన్నీ ఉదాహరణలే. ఈ వేషాలన్నింటిలో కథాంశం అనేది ఉండదు. అప్పటికప్పుడు కళాకారుడు తనకు తానుగా వచనాన్ని సృష్టించుకొని ప్రేక్షకులను ఆశ్చర్యంలో ముంచెత్తాడు. పగటివేష కళాకారులు మాత్రం ఆయా గ్రామంలో అన్ని కులాల వారిని ఆశ్రయిస్తారు. ఆయా గ్రామాలల్లో ఇచ్చినది స్వీకరించి, మరల వేరు గ్రామంలో అదే కళారూపాల్ని అనేక గ్రామాల్లో ప్రదర్శిస్తూ

వారి జీవనాన్ని కొనసాగిస్తుంటారు. అందుకే పగటి వేషాన్ని సంచార కళారూపమని, పగటివేష కళాకారుల్ని సంచార కళాకారులని తెలియ చేయడం సముచితం.

ప్రారంభ ప్రదర్శన :

ప్రారంభ ప్రదర్శనను గురించి పలువురు పలు రకాలుగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసారు.

ఆదిభైరాగి వేషం :

ఆది భైరాగివేషమే అనేకమంది పగటివేష కళాకారులు ప్రదమ ప్రదర్శనగా ప్రారంభించడానిక ముఖ్య కారణం ఇది అన్ని మతాలు ఒక్కటే అని తెలియజేసే సాధు స్వరూపమైనవేషం అన్ని మతాల వారిని సమానంగా చూస్తేనే వారి కళారూపప్రదర్శనలు విజయవంతమవు తాయి. ఆదిభైరాగి వేషం అన్ని మతాలకు సంబంధించి నది. కనుకు ఇది గ్రామీణులందిరికీ ఆమోదయోగ్యం. వారికి జీవనం సాఫీగా సాగాలంటే ప్రజలందరి ఆదరభి మానాలు పొందాలి.

బుడబుక్కల వేషం :

బుడబుక్కలవారు గ్రామంలో ప్రవేసిస్తే గ్రామానికి శు భం జరిగినట్లుగా భావిస్తారు. వీరు భవిషత్తును చక్కగా తెలియజేస్తారు. శివుని డమరుఖం మ్రోగించగా మేలు జరుగుతుందని జానపదులు భావిస్తారు. వీరు నాల్గుగైదు గంటలకు తమ ప్రదర్శనలను ప్రారంభిస్తారు. కనుక ప్రారంభ ప్రదర్శన బుడబుక్కల వేషమని ఆచార్య పోనంగి శ్రీరామ అప్పారావు గారు తెలియజేసారు. ఇది సబబే అనిపిస్తుంది.

ప్రదర్శన ముగింపు :

కళాకారులకు సహకరించే విధంగా తమ ముగింపు ప్రదర్శనను గ్రామాల్లో ఇస్తుంటారు. ఈ ముగింపు ప్రదర్శనపై కూడా పూర్వ పరిశోధకులు విభిన్న పాత్రలను సూచించడం జరిగింది. ''గారడివేషం'' అని శ్రీరామ అప్పారావు గారు చెప్పగా, ''శారదవేషం'' అని ఆచార్య తూమాటి దోఅప్ప తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

గారడివేషం :

గారడివేషంలో గారడివాల్లు ప్రదర్శన ఇస్తుంటే మిగి లిన ప్రదర్శనలకన్నా జనం గుమిగూడి ఉంటారు. కారణం గారడి వేషమంటే ఒకరకమైన ఇంద్రజాల ప్రదర్శన.

ఉదాహరణకు :

చిన్న చిన్న రాళ్ళవేసి చిల్లరగా మార్చడం, కర్రను అటు ఇటు తిప్పి పాముగా మార్చడం, వేపాకులు దూసి తేళ్ళను తెప్పించడం, అరచేతిలో రూపాయిని సృష్టించడం, ఒకరి జేబుల్లో వస్తువును మరోక జేబుల్లోకి రప్పించడం, మనిషిని బుట్టలో పెట్టి మాయంచేయడం, గొంతును కోసి రక్తం చూపించడం. లాంటి అనేక ఇంద్రజాల విద్యలు గారడి వేషంలో ఉంటాయి. దీనిని నాలుగురోడ్ల కూడలిలో ప్రదర్శిస్తారు. అందువలను డబ్బును రాబట్టటానికి వచ్చిన ప్రేక్షకులనుంచి ధనాన్ని పొందడానికి గారడి వేషం ద్వారా అస్కారం ఉంది.

శారదవేషం :

శారద అనగా సరస్వతి. ప్రముఖ కళాకారుడైన విభూతి భవాణి లింగం గారు ఇచ్చిన వివరణ ఇలా ఉంది. ఈ వేషంలో ముగ్గురు ఉంటారు. ఒకరు తుంబర, ఇద్దరు డిక్కిలు వాయించుకుంటూ దాతలను పొగుడుతూ తమకు కావలసిన ధనాన్ని లేదా వస్తువులను తాము సాధించుకుంటారు. ఇది ఏ మాత్రం కథాంశం లేని పొగడ్తలతోనే ప్రదర్శించే కళారూపం. ఈ వేషంలో కళాకారులు రాబట్ట దలుచుకున్నది నిర్మొహమాటంగా తెలియజేస్తారు. పూర్వం రామాయణ ఘట్టాన్ని చెబుతూ ప్రజలను కవితా దోరణిలో పొగిడేవారట. కాని ప్రస్తుతం దాతలను పొగడటమే ప్రదానాంశం. ప్రదర్శనలన్నీ విజయ వంతమైనాయనే భావంతో అందుకు కృతజ్ఞతగా శారదా వేషం చివరిగా ఏర్పాటు చేసుకొని ఉండవవచ్చు. శారద వేషం గ్రామాల్లో చివరి ప్రదర్శనగా ప్రదర్శించడం సబబే అనిపిస్తుంది.

శక్తివేషం :

శారదవేషానికి ముందు ప్రదర్శననగా శక్తివేష

ప్రదర్శనగా ఉంటుంది. దీనిని రామలక్ష్మణుల వేషం లేదా శూర్పణఖ వేషం అని అంటారు. జానపదులకు ప్రీతి పాత్రమైనది శక్తివేషం. సీతారామలక్ష్మణులు అరణ్యవాసం చేస్తూ చిత్రకూట పర్వత ప్రాంతంలో పంచవటి సమీపాన ఉన్న సమయంలో రాముని చూసి శూర్పణఖ మోహిస్తుంది. తనను వివాహం చేసుకోమని వెంటపడుతోంది. అప్పుడు శూర్పణఖను పిలిచి శూర్పణఖా వీపుపై రాముడు ఏదో రాసి లక్ష్మణుని వద్దకు వెళ్ళమంటాడు. శూర్పణఖ ఆనందంతో లక్ష్మణుని వద్దకు వెళ్ళి రాముడు రాసిన అక్షరాలను చూపిస్తుంది. అక్షరాల్లోని అర్థాన్ని గమనించిన లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు, చెవులను కోసి పంపిస్తాడు. అందుకు కోపించిన శూర్పణఖ శక్తిరూపం దాలుస్తుంది. ఇది క్లుప్తంగా శక్తివేషం కథ. జానపదుల దృష్టిలో గ్రామదేవతలంతా శక్తి స్వరూపులు, భయంకర రూపుకల్గిన స్త్రీ మూర్తులు, గ్రామదేవతలంతా పార్వతీ దేవీ అవతారాలని, ఆదిశక్తి అని జానపదుల నమ్మకం. ఈ దేవతలంతా గ్రామాన్ని సురక్షితంగా కాపాడుతారని గ్రామాల్ని చుట్టిముట్టే మశూచి లాంటి వ్యాదుల్ని పార ద్రోలు తారని గ్రామీణుల విశ్వాసం. అందుకే మశూచి నశింపుకు వేపాకును శక్తిదేవతల చేతుల్లో ఉంచుతారు. అందుకే పగటివేషాల్లోని శూర్పణఖ వేషదారుడికి కూడా చేతుల్లో వేపాకు, శివుని సంకేతమైనా త్రిశూలాన్ని ఉంచుతారు. శక్తివేషం గ్రామమంలో సంచరిస్తే దుష్టశక్తులు అడుగంటిపోతాయనే నమ్మకంతో శక్తివేషాన్ని గ్రామీణులు ప్రదర్శించుకుంటారు. ఇది శక్తివేషంపై జానపదులకుండే నమ్మకాన్ని తెలుపుతుంది. శక్తివేష ప్రదర్శనాంతరం గ్రామప్రజలు తమ గ్రామంలోని దుష్టశక్తులు దూరమైనాయని విశ్వసిస్తారు. పిదప ఎంతో ఆనందంగా దానం చేయడానికి ముందుకు వస్తారు. అందుకే శక్తివేషం ప్రదర్శనాంతరం గ్రామంలో శారదవేషం వేస్తూ తమ జీవనానికి కావలసిన ఆర్థిక, వస్తుసహాయాన్ని కోరుకుంటారు. ఫలానా ప్రదర్శన ప్రారంభప్రదర్శనగా వేయాలని, ఫలానా ప్రదర్శన చివరి ప్రదర్శనగా వేయాలనే నియమనిబందనలు కూడా పాటించడం లేదు. ఒక్కొక్క బృందం ఒక్కొక్క విదంగా ప్రారంభముగింపు ప్రదర్శనలు ప్రదర్శిస్తున్నారు.

ముగింపు :

పగటివేషాలు ఆనాటి ప్రజలకు వినోదంతోపాటు విజ్ఞానాన్ని కూడా కల్గించాయి. ఇవి మన పురాణ ఇతిహాసాలలో ముడిపడిఉండటం గమనార్హం. ఇలా ప్రాచుర్యం పొందిన పగటివేషాలు ఇతర జానపద రూపకాల వలెనే ఈ కళారూపకానికి కూడా కళాదరణ తగ్గిందని చెప్పవచ్చు.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వెలుగుబాటలో ఆధునిక సాహిత్యం

– డా॥. వి. అనిత, సహాయ ఆచార్య,
యూనివర్శిటి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము, అనంతపురము.

ఆధునిక సాహిత్యంలో 'ఆధునిక' శబ్దం కాలాన్ని సూచిస్తుందా? లేక స్వభావాన్ని సూచిస్తుందా? అనే చర్చ చాలా జరిగింది. కచ్చితంగా చెప్పలేం కానీ 1875వ సంవత్సరం నుంచి ఆధునిక సాహిత్య యుగం ప్రారంభమైందని చెప్పవచ్చు. అప్పటి నుంచి వెలువడిన సాహిత్యాన్ని ఆధు నిక సాహిత్యం అంటున్నారు. ఆధునిక భావాలు గలదే ఆధు నిక సాహిత్యం అవుతుందనీ కొందరి అభిప్రాయం. హిందూ పునరుజ్జీవ ఉద్యమం వల్ల పాత భావాలు, మూఢ నమ్మకాలు, సనాతన ఆచారాలు బలహీనపడటం మొద లైంది. ఈ దృక్పథమే ఆధునిక సాహిత్యానికి బీజమైంది. రచయితలు కొత్త భావాలతో రచనలు చేయడం ప్రారంభించారు. ఆధునిక సాహిత్యం అంటే ఏమిటో విశ్వ నాథ సత్యనారాయణ చక్కగా వివరించారు. ''సృష్టి క్రమంలో సృష్ట్యాది నుండి కాల నిర్ణయంలో, సంఘ ధర్మ నీతులులలో, ఆర్థిక రాజకీయాల్లో సారస్వత పథాలలో ఒక విశిష్టమైన సంస్కారంతో గూడిన సిద్ధాం తాల మీద మన జాతి నడిచింది. ఇవ్వాల అంగ్లేయులు మనల్ని ఆక్ర మించటం చేత ఆ మహాసంస్కారం మీద అభిమానం ప్రబలింది. ఏతదభిమాన పురస్కృతములైన భాషా తత్వం, చరిత్ర నిర్మాణం, సృష్ట్యాది కాలనిర్ణయం, సంఘ ధర్మాలు, విశ్వాసాలు వీటిని యేయే గ్రంథం పరామర్శిస్తుందో అదంతా నవ్య సాహిత్యం''. సాహిత్యం 20వ శతాబ్దంలోకి వచ్చేసరికి మానవ సంబంధాల ప్రాధాన్యతనివ్వడం జరి గింది. ప్రపంచీకరణ దుష్పలితాల్లో వస్తు సంస్కృతి ధనాదిక్యత పెచ్చు పెరిగిన నేటి కాలంలో మనిషి కాళ్ళ కింద మనిషే నలిగిపోతున్నాడన్నది చేదునిజం. పోటీ సంస్కృతి ఫలితంగా మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబం ధాలుగా రూపాంతరం చెందడం విచారకరం. ఈ నేపథ్యంలో మనుషుల మధ్య స్నేహవారధిని నిర్మించే పనిని ఆధునిక సాహిత్యం చేపట్టింది. సమాజాన్ని నిశిత దృష్టితో పరిశీలించి సంక్షోభాల మూలాలను అన్వేషించి జాతికి జీవాన్నిచ్చే సాహిత్యాన్ని అందిస్తోంది ఆధునిక సాహిత్యం. ఆధునిక సాహిత్యాన్ని చదవడం ఒక ఎత్తయితే, దానిని సరైన రీతిలో అన్వయించుకొని చూపటం ఎంతో అవసరం. అలా జరిగినప్పుడే సాహిత్యంద్వారా మనం సరైన ప్రయోజనాన్ని పొందగలుగుతాం. జీవితం రొటీన్ లోకి జారుకోకుండా ఆలోచనల్లోనూ, జీవించే పద్ధతిలోను నిత్యనూతనంగా ఉండేలా సహకరిస్తుంది సాహిత్యం. ఆధునిక సాహిత్యంలో శతకం, కథ, నవల, నాటకం, కవిత్వం వంటి ప్రక్రియలు అభివృద్ధి చెందాయి. ప్రతి ప్రక్రియ మానవ సంబంధాల గురించి చర్చించడానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఆధునిక సాహిత్యం మన ఆలోచనా పరిధిని విస్తృత పరుస్తుంది. కొత్త కోణంలో ఆలోచించేలా చేస్తుంది. మతలోకంలోకి కాక మానవలోకంలోకి మీ పయనమెలా జరిగింది అని ప్రశ్నిస్తే ప్రముఖ కథా రచ యిత కేతు విశ్వనాథ రెడ్డి ''నేను చదివిన బెర్నాండ్ షా నాటకాలు, బెర్ట్రాండ్ రస్సెల్, జాయిస్, గురజాడ, గోపీ చంద్, చలం, కుటుంబరావు రచనలు నన్ను మతలోకం లోకి కాక మానవలోకంలోకి తీసుకెళ్లాయి'' అంటారు.

బెర్ట్రాండ్ రస్సెల్ 'మ్యారేజ్ అండ్ మోరల్స్' నీతిని గురించి కొత్త చూపు ఇచ్చింది. ఈ చూపులోంచే నేను సమాజాన్ని చూసాను. సెక్సులో లేని కులం, సామాజిక స్వభావంతో రాజకీయ బలం ఎలా అయిందో చూశాను అంటారు కేతు విశ్వనాథరెడ్డి. ఆధునిక సాహిత్యంలోని కథ, నవల, కవిత దేనిని చదివినా దాని మీద నమ్మకంతో ఆకళింపు చేసుకోవాలి. ఆధునిక సాహిత్యం సమాజంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆధునిక సాహిత్యం మానవ విలువలకు

ప్రాధాన్యమిచ్చిన సందర్భంలో మానవ విలువలు అంటే ఏమిటో ఒకసారి ఆలోచిద్దాం. అసలు మానవ సంబంధాలంటే ఏమిటి? అని ఆలోచిస్తే ఒక మనిషి తన తోటివారితో ఎలా ప్రవర్తిస్తున్నాడు. కుటుంబం, సమాజం, దేశం, ప్రపంచంలోని మరే ఇతర వ్యక్తితో ఉండవలసిన కనీస స్నేహం, దయ, కరుణ, మమకారం, స్నేహం ఏ ఒక్క భావాన్నయినా కలిగి ఉంటున్నాడా! అనిపిస్తుంది. మానవీయత కరువైన చోట మానవ సంబంధాలు కూడా దారుణంగా దెబ్బతింటాయి. నగరీకరణ, ప్రపంచీకరణ, వస్తు సంస్కృతిలో మనిషి తనని తాను పోగొట్టుకుంటున్నాడన్నది నిర్వివాదాంశం. ప్రస్తుతం మానవ సంబంధాల గురించి ఆలోచింపజేసే రచనలను తెలుగు కవులు సమర్థవంతంగా రచిస్తున్నారు. మానవ సంబంధాలు, విలువలను చర్చిస్తూ ఈ మధ్య వచ్చిన నవల "ఆలోచన ఒక యజ్ఞం". రచయిత కొమ్మూరి వేణుగోపాలరావు. ఆధునిక తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయే విషయాలనైనా, ఆలోచనాత్మక అంశాలనైనా సరళ భాషలో, సహజమైన రీతిలో వ్రాసాడు రచయిత. ఈ నవల జీవితాలకు సంబంధించిన గ్రంధం. ఇందులో ప్రతి వాక్యం ప్రతి అక్షరం సూటిగా, స్పష్టంగా వ్రాయగలిగారు రచయిత. రచయిత తనకు తెలిసిందీ, తనకున్న జీవితానుభవంతో ఆలోచించగలిగింది పాఠకులకు అందించాడు. ఎన్నో జీవిత సత్యాలను గ్రహించడానికి ఈ నవల ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సందర్భంలో "ఆలోచన ఒక యజ్ఞం" నవలను లోతుగా చర్చించాల్సిన అవసరం ఉంది.

అభిలాష వున్నా సమాజానికి ఏదోరకంగా దూరమై పోతున్నామంటాడు రచయిత. అంటే జీవించాల్సిన జీవితం కొంత కోల్పోతున్నాం. ప్రతి మనిషి తనతో తాను ఆరోగ్యకరమైన సంబంధాన్ని కలిగి ఉండటమే మానవ సంబంధాలకు తొలి పునాదిరాయి. కుటుంబంలో, ఉద్యోగం చేసే కార్యాలయంలో ఎలా ఉండాలో చక్కగా చర్చించారు రచయిత. నీ తప్పుండనీ, వుండకపోనీ, వున్నా ఆ విషయం నీకు తెలియకపోవచ్చు. నీ పై అధికారి ఓ మాట అంటే, నువ్వు పడితే తప్పేమిటి? అందులో కొంపలంటుకు పోయేటంత విశేషమేముంది? ప్రపంచంలో ఎన్నో రంగాల్లో వృత్తి, ఉద్యోగం, కళ, క్రీడ, ఇంకా ఎన్నో... వీటిలో ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతులుగా వున్నవారు ఒకానొకదశలో ఇంతకంటే పెద్ద పెద్ద మాటలే అనిపించుకొని వున్నారని గుర్తుంచుకోండి. భార్యను భర్తా, భర్తను భర్యా ఒక మాటంటే తప్పేమిటి? పిల్లను ఓ మాటంటే తప్పేమిటి? ఆలోచించండి. అసలు అనకుండా గడపటం ఎలా సాధ్యమవుతుంది?

జీవితంలో అక్కర్లేనివీ, అనవసరమైనవీ ఎన్నో భరిస్తూ వుంటాం. ఎంతో అవసరమైనవీ, వ్యక్తిత్వానికి పరిపూర్ణత తెచ్చేవీ భరించడానికి నిరాకరిస్తూ వుంటాం. అవతలి వ్యక్తికి వున్న స్థానాన్నిబట్టీ, పరిస్థితులనుబట్టీ ఒకమాట పడితే, అది మన వ్యక్తిత్వాన్ని కించపరుచుకున్నట్టు కాదు, అవమానం పాలైనట్టు కాదు. మనను మనం పెంచుకున్నట్టవుతుంది అని ఎంతో చక్కగా వివరించారు రచయిత. మేము మాటపడం అని భీష్మించుకుకూర్చుంటే ఇంటా బయట మానవ సంబంధాలు దెబ్బతింటాయి అని చక్కగా చెప్పారు.

మానవ సంబంధాలను గట్టిపరిచే మరో ముఖ్య అంశం 'క్షమించడం' గురించి రచయిత లోతుగా చర్చించాడు. నేను క్షమించటానికి ఇష్టపడుతున్నాను అనుకున్న మరుక్షణం నీ కొత్త జీవితానికి మొదటి క్షణమవుతుంది అంటాడు. ఒక సత్యం గుర్తించండి. కుటుంబ పరిస్థితులను బట్టీ, ఆర్థిక పరిస్థితులను బట్టీ, ఇంకా కొన్ని నిస్సహాయస్థితులను బట్టీ, భర్త కొన్ని విధులను సక్రమంగా నిర్వర్తించి వుండకపోవచ్చు. కానీ అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు భార్యకోసం ఆరాటపడేదీ, సేదదీర్చగలిగేది అతనే? అలాగే రోగగ్రస్తమై లేవలేని స్థితిలో వున్నప్పుడు, సమస్యల వలయంలో కూరుకుపోయి వున్నప్పుడూ మిగతా ప్రపంచంకంటే చేయూతనిచ్చేది భార్యే! నిజమే కాని అది అప్పుడప్పుడు మాత్రమే తాత్కా

లికంగా వుండే మెరుపుకాంతి కాకూడదు. నిరంతరం వెలిగిపోయే ఓ అఖండజ్యోతి అయివుండాలి అని కోరుకుంటాడు రచయిత. ప్రతి భార్య భర్త కూడా రచయిత లానే ఆలోచించాలి. ఈ పవిత్ర చక్రం ఎందుకు గాడి తప్పుతోంది? అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. అప్పుడే రచయిత రచనకు సార్థకత చేకూరుతుంది.

ఒక మేధావి, తన మేధను స్వార్థరహితంగా ప్రజాహితం కోసం ధారపోయాలి.

ఒక ఉపాధ్యాయుడు తన విద్యాసంపదను విద్యార్థుల కోసం స్వార్థరహితంగా ధారపోయాలి.

అలాగే ఓ నాయకుడు తన నాయకత్వ బలాన్ని ప్రజా శ్రేయస్సు కోసం,

ఒక డాక్టరు తన పేషంట్ల కోసం,

ఒక ప్రభుత్వోద్యోగి తన ఉద్యోగ ధర్మం కోసం,

ఒక సంఘ సేవకుడు సంఘం కోసం,

ఒక సైనికుడు దేశం కోసం

భార్యా భర్తలు తమ కుటుంబాభివృద్ధికోసం, పిల్లల భవిష్యత్తుకోసం స్వార్థరహితంగా ఆచి తూచి అడుగు వెయ్యాలి అంటాడు రచయిత. స్వార్థరహితంగా అంటే డబ్బు సంపాదించుకోవద్దనీ, సొంత సుఖాలూ భావ స్వాతంత్ర్యం పూర్తిగా చంపుకొమ్మనీ తన ఉద్దేశం కాదని, ఆరోగ్యకరమైన పరిధులు నియంత్రించుకోవాలి. ఎంత వరకూ మన గోల లేక స్వేచ్ఛాభావాలూ లేక అహంకారాలూ లేక డామినేషన్లూ లేక కోరికలూ లేక ఇంకా ఇంకా కొన్ని వున్మాదాలు మితిమీరకుండా చేస్తే కుటుంబ జీవితం భగ్నం కాదో, ఆ పరిమితులు ఎవరికి వారే విధించుకోవాలి అని సూచిస్తున్నాడు రచయిత. తప్పుకోలేని విషవలయాల మధ్య రక్షణగా నిలబడేది భార్య భర్తల అనుబంధం ఒక్కటే. మిమ్మల్ని ఆ భయంకరమైన వ్యాకులపాటుల నుంచి కాపాడేది భార్య భర్త అనుబంధం ఒక్కటే. నిరంతర సంఘర్షణల ఉలికిపాట్లలో ఊరట కలిగించేది భార్యా భర్తల అనుబంధం ఒక్కటే. ఆదమరచి, ఆ బలమైన అందాన్ని హేయంగా విస్మరించి నిరంతరమూ అశాంతుల్ని ఆహ్వానించటం మిమ్మల్ని లజ్జితుల్ని చేయటం లేదా? అని భార్యాభర్తలను ప్రశ్నిస్తున్నాడు రచయిత. భార్యాభర్తల మధ్య ఉండాల్సిన మానవ సంబంధాలను ఎంతో చక్కగా చర్చించారు. సమస్యలకు మూలాలను, వాటి పరిష్కార మార్గాలను చక్కగా వివరించారు. ఇలాంటి రచనలు నేటి సమాజానికి ఎంతో అవసరం.

ఆర్థికంగా ఆలోచించాల్సిన మానవ సంబంధాలు మృగ్యమైపోతున్నాయని రచయిత తన బాధను తెలుపుతున్నాడు. ప్రకృతి విలయాలు సంభవించినప్పుడూ, ఇంకా అటువంటి ఉపద్రవాలు సంభవించినప్పుడూ చేయూతనివ్వటానికి ఎంతోమంది ముందుకు వస్తూ ఉంటారు. కాని కళ్ళముందు కొందరు నిర్భాగ్యులు విలవిల్లాడిపోతూవుంటే స్తబ్దుగా వుండిపోతారు. మనం అందరికీ సహాయం చెయ్యటం సాధ్యం కాదు. కాని మీకో సర్కిల్ వుంటుంది. మీరు ప్రేమించేవారు, అభిమానించే వారు, అలాగే మిమ్మల్ని ప్రేమించి, అభిమానించేవారు, ఆపదలో కొట్టుకుపోతున్నప్పుడు వాళ్లు ఆర్థికంగా నిస్సహాయ స్థితిలో చిక్కుకుపోయి విలవిల్లాడి పోతున్నప్పుడు వెధవ రూల్సన్నీ పక్కన పెట్టి చేయూత నందిస్తే పరిస్థితి ఎంత హాయిగా చక్కబడుతుంది! మిమ్మల్ని మీరు ఇబ్బంది పెట్టుకొని బయట నుంచి అప్పులు తెచ్చి హామీలు వుండి ఇవ్వనక్కరలేదు. అలా చెయ్యమని సలహా కూడా చెప్పను. మీలో కొంత మందికి సాయం చెయ్యగల శక్తి వుంది. అప్పుడు వెనకాడకండి. మిమ్మల్ని మీరు పోగొట్టుకోకుండా, ఆ డబ్బు మీకు తిరిగి రాక పోయినా ఫరవాలేదన్న కొంచెమో, గొప్పో పరిస్థితిలో వున్నప్పుడు తప్పకుండా సాయం చెయ్యండి అంటాడు రచయిత. 'జాలి' అనే బలహీనతకు లొంగిపొమ్మని చెప్పటం లేదు. 'ప్రేమ' అనే చైతన్యంతో నిండిపోవాలి, మన చుట్టూ వున్న సమాజం యావత్తు మనం పంచే ప్రేమతోనే పునీతమవుతూ వుంటుంది. ఇలాంటి రచనలు చదివితే పాఠకుడిలో చైతన్యం కలుగుతుంది.

మానవ సంబంధాలలో మరో ముఖ్యమైన అంశం

'కృతజ్ఞత'. ఈ అంశాన్ని ఎంతో చక్కగా వివరించారు రచయిత. నమ్రతతో కూడిన నిశ్శబ్ద కృతజ్ఞతాభావం నీకెంతో మేలు చేస్తూ వుంటుంది. నువ్వు ఊహించని శిఖరాలకు నిన్ను చేరుస్తూ వుంటుంది. నిన్ను చూసి ఎదుటివారు భయపడేలా, సిగ్గుపడేలా, చేస్తూవుంటుంది. కృతజ్ఞతాభావం నీకు తెలియకుండానే నీ జీవితానికి ఎంతో మేలు చేస్తుంది. నీకొక గొప్ప వ్యక్తిత్వాన్ని సంపూర్ణత్వాన్ని, ఔన్నత్యాన్ని ఆపాదిస్తుంది అంటాడు రచయిత. మానవసంబంధాలను ఎలా పోగొట్టుకుంటున్నారో సూటి ప్రశ్నిస్తున్నాడు.

ఒక్కసారి ఆలోచించండి. ఎవరితోనూ సఖ్యతగా, ప్రేమగా లేకుండా, ఎప్పుడూ గొడవలతో, అంతర్యుద్ధాలతో ఒకరినొకరు చికాకు పెట్టుకుంటూ జీవించటంలో ఏమైనా సాధించగలుగుతున్నారా?

ఒంటరి తనంలో నీవు పరిపక్వతతో కూడిన ఆనందం అనుభవించేస్థాయి నీలో వుంటే అభినందించవలసిందే! కాని ఆ ఒంటరితనంతో జీవితాన్ని దుర్భరం చేసుకుంటున్నప్పుడు అదే కోరుకోవటం దేనికి?

అజ్ఞానం కాదా?
అహంకారం కాదా?
మూర్ఖత్వం కాదా?
అసహ్యం కాదా?
నీలో మమకారముంది.

అది స్వార్థం కోసం చంపేసుకుంటున్నావు. కాని ఆ స్వార్థం వల్ల నీవు పొందుతున్న ప్రయోజనమేమీ లేదు.

నీలో మంచిని, పరిస్థితుల పేరుతో ఎంతగా అణగ దొక్కేశావో ఎంత మందికి కష్టం కలిగిస్తున్నావో, నీ ప్రవర్తనలో ఎంత కాఠిన్యముందో, ఎంత నిర్దయ వుందో చూసుకో.

నిన్ను బాగా చూసుకో
నీలో ఎంత స్వార్థముందో, అజ్ఞానముందో, అహంకారముందో చూసుకో.
నువ్వు ఎంతమందిని బాధ పెడుతున్నావో చూసుకో.
నీలో ద్వేషముంది.
ప్రేమ రాహిత్యముంది.
అపరాధ భావముంది.
భయముంది.
వ్యతిరేక భావముంది.
స్వార్థముంది.
నీ తప్పని సమర్థించుకునే గుణముంది.
ఎవర్నీ అంగీకరించలేని స్వభావముంది.
ఇవన్నీ నీలో ఎంతమేరకు విస్తరించి వున్నాయో, వాటికి ఎలా లొంగిపోతున్నావో చూసుకో.
వాటికి లొంగిపోయి నిన్ను నీవు పోగొట్టుకుంటున్నావు.
నిన్ను పోగొట్టుకుంటూ, నీ సంబంధాలని పోగొట్టుకుంటున్నావు.

రచయిత సూటిగా మానవ సంబంధాల ఆవశ్యకత పాఠకుడి మనసులో స్థానం పొందేలా రచనను సాగించాడు. ఒక వ్యక్తి తానాశించిన రంగాల్లో పైకి రావాలంటే నరి అయిన మానవ సంబంధాల అవసరం అని "ఆలోచన ఒక యజ్ఞం" నవల సరళంగా తెలుపుతుంది. ఆధునిక సాహిత్యంలో ఇలాంటి రచనలు తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయని గర్వంగా చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1). సంగమం (వ్యాసాలు, ప్రసంగాలు), 2009, కేతు విశ్వనాథ రెడ్డి, విరాట్ కమ్యూనికేషన్, హైదరాబాద్ ప్రచురణ.
2). తెలుగు సాహిత్య చరిత్ర 1998, డాక్టర్ ద్వా.నా. శాస్త్రి, శ్రీ కళాంజలి గ్రాఫిక్, హైదరాబాద్ ప్రచురణ.
3). ఆలోచన ఒక యజ్ఞం, 2010, కొమ్మూరి వేణుగోపాలరావు, సాహితి ప్రచురణలు, విజయవాడ.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

టెలివిజన్ ప్రసారాలు – భాషా స్వరూపం

– డా॥. వి.గోపాల్, అసిస్టెంట్ డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ప్రజాస్వామ్య చరిత్రలో ప్రసారమాధ్యమాలు గణనీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పత్రికలు, ఆకాశవాణి, దూరదర్శన్ వివిధ ఛానళ్ళు తమవంతు కృషిగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తూనే ఉన్నాయి. తెలుగు పత్రికారంగ చరిత్ర వంద ఏళ్ళకు, అలాగే ఆకాశవాణి ప్రసారాలు 80 ఏళ్ళపైబడింది.

భాషలు వేరైనా మానవాళి అనుభూతి ఒక్కటే, ఆవేశం కట్టలు తెంచుకున్నా, ఆక్రోశం విలవిల్లాడినా, ఆనందాను భూతులకు నెలవైనా మనిషి స్పందనలో మాత్రం సారూపత్య కనిపిస్తుంది. ఎక్కడో సుదూర ప్రాంతంలో జరిగిన విషాద సంఘటనకు అయ్యోపాపం అని ఇక్కడ మన మనసు విలవిల్లాడుతుంది. మానవాళి భావోద్వేగాలకు ఎల్లలు లేవు. సమాచార వేగం పెరిగిన ఈ రోజుల్లో 'వసుదైవ కుటుంబకం' భావనకు ప్రసార సాధనాలు ఆలంబనగా నిలిచాయి. ఇరవై ఒకటవ శతాబ్ది ముంగిట నిలిచిన మనసు అనుక్షణం సంభవిస్తున్న పరిణామాల కారణంగా అనునిత్యం చోటు చేసుకుంటున్న ఉద్విగ్న క్షణాలూ, సంఘర్షణలూ, సంతోషాలు, సంతాపాలు ప్రజల ముందుకు తీసుకురావడమే మాధ్యమాల లక్ష్యం.

అత్యయిక పరిస్థితిని ఎత్తివేసిన తర్వాత ప్రజల్లో సమాచార దాహం పెరిగి కొత్త వార్తాపత్రికలూ, వార, పక్ష పత్రికలు వెలసి వర్ధిల్లాయి. ముఖ్యంగా దిన పత్రికల వ్యాప్తి విశేషంగా పెరిగింది. ప్రతి జిల్లా కేంద్రంలో ఎడిషన్లూ, జిల్లా టాబ్లాయిడ్లూ అవతరించాయి. పత్రికల మనుగడకు టెలివిజన్ వల్ల ప్రమాదం లేకపోగా ఒకదానిని ఒకటి పూరకంగా దోహదం చేస్తున్నాయి. ఆసియా క్రీడోత్సవ సంరంభంలో రాజీవ్ గాంధీ చొరవ ఫలితంగా భారత టీవీ జర్నలిజం కొత్తపుంతలు తొక్కింది. 1991లో పి.వి.నరసింహారావు, మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టిన ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల ధర్మమా అని టీవీ ఛానళ్ళు సంఖ్యానేకంగా పుట్టుకొచ్చి దేశంలో టీవీ జర్నలిజం స్వరూప స్వభావాలనే మార్చివేశాయి.

1996 కాంగ్రెస్ పరాజయం తర్వాత దేశంలో రాజకీయ అస్థిరత ఏర్పడింది. సంకీర్ణ సంస్కృతి వంటబట్టే వరకు ప్రభుత్వాలు తరుచుగా మారడం, ఎన్నికలు అనివార్యం కావడంతో రాజకీయాల ప్రాధాన్యం పెరిగింది. వార్తల పట్ల, వార్తలు సృష్టిస్తున్న వారిపట్ల ఆసక్తి ఇనుమడించింది. ప్రస్తుతం మనది అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ. టెలివిజన్ ఓర్నలిజం సైతం వార్తా ప్రమాణాల పరంగా, సాంకేతికపరంగా అంతే వేగంగా సరికొత్త శిఖరాలను అధిరోహిస్తున్నది. (ఇరవై ఏళ్ళ క్రితం మన దేశంలో అయిదారు టీవీ ఛానళ్ళు మాత్రమే ఉండేవి. వాటిలో దూదర్శన్ అన్ని విధాల అగ్రగామి. దూరదర్శన్ వార్తల బులిటెన్‌లో ఎక్కువసేపు రాజకీయ నాయకులనూ, వారి ప్రసంగాలనూ, వార్తలు చదివే వ్యక్తి మొహం మీదే కెమెరా కన్ను ఉండేది. "వరల్డ్ దిస్ వీక్" కార్యక్రమంతో ప్రారంభమైన ప్రణయ్‌రాయ్ ఎన్‌డిటివి అనతి కాలంలోనే మధ్య తరగతిని ఆకట్టుకోవడమే కాకుండా ఇంగ్లీష్, హిందీ భాషల్లో రోలింగ్ న్యూస్ ఛానల్‌గా అద్భుతంగా ఎదిగింది. ఎన్‌డిటివి 'ప్రాఫిట్' పేరుతో బిజినెస్ చానల్‌ను కూడా జయప్రదంగా నిర్వహించడం మన దేశంలో టీవీ జర్నలిజం వికాస క్రమానికి చక్కటి ఉదాహరణ.

ఈ రోజుల్లో కేబుల్ టీవీ ఉన్నవారికి రెండువందలకు పైగా ఛానళ్ళు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ముప్పయ్ దాకా న్యూస్ ఛానళ్ళు, కొన్ని ఇంగ్లీష్‌ఛానళ్ళు, తక్కినవి ప్రాంతీయ భాషల్లో నిరంతర వార్తా ప్రవాహాన్ని ప్రసారం చేస్తున్నాయి. మన దేశంలో మీడియా సంస్థలు

విస్తరించి వేల సంఖ్యల్లో ఉద్యోగాలను సృష్టించాయి. ప్రతిభావంతులైన యువతీయువకులు టీవీ ఛానళ్ళలో ఆకర్షణీయమైన వేతనాలతో పనిచేస్తున్నారు. తెలుగు పత్రికల మాదిరే టీవీ చానళ్ళ సైతం ఇతర భాషల్లోని చానళ్ళతో అన్ని విధాలా పోటీపడుతున్నాయి. ఇరవై నాలుగు గంటల తెలుగు చానళ్ళు జైత్రయాత్ర సాగిస్తున్నాయి. ప్రారంభంలో న్యూస్ చానళ్ళలో వార్తా సేకరణకూ, రచనకూ, సమర్పణకూ వార్తా పత్రికల్లో పనిచేసిన జర్నలిస్టులనే నియమించారు. కాన్వెంట్ చదువులూ, విదేశీ చదువులూ చదివిన యువతీయువకులు ఇంగ్లీష్ చానళ్ళలో చేరినట్టు అసాధారణ ప్రతిభావ్యుత్పత్తులు గల జర్నలిస్టులు తెలుగు చానళ్ళలో చేరలేదు. క్రమంగా కొత్త రక్తం ప్రవేశిస్తున్నది. వైవిధ్యం పెరుగుతుంది. ప్రతిభావంతులు తెరమీదికి వస్తున్నారు. ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా క్లిష్టమైంది. కష్టభూయిష్టమైంది. శక్తివంతమైంది.

టీవీ వార్తా సేకరణ ప్రయాసతో కూడిన పని. వార్తా రచన కూడా భిన్నంగా, సంక్షిప్తంగా, సులభగ్రాహ్యంగా ఉండాలి. వార్తా సేకరణ ఎంత ముఖ్యమో స్క్రిప్టు రాయడం, ఎడిట్ చేయడం కూడా అంతే కీలకం. వేగం, కచ్చితత్వం, ఆసక్తి, సంక్షిప్తత, సూటిగా హృదయానికి హత్తుకునే భాష టెలివిజన్ జర్నలిజానికి పంచప్రాణాలు. వాఖ్యానం కంటే దృశ్యం ప్రధానం. దృశ్యగమనానికి తగినట్టుగా వ్యాఖ్యానం సాగాలి. అందుకే ఎడిటింగ్ సృజనాత్మకంగా చేసిన కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. స్క్రిప్టు, ఎడిటింగ్ సమర్థంగా ఉన్నంత మాత్రాన సరిపోదు. వాయిస్ ఓవర్ బాగుండాలి. యాంకర్ అందంగానే కాకుండా అర్థవంతంగా మాట్లాడే నేర్పు కలిగి ఉండాలి. ఉచ్చారణ సరిగా లేని యాంకర్లు టెలివిజన్ న్యూస్ చానళ్ళను అపహాస్యం చేస్తున్నారు. వాక్య నిర్మాణం, పదాల పొందిక, పదాల విభజన, విరుపు వంటి అంశాలు బులిటిన్ జయాపజయాలను నిర్ణయించగలవు. న్యూస్ బులిటిన్‌లో ఒక లయబద్ధమైన వాక్ దృశ్య ప్రమాశంలాగా సాఫీగా సాగిపోవాలి. టెలిఫోన్ ఇటర్వ్యూలు, గ్రాఫిక్స్, సబ్‌టైటిల్స్ సమకూర్చడం వంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా శ్రద్ధగా చేస్తేనే బులిటిన్ రక్తికడుతుంది. రిపోర్టర్‌కీ, విడియోగ్రాఫర్‌కీ మధ్య స్రిప్టు రైటర్, ఎడిటర్, ప్రొడ్యూసర్ మధ్య సమన్వయం సమర్థంగా సాగినప్పడే నత్పలితాలు సిద్ధిస్తాయి. సామీప్యం, మానవీయకోణం, ప్రేక్షకులపై ప్రభావం, తీవ్రత, సంచలనాత్మకత, వినోదాత్మకత, నాటకీయత వంటి అనేక అంశాలను మనసులో నిలుపుకొని పని చేయాల్సి ఉంటుంది. టీవీ న్యూస్ చానళ్లలో దొర్లుతున్న అపభ్రంశాలను, ఉచ్చారణ దోషాలను, సమన్వయ రాహిత్యాన్నీ చూసిన వారికి ఈ రంగంలో శిక్షణ, అధ్యయనం ఉండాలి. న్యూస్ చానళ్ళు మాత్రమే కాదు, ఇతర చానళ్లలో పని చేసే వారికి కూడా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఉండాలి.

భాషాస్వరూపం :

భారతదేశం లాంటి వర్ధమాన దేశాలలో ఇంకాసగం జనాభా నిరక్షరాస్యులే. ఇటువంటి దేశాల్లో మాతృభాష ద్వారానే అక్షరాస్యత వ్యాప్తి జరుగుతుంది. మాతృభాషలోనే ఎవరైనా మౌలికమైన ఆలోచన చేయగలరనీ, సృజనాత్మకత వ్యక్తమయ్యేది మాతృభాషలోనేననీ, విషయ అవగాహన స్వభాష ద్వారా జరిగినంతగా పరభాషలో జరగదనీ, శక్తివంతమైన భావప్రకటన తల్లిభాషలోనే జరుగుతుందనీ పరిశోధనలు తెలుపుతున్నాయి. జీవగర్ర లాంటి మాతృభాషాభ్యాసాన్ని పటిష్టం చేసుకొని అవసరార్థం ఇంకెన్ని భాషలనైనా అభ్యసించవచ్చు. విద్యావంతులు తమజాతి జీవనంతో సాన్నిహిత్యాన్ని సాధించే సాధనంగా మాతృభాష చాలా అవసరమని మనో విజ్ఞాన శాస్త్రవేత్తలు, సమాజ శాస్త్రవేత్తలు, భాషా శాస్త్రవేత్తలూ అభిప్రాయపడుతున్నారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల స్థాపనతో తెలుగుభాషా పాలనాభాషగా మారింది. ఉన్నతస్థాయి విద్యలో బోధనా భాషగా ఎదిగింది. భాషాప్రయోగరంగాల విస్తరణతో

భాషను ఆధునీకరించుకోవలసిన అవసరం కలిగింది. అందులో భాగంగా ప్రమాణీకరణ జరిగింది. ఆధునీకరణ, ప్రమాణీకరణ విషయంలో తెలుగు పత్రికల కృషిని ప్రముఖ భాషా శాస్త్రవేత్తలు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య చేకూరి రామారావు విస్తారంగా ప్రస్తావించారు. క్రమంగా పత్రికలు, రేడియో, టి.వి, సినిమా లాంటి ప్రసార సాధనాల్లో ప్రజల వ్యవహారభాష నుంచి రూపొందించిన ఆధునిక ప్రామాణిక వచనా రచనా భాష వాడుకలోకి వచ్చింది. ప్రమాణ భాష ఎంత ప్రయోజనకారి అయినా మాండలిక భాషలో ఉన్న సొగసు, సహజత్వం మనసుకి హాయినిచ్చే అంశాలు. అవి ఎటువంటి పరిస్థితుల్లోనూ వదులుకో కూడని అంశాలు. నేలనిబట్టి నీళ్ళు రుచిని మార్చుకున్నట్టు ప్రాంతాన్నిబట్టి, వృత్తినిబట్టి, కులాన్నిబట్టి, వర్గాన్నిబట్టి, సందర్భాన్నిబట్టి భాష రూపాన్ని మార్చుకోవడం దాని సజీవత్వానికి నిదర్శనం. ప్రయాణ భాషలో ఉన్న 'అందరికీ ఆమోదయోగ్యతా' అనే అక్షణంతో అది ఉనికిలోకి వచ్చినా పత్రికలూ, టి.వి. రేడియో దాని ఉనికిని కాపాడుతూనే ఉన్నాయి.

టీవీలలో యాంకర్ల భాషపై ఎన్ని రకాల వివర్శలూ, జోకులు ఉన్నాయో మనందరికీ తెలుసు. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ఉచ్చరణకు సంబంధించిన ఖచ్చితమైన నియమాలు పాటించబడుతున్నాయి. ఇంగ్లీషు మీడియంలో చదివిన తెలుగుచానళ్ళ యాంకర్లు కొందరు భాషను ఖూనీ చేస్తున్నారనే అపప్రధ ఉంది. ఉచ్చారణ దోషాలూ ఇంగ్లీషు యాసా ఒక వంతయితే ఎక్కువ ఇంగ్లీషు పదాలే వాడుతున్నారనేది మరో విమర్శ.

పత్రికల భాషకూ, టీవీ భాషకు చాలా తేడా ఉంది. నిరక్షరాస్యులు సైతం చూసి అర్థం చేసుకునేందుకు వీలుగా మాట్లాడే భాషలో, సులభమైన పదులతో రచన జరగాల్సిన అవసరం టీవీ వార్తలకుంది. వాక్యం స్పష్టంగా, సూటిగా, చిన్నదిగా ఉన్నప్పుడే ప్రేక్షకుడు వినగానే అర్థం చేసుకుంటాడు. ఆ విధంగా సులభశైలిలో రాయడం తప్పనిసరి. చూసింది చెప్పడం టీవీ జర్నలిస్టు పని గనుక చూసిన విషయాన్నే మాట్లాడే భాషలో రాయవలసి వస్తుంది.

పత్రికలు ప్రభావంతో రాస్తున్న కొన్ని పదాలను టీవీకి అనుగుణంగా సంభాషించే శైలిలో రాయాలి. అన్నారు, చెప్పారు, పేర్కొన్నారు, వివరించారు, అభిప్రాయపడ్డారు, వాఖ్యానించారు, ఇలా 'రు' అక్షరంతో ముగిస్తే వినసొంపుగా ఉండదు. కనుక పదాలను మార్చి రాయాలి. రైతులు అంటున్నారు బదులు 'ఇదీ రైతుల వాదన' అని చెప్పవచ్చు. అలాగే సందర్భాన్ని బట్టి ఏ పదం ఎప్పుడు వాడాలో కూడా తెలిసుండాలి. ఒక విషయాన్ని వెల్లడిస్తే 'తెలిపారు', పాయింట్‌ను ఎత్తి చూపితే 'పేర్కొన్నారు' అనాలి. విషయాన్ని గట్టిగా చెప్తే'ఉద్ఘాటించారు', హెతువు చెప్తే 'ఉద్బోధించడం', సంశయాలను అనుమానాలను తొలిగించే ప్రయత్నమైతే 'స్పష్టం చేయడం', ముందు వెనుకలను, బాగోగులను చెప్తే 'విశ్లేషించడం', విషయాన్ని విపులంగా చెప్తే వివరించడం, విపులీకరించడం, విశదీకరించడం అని రాయాల్సి ఉంటుంది.

అలాగే అంగీకరించారు, ఒప్పుకున్నారు అని, గమనార్హం, విశేషం అని, ప్రాధాన్యత, ప్రాధాన్యం అని, మృత్యువాత పడ్డారు, మరణించారు అని, మత్సకారులు, జాలరులు అని, వెలుగులోకి వచ్చింది, బయటపడింది అని, బంద్ విజయవంతమైంది, బంద్ సంపూర్ణం అని, రెండు సంవత్సరాలుగా, రెండేళ్ళుగా అని, పంథా, పద్ధతి అని, ఉపయోగిస్తున్నారు, వాడుతున్నారు అని, నావికాదళం, నౌకాదళం అని, కుమార్తె, కూతురు అని, పర్యటించనున్నారు, పర్యటిస్తారు అని, సంభాషించే శైలిలో ఉండాలి.

పత్రికల భాషకు భిన్నంగా టీవీ వార్తల భాష ఉండాలని చెప్పడంలో పత్రికల భాష 'తప్పు' అనే దురుద్దేశమేదీ లేదు. రాసే భాషకు, మాట్లాడే భాషకు ఉంటున్న తేడాను యదాతథంగా స్వీకరించాలన్నదే ఉద్దేశం.

ఆధారగ్రంథాలు :

1. ప్రసార భాష - బి.కేశవరావు.
2. టెలివిజన్ జర్నలిజం - తోట భావనారాయణ
3. మంచి జర్నలిస్ట్ కావాలంటే - బూదరాజు రాధాకృష్ణ
4. మీడియా మాయాజాలం - నోమ్ చామ్‌స్కీ, ఎడ్వర్డ్. ఎస్.హెర్మన్, సంక్షిప్త అనువాదం తెలకపల్లి రవి
5. టీవీ జర్నలిజం - డాక్టర్ గోవిదరాజు చక్రధర్.
6. తెలుగు భాష - డా॥ వి. లక్ష్మణరెడ్డి.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రజాకవి సుంకర సత్యనారాయణ గేయ సాహిత్యం

- పాత శ్రీనివాసరావు, పరిశోధక విద్యార్థి , ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సుంకర సత్యనారాయణ అనేక గేయాలను రచించారు. వాటిలో ప్రబోధ గేయాలు, విప్లవగేయాలు, అభ్యుదయ గేయాలు వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. సుంకర రచనల్లోని గేయాలు, అహుతి (హరికథ)లతో కూడిన ఒక పుస్తకాన్ని ప్రచురించారు. దానిలో సుమారు నలభై అయిదు కవితలు ఉన్నాయి. పైగా ఈ పుస్తకంలో ఒక హరికథ ఆహుతి అనేది కూడ ఉంది. సుంకర రచించిన ఈ గేయాలు ఆనాడు ప్రజలను ఉర్రూతలూగించాయి. ఈ గేయాలలో స్వాతంత్ర్యం రాకముందు రెండో ప్రపంచ యుద్ధకాలంనాడుకు చెందినవి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజలను మేలుకొల్పే విధంగా అనేక గేయాలతో బాటుగా పల్లెటూరు (1952) లో వచ్చిన చలన చిత్రంలో సుంకర - వాసిరెడ్డి రచించిన పాటలు, 'భూమికోసం' చలనచిత్రం కోసం రాసిన పాటలను కూడా ఇచ్చారు. ఈ పాటలను కొన్నింటిని ఒకొక్క దాన్ని విడిగా వివరించి చూద్దాం.

ఈ గ్రంథంలోని ఒక గేయాన్ని చూద్దాం.... ఆ గేయం శీర్షిక పేరు 'జయగీతి'

'పట్టరా వడిశాల - కొట్టరా దెబ్బ
పరిగ పిట్టల మంద - పారిపోవాలి ॥పట్ట॥
పంట ధ్వంసముజేయు - పందులవిగోర
బాకునా, బల్లాన - పగల జీరుముర ॥పట్ట॥
ముందుకురికీ తగిన - పందులన్నిటిని
మందేసి కొట్టరా - కందికాయల్లె ॥పట్ట॥
కూలీలు రైతులూ - కూడికేకేస్తే
క్రూరమృగముల గుండె - జారిపోవాలని ॥పట్ట॥
రామబాణమురా నీ - రాయిదెబ్బలంటె
రమ్మురా వైరులను - దుమ్ముజేయాలి ॥పట్ట॥
శ్రామికా నీలోన - శక్తి మిగిలుంటె
సమరాన నీ కత్తి - ఝళిపించుమోయి ॥పట్ట॥
పటపటా యీ దాస్య - బంధాల తెంచి
స్వాతంత్ర్యమును పొంది - జయగీతి పాడు ॥పట్ట॥

అనే ఈ గేయం ఆనాడు ప్రతి ఒక్కరినోట పలికింది. ఈ గీతం విశేషం ఏమిటంటే.. స్వాతంత్ర్యసమరాన సాయుధ పోరాటం చేయమని చెప్పటమే ! పట్టరా వడిశెల పట్టరా! అంటే ఆయుధాన్ని పట్టుకోమని, కొట్టరా దెబ్బ అంటూ ఆయుధాన్ని వాడమని దానితో పరిగిపిట్టలమంద పారిపోవాలని. ఆ పిట్టలు పంటలను ధ్వంసం చేస్తు దోచుకుంటున్నాయని చెపుతారు. అదే విధంగా దేశంలో ఉన్న పంటల్ని ధ్వంసం చేస్తు దోచుకుంటున్నాయని చెపుతారు. అదేవిధంగా దేశంలో ఉన్న పంటల్ని ధ్వంసం చేసే పందులు అవిగోరా! అంటూ భూస్వాములను గురించి చెపుతారు. రైతుకూలీలు ఒక్కటై కేకపెడితే భూస్వాముల గుండె జారిపోవాలి అని భూస్వాములను క్రూర మృగాలతో పోల్చుతారు. ఓ శ్రామికుడా నీలో ఇంకా శక్తి మిగిలి ఉంటే సమరాన నీ కత్తి ఝళిపించవోయి అంటూ దేశ సేవకై సమరం సాగించమని ఉద్బోధిస్తారు. ఈ దేశపు దాస్య శృంఖలాల్ని తొలగించి జయగీతిని గానం చేయమని చెపుతారు. ఈ గేయాన్ని సుంకర 1946లో రచించారు.

విప్లవ భావాలతో ఉన్నప్పటికీ సుంకర గేయాలు జనంలో విపరీతంగా ప్రచారం పొందాయి. ఆయన గొప్ప చదువులు చదువుకోనప్పటికీ సాహిత్యంలో ఒక విలువైన స్థానాన్ని సంపాదించుకున్నారు సుంకర సత్యనారాయణ గారు. స్వాతంత్ర్యం రాకముందు స్వాతంత్ర సముపార్జనకై పోరాడమని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలోని భూస్వామ్య వ్యవస్థమీద తిరుగుబాటు చేయమని,

పోరాడమని చెపుతారు. సమయానుకూలంగా ఎప్పుడు ఏ గీతాలాపన చేయాలో సుంకర కలంనుండి ఆయా సందర్భాన్ని బట్టి గీతాలు జాలువారాయి. కమ్యూనిస్టు భావాలుగల సుంకర సత్యనారాయణ రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లరు దురాగతాలను కూడ తన గేయాలలో తెలియజెప్పారు. హిట్లరు గురించి, రష్యా విప్లవ వీరుల త్యాగాలను గురించి కూడ సుంకర తెలుపు తారు. ఇంకా కొరియా దేశం గురించి చెప్తూ దాన్ని దోచు కోవడానికి అగ్రరాజ్యాలు తమ బలాన్ని ఏవిధంగా ఉప యోగించు కుంటున్నాయో తెలియజేస్తారు.

ఆయన గేయాల్లో చాలావరకు ఇతర దేశాలకు సంబంధించిన సంఘటనలు కలిసినవే ఉంటాయి. ఉదాహరణకు 'మిట్టపడే హిట్లరయ్యా.' 'అయ్యో! హిట్లరూ! 'ఎర్రసైనికుడా!, 'కోల్యా కథ, 'విజ్ఞాన ధనులార', 'ఎదురులేని ప్రజా బలం,' 'జోహార్లివిగో రష్యన్ వీరుడా!', 'విప్లవ జ్యోతులు,' 'మేడే', 'ఆశాజ్యోతి', 'కొరియా', వంటివి ఇతర దేశాల్లో ముఖ్యంగా సోవియట్ రష్యాకు చెందిన విప్లవాలు, రష్యామీద హిట్లర్ సైన్యం దాడి చేయడం, జర్మనీ సైన్యాన్ని ఎర్ర సైనికులు ఎదిరించడం, రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ పరిస్థితి... కొరియా యుద్ధం ఇలాంటివి వాటి నేపథ్యంలో ఆయన గేయాలు రాయడం జరిగింది.

మన దేశానికి చెందిన సంఘటనలు కూడా ఆయన గేయాల్లో చోటు చేసుకున్నాయి. వాటిల్లో 'బెంగాల్ కరువు', 'పంట చేను రొద', 'తుమ్మెద పాట,' 'అక్టోబర్ 2', 'ప్రజా ఘోష', 'ముగ్గురు పెళ్ళి కొడుకులు,' 'క్విట్ ఇండియా', 'ప్రబుద్ధ తెలంగాణా', 'స్వాతంత్ర్య పతాక', 'పౌరుషము చూపించరా,' 'తెలుగు జోదుల కత్తి మలిగిపోయిందా?, 'జే గంట', 'ఆశాకిరణం', 'రాయలసీమ విషాద గాథ', 'జోహార్లు', 'తెలంగాణా', 'గుంటూరు కార్మిక వీరులు', 'విలపించు చున్నావా తెలుగు తల్లీ నీవు?' 'పాలికేక' 'ఫలితం', 'పిలుపు', 'గొలుసులను తెంచుకొన', 'విప్లవ జ్యోతి' ఇలాటి పాటలు ఉన్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో జర్మన్ నియంత, ఫాసిస్టు హిట్లర్ మీద ఆయన రాసిన గేయాలు బాగా ప్రాచుర్యం పొందాయి. వాటిని ఇక్కడ చూద్దాం...

"మిట్టి పడే హిట్లరయ్యా! అనే శీర్షికతో ఈ గేయం కొనసాగుతుంది. ఈ గేయం ప్రజాశక్తి పత్రికలో 1943 ఫిబ్రవరి పదవ తారీఖున ప్రచురించబడింది.

" ఓ మిట్టపడే హిట్లరయ్యా!
ఏటికి ఎదురీదుచుంటివా? ॥ఓ॥

కూలి రాజ్యం కూలద్రోసి
నీదు రాజ్యం నిలుపబోతే
మంచి వీరులు మట్టి గలిశారా ॥ఓ॥

స్టాలినోగ్రాడ్ కాలదన్ని
యూరల్ కొండెక్కబోతే
సేనలన్ని చెరిదిపొయ్యేనా ॥ఓ॥

శీతాకాలం రాకముందే
బాకు గసులూ పట్టుకొంటే
నాకె విజయమని కలలు గంటీవా ॥ఓ॥

కూలిరైతుల పాలిస్వర్గం
నేలమట్టం చేయబోయి
కాలుజారీ నేలబడితివా? ॥ఓ॥

అని ఈ గేయంలో హిట్లర్‌ను తలుస్తూ అతని నిరం కుశత్వాన్ని తెలుపుతారు. అతను మిడిసిపాటు పడుతూ ప్రపంచాన్ని జయించాలనే దురాశతో రష్యామీద దాడి చేయడం... రష్యాలోని కూలిరాజ్యం కూలద్రోసి తన దైన హిట్లర్ రాజ్యంను స్థాపించా లనుకోవడం... ఈ పరిస్థితుల్లో మంచి వీరులు చాలామంది మరణించారని తెలియ జేస్తారు. స్టాలినోగ్రాడ్ దాటి యూరల్ కొండనెక్కబోతే హిట్లర్ సేనలన్నీ చెదరిపోయాయని, శీతాకాలం రాక ముందే బాకుగనులూ (బానెట్ ఉన్న గన్నులు) పట్టు కొంటే.... చివరకు నాకే విజయమని కలలు కన్నాడని, రైతు కూలీల పాలిట స్వర్గం అయిన రష్యాను నేలమట్టం చేయబోయి చివరకు కాలుజారి బొక్కబోర్లా పడ్డాడని

ఎద్దేవా చేస్తారు. ఇదే హిట్లర్ మీద రాసిన మరొక గేయం.. 'అయ్యో! హిట్లరూ!" అనే శీర్షికతో రాసింది ఈ గేయం 1943 జూన్ రెండవ తారీఖున ప్రజాశక్తిలో ప్రచురింప బడింది.

"స్టాలినోగ్రాడ్ దాకా - సాగిరానిచ్చి నిన్ను
యెర్రసేన చుట్టు ముట్టి - గొర్రెకోత కోయుచుండ -
॥ హిట్లరూ ॥

అబ్బ ! నా కళ్లు చల్లబడ్డవోయీ హిట్లరూ !
చాకచక్యంబుతోడ - దూకి ముందుకేగి నీవు
కాకసస్సు పట్టబోవ - లాగితన్నె యెర్రసేన -
॥ హిట్లరూ ॥

అబ్బ! నా కళ్లు చల్లబడ్డవోయీ హిట్లరూ !
నేల యీనినట్లు లేచి - వేలకొలది యెర్రసేన
నీదు సేన చుట్టుగమ్మ - నిలువుగుడ్లు బడెర నీకు
॥ హిట్లరూ ॥

అబ్బ ! నా కళ్ళు చల్లబడ్డవోయీ హిట్లరూ!
నేల యీనినట్లు లేచి - వేలకొలది యెర్రసేన
నీదు సేన చుట్టుగమ్మ -నిలువుగుడ్లు బడెర నీకు
॥ హిట్లరూ ॥

అబ్బ ! నా కళ్ళు చల్లబడ్డవోయీ హిట్లరూ !
లెనిన్‌గ్రాడ్ వద్దవారు - లేవదీసి తన్నుతుంటె
వేలకొలది నీదుసేన - నేలపాలైనాది
॥ హిట్లరూ ॥

అబ్బ! నా కళ్లు చల్లబడ్డవోయీ హిట్లరూ !
స్టాలినంతోణ్ణి బట్టి - కాలు సేతులంట గట్టి
జర్మనీకి తెత్తునన్న - జ్వరము వదల నిన్నుదన్న
॥ హిట్లరూ ॥

అబ్బ! నీ తిక్క కుదిరిపోయెనోయి హిట్లరూ !
ఉచ్చులోన బడ్డ నిన్ను - తుచ్చులైన సైనికులను
చెక్కుచెదరనీయకుండ - నొక్కి నొక్కి చంపుతుంటె
॥ హిట్లరూ ॥

అబ్బ! నీ తిమ్మిరొదిలిపొయెనోయి - హిట్లరూ!
నాజీల గుంపులన్ని - నల్లమొగము వ్రేలవైన
తెల్లబోయి నీవుజూడ - యెల్ల ప్రజలు నవ్వుతుంటె
॥ హిట్లరూ ॥

ఓరి! నవ్వు వచ్చె నాకుచాల - హిట్లరూ!
'ఇంతబలము రష్యకున్న - అంతునాకు తెలియ' దంచు
ఇంతమోము జేసికొన్న - హంతకుణ్ణి నిన్ను జూచి - హిట్లరూ!
అబ్బ నవ్వు వచ్చె నాకు చాల హిట్లరూ!
హీనమైన నీదుసేన మానవతీమణులబట్టి
నానహింసబెట్టినందు - కానవాలు మరణమన్న హిట్లరూ !
అబ్బ! నా కడుపు మంట తీరినోయి - హిట్లరూ!

ఈ విధంగా హిట్లరును వెక్కిరిస్తూ హిట్లరు మీద రచించిన గేయం ఆనాడు ఎంతో పేరు పొందింది. ఈ గేయంలో 'నా కళ్లు చల్లబడ్డవోయి', 'నిలువుగుడ్లు బడెర నీకు,' 'లెనిన్‌గ్రాడ్ వద్ద వారు లేవదీసి తన్నుతుంటె', 'నీ తిక్క కురిదిపోయినోయి హిట్లరూ!', 'నాజీల గుంపులన్ని - నల్లమొగము వ్రేలవైన', 'తెల్లబోయి నీవుజూడ - యెల్ల ప్రజలు నవ్వుతుంటె', 'ఓరి! నవ్వు వచ్చె నాకు చాల - హిట్లరూ!', నా కడుపు మంట తీరెనోయి హిట్లరూ!' ఈ విధమైన సామాజిక పలుకుబడులు పదాలతో కూడిన ఈ పాట ఒక విధంగా హిట్లరు పరిస్థితిని తెలియ జేస్తున్నది.

ప్రజాశక్తి పత్రికలో ప్రచురించిన మరొక గేయం రష్యా సైనికుని వీరత్వాన్ని శ్లాఘిస్తూ ఉంటుంది. ఎర్ర సైనికులని రష్యన్ సైనికులకు పేరు. 'శాల్యూట్ శాల్యూట్ ఎర్ర సైనికుడా! సెబాసు సెబాసో యెర్ర సైనికుడా! శాల్యూటులివె నీకు శక్తుంటే నీదేనూ!... అనే ఈ పాట రష్యాలో ఉండే ఎర్ర సైనికుని ఉద్దేశించి పాడింది.

"స్టాలిన్‌గ్రాడు కాడ చవట ఫాసిస్టులను జూను ఇరువది రెంట... నిలిపి వేయుడంటూ చోరులౌ నాజీలు... నీచ ఫాసిస్టులను నిప్పులా బాంబులతో నిలబెట్టి నరికావా... నాలుగూ లక్షాల నాజీల గుంపుల్ని కత్తి మీద వొరిగి, సుత్తి కొడవాలెత్తి.... గిరివేసి మెలివేసి గిరిలోన నిలవేసి, కార్మికుల రాజ్యాన్ని కాపాడినావయ్యా, వరికోత కోశావ తరిగావ కూరట్లు" అని ఈ గేయంలో తెలియజేసారు. ఈ గేయాన్ని ప్రజాశక్తిలో 1943లో జూన్, 2వ తారీఖున ప్రచురించారు.

"విజ్ఞాన ధనులారా! అంటూ మరొక గేయంలో సోవియట్ రాజ్యానికి మద్ధతు తెలుపమని విజ్ఞాన ధనులైన ప్రజలకు విజ్ఞప్తి చేస్తారు. అంతేగాక ఈ గేయంలో సోవియట్ రాజ్యానికి ఎందుకని మద్ధతు తెలిపాలి అని కూడ చెపుతూ మనిషి మనిషిని దోచి - మాడ్చి చంపుక తినక సర్వ హక్కులు ప్రజలకు సంక్రమింపగ చేసి.... సోదరత్వముగోరు రాజ్యాన్ని మిత్రమండలిని బలపర్చమని, స్త్రీకి స్వాతంత్రాన్ని, స్వేచ్ఛను కలుగజేసి, నిరక్షరాస్యతను నిర్మూలన చేసి, జాతి, మతాలను గోతిలో పాతేసి, ఫాసిస్టు దుండగీండ్ల గుండెలన్ని పగులగా, ప్రజా స్వాతంత్ర్యంబు గోరువారు రండిరా! అని విజ్ఞాన ధనులను పిలుస్తారు.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సాహిత్యంలో వ్యవసాయం

- ఆకుల లక్ష్మణ్, దుబ్బాక, సిద్దిపేట జిల్లా.

సమాజంలో నిప్పు, చక్రంతో నాగరికత ఆవిర్భావం జరిగింది అని చరిత్ర తెలుపుతుంది. సామాజిక శాస్త్ర వేత్తలు సామాజిక శాస్త్రపరంగా ఈ విషయాన్ని తెలియ జేసారు. ఆదిమదశలోని సంచార జీవనం అనుభవాల నుండి తేరుకున్న మానవుడు స్థిర ఆవాసాలు ఏర్పరచు కొని వృత్తిని ఎంచుకున్న ఆ తరుణం మహోదయానికి, వ్యక్తి సామాజిక జీవితానికి నాంది పలికింది. సామాజిక అనుబంధాలు, పరస్పర చర్యలు, నూతన ఆలోచనలతో కూడిన లక్ష్యాలను మానవుడు ఏర్పరచుకొని, మానవుడు సంఘజీవి అనే పదానికి స్ఫూర్తిని తెచ్చాడు. మానవీయ సంబంధాలు పరిపుష్టం చేసుకొని వ్యవసాయాన్ని జీవన మార్గంగా ఏర్పరచుకున్నాడు.

భారతీయ వ్యవసాయం ప్రాచీనమైనదని, వ్యవ సాయం అంటే ప్రకృతి యందు సహజంగా స్థిరపడి జరుగు తున్న పరిస్థితులను మార్చడమని చెప్పవచ్చు. అయితే ఈ మార్పులు ఎంతవరకు ప్రకృతి అనుసరించో లేదా మిక్కిలి విరుద్ధముగా ఉండవో అంతవరకు వ్యవసాయ కృషి ఫలిస్తుంది. సాధారణ విషయాలలో ప్రాచీన ఆధునిక వ్యవసాయాల ముఖ్య సంప్రదాయాలలో ఎక్కువ భేదాలు కనిపించవు. అప్పుడునూ, ఇప్పుడునూ కూడా దున్నడం, విత్తడం, నీరు పెట్టడం, అంతర్ కృషి దోహదం చేయుట, కోయుట, నూర్పుట, కైలు వేయుట ముఖ్య మైన సేద్యపు పనులుగా వ్యవహారంలో ఉన్నాయి. ప్రస్తుత పాశ్చాత్య శాస్త్ర విజ్ఞాన సహాయంతో ఆధునిక వ్యవ సాయం ఏవిధంగా అభివృద్ధిచెందిందో అట్లాగే ప్రాచీన వ్యవసాయం కూడా పూర్వులు తాము క్రమంగా సంపా దించిన ప్రకృతి శాస్త్ర విజ్ఞానం అనుసరించి ఎప్పటికప్పుడు అభివృద్ధిచెందేవారనడానికి ఆధారాలు కనిపిస్తాయి. ఈ వ్యవసాయ ప్రస్తావనను వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, బృహత్‌సంహితలు, అమరకోశం మొదలైన గ్రంథాల్లో వ్యవసాయ భూములు ఎరువులుగా మొదలగు వానిని గురించి చెప్పబడింది.

భగవద్గీతలోని వ్యవసాయ ప్రస్తావన గురించి పరిశీ లించినప్పుడు గీతాచార్యుడైన కృష్ణభగవానుడు అర్జునుడికి చేసిన గీతోపదేశంలో వ్యవసాయ ప్రస్తావనను కింది విధంగా తెలియ జేసాడు.

"అన్నాద్భవన్తి భూతాని - పర్జన్యా దన్న సంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో - యజ్ఞ కర్మ సముద్భవః"
(3-14)

అలాగే పోతన భాగవతంలో శ్రీకృష్ణలీలలులో కరువు అధ్యయనం పోతన ఈవిధంగా వర్ణిస్తాడు.

దినము లంతంతకు దీర్ఘంబులైయుండ
దిననాథుడుత్తరదిశుజరించె
నాటినాటికినెండ నవ్యమై ఖరమయ్యె
వెచ్చని గాడ్పులు విసరుజొచ్చె
మేదినీరేణువుల్ మింటసంకులమయ్యె
నేఱులుగొలకులనిగిరిపోయే
బానీయశాలలుబధిక సంఘము నిల్చె
జప్పరంబులభోగిచయముడాగె

దరులుగుసుమ చయము దళములతో వాడె
మిథున కోటికి రతిమెండుదోచె
సఖిలజంతుభీష్మమైనగ్రీష్మముారాక
గీలియడవులందు గేలి సలిపె.
(పోతన భాగవతము :714)

ప్రధానంగా బ్రహ్మాండ పురాణం, విష్ణు, పద్మ, నారద పురాణం, వరాహ, మార్కెండేయ, దేవీభాగవత, మత్స్య, అగ్ని, స్కాంద, పురాణాల్లో కరువులను గురించి చర్చిం చడం జరిగింది.

వరాహపురాణంలో కూడా అనావృష్టిని, అతివృష్టిని పరమేశ్వరుడు యోగి పుంగవులకు చెప్పే సందర్భంలో వ్యసాయక పరిస్థితులను తెలియజేయబడింది. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో 'కలియంబలి' కథలో చోళ మండేశ్వరుడు పొరుగు రాజ్యంపై యుద్ధానికి వెళ్తాడు. మతిభ్రష్టురాలైన అతని భార్య కరువు వచ్చింది, ఎట్లా బ్రతుకుతారో ఏమో అని తన గాదెల్లోని ధాన్యాన్ని తల్లిదండ్రులకు, బంధువులకు పంపిస్తుంది. అప్పుడు యుద్ధంలో ఉన్న రాజుకి పరమేశ్వరుడు ప్రత్యక్షమై చోళుడా! నీ గాదెలన్ని ఒట్టిపోయినవి. ఇంకెందుకు ఈ యుద్ధం. ఎవరిపై దాడి? అని హెచ్చరిస్తాడు. వెంటనే చోళ మండల రాజు అంతఃపురానికి వచ్చి ధాన్యాగారంలో గాదెలు ఖాళీగా ఉండడం చూసి, రాణిపై మండిపడి ఆక్రోశిస్తాడు. రాణి తన తల్లిదండ్రులకు పంపించానని చెప్తుంది. ఆ కథలోనే రాజు లేని కారణంగా ఆ రాజ్యంలో 60 సం॥లు అనావృష్టి తాండవం చేసిందని తెలియజేశాడు.

జనశ్రుతిలో చాటువులుగా చెప్పబడే ఇవి ఎక్కువగా శ్రీనాథుడి కాలంలో ఉన్నట్లుగా తెలుగు సాహిత్య చరిత్రకారులు తెలియజేశారు. సామాన్యంగా చాటువుల్లో ఎక్కువ భాగంగా శ్రీనాథుడి కాలం లోనివే అయి ఉండడం విశేషం. అలాంటిదే అతని చాటువు పల్నాటిసీమలో కరువు గురించి ఈవిధంగా చెప్పబడింది.

రసికుడు పోవడు పల్నా
డెసుగంగారంభమైననేకులెవడుకున్
వసుధేశుడైన దున్నును
గుసుమాస్త్రుండైన జొన్న కూడే కుడుచున్.

కాలజ్ఞానంలో పోతులూరి వీరబ్రహ్మంగారు క్షామం గురించి భవిష్యత్తులో జరగబోయే పరిణామాల గురించి ఈవిధంగా చెప్పాడు.

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్త మాల్యదలో పంటచేల వర్ణనలో ఇలా తెలిపారు.

"గూండ్లకై శాలిమంజరుల్ గొనుచు మూగి
యంబరంబున బఱచుకీరాళి వొలిచె
బసరు టొంటొంటి యాకుతో బండబాఱి
ఛేదభయమున నెగసిన చేలనగ"

(ఆముక్త మాల్యద)

వరిచేలు పండినవి. వరి మొక్కల నుండి ధాన్యపు గుత్తులు వ్రేలాడుచున్నవి. చిలుకలు ధాన్యపు గుత్తులను గొఱికి యెఱ్ఱని ముక్కులతో గఱచి పట్టుకొని యాకాశముపై గుంపులు గుంపులు గూండ్లకు జేరుచున్నవి. అది రాబోవు కోతలకు భయపడి వరిచేలు నింగికెగసి పాఱిపోవుచున్నట్లున్నది.

ఆధునిక సాహిత్యంలో వ్యవసాయ రైతు ప్రస్తావన ఉన్న రచనలు చాలా ఉన్నాయి. కథల్లో, నవలల్లో, నాటకాల్లో, కవితల్లో అనేక ప్రక్రియల్లో రైతుల ప్రస్తావన కనిపిస్తుంది. కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి పద్యకావ్యం 'కృషివలుడు', ఈ కావ్యంలో వ్యవసాయానికి సంబంధించిన రైతు జీవన స్థితి గతిని తెలిపాడు.

శ్రమలు లేకయె ఫలములు దుముక బోవు
పిండికొలదియె రొట్టె మోపిన విధాన
గష్టపడుము కృషివలన గలుగు సుఖము"

అని వ్యవసాయంలో శ్రమ జీవనాన్ని గురించి చక్కగా అభివర్ణించారు. అలాగే వ్యవసాయ రైతు ప్రస్తావనను గురించి ఒక ప్రత్యేక కావ్యంగా తీసుకువచ్చిన వారు గంగుల సాయిరెడ్డి రాసిన 'కాపుబిడ్డ' కావ్యం. వ్యవసాయ రైతుల జీవితాలను గురించి స్త్రీ పురుషుల జీవితాలను అద్భుతంగా రాశారు.

"ఇందిరాదేవి బోలెను ఇల్లు వెడలి
వచ్చు గరితను కనుగొని మెచ్చుకొనుచు
ఱంకెవేసెడి యెద్దుల లంకెబెట్ట
కనుల పండువు కర్షకా గాదె నీకు" (కాపుబిడ్డ)

అని రైతు భార్య అయిన ఇందిరా ఇంటి నుండి పొలానికి బయలుదేరిన వైనాన్ని గురించి కవి అద్భుతంగా వర్ణిస్తూ రాయడం జరిగింది.

వానమామలై జగన్నాథాచార్యులు 'రైతు రామాయణం'

మొదలైనవి వ్యవసాయదారుని గురించి రాసినవే. కథల్లో మేరెడ్డి రాసిన 'బొడ్రాయి కథలు' రైతుల కష్టాలకు ప్రకృతే కాదు, ప్రభుత్వము కూడా కారణమని చెప్పే 'హలాహలం' రైతు జీవితాన్ని భవిష్యత్తును, ఆక్రమించుకున్న సేటు, నష్టపోయిన రైతు గురించి తెలియజేసే కథ 'ఆ ఇల్లు మూడ వడ్డది' నామిని సుబ్రహ్మణ్యం నాయుడు రాసిన 'ఆర్య వ్యవహారంబులు దుష్టంబు గ్రాహ్యంబు' మేరెడ్డి యాదగిరిరెడ్డి రాసిన 'రైతు యాత్ర' చిత్తూరు కథ సంకలనం ఇవన్నీ కూడా వ్యవసాయరైతు సంబంధిత అంశాల కేంద్రంగా వచ్చిన కథలు మనకు తెలుగు సాహిత్యంలో ఎన్నో కథలు మనకు కన్పిస్తాయి.

కథా సాహిత్య ప్రక్రియల్లోనే కాదు నవలలో కూడా మనకు వ్యవసాయానికి సంబంధించిన అంశాలు అనేక సందర్భాల్లో కన్పిస్తాయి. నవలా సాహిత్యంలో ముఖ్యంగా ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన 'మాలపల్లి' పాలగుమ్మి పద్మరాజు 'నల్లరేగడి' చెరబండరాజు ప్రస్థానం నామిని సుబ్రహ్మణ్యం నాయుడు రాసిన 'మునికన్నడి సేద్యం', బండి నారాయణ స్వామి రాసిన 'గద్దలాడతాండయి', మొలుకపల్లి కోటేశ్వరరావు రాసిన 'ఆక్రందన', కాలువ మల్లయ్య రాసిన 'బతుకు పుస్తకం', భూమిపుత్రుడు, వాసిరెడ్డి సీతాదేవి రాసిన 'మట్టిమనిషి', కేశవరెడ్డి రాసిన 'మూగవాని పిల్లనగ్రోవి', సన్నపురెడ్డి రాసిన 'కాడి', జొన్న విత్తుల రామచంద్రమూర్తి రాసిన 'వలస దేవర', పైడి చంద్రలత రేగడి విత్తులు' వంటి నవలలు మొదలైనవి రైతు వ్యవసాయ నేపథ్యంతో కనిపిస్తాయి. సమాజంలో వ్యవసాయ ప్రస్తావనతో రైతుల వెతలను కథలుగా మలిచిన తీరు చాలా అద్భుతంగా కన్పించడం కన్పిస్తుంది.

కవిత్వం, కథ, నవలలో కాకుండా రైతు ప్రాతిపదికగా నాటకాలు కూడా వచ్చాయి. వీధి నాటకం 'రైతు విజయం' ఇది జానపద వీధి నాటకం. ఏటిదరి పొట్టిపల్లె నివాసస్థులయిన పి.వీరప్పగారు 'రైతు విజయం' అనే నాటకాన్ని 1953లో ప్రచురించారు. ఇందులో రైతు జీవన చిత్రణ ఉంది. కోటారెడ్డి రైతుసోదరి లలితాబాయికి పెళ్ళి చెయ్యాలనుకున్నా పంటలు పండక, పేదరికంతో బాధ పుడుతూండడం, సోదరి విషయంలో ఆస్తి పోగొట్టుకోవడం చివరికి పిచ్చివాడవ్వడం, భూస్వాములు భూములు లాక్కోవడం చివరికి ఆసుపత్రిలో ఆరోగ్యవంతు డవడం ఇందులోని కథ.

నాటకాల్లో 'జమీన్ రైతు' నాటకం, 'భూమి భాగోతం' నాటకం శ్రీకాకుళం జిల్లా లక్ష్మీపేటలో భూమికోసం ప్రాణాలు తీసుకున్న ఒకే ఊరిలోని ఇరువర్గాల సంఘర్షణ. దళితులపై దాడిని తెలియజేస్తుంది. ఇది 1974లో వంగపండు రాశాడు. 'పాలేరు' నాటకంలో వంశాను గతంగా వస్తున్న జమిందారితనం, కామందు - పాలేరు మధ్య జరుగుతున్న మౌన పోరాటం. పాలేరు వెంకన్న ఎన్నో బాధలు పడి బి.ఏ.పరీక్ష పాసై డిప్యూటి కలెక్టర్ హోదాలో రైతు వాడకు వెళ్తాడు. 'పడమటిగాలి' నాటకంలో వ్యవసాయ నేపథ్యం ఉన్న కుటుంబం ప్రపంచీకరణ ప్రభావంతో సులభంగా డబ్బు సంపాదనకు ప్రయత్నించి చివరకు మనుమడితో వ్యవసాయం ప్రారంభమవడం కనిపిస్తుంది.

ముగింపు :

ఇలా తెలుగు సాహిత్యంలో వ్యవసాయానికి సంబంధించిన అంశాలను కేంద్రంగా చేసుకొని తెలుగు సాహిత్యంలో రచనలు వచ్చాయి. ప్రపంచానికి అన్నం పెట్టేవానికి తిండిలేక రోడ్ల పాలవుతున్న పరిస్థితులు మనం రోజు దినపత్రికల్లో వార్తలు చూస్తునే ఉన్నాం. కాబట్టి ప్రపంచానికి ప్రధానమైన వృత్తి వ్యవసాయం అని వ్యవసాయంతో రైతు సమాజాన్ని రక్షిస్తున్నాడనే విషయం తెలుగు సాహిత్యం ద్వారా కవులు, రచయితలు కళ్ళకు కట్టినట్లు చెప్పిన విషయాలు మనకు పై విధంగా కన్పిస్తున్నాయి.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు గజల్ – కవి – కవితాత్మకత

– డా॥. నందిరెడ్డి పురుషోత్తమ రెడ్డి, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కంభం, ప్రకాశం జిల్లా.

గజల్ ఒక అందమైన సాహితీ ప్రక్రియ, ప్రతి గజల్‌లో కవి హృదయం, కవి ఆలోచనలు మనకు సాక్షాత్కరిస్తాయి. చాలా మంది గజల్ సంగీతం అన్న పద ప్రయోగం చేస్తుంటారు. నిజానికి గజల్ సంగీత ప్రక్రియ కాదు. అది సాహితీ ప్రక్రియ మాత్రమే. కానీ వివిధ తాళ, లయ గతులలో గజల్ లు రాయడం వల్ల అంతర్లీనంగా గజల్ సాహిత్యంలో సంగీతం కూడా ప్రవహిస్తూ ఉంటుంది.

గజల్ రచన అంటే కేవలం ఖాఫియా, రదీఫ్ ల కూర్పు కాదు, ప్రతి షేర్ లోను ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేసే భావ వ్యక్తీకరణ కనిపించాలి. కవి విశేషమైన కృషి చేయాలి. వేనవేల ప్రాణాలను హరించి విసుగేసిందేమో మనిషిగా క్షణం జీవించాలని మరణానికి దాహం ఆలయాల్లో కొలిచే ప్రతిమలు ఆత్మ తృప్తికే సినారె దయ కురిసే మనుషుల్లో ఉన్నది దైవం చేసిన సంతకం అన్న షేర్లలో కవి సినారే భావ ప్రకటన ఎంత పదునుగా, ఏట సూటిగా ఉందో గమనిస్తే ఒక షేర్‌ని ఎంత బలంగా రాయాలో అర్థమవుతుంది.

అందరూ మృదువుగా ఉచ్చరించేందుకు వీలుగా ఉండే పదాలను ఉపయోగించి గజల్ వ్రాయవలసి ఉంటుంది. ఏవో మారుమూల పదాలను ఉపయోగించ రాదు. వాడుక భాషలోనే గల వ్రాయగలిగితే, భావం అర్థమై, శ్రోతలకు ఆనందాన్ని కలిగిస్తుంది.

డాక్టర్ రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు గోదావరిపై రాసిన గజల్ లో గట్ల వెంబడి చెట్లు, చేమలు, ఊళ్లు జీవాలు ఎంత కల్పనా బ్రహ్మాంకింకొక మాట గోదారి అన్న షేర్లు ఎంత కవితాత్మకంగా, రసస్పోరకంగా ఉన్నాయో గమనించాలి.

కవి రసరాజు తన గజల్లో ఒక్క గజల్ రాయాలని ఎంత చచ్చి బతికానో ఎన్ని ఎన్ని భావాలూ ఏరి తెచ్చి ఉతికానో అని అంటూ పదానికి పదానికి స్నేహం పూయించాలని ఎన్నిమార్లు ఆ రెంటికి ప్రాణమిచ్చి అతికానో అని అంటారు. ఎంత మంచి షేర్! ఇది గజల్ అందినట్టే అంది తుర్రుమనే పిట్టలాగ ఎగిరిపోతుందని దానిని చాకచక్యంగా ఒడిసి పట్టుకోవాలని రసరాజు భావన.

గజల్ కవి విశ్వజనీనమైన భావాలను, అనుభవాలను, అనుభూతులను తన గజళ్ళలో సాహిత్యంగా ఎంచుకున్నప్పుడు ఆ గజళ్ళు మిక్కిలి ప్రేరణ పొందుతాయి. స్వీయానుభూతి, అనుభూతులతో రాసిన గజళ్ళు ప్రేక్షకుల మనస్సులకు మరింత దగ్గరౌతాయి. అనేక భాషల్లో ప్రచురించబడుతున్న గజళ్ళను అధ్యయనం చేయాలి. కేవలం గజల్లే కాకుండా అనేక సాహితీ ప్రక్రియల్లో వచ్చిన భావాలను పరిశీలించాలి. అనేక దృశ్యాలను, సంఘటనలను మనో నేత్రాలతో చూడగలిగినప్పుడు మంచి గజల్లు పుట్టే అవకాశం ఉంటుంది. అమెరికా ప్రయాణానికి వెళుతూ కూడా గజల్ శ్రీనివాస్ హైదరాబాదు విమానాశ్రయంలో తల్లిదండ్రులు రెండేళ్లకు ఒకసారి తమని చూడడానికి వచ్చి తిరిగి వెళుతున్న తమ బిడ్డలకు వీడ్కోలు చెబుతున్న ఒక దృశ్యాన్ని చూసి, ఆ దృశ్యం పై తిరుగు ప్రయాణం అనే శీర్షికతో ఒక గజల్ రాసారు.

వెళ్ళినట్టే లేదు పల్లెను చూసినట్టే లేదు
ఎన్నో రోజులు గడిపినా, గడిపినట్టే లేదు

అన్న గజల్ ప్రవాసాంధ్రులను ఎంతో కదిలించింది.

డాక్టర్ తటవర్తి రాసిన ఓనమాలు నేర్పిన నీ వీధి బడి కూలిపోతూ నీ కుశలం అడగమంది అన్న గజలులో పల్లె శిధిలమైపోతున్నా తన ఒడిలో పుట్టిన బిడ్డ ఉన్నత శిఖరాల పై ఉన్నాడని తెలుసుకొని తన బిడ్డ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని కోరుకుంటూ

కుశలమా నాన్న అని సంభోదిస్తూ సాకిన గజల్ ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తుంది.

ప్రచురణకు యోగ్యమైన గజళ్ళతో పాటుగా గాన యోగ్యమైన గజళ్ళు రాయడం వల్ల కవి ప్రయత్నం లక్షాలాది మంది గజాలు ప్రేమికుల దగ్గరకు వెళుతుంది. తద్వారా కవి యశస్సు, అతని సాహితీ తపస్సు కాలంతో పాటు నిలిచిపోతాయి.

ఉర్దూ, హిందీ గజలు ప్రపంచంలో కవికి పెద్ద పీట వేస్తారు. కవి పేరు చెప్పకుండా ఏ గాయకుడు గజల్ గానం చేయడు. గాయకుడూ గజల్ గానం చేస్తున్నప్పుడు మంచి షేర్ తన గజల్ గానంలో రాబోతున్నప్పుడు ప్రేక్షకులను ఓ మంచి సాహిత్యం వినడానికి మానసికంగా సిద్ధ పరుస్తాడు. అలా గజల్ భావ సౌందర్యాన్ని మన:పూర్తిగా గాయకుడు ప్రశంసిస్తూ ఉంటే కవి ఓ కావ్య దేవతలా మహిఫిల్ లో మనకు సాక్షాత్కారిస్తాడు. గజల్ ప్రక్రియకు భూమిక ఆత్మలాంటిది.

రాజు ఎదురైతే నమస్కరిస్తా కవి ఎదురైతే సాష్టాంగ పడతా అన్న డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట గజల్ సాహిత్యంలో కవికి ఉన్న ప్రాధాన్యం ఎటువంటిదో మనకు అర్థం అవుతుంది. గజల్ సాహిత్యానికి కవి ఆలోచనలే జనజీవాలు.

గజల్ ముషాయిరాలు మెహఫిల్ ల వాతావరణం ఓ ప్రత్యేకమైనది. సాదారణంగా శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, ఓ నాటకం మరే ఇతర కళా ప్రదర్శనల్లో అయినా ప్రేక్షకులు తన్మయులై వీక్షిస్తారు. ఎప్పుడైనా రసానుభూతి కలిగినప్పుడు, ప్రదర్శనాంశం పూర్తైన తర్వాత హర్షధ్వానాల ద్వారా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. కచేరి వాతావరణం అంతా ఓ ధ్యాన ముద్రలో ఉన్నట్టుగా అనిపిస్తుంది. కళాకారులకు ఎటువంటి అసౌకర్యాన్ని, అసంతృప్తిని కలిగించే చేష్టలు చేయకుండా ప్రేక్షకులు శ్రద్ధతో, తాదాత్మీయంతో ప్రదర్శనలో లీనమవుతారు.

గజలులోని భావం ఏ చరణానికి ఆ చరణం వేరుగా ఉంటుంది కాబట్టి ప్రతి చరణానికి ప్రేక్షకులు నుండి స్పందన ఆశిస్తారు.

మరొక సందర్భంలో తమకు నచ్చిన షేరును మరలా పాడమని ప్రేక్షకులు గాయకులను కోరడం తరుచూ చూస్తుంటాం. గాయకులు వారి కోరికను మన్నించి మరలా గానం చేస్తారు.

గజలు ముషాయిరాలు, మెహఫిల్ లు పూర్తి స్థాయిలో విజయవంతం కావాలి అంటేమేలైన రచన, భావస్ఫూర్తితో సాగే గాయకుని గానం, రస స్పందన ప్రకటించే ప్రేక్షకులు భూమిక, ఇవన్నీ అవసరం. గజలు ప్రజల కోసమే అని డాక్టర్ గజల్ శ్రీనివాస్ అనేక సందర్భాల్లో తన కచేరిలలో చెబుతారు. గజలు వివిధ సంస్కృతులతో అవిష్కరించే సాహితీ ప్రక్రియ. గజలుతో అనుబందాన్ని పెనవేసుకున్న వారికి ప్రతి గజలు ఆపాత మధురం, ఓ ఆత్మానందం.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నియోగి జీవితం – రచనల వైవిధ్యం

- నాగెల్లి ప్రభాకర్

తెలంగాణ సమాజంలో తాను చూచి అనుభవించిన సామాజిక పరిస్థితులు, సాంస్కృతిక స్థితిగతులు, పీడన, నిరసన, ప్రతిఘటన ఈ అన్నింటిని నియోగి తన రచనల్లో సమగ్రంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. నియోగి నాలుగు ప్రజాఉద్యమాల (తెలంగాణ విమోచనోద్యమం, రాజకీయ స్వాతంత్ర్య పోరాటం, విశాలాంధ్రోద్యమం, తెలంగాణ రాష్ట్రోద్యమం) చరిత్రను చూచి వాటి ప్రభావంతో సాహిత్య సృజన చేశారు. దీనితో పాటు తన బాల్య సంఘటనలు, వాటి అనుభవాలు, ఇతరుల అనుభవాలను మేళవించి నియోగి కవిత్వం రాశారు. దీనితో పాటు వివిధ పత్రికల్లో పనిచేసిన అనుభవంతో తన కవితా వ్యాసంగాన్ని కొనసాగించాడు. "నియోగి తాను పుట్టి పెరిగిన గడ్డమీద తొలినుండి ఎన్నో రాజకీయమైన సంఘర్షణలను ప్రత్యక్షంగా చూశాడు. తెలంగాణను మాతృమూర్తిగా భావించి అనేక కవితలను రాశాడు. కొన్ని కవితల్లో తెలంగాణను మాతృమూర్తిగా కాకుండా వీరమాతగా కూడా భావించాడు. "నీవు వీరమాతవే తల్లి! కన్నీరు పెట్టకు । అన్యాయమంపై । తిరగబడ్డ పులిబిడ్డ వాడు.

ఈ వేల మంది నీ బిడ్డలే దీవించు అంటూ వీరమాత నిర్వహించిన పాత్రను ఈ కవితలో నియోగి గుర్తు చేస్తారు. ఇటువంటి కవితలు ఆయనను ప్రజాకవిగా ఉద్యమ కవిగా నిలబెడతాయి. ఈ విధంగా తెలంగాణ సాహిత్యం మరింత దీప్తిమంతంగా కావడానికి నియోగి రచనలు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు.

ముళ్ళపాటి కామేశ్వరరావు సీతాదేవి దంపతులకు 1964 జూన్ నెల 20వ తేదీన మధిర తాలూక చొప్పకట్ల పాలెంలో ముళ్ళపాటి వేంకటరమణ జన్మించారు. కలం పేరు నియోగిగా మార్చుకున్న వేంకటరమణ బి.కాం. వరకు చదువుకున్నారు.

పువ్వు పుడుతూనే తన అందంతో పాటు పరిమళాలు ప్రసారిస్తుంది. తొలి వర్షపు చినుకు గుండెకి తాకగానే ప్రకృతి పచ్చని నవ్వులతో పాటు నులి వెచ్చని ఆశయాలను మానవ ప్రకృతిలోకి పంపిస్తుంది. అట్లాగే నియోగి జననం జరిగింది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను బాగా ఆకలింపుకు తెచ్చుకున్నవారు. ఈ విద్యలలోని విశిష్టతను తన గ్రామ ప్రజలకు అందిస్తూ వాళ్ల జీవితాలలో చైతన్యాన్ని వికసింపజేసే వారు. అందరినీ కలుపుకు పోయే చక్కని హృదయ భాష కలిగి మనుగడను రేపటి తరానికి అందించిన కవి. అన్ని విధాలా భర్తకు సరితూగిన ఇల్లాలుగా నాగలక్ష్మి నవంబరు 6, 1989న నియోగి జీవితంలోకి ప్రవేశించారు. పుట్టినింట సంస్కారాన్ని మెట్టినింట సంప్రదాయాన్ని బాగా తెలిసి ఆదర్శంగా ప్రవర్తించిన సాద్వీమణి ఆమె భర్త అడుగు జాడలలో పయనించిన ధన్యాత్మ. గృహాన్ని చక్కదిద్దిన మాతృమూర్తి. మమతా సమతలు తెలిసి ఆత్మీయతా అనురాగాలను పంచిన ఇల్లాలు. ఆమె మనస్సుకు ఎల్లలు లేవు. తన భర్త కుటుంబ సభ్యుల అందరినీ ప్రేమవాత్సల్య భావాలతో ఆదరిస్తున్న ఆత్మీయమూర్తి. తల్లిదండ్రులు ఆదర్శ జీవితంలో తమ చుట్టూ విస్తరించి ఉన్న సమాజాన్ని చైతన్య పరచినవారే. అందరూ భగవంతున్ని ఆరాధించిన వారే! తండ్రి సంస్కృతాంధ్ర సాహిత్యాలలోని పంచకావ్యాలను చదివారు. అనేక శాస్త్రాలను అధ్యయనం చేశారు. గ్రామ ప్రజలకు సన్నిహితుడుగా, హితుడుగా ఉండి ధార్మిక జీవితాన్ని గడిపారు. అలాంటి సంప్రదాయ కుటుంబంలో నియోగి శైశవ, బాల్య యౌవన జీవితాలు గడిచాయి.

జర్నలిజాన్ని వృత్తిగా స్వీకరించి తొలుత 1985లో "ఉదయం" పత్రికలో జర్నలిస్టుగా చేరాడు. అనేక చిన్న పత్రికల్లో ఉప సంపాదకునిగా పనిచేశాడు. ప్రస్తుతం

ఆంధ్రప్రభ దినపత్రికలో 'సాహితీ గవాక్షం, సంస్కృతి' పేజీ లకు ఇన్‌చార్జిగా సబ్ ఎడిటర్ హోదాలో పనిచేశారు.

నియోగికి ఆంధ్రప్రదేశ్‌లోని అనేక సాహిత్య కళా సంస్థలతో అనుబంధం ఉంది. ముఖ్యంగా హైద్రాబాద్ లోని వివిధ సంస్థలతో అనేక మంది సాహితీ వేత్తలతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉంది. ప్రముఖ సాహిత్య పత్రిక ఆంధ్రప్రభ, ఆంధ్ర పత్రిక, ఆంధ్రభూమి, నేటి నిజం, సాక్షి, విశాలాంధ్ర , ప్రజాశక్తి, ఆంధ్రప్రదేశ్, యోజన, ఆంధ్రజ్యోతి, (దిన,వార) వంటి అగ్రశ్రేణి పత్రికలలో నియోగి కవితలు వ్యాసాలు ప్రచురింపబడినాయి. ఇంకా ప్రచురింపబడుతూనే ఉన్నాయి. నియోగి చాలా ప్రక్రియల్లో అనేక గ్రంధాలు వెలయించారు. ఆయన రచనల నిండా సమాజం కన్పిస్తుంది. అనేక సమస్యలు వాటి పరిష్కారాలు ఉంటాయి. ఆ పరిష్కారాలు కూడా మానవత్వం భూమికగా సాగుతాయి. అసలు సమస్యలు ఉత్పన్న మవటానికి గల హేతువులను ముందుగా పరిశీలిస్తారు. అక్కడి నుంచే సంస్కరించే యత్నం చేస్తారు. ఈ అగాధమైన అంశాల్లోకి వెళ్లి అన్వేషణ చేయటం కవి బాల్యదశ నుంచే పట్టుబడింది.

తెలంగాణ కథా సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే అందులో గ్రామీణ జీవితం, సామాజిక పరిస్థితులు వీటిలో ముఖ్యంగా రైతుల కష్టాలు, దుర్భర దారిద్ర్యాలు, రోగాలు, అప్పులు మొదలైన వాటిని నియోగి తన కథల్లో చిత్రించారు. ఈనాడు పల్లె జీవినాన్ని పరిశీలిస్తే పల్లెలు వల్లకాడు అవుతున్నాయి. సకాలంలో వర్షాలు పడక కాలువల ద్వారా నీటి సౌకర్యం అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తద్వారా వ్యవసాయం జరిగా జరగక రైతులు అప్పులుపాలై ఆత్మహత్యలు చేసుకుంటు న్నారు. అయితే నియోగి కాలువ మల్లయ్య, బి.ఎస్. రాములు, పెద్దింటి అశోక్ కుమార్, జాతశ్రీ, కె.వి.నరేందర్ లాగ ఎక్కువ కథలు రాయకున్నా రాసిన కథల్లో స్థానికత కనిపిస్తుంది. కథల్లో ఏ ఇజాలు లేకున్నా, ఏ సిద్ధాంతాలు లేకున్నా ప్రాంతీయ అస్తిత్వ స్పృహతో కథలను రాశారు. తెలంగాణ కథా సాహిత్యానికి నేను సైతం అంటూ మానవ దృక్కోణం నుండి కథలు రాసిన రచయిత నియోగి. తెలం గాణ రాజకీయాల జోలికి పోకుండా సాంఘికార్థిక వాతావరణ పరిస్థితులను పరిణామాలను దృష్టిలో పెట్టుకొని తమ అభివ్యక్తిని కథల్లో కెక్కించారు. నియోగి ఈతరం తెలంగాణ కథకుల్లో వాస్తవిక దృక్పథంతో కథలు రాస్తున్న రచయితగా పేర్కొనవచ్చు. ఆయన కథలు ఎక్కువభాగం ఆర్థిక సమస్యలతో కూడినవిగా ఉన్నాయి. ఇందులో తెలంగాణ సమాజనం తీరు తెన్నులను కూడా తన కథల్లో చిత్రించారు.

మూసపద్ధతిలో కొనసాగుతున్న తెలంగాణ కథానిక రంగంలోకి ఆశాకిరణంలా వచ్చిన కథకుడు నియోగి ఆయన కథలన్నీ సహజంగా ఉంటాయి. వాస్తవ చిత్రీ కరణతో పాఠకులను ఆలోచింపజేస్తాయి. నియోగి కథలు తక్కువే అయిన అన్నీకూడా ఆణిముత్యాలే. ఏ కథకు ఆ కథనే మంచి కథగా చెప్పుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే వీరి కథల్లో మధ్య తరగతి మానవ సంబం ధాలు చిత్రీకరించారు. ఇవి నేటి సమాజంలో జరగుతున్న మధ్యతరగతి ఆవరి సమస్యలకు ప్రతిబించాలని చెప్పవచ్చు.

నియోగి కథల్లో మానవ అంతరంగాల వ్యక్తీకరణ, మనిషి నేపథ్యాన్ని విశ్లేషించడం మొదలైన అంశాలను పరిశీలిస్తే ఈ కథల్లో స్థానికతను అంచనా వెయ్యవచ్చు. నాటకాల సాంబయ్యలో మధిర ప్రాంతం, రికార్డింగ్ డ్యాన్స్‌లో సత్తుపల్లి స్వాములవారు కథలో హైద్రారాబాదు, కొన్ని లక్షణాలు కథలో సికింద్రాబాద్ ప్రాంతాలను పేర్కొ న్నారు. కథలో స్థానికతను పరిశీలిస్తే స్థానికత కారణంగానే నియోగి కథలు నేలవిడిచి సాము చెయ్యకుండా నిబద్ధతతో, నిజాయితీతో, సామాజిక నిష్ఠతో మానవ సంబంధాలకు ప్రాముఖ్యతను ఇచ్చాయి. వీరి కథల్లో మానవ సంబంధాలలో అప్యాయతలు, ఆర్భాటాలు, వ్యత్యాసాలు, దుర్మార్గాలూ అన్నీ కనిపిస్తాయి. కొన్ని కథల్లో పేదరికం, అవిద్య, వివక్ష, సంక్షోభాలు, అమాయకత్వం,

దుఃఖాలులు పీడన వంటి ఎన్నో పార్శ్వాలు వీరి కథల్లో చోటు చేసుకోవడం పరిశీలిస్తే ఈ కథల్లో స్థానికతను మనం అర్థం చేసుకోవచ్చు. కథా రచన ఒక యజ్ఞ లాంటింది. అతి తక్కువ నిడివిలో ప్రజలని పరికించి వారి జీవితాన్ని పాఠకునికి దృశ్యమానం చేసి తదాత్మ్యం చెందించి సమస్యలపై దృష్టి సారింప జెయ్యడానికి స్థానికతే ప్రధాన కారణం అవుతుంది. అటువంటి స్థానికతకు నియోగి కథలు పెద్దపీట వేశాయి.

నియోగి రాసిన అన్ని ప్రక్రియల్లోనే ఆయన వ్యక్తిత్వం కన్పిస్తుంది. ఆయన రచనలను పరిశీలిస్తే ఆయన సాహితీ వ్యక్తిత్వం ఒక పద్ధతిలోనే సాగినట్లు ఈ వ్యాసం వల్ల నేను గ్రహించాను. ఆయన కవిత్వం రాసినా, కథలు రాసినా విమర్శ చేసిన అందులో కవిత్వముంటుంది. ఆ కవిత్వం అందరి హృదయాలను అలరిస్తుంది. ఇంకా ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన ప్రతి రచనలో సమకాలీన సమాజం కన్పిస్తుంది. ధనవంతుల చేతిల్లో బక్కచిక్కిన నిరుపేదల పట్ల ముఖ్యంగా దళితుల పట్ల నియోగికి చక్కటి సానుభూతి ఉంది. అయితే నేడు వారిపట్ల సమాజం వ్యవహరిస్తున్న తీరుకు తన రచనలు ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. తన రచనల్లో మానవుని కులాన్ని బట్టికాక గుణాం బట్టి గౌరవించాలని సూచించారు. నానాటికీ కనుమరుగౌవుతున్న మానవ సంబంధాలను పెంచుకోవాలని తన రచనలు ద్వారా స్పష్టం చేశారు.

నియోగి ఎంత ప్రతిభకల కవో అంత సాహితీ విమర్శ కుడు కూడా ఆయన సాహితీ విమర్శలో ఎక్కువ వామపక్ష భావజాలం కన్పిస్తుంది. సహృదయత, విషయ పరిజ్ఞానం, విషయాన్ని నిష్పక్షపాతంగా చెప్పడం ఇలా ఈ లక్షణాలన్నీ నియోగి సాహితీ విమర్శలో చూస్తాము ఒక్కొ సాహితీ వేత్తకు ప్రశ్నలను సంధిస్తూ వాటికి సరియైన సమాధానాలు రాబట్టడం నియోగికి ప్రత్యేకత ఒక్కొక్క సమయంలో నియోగి వేసిన ప్రశ్నలకు వెంటనే సమాధానాలు చెప్పలేక కంగారు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో వంద ప్రశ్నలు-సమాధానాలు

అనేది నూతన ప్రయోగమనే చెప్పాలి. ఒక్కకవి అతని కవిత్వానికి వ్యక్తిత్వాన్ని సమగ్రంగా ఆవిష్కరించడానికి ఈ ప్రక్రియ ఎంతో దోహదం చేసింది. ఇది ముమ్మాటికి వినూత్న ప్రయోగమే కవి రచయిత యొక్క సాహిత్య సామాజిక జీవనాన్ని అన్ని కోణాల్లో చదివి దర్శించి, సంఘర్షించి దీనికి జీవం పోశారు.

నియోగి ఎంచుకున్న వస్తువు ప్రజానముహం నుండియే తీసుకుంటాడు. స్థానికత, వాస్తవికత రెండు సామాజిక జీవన చిత్రణకు ప్రతిఫలనాలే అనడానికి నియోగి కవితలు చక్కని రుజువు. ఆయన ఏ కవిత పరిశీలించిన మానవత్వ పరిమళాలు వెదజల్లుతాయి. అదే పాఠకుడ్ని అతుక్కుపోయేట్లు చేస్తుంది. నియోగి కవిత్వం నిండా మనిషి శ్రమే వస్తువు. మనిషిని మనిషే దోపిడీ చేసే అమానుషం మీద మనిషి ఓటు వేసి నాయకులను ఎన్నుకొంటే

ఆ పాలకులే మనిషిని దొపిడీ చేస్తున్నారు. ఆ మనిషిని తన కవిత్వం ద్వారా తిరుగుబాటు చైతన్యాన్ని కలిగిం చడం నియోగి రచనల ప్రత్యేకత. నియోగి రచనల ఆధారంగానే ఆయన కవిత్వాన్ని విశ్లేషించే ప్రయత్నం ఈ పరిశోధనలో చేశాను. నియోగి పెరిగిన సామాజిక నేవధ్యం ఆయనను బలమైన వామవక్షవాదిగా మార్చాయి. ఈ కారణంతోనే తొలినాళ్ళలో ఆయన కవిత్వం శక్తివంతంగా మారింది. ఒక్కొక్క సారి ప్రకృతితో మరొక సారి సమాజంతో మమేకం కావడం కనిపిస్తుంది. ఆర్తి, నెగళ్ళు, వల్లడి వంటి కొన్ని కవితల్లో ఉద్వేగాలు తన్నుకొస్తున్నట్లు కనిపిస్తాయి. ఈ కవితలో గాఢత ఉం టుంది. వాస్తవాలను చెప్పడానికి భయపడటం, నర్మ గర్భంగా వెలువరించడం నియోగిశైలి కానేకాదు. ఆయన కవితా సంపుటిలు అయిన ఆర్తి, వల్లడి, నెగళ్ళులో పూర్తి స్పష్టత ఉంటుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రాంతీయ కథా సంకలనాలు – రచయిత్రుల పాత్ర

– బరుచూరి మౌనిక, పరిశోధక విద్యార్థిని, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

కథాసంకలనం :

సంపుటం, సంకలనం అనే పదాలను సాహిత్యంలో తరచూ వింటుంటాం. సంపుటం అంటే 'బరిణె, ముకుళనము'. సంకలనం అంటే 'కూర్చుట' అని నిఘంటువులోని అర్థాలు. ఈ రెండు పదాలను కొందరు సమానార్థకంగా భావించడం జరుగుతున్నది. అయితే సాహిత్యపరిభాషలో చెప్పాలంటే వీటిమధ్య తేడా కని పిస్తుంది. "ఒక రచయిత రాసిన పలు కథలను ఒకే పుస్తక రూపంలో ముద్రిస్తే దానిని సంపుటం అని, వేరు వేరు రచయిత రాసి పలుకథలను ఒకే పుస్తకంలో ముద్రిస్తే అది సంకలనం అని నిర్ధారణకాగలదు.

సంకలనం అంటే సంకలితము, కలపడం, బల వంతంగా పట్టుకోవడం, ప్రోగుచేయడం ఇలా అనేక అర్థా లున్నాయి. "వివిధ కవుల కావ్యాల నుండి కొన్ని విశిష్టమైన భాగాలను సంగ్రహించి కూర్పుచేయడం" అని డాక్టర్ గొల్లకోట సూర్యభాస్కరరావు వివరణ ఇచ్చారు. ఈ సంకలనాన్నే ఆంగ్లంలో ఏంథోలజి అంటారు.

ప్రాంతీయ కథాసంకలనాలు :

ప్రాంతీయవాద ప్రభావం కూడా కథా సాహిత్యంపై ఉంది. ప్రాంతీయ స్పృహతో, మాండలిక భాషలో రాసిన కథలు ఎన్నో వచ్చాయి. ఇటువంటి కథలో ఆయా ప్రాంతాలలో వెనుకుబాటుతనం, నిరక్షరాస్యత, వలసలు, కరువు, పరాధీనత, స్త్రీ, పురుష సంబంధాలు, మానవ సంబంధాలు, వర్తమాన విద్యావ్యవస్థ ఫలితాలు, ప్రపంచీ కరణ ప్రభావం కన్పిస్తాయి. ప్రాంతాల వారిగా, జిల్లాల వారిగా కథా సంకలనాలు వెలువడుతున్నాయి. విదేశాలో స్థిరపడిన ప్రవాసాంధ్రులసైతం అక్కడి విషయాలతో కథలు రాస్తూ కథా సంకలనాలు వెలువరిస్తున్నారు.

ప్రాంతీయ కథా సంకలనాల్లో రచయిత్రుల పాత్ర:

ప్రాంతీయ కథా సంకలనాల్లో రచయిత్రులకు ఎంత వరకు గుర్తింపు ఉంది. వారి కథలు సంకలనాల్లో ఎన్ని ప్రచురించబడుతున్నాయి. రచయిత్రుల ఏ ఇతివృత్తాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆ కథలకు ఎంతవరకు ప్రాచుర్యం లభిస్తుంది అన్న ఆలోచనతో ఈ సంకలనాలు పరిశీలించడం జరిగింది.

1. కథా పార్వతీపురం 2.ఉత్తరాంధ్ర కథలు 3.కడప జిల్లా కథాసంకలనం 4.కర్నూలుజిల్లా కథాసంకలనం 5.చిత్తూరుజిల్లా కథాసంకలనం 6.తొండనాడు కథలు 7.సీమకథలు 8.సీమకక్ష్యకథలు 9.ఓరుగల్లు కథలు 10.కరీంనగర్‌జిల్లా కథాసంకలనం 11.వరంగల్‌జిల్లా కథాసర్వస్వము మొత్తం 11 పుస్తకాలలో 553 కథలు ప్రచురించబడితే రచయితలు కథలు 475, రచయిత్రుల కథలు 78 ఉన్నాయి. రచయిత కథలతో పోల్చి చూస్తే రచయిత్రుల కథలు తక్కువ ఉన్నాయి.

ఉత్తరాంధ్ర రచయిత్రుల కథలు 19 ఉన్నాయి. రాయలసీమ రచయిత్రులు కథలు 33 ఉన్నాయి. తెలంగాణ ప్రాంత రచయిత్రుల కథలు 32 ఉన్నాయి.

రచయిత్రుల కథల్లో ఇతివృత్త వైవిధ్యం :

1. రాయలసీమ రచయిత్రులు :

రాయలసీమ రచయిత్రుల కథలన్నీ రాయలసీమ నిర్దిష్ట జీవితానికి పరిమితం అయినవికావు. రాయలసీమ ప్రజల కడగండ్లని చిత్రించినవిగా ఉన్నాయి. కాశీయాత్ర, మా బావ, దిమెర్సికిల్లింగ్, రెక్కలున్న పిల్ల వంటి కథలో స్త్రీ, పురుష సంబంధాలు ఎక్కువుగా ఆవిష్కృత మయ్యాయి. గాజుకళ్ళు, తారాబాయి, తాజ్‌మహల్, మచ్చ, నీళ్ళు కథలో రాయలసీమ ప్రాదేశిక వాస్తవాలు, కరువు కక్ష్యలు, వాటి దుష్పరిణామాలు, రాయలసీమ

నీటి పోరాటాలు ఈ సంకలనాలో ప్రధాన స్థానం ఆక్రమించాయి. ఆ గమ్యం ఎక్కడికో, ల్యాటిట్యూడ్ కథలో ప్రపంచీకరణ ప్రభావాన్ని ఆవిష్కరించారు.

2. తెలంగాణ రచయిత్రులు :

తెలుగు కథా సాహిత్యంలో తెలంగాణ కథ ఒక పెద్ద పీటనే ఆశ్రమించుకున్నది. తెలంగాణా రచయిత్రుల కథలో 'నీళ్ళుబాయి' కథలో నగరం పెరిగె కొద్ది వ్యవసాయ క్షేత్రాలు, నీళ్ళుబావులు విధ్వంసమై ప్లాట్లుగా, అపార్ట్‌మెంట్లుగా రూపుదాల్చిన వైనాన్ని చిత్రించారు. 'కొడుకు' కథలో ఆడపిల్ల పుట్టుక వల్ల సామాజిక వ్యతిరేక పరిణామాలు, ముక్కుపుల్ల కథలో స్త్రీల ఇష్టాయిష్టాలపై నియంత్రణ, "నన్ను ముట్టుకోకు, జీవనగామి" కథలో కుటుంబ హింస కేంద్రంగా వచ్చాయి. 'గృహహింస చట్టం' కథలో చట్టాలు ఎన్ని వచ్చిన స్త్రీలను రక్షించేది అంతిమంగా వారి వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసమే అని తెలియజేయడం జరిగింది. భోగిని శివసత్తి వంటి సంప్రదాయాలకు బలి అవుతున్న దళిత బహుజన స్త్రీల బ్రతుకులలో విషాదాన్ని ఉయ్యాల కథ చిత్రిస్తే, దాని నుండి బయడ పడటాన్ని ప్రయత్నపరులు అవుతూ స్త్రీల విద్యను అందుకు సాధనంగా మలుచుకోవడం 'లచ్చుమమ్మ' కథలో కన్పిస్తుంది. 'సోపతి, జయజయ జయహే' కథలో ప్రత్యక్ష ఉద్యమ సంబంధాలను, సంఘర్షణలు తెలియజేశాయి.

3. ఉత్తరాంధ్ర రచయిత్రులు :

ఉత్తరాంధ్ర కథా సంకలనాల్లో 'ఏకాంతంలో చివరిదాకా' కథలో మనిషి అంతరంగ స్వభావాన్ని, మనస్తత్వంలోని వైచిత్రిని ఈ కథ సూచిస్తుంది. 'చూపు' కథలో అందమైన భవిష్యత్తు, అర్థవంతమైన జీవితం కాంక్షించే మహిళకు పురుషాధిక్య ప్రపంచంలో చుక్కెదురు కావడాన్ని చిత్రించింది. 'రెండంచులకత్తి' కథలో ఆధునిక నాగరిక సమాజంలో దళితులు ఇంకా వివక్షతకు గురవుతున్న తీరును ఈ కథలో చూడవచ్చు. ప్రాంతీయ కథా సంకలనాలలో రచయిత్రులు ప్రాంతీయ నేపథ్యం ఉన్న కథలు తక్కువ ప్రాధాన్యత మానవ సంబంధాలు, స్త్రీల సమస్యలకు సంబంధించిన కథల ప్రాధాన్యత ఎక్కువ.

ప్రాంతీయ కథా సంకలనాలలో రచయిత్రులు ప్రాంతీయ నేపథ్యం ఉన్న కథలు తక్కువ. మానవ సంబంధాలకు, స్త్రీ సమస్యలకు సంబంధించిన కథలు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాయి. ప్రాంతీయ కథా సంకలనాల రచయిత్రుల సేద్యం కథలు, వృత్తుల కథలు, దళిత కథలు, ఉద్యమ కథలు రాసిన భవిష్యత్ తరాలకు అందించవలసిన ఆవశ్యకత ఉంది.

నూతన పోకడలు :

రచయిత్రులు తమకున్న పరిధిలో కథలు రాయడమే తక్కువ. దానిని ప్రామాణికంగా తీర్చిదిద్దే ఉత్తమ కథగా రూపొందించి పోటీకి పంపే వెసులుబాటు ఉండదు. అసలు కథ పోటీల సంగతే కొంతమందికి తెలియదు. రచయిత్రుల సమావేశాలు, చర్చాగోష్ఠులు, ప్రత్యేకంగా నిర్వహించి వారి రచనలను ప్రోత్సహించడం, అముద్రిత రచనలను ముద్రించడం ద్వారా మంచి ప్రయోజనం లభిస్తుంది.

స్త్రీలకు ఇవన్నీ తెలిసే అవకాశాలు తక్కువ. ఎక్కువ మంది రచయిత్రులు గృహిణులే. కొంతమంది ఉద్యోగినులు, వీరందరు తమ రచన వ్యాసాంగాన్ని ఏ అర్ధరాత్రో, అపరాత్రో కొనసాగిస్తూ ఉంటారు. అందువల్ల కథ పోటీలలో రచయిత్రులకు స్థానంలేనట్లే. ఉద్యమ నేపథ్యకథాసంకలనాల్లో, ప్రాంతీయ కథా సంకలనాల్లో, ఉత్తమకథాసంకలనాల్లో, కథలు ఎంపికలో వీరి కథలకు చోటు లేదు. కథా రచనలో పురుషులదే పై చేయి అవుతుంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. కథాశిల్పం - వెంకట సుబ్బయ్య, వల్లంపాటి
2. ఉత్తరాంధ్ర కథలు - లక్ష్మీపతి, విరియాల; తులసి, చాగంటి
3. తెలంగాణ కథలు - మల్లయ్య, కాలువ
4. కర్నూలు జిల్లా కథా సంకలనం - హరికిషన్, ఎమ్

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మరుభూమిలో మల్లెతీగలు నవల – వేశ్యా స్త్రీల జీవిత చిత్రణ

– డా॥. కడియాల వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

దక్షిణ భారతదేశంలో పూర్వం జోగిని వ్యవస్థ, దేవదాసి వ్యవస్థలు ఉండేవి. 1890 తర్వాత భారతీయ సమాజంలో దేవదాసీ వ్యవస్థను నిషేధించాలంటూ 'ఏంటీ నాచ్' ఉద్యమం మొదలయ్యింది. ఆ తరువాత కాలంలో ఈ వ్యవస్థల నిర్మూలనకు సంబంధించి అనేక చట్టాలు రూపొందాయి. అందువలన వాటి స్థానంలో ఈ వ్యభిచార గృహాలు వచ్చి చేరాయి. నేటికీ ఈ వ్యభిచార గృహాలు అక్రమంగా కొనసాగుతూనే ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో ఈ వేశ్యావృత్తిని ఆధారంగా చేసుకొని అనేక కథలు, నవలలు, నాటకాలు రాశారు రచయితలు.

1910లో గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్రను వేశ్యగా అద్భుతంగా తీర్చిదిద్దాడు. నాటకం ముగిసేసరికి గొప్ప మనిషిగా మధురవాణి కనబడుతుంది.

1923లో కాళ్ళకూరినారాయణరావు రాసిన చింతామణి నాటకం నేటికీ ప్రదర్శించబడుతుంది. ఇది వేశ్యావృత్తిలో దురాచారాన్ని ఖండించే నాటకం.

సమాజం వేశ్య స్త్రీలను కలుపుమొక్కలుగా భావిస్తుంది. అయితే 1935లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు రాసిన 'కలుపుమొక్కలు' కథలో వేశ్య స్త్రీని కలుపుమొక్క కాని పాత్రగా తీర్చిదిద్దారు.

వేశ్య అయి ఉండీ, డబ్బుకు ఆశ పడని స్త్రీ గురించి 1940లో వచ్చిన కుటుంబరావు గారి 'నీకేం కావాలి?' కథ లోని కస్తూరి పాత్రను చిత్రించాడు.

1969లో వచ్చిన రంగనాయకమ్మగారి 'అంధకారంలో' నవల వేశ్యల దుర్భర జీవితాలను చక్కగా చిత్రీకరించింది.

ఈ విధంగా అనేకమంది రచయితలు వేశ్యావృత్తిలో ఉన్న వారి పట్ల సానుభూతినీ, వారి వ్యక్తిత్వం పట్ల గౌరవన్నీ ప్రకటిస్తూ చాలా రచనలు రాశారు. వీరందరూ సృష్టించిన వేశ్య పాత్రల ద్వారా మనకు తెలిసేది ఏమిటంటే- అసహజమైన వృత్తిని సమాజం వారిపై రుద్దింది. మానవత్వానికీ, ఆత్మగౌరవానికీ, కళాభిమానానికీ ప్రతీకలుగా వేశ్యలను కొందరు దర్శిస్తే, వారు ఏ విధంగా ఆ పడుపువృత్తిలోకి ప్రవేశించారో ఇంకొందరు చిత్రించారు. అంధకారంలో చిక్కుకుని అందులో నుండి వెలుగులోకి వచ్చే అవకాశం కోసం వారి ఆరాటాన్నీ, పోరాటాన్నీ మరికొందరు చిత్రించారు.

"మరుభూమిలోమల్లెతీగలు" నవలను 1987లో "చక్కిలం విజయలక్ష్మి" రాశారు. ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా అశేష పాఠకుల ఆదరాభిమానాలను అందుకున్న నవల." తమకొరకు అణువంత, కామాంధుల కొరకు కొండంత నాశనమౌతు తమను తాము బలిపీఠం వైపు ఈడ్చుకుంటూన్న ఈ నవలలోని కొన్ని పాత్రల వంటి అమాయకులకు, అభాగినులకు ..... సానుభూతితో" అని సమాజంలోని వేశ్య స్త్రీలకు ఈ నవలను అంకితం చేశారు రచయిత్రి. ఈమె కర్నూలు జిల్లాకు చెందిన రచయిత్రి. ఈమె కథలు, నవలలు చాలా రాశారు.

ఈ నవల్లో రచయిత్రి కథ నడిపించిన తీరు అత్యంత సరళంగా ఉంటుంది. సన్నివేశ కల్పనలో, పాత్రలను చిత్రించడంలో రచయిత్రి తనదైన శైలిని ప్రదర్శించారు. తను సృష్టించిన ప్రతి పాత్రకు జీవం పోసి నడిపినట్లుగా నవల్లో చిత్రించారు. పాఠకుల్లో ఉత్సుకతను, ఉత్కంఠను రేకెత్తించే నవల్లో "మరుభూమిలో మల్లెతీగలు" ఒకటి.

మరుభూమి అంటే ఎడారి అని అర్థం. వ్యభిచార గృహాలను ఎడారితో పోల్చింది రచయిత్రి. ఎడారి లాంటి వ్యభిచార గృహాల్లో మల్లెతీగల్లాంటి మహిళలు మగ్గి పోతున్నారన్నదే రచయిత్రి భావన.

నేటి సమాజంలో చాలామంది స్త్రీలు కామాంధుల చేతుల్లో బలవుతున్నారు. అలా బలైపోయి జీవశ్చవల్లా బ్రతికివున్న స్త్రీల జీవితంలో వెలుగులు నింపడమే రచయిత్రి ఉద్దేశం. స్త్రీలు వేశ్య వృత్తిలోకి ఎలా వెళుతున్నారు! ఎందుకు వెళుతున్నారు! వాళ్ళు ఆ వృత్తిలోనికి వెళ్లడానికి గల కారణాలేంటి? అనే ప్రశ్నలకు సమాధానామే ఈ నవల్లోని యితివృత్తం. వ్యభిచార గృహాలను నడిపించే యాజమాని చేతిలో దగాపడిన స్త్రీని వ్యభిచార గృహం నుండి బయటకు తీసుకొచ్చి ఆమె జీవితంలో వెలుగు నింపిన వ్యక్తిని ఆదర్శ పాత్రగా తీర్చిదిద్దింది ఈ నవల్లో రచయిత్రి. అత్యాచారానికి గురై ధైర్యంగా పోలీస్ కంప్లైంట్ ఇచ్చే స్త్రీలు కొంతమంది అయితే, బయటకు చెప్పలేక, బయటికి తెలిస్తే ఎక్కడ తమ పరువు పోతుందోనని సమాజానికి భయపడి పోలీస్ కంప్లైంట్ ఇవ్వకుండా, తమలో తాము కుమిలిపోతున్న స్త్రీలు ఎంతమందో తెలియదు. ఈ నవల్లో అనేక పాత్రలు అలాంటి స్త్రీ పాత్రలే.

పూర్వం దేవదాసి వృత్తిలోకి వారసత్వంగా వస్తూండే వాళ్ళు. ప్రస్తుతం వేశ్యావృత్తి వారసత్వం కాకపోయినా, వారసత్వంగా వచ్చే పేదరికం స్త్రీలను సులభంగా అటువైపు నెడుతోంది. నేటికీ కొందరు స్త్రీలు సెక్స్ వర్కర్లుగా పొట్ట పోసుకుంటున్నారన్నది వాస్తవం.

ఇలాంటి స్త్రీల జీవితాలను ఆధారంగా చేసుకుని ఈ నవల్లో పాత్రలను చిత్రించారు రచయిత్రి. రాధ అనే అమ్మాయి తల్లిదండ్రులతో తిరుపతి వచ్చినప్పుడు తప్పిపోతుంది. దాంతో ఆమె ఏడుస్తుండగా భూషణ్ అనే వ్యక్తి వచ్చి బుజ్జగిస్తాడు. తన అమ్మానాన్నల దగ్గరికి నేను తీసుకెళ్తాను అని అబద్ధం చెప్పి రాధను వేశ్య గృహం దగ్గరికి తీసుకెళ్ళతాడు. వ్యభిచార గృహం యజమాని రాగిణిదేవికి అప్పగిస్తాడు.

మేనక అనే అమ్మాయి తల్లి చిన్నతనంలోనే చని పోతుంది. ఆమె సవితి తల్లి తనను ముగ్గురు భార్యలు ఉన్న పండు ముసలివానికి ఇచ్చి కట్టబెడుతుంది. తనకు ఆ ముసలి వాడితో కాపురం చేయడం ఇష్టం లేక పెరట్లోకి వెళ్ళొస్తాను అని సాకుచెప్పి కట్టుగుడ్డలతో బయటికి వస్తుంది. ఊరికి మైలు దూరాన ఉన్న రైల్వేస్టేషన్ చేరుకుని రైలు ఎక్కుతుంది. ఆమెకి రైలులో భూషణ్ పరిచయం అవుతాడు. అతను ఈమెను వ్యభిచార గృహానికి తీసుకెళ్ళతాడు.

సుశీల అనే అమ్మాయి తల్లిలేనిపిల్ల. తండ్రి పచ్చి తాగుబోతు, దుర్మార్గుడు. డబ్బుకు కక్కుర్తిపడే వ్యక్తి. ఇంట్లో సామానులు తీసుకెళ్లి అమ్ముతుంటాడు. ఇంట్లో వస్తువులు అన్నీ అయిపోతాయి. ఇంక అతనికి ఏమి చేయాలో తోచలేదు. చివరికి సుశీలకు ఒక మంచి సంబంధం చూశానని మాయమాటలు చెప్పి పట్నం తీసుకెళ్ళతాడు. ఆమెను వ్యభిచార గృహంలో అమ్మి డబ్బు తీసుకొని వెళ్ళిపోతాడు.

సంపంగి బాల వితంతువు. వాళ్లది ఘోషా కుటుంబం కావడం వల్ల బయటి ప్రపంచం తెలియకుండా పెరుగుతుంది. మరిదితో అక్రమ సంబంధం పెట్టుకుంటుంది. కొంతకాలానికి గర్భం దాలుస్తుంది. అది తెలిసిన అత్త మావలు ఇంటి నుండి బయటకు గెంటేస్తారు. ఆమె గర్భంతో ఉండగానే వ్యభిచార గృహానికి తీసుకెళ్ళి రాగిణీదేవికి అప్పగిస్తాడు మరిది.

సుందరి భర్త జల్సాలకు బానిసై భార్యను వ్యభిచారిగా మారుస్తాడు. తన భోగవిలాసాల కోసం ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా వ్యభిచారం చేపిస్తుంటాడు. అలా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ ఉంటాడు. ఆమెకు కడుపు నిండా అన్నం పెట్టడు. తనకు జీవితంలో సుఖం లేకుండా చేస్తాడు. తన దగ్గరకి వస్తున్న వాళ్ళల్లో ఒకరికి తన కష్టాలు చెప్పుకుంటుంది సుందరి. అప్పుడు అతను "దిగిన దానివి ఎటూ దిగావు. అక్కడికి వెళితే కనీసం కడుపునిండా తిండైనా తింటావు. కాస్త వెనక వేసుకోవచ్చు కూడా, ఈ పాపపు సొమ్ముతో సుఖానికి అలవాటు పడిన నీ భర్త దీన్ని ఇక ఈ జన్మలో వదులుకోలేడు." అని వ్యభిచార గృహం గురించి చెబుతాడు. భర్త దగ్గర

ఉండలేక, భర్తకు తెలియకుండా తనే స్వయంగా వ్యభిచార గృహంలో చేరుతుంది.

తన తల్లిదండ్రులకు మాధురితో పాటు ఎనిమిది మంది సంతానం. పెద్ద వాళ్ళు ఇద్దరు మగ వాళ్ళు, తక్కిన వాళ్లంతా ఆడవాళ్లు. వాళ్లలో మాధురి అందరి కంటే పెద్దది. మగ వాళ్ళు ఇద్దరు సరిగా లేకపోవడం వలన కుటుంబంలో ఆర్థిక సమస్యలు ఎదురవుతాయి. తల్లి దండ్రులు అనారోగ్యంతో మంచానపడి ఉంటారు. ఆ సమస్యల నుండి బయట పడటానికి మాధురి వ్యభిచార గృహం దగ్గరికి వచ్చి రాగిణీదేవిని సంప్రదించి అందులోకి ప్రవేశిస్తుంది.

ఇద్దరు అమ్మాయిలు రాత్రిపూట సినిమాకి వేళ్ళి వస్తుం టారు. అప్పుడు వాళ్లను దుండగులు అడ్డుకొని ఒక అమ్మాయిని పాడు చేస్తారు. ఇంకొక అమ్మాయి తప్పించు కొని పారిపోతుంది. అంతలో భూషణ్ రావడం చూసి ఆ దుండగులు పారిపోతారు. అప్పుడు అతను ఆ అమ్మాయిని వ్యభిచార గృహానికి తీసుకెళ్ళతాడు.

సమాజంలో స్త్రీలు వ్యభిచార వృత్తిలో ప్రవేశించడానికి గల సామాజిక నేపధ్యాన్ని గురించి రచయిత్రి ఈ పాత్రల ద్వారా తెలియజేస్తుంది. వ్యభిచార వృత్తిలోకి వచ్చిన స్త్రీలంతా వాళ్ళ ఇష్టంతో వచ్చిన వాళ్లు కాదు.

కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు, ఆకలి సమస్యతో వచ్చిన వారు వున్నారు. అలా కాకపోతే ఎవరో ఒకరు బలవంతంగా అందులోకి లాగడం, భార్యాభర్తల మధ్య అన్యోన్యత లేకపోవడం వలన వచ్చిన వారు కూడా వున్నారు. ఇలా అనేక సామాజిక సమస్యలతో వచ్చిన వారు వున్నారు. ఇలా ఎన్నో కారణాల చేత వ్యభిచార వృత్తిలోకి వచ్చిన స్త్రీలే తప్ప సుఖవంతమైన జీవితాన్ని గడపాలని ఆ వృత్తిలోకి ఎవరు రాలేదు అని రచయిత్రి ఉద్దేశం.

"మరుభూమిలో మల్లెతీగలు" నవల్లో వ్యభిచార స్త్రీలు ఎదుర్కొంటున్న హృదయ విదారకమయిన సమస్యల గురించి చిత్రించారు రచయిత్రి. ఆ వృత్తిలో స్త్రీలు సమాజం నుండి చాలా సమస్యలు ఎదుర్కొంటారు. అక్కడ స్త్రీలు దుర్భరమైన జీవితాన్ని గడుపుతూ ఉంటారు. ఈ నవల్లో రేరాణి అనే వ్యభిచార స్త్రీ చాలా కాలం నుండి వ్యభిచార గృహంలో ఉంటుంది. ఆమె దగ్గరకు చాలా మంది వచ్చి వెళ్తారు. అందువలన ఆమెకు కుష్ఠురోగం వస్తుంది. అది తెలిసిన చంచల అందరితో ఇలా అంటోంది."ఒసేయ్ అమ్మాయిలు రండి రండి. ఇదిగో రేరాణిని ఇన్నాళ్లు రసికులు వరించారు. మరేమో ఇప్పుడు కుష్ఠు వరించింది."[2]అని అంటుంది. పడుపు వృత్తిలో ఉన్న స్త్రీలు కుష్ఠురోగం, మందులేని ఎయిడ్స్ వంటి భయంకరమైన రోగాల బారిన పడతారు. అలాగే ఈ రోగాలు వచ్చిన స్త్రీలను సమాజం ఎంత నీచంగా చూస్తుందో కూడా రచయిత్రి ఈ నవల్లో చిత్రించింది.

చంచల అనే ఆమె అక్కడికి ఎలా వచ్చిందో తెలియదు కానీ, ఆ వ్యభిచార గృహంలోని అందరినీ నవ్విస్తూ, దబాయిస్తూ ఉంటుంది. పగటి సమయంలో అందరూ ఒక చోట చేరి మాట్లాడుకుంటూ ఉంటారు. రాత్రి అవ్వగానే ఆ వృత్తిలోకెళ్తారు. ఒక రోజు రాత్రి చంచల దగ్గరకు తన తండ్రి వస్తాడు. వచ్చింది తన తండ్రి అని తెలిసి భీకరంగా అరుస్తుంది. ఈ హృదయ విదారకమైన సంఘటనను చూసిన తర్వాత ఆమెకు మూర్ఛవచ్చి కిందపడి మరణిస్తుంది. ఈ సంఘటన పాఠకులకు కన్నీళ్లు తెప్పిస్తుంది.

మధు ఇంటి పక్కన పాడుబడిన బంగ్లా ఉంటుంది. అందులో చింపిరి జుట్టుతో మాసిన బట్టలతో ఒక వృద్ధురాలు ఉంటుంది. ఆమె వయస్సులో ఉన్నప్పుడు వ్యభిచార గృహంలో ఉండేది. తన ద్వారా ఆ యజమాను రాలు ఎంతో లాభపడుతుంది. ఆమె ముసలిది కాగానే యజమానురాలు బయటికి పంపిస్తుంది. బయటికి వచ్చిన తరువాత ఆమె భిక్షాటనం చేస్తూ జీవనం కొన సాగిస్తూ ఉంటుంది. అనారోగ్యంతో కదలలేని పరిస్థితి వచ్చి మరణిస్తుంది. ఆమె శవాన్ని ఎక్కడ సమాధి చేసారు అని మధు మునిసిపల్ వాళ్ళని అడుగుతాడు. అప్పుడు వాళ్ళు ''ఊరకుక్కలను కూడా సమాధి చేయటం

ప్రారంభిస్తే ఇక అయినట్టే"[3] అని వెటకారంగా అంటారు. ఇలా జీవిత చరమాంకంలో నానాబాధలకు ఆమె గురై దయనీయంగా చనిపోయింది. ఇలాంటి ఆడవాళ్ళు "సమాజం దృష్టిలో చీడపురుగులు. కాముకుల దృష్టిలో మిఠాయి ఉండలు" వ్యభిచార వృత్తిలోకి ప్రవేశించిన స్త్రీలను వయసులో వున్నాపుడు విటులు తమ సుఖాలకు ఉపయోగించుకుంటారు. అలాగే యజమాని వీరి ద్వారా ధన సముపార్జన చేస్తాడు. వీరి శరీరం సడలిపోగానే యజమాని, విటులు ఈసడించుకుని పక్కకునెట్టేస్తారు. ఈ స్థితిలోకి నెట్టివేయబడిన వీరిని సమాజం చీదరించు కుంటుంది. ఎవరి దయకు వీరు పాత్రులుకారు. వీరిని వీధికుక్కలలాగా భావిస్తుంది సమాజం.

వ్యభిచార గృహంలో సంపంగి మగ బిడ్డను ప్రస విస్తుంది. ఆ పిల్లవాడి బాగోగులు చూసుకుంటూ ఉం టుంది. విటుడు వచ్చినా ఆ పిల్లవాడిని వదిలి వెళ్ళడానికి ఇష్టపడేది కాదు. పిల్లవాడుంటే గిరాకి దెబ్బతింటుందని యజమానురాలు అనుకుంటుంది. ఒక రాత్రి యజ మానురాలు ఆ పిల్లవాడిని భూషణ్ కిచ్చి పంపిస్తుంది. అతను తీసుకెళ్లి పిల్లవాడిని గొంతు పిసికి చంపేస్తాడు. అది తెలిసిన యజమానురాలు పీడ విరగడయింది అని సంతోషపడుతుంది. ఈ విధంగా సంతానానికి కూడా నోచుకోకుండా వీరి జీవితాలు దుర్భరమవుతాయని రచయిత్రి ఆవేదన వ్యక్తం చేసింది.

మధు యుక్తవయస్సులో ఉండగా, వ్యభిచార గృహాల్లో స్త్రీలు ఎలా ఉంటారో ఒకసారి పరిశీలించాలని అను కుంటాడు. మిత్రుడి సహకారంతో వ్యభిచార గృహానికి ఒక రాత్రి వెళతాడు. అక్కడ స్త్రీలు కనపడరు. అందరూ వృత్తిలోకి వెళ్ళిపోయి ఉంటారు. ప్రేమ అనే మూగ అమ్మాయి మాత్రమే ఉంటుంది. యజమానురాలు, ఆమెను మధు దగ్గరికి పంపిస్తుంది. ఆమె మధును చూసి భయపడుతుంది. మధు,రాగిణీదేవికి కొంత డబ్బు చెల్లించి ఆ వ్యభిచారి గృహం నుండి ప్రేమను తీసుకుని వస్తాడు.

తనను మధు ఆమె తల్లిదండ్రుల వద్దకు తీసు కెళతాడు. ప్రేమ వ్యభిచార వృత్తిలో ఉండేదని తెలుసు కున్న తల్లిదండ్రులు,ఆమెను ఇంట్లోకి రానివ్వరు. పడుపు వృత్తిలో వుండే స్త్రీలను కన్న తల్లిదండ్రులు కూడా ఆదరించరని ఈ పాత్ర ద్వారా రచయిత్రి మనకు తెలియ జేస్తుంది.

ప్రేమను అలాంటి సమయంలో ఒంటరిగా వది లేయటం మంచిది కాదనుకుంటాడు మధు.తన దగ్గరే ఉండమని చెప్పి, తన ఇంటికి తీసుకుని వస్తాడు. వీళ్ళిద్దరి సాన్నిహిత్యం ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటారు. సంసార జీవితంలో సంతోషంగా ఉంటారు. ఒక పుస్తకంలో వేశ్య స్త్రీల గురించి నీచంగా రాయటం చూసి రాధ బాధపడు తుంది. మధు, రాధను ఓదార్చుతాడు. అప్పుడు తన జీవిత నేపధ్యాన్ని గురించి రాధ, మధుకు వివరించి చెబుతుంది.

"మరుభూమిలో మల్లెతీగలు" నవల్లో మధు పాత్రను ఆదర్శంగా తీర్చిదిద్దింది. మధు ప్రేమను వ్యభిచార గృహం నుండి తీసుకొచ్చి వివాహం చేసుకుంటాడు. దీన్ని బట్టి మధుకు వేశ్య స్త్రీల పట్ల సానుభూతి ఉన్నట్లు వ్యక్తం అవుతుంది. వ్యభిచార వృత్తిలోకి ప్రవేశించే స్త్రీలను మధులాగా సానుభూతితో అర్థం చేసుకొని, వారికి పునర్జీవితం ప్రసాదించాలన్నదే ఇక్కడ రచయిత్రి ఉద్దేశంగా చెప్పవచ్చు.

రాజ, హేమలత బావ మరదలు. వీళ్ళిద్దరూ ఒకరిని ఒకరు ఇష్టపడతారు. అయితే హేమను కొంతమంది దుండగులు పాడు చేస్తారు. " కళ్ళు తెరిచి చూసేసరికి ఇంట్లో ఉన్నాను. విషయం విని అమ్మ, నాన్న పసి వాళ్ళలా హృదయవిదారకంగా రోదించారు. పోలీస్ కంప్లైంట్ ఇద్దాం అన్నారు నాన్నగారు. అమ్మ వద్దంది. 'నలుగురికి తెలిసి నవ్వులపాలు కావడం తప్ప పోగొట్టు కున్నది రాదు' అంది. వారం రోజులు మాకెవ్వరికీ తిండి తిప్పలు లేక పోయాయి. బయట ముఖం చూడకుండా మర్చిపోయాము" అని హేమ బాధపడుతుంది. హేమ

తల్లిదండ్రులు ఈ విషయాన్ని కప్పిపుంచి ఆమెను రాజాకు ఇచ్చి వివాహం చేస్తారు. వివాహం జరిగిన తర్వాత మొదటి రాత్రి హేమ తనకు జరిగిన పరాభవం గురించి రాజాతో చెబుతుంది. నాటి నుండి రాజా బాధపడుతూ ఉంటాడు.

ఉద్యోగరీత్యా రాజా హైదరాబాద్ వెళ్తాడు. రాజా ప్రవర్తనతో హేమ కూడా విచారంలో వుంటుంది. రాజా హైదరాబాద్ నుండి వస్తాడు. రాజా బాధపడడం మిత్రుడు మధు చూస్తాడు. కారణం అడగ్గా, హేమపై జరిగిన అత్యాచారం గురించి మధుతో చెబుతాడు రాజా. తన బాధను తొలగించడానికి మధు తన జీవితంలో జరిగిన సంఘటన గురించి చెబుతాడు. మధు జీవితాన్ని తెలుసుకున్న రాజాకు జ్ఞానోదయం కలుగుతుంది. దాంతో రాజా హేమను అర్థం చేసుకుంటాడు. ఆ విధంగా వారి సంసార జీవితం సుఖాంతంగా మారుతుంది.

సంఘంలో మధు అనే వ్యక్తి ఆదర్శంగా నిలబడితే, ఆ ప్రభావం సంఘంపై ప్రసరిస్తుంది. దాంతో రాజా లాంటి వారు హేమ లాంటి అమ్మాయిలను చేరదీసి వారి జీవితంలో వెలుగులు నింపుతారన్నది రచయిత్రి విశ్వాసం. దాంతో సంఘం శక్తి యినుమడిస్తుందని రచయిత్రి భావన.

"మరుభూమిలో మల్లె తీగలు" అనే నవల ద్వారా రచయిత్రి, వ్యభిచార గృహంలో ఉంటున్న స్త్రీలు మనలాంటి మనుషులే. వాళ్లని నీచంగా చూడకుండా మానవత్వంతో అర్థం చేసుకోవాలంటుంది. సమాజ ప్రవంతిలో వారిని భాగస్వాములని చేయాలి. వ్యక్తి ఉద్ధరణే సమాజ ఉద్ధరణ. ఆ విధంగా వారు సమాజ ఉద్ధరణకు దోహదపడగలరు. పడుపు వృత్తిలోకి ప్రవేశించిన స్త్రీలు, వ్యక్తిగతంగా ఆ దోషం వారిదికాదు. ఈ సమాజానిది, ఈ వ్యవస్థది. సామాజిక వ్యవస్థలోని లోపాలే సామాజిక శరీరంపై పడుపు వృత్తి అనే రణం ఏర్పడడానికి కారణం. ఆ రణాన్ని సామాజిక వ్యవస్థే ఆపరేషన్ ద్వారా తొలగించాలని ఆ ఆపరేషన్‌కు నవల్లో మధు లాంటి డాక్టర్ను సూచించింది రచయిత్రి.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. 'మరుభూమిలో మల్లె తీగలు' చక్కిలం విజయలక్ష్మి, జూన్ 1987, పుట 132.
2. 'మరుభూమిలో మల్లె తీగలు' చక్కిలం విజయలక్ష్మి, జూన్ 1987, పుట 141.
3. 'మరుభూమిలో మల్లె తీగలు' చక్కిలం విజయలక్ష్మి, జూన్ 1987, పుట 72.
4. 'మరుభూమిలో మల్లె తీగలు' చక్కిలం విజయలక్ష్మి, జూన్ 1987, పుట 94.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక కథాసాహిత్యం – కవులు, కథానికలు

– ఐ. వెంకటేశన్, పరిశోధక విద్యార్థి, రాజధాని కళాశాల, తెలుగు అధ్యయనశాఖ, చెన్నై.

కథ నిర్వచనం :

కథ అనే పదము "కథ్" అనే సంస్కృత దాతువు నుండి ఉద్భవించింది. కథకు పర్యాయ పదములుగా కథ, కథానిక అను పదములు వ్యవహారములో వాడబడుచున్నది. కథను ఆంగ్లములో "షార్ట్‌స్టోరీ" అను పదము సమానార్థకముగా వాడబడుచున్నది. ఆధునిక కథానిక దాదాపు ఒకే కాలములో జర్మనీ, అమెరికా, ఫ్రాన్స్, రష్యా వంటి పాశ్చాత్య దేశములలో ఉద్భవించింది.

ఆంగ్ల విమర్శకులు కథను క్రింది విధంగా కొనియాడారు.

"A short story is prose narrative requiring from half an hour to one or two hours in to perusal putting the same idea.in to different phraseology we may say that a short story is a story that can be easily read at a single sitting"

- W. H. Hudson

కథానిక ప్రస్తావన మొట్టమొదటిగా అగ్నిపురాణంలో క్రింది విధంగా చెప్పబడింది.

"భయానకం సుఖతరం గర్భేచ కరుణోరస
అద్భుతోస్తే సుక్లుప్తార్థ నోదాత్తా సా కథానికా"

ఆధునిక కథాసాహిత్యం :

ఆధునిక కథాసాహిత్యం1910లో ప్రారంభమైనది. ఆధునిక సాహిత్యంలో తొలి కథానిక గురజాడ అప్పారావు రచించిన "దిద్దుబాటు" ఇది ఆంధ్రభారతి పత్రికలో ప్రచురించబడింది. అప్పటి నుండి కథా ప్రపంచం విస్తరించబడింది.

ఆనాటి నుండి నేటి వరకు తెలుగు సాహిత్యంలో కథానికలు దినదిన ప్రవర్ధనమానమౌతూ పవిత్రంగా రూపుదిద్దుకుంటుంది. పోరంకి దక్షిణామూర్తి (కథానిక స్వరూప స్వభావాలు), పల్లంపాటి వేంకట సుబ్బయ్య (కథాశిల్పం) తెలుగు కథలపై విశేష కృషి గావించాయి.

ఆధునిక సాహిత్యంలో వెలువడిన మొదటి కథానిక "దిద్దుబాటు"కి కథానిక లక్షణాలన్నీ వర్తిస్తాయి.పల్లంపాటి వారి ఆదేశాలకు అనుగుణంగా కథకు లక్షణాలు క్లుప్తత,అనుభూతి,ఐక్యత,సంఘర్షణ,నిర్మాణ సౌష్టవం మొ॥లగు అంశాలు ప్రధాన భాగాలని సూచించారు.

తెలుగు కథానిక వికాసం: ప్రారంభ కాలంలో కథా వాఙ్మయం కాశీమజిలీ కథలు, బాలనాగమ్మ కథ, దేశింగురాజు కథ, పల్నాటి యుద్ధం, లక్ష్మమ్మ కథ, ఎల్లమ్మ కథ, కాంభోజరాజు కథ, వంటి కథలకు మాత్రమే పరిమితమై యుండినది.

క్రీ.శ. 19వ శతాబ్దంలో కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వేంకటరత్నం నాయుడు మున్నగు వారి సంస్కరణోద్యమంలో తెలుగు నాటి సాంఘీక రంగంలో నూతన చైతన్యము మొలకెత్తినది. తెలుగు సాహిత్యం పై ఈ ప్రభావము పడినది. అంతే కాకుండా కథానిక వస్తు విషయంలో మార్పుకూడా వచ్చింది.గిడుగు రామమూర్తి వ్యవహారిక భాషోద్యమం భాషా రంగంలో శాస్త్రీయ దృష్టికి మార్గమేర్పడినది. అప్పటి నుండి కథానిక ఈ మార్గంలో పయనించుటకు ప్రారంభించినది.

ఇతివృత్తంలోనూ, శైలిలోనూ, ఆధునికథను సంతరించుకొనిన తొలి కథానికగా గురజాడ అప్పారావు గారి "దిద్దుబాటు" వెలుగులోనికి వచ్చినది. దిద్దుబాటు ఆంధ్రభారతి పత్రికలో 1910 ఫిబ్రవరిలో ప్రచురిత మైనది. గురజాడ అప్పారావు రచించిన మరో కథానిక "మీపేరేమిటి".

ఆంధ్రభారతి పత్రికలో 1910 ఏప్రిల్, జూన్ మాసంలో ప్రచురించ బడింది. అవేకాకుండా గురజాడ అప్పారావు

గారు మెటిల్డా, పెద్ద మసీదు అను కథలను రచించారు. గురజాడ ఆంగ్లంలో రచించిన "Stooping to raise" దీనిని సంస్కర్త హృదయం అను పేరుతో అవసరాల సూర్యారావుగారు అనువదించి అది భారతిమాస పత్రికలో 1951లో ప్రచురించబడ్డాయి.

మాడపాటి హనుమంతరావుగారు రచించిన కథానికలు 1911లో "మల్లికాగుచ్ఛం" పేరిట ఒక సంపుటంగా ప్రచురించబడింది. 1914లో పెదురుముడి శేషగిరిరావు "మద్రాసు కథలు" వ్రాశారు. తెలుగు నందలి ప్రథమ శ్రేణి రచయితలలో శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి గారు ఒకరు. వీరు రాసిన కథలు 75. వీరి మొట్టమొదటి కథ "ఇరువురమొక్కచోటకే పోదాము"ఇది 1915లో నవంబర్ 17న ఆంధ్ర వార పత్రికలో ప్రచురితమైనది. 1916 మొదలు 1919 వరకున్న మధ్య కాలమున కథానిక రచన వికాసము చెందినది.

ఆధునిక కవులు - కథానికలు :

ఆధునిక కవులలో పేరెన్నిక గనిన కవి గురజాడ అప్పారావు.గురజాడ అప్పారావు గారు దిద్దుబాటు, మీపేరేమిటి, మతము - విమతము, మెటిల్డా, పెద్దమసీదు మొ॥లగు కథానికలను రచించి ఆధునిక కథాసాహిత్యంనకు అంకురార్పణ పలికారు.

శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రి :

శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రి గారు తెలుగు కథకుల్లో విశిష్టులు.శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రి గారు అనగానే మనకు గుర్తుకొచ్చేది "కలుపుమొక్కలు"కథానిక శ్రీపాదవారి కథలలో గులాబీ అత్తరు, వడ్లగింజలు, శుభకేసిర అరోహ,

అన్నంతపనీ జరిగింది. విమానం ఎక్కబోతూనే, తాపీమేస్త్రీ, రావుదీక్షితులు బి.ఏ., మార్గదర్శి కన్యాకాలే యత్నద్వారితా మొదలగు కథలు విశిష్టతలు పొందాయి. ఇవే కాకుండా "ఇలాంటి తవ్వాయి వస్తే" సాగర సంగం మొదలగు కథలు సమాజంలో అంటరాని తనాన్ని అంత రింపజేసాయి.

వేలూరి శివరామశాస్త్రి :

శ్రీపాదవారి తరువాత వేలూరి శివరామశాస్త్రి గారు విశిష్టులు. శరత్‌బాబు రచనల్ని ముందుగా తెలుగులో అనువదించిన ఘనత వీరిదే.వీరి కథారచనలకు నైపుణ్యం తెలిపే కథ "డిప్రెషన్ చెందు".

మొక్కపాటి నరసింహశాస్త్రి :

కథలో హాస్యమూ - శిల్పమూ పెనవేయడంలో అగ్రగణ్యులైన మొక్కపాటిగారు కొన్ని కథలు రాశారు. వీరి కథలలో బారిష్టరు పార్వతీశం, పిలక, లక్ష్మీ, భిక్షువు, చిత్రం మొదలగు కథలు ప్రఖ్యాతిగాంచినవి.

విశ్వనాథ సత్యనారాయణ :

కవిగా, విమర్శకుడిగా,నవలా రచయితగా విశ్వనాథ సత్యనారాయణ తక్కువ కథలు రాసినా అందులోని అంశాలు ప్రజలను ఆలోచన కలిగించే విధంగా ఉంటుంది. వీరి కథలు నీ ఋణం తీర్చుకున్నా, యేర్విషిఖెయ్, ఏమి సంబంధం, మాక్లీదుర్గంలోకుక్క, పరిపూర్తి, కపర్ధి, ముగ్గురు బిక్షగాళ్ళు, తిరోధానం మొదలుకుని 22 చిన్న కథలను రాశారు.

గుడిపాటి వెంకటాచలం :

కథా వస్తువులోనూ,శైలిలోనూ,తెలుగు కథలో చలం తీసుకువచ్చిన మార్పు విప్లవ సదృశమైంది. వీరి కథలలో ఆరాత్రి, పాపఫలాలు, జలసీ, ఆమె పెదవులు, ఆమె త్యాగం, ఓపువ్వు పూసింది, కర్కమిట్లా కాలింది, నేనేం చేశాను, వివాహం, దోషగుణం, హరిజన సమస్య, హంపీ కన్యలు, సుశీల, సినిమా జ్వరం, మధుర మీనాక్షి,అప్పుడు ఇప్పుడు మొదలగు కథలు చాలా ప్రాముఖ్యత చెందాయి.

అడవిబాపిరాజు :

తెలుగు కథా రచనలలో మరొక సిద్ధహస్తుడు అడవిబాపిరాజు. వీరి కథలో అంజలి, తరంగిని, తూలికా నృత్యం, భోగీరలోయ, రాగమాలిక, వింధ్యాచలం, శైలిబాల, ద్వేషం, బండరాళ్ళు, వీణ, మెట్లు, నరసన్న పాపాయి, గుడ్డిపిల్ల, కన్నీరు మొదలగు కథలతో కలిపి మొత్తం 44 కథలు రాసారు.

సురవరం ప్రతాపరెడ్డి :

ఆధునిక కథా సాహిత్యంలో విశేష కృషి గావించిన మరొక రచయిత సురవరం ప్రతాపరెడ్డి గారు. వీరి కథా రచనలలో నిరీక్షణ, మొగలాయి కథలు, చంద్రయ్య భీమా, పెండ్లిబేరము, వింత విడాకులు, ఒట్టు, మాఊరు మొదలగు కథలు విశిష్టత కలిగినవి.

భమిడిపాటికామేశ్వరరావు :

భమిడిపాటి కామేశ్వరరావుగారు హాస్య, అధిక్షేప కథలను రాయడంలో అగ్రగన్యులు. వీరు దానికేముంది, మాటలేనా, మడత పేచీ, గునగుసపెళ్ళి మొదలగు కథలను రాశారు.

కాంతం : (మునిమాణిక్యం లక్ష్మీనరసింహారావు)

కాంతం పేరు వినని తెలుగు సాహిత్యాభిమానులు బహుశా ఉండరు. వీరు అనేక హాస్య కథలు రచించారు. వీరి కథలో టీకప్పులో తుఫాను, శరద్రాత్రులు, కాంతం కథలు,నేను - మాకాంతం, కాంతం వృధ్యాపం మొదలుగు నవి విశేషపు కథలు.

కరుణకుమార :

పల్లె, పట్టణాలు, అగ్రహారాలు మొదలగు స్థలాలను క్రోడీకరించి కథలను అల్లడంలో కరుణకుమార అందె వేసిన చేయి. వీరు రచించిన కథలలో కయ్య - కాలువ, బిళ్ళల మొలతాడు, పసువులకొఠం, రిక్షావాలా, ఉన్నతోద్యోగాలు, టార్చ్‌లైట్, ఆకలి మంటలు, సన్న జీవాలు మొదలుగునవి.

మల్లాది రామకృష్ణశాస్త్రి :

తెలుగుతనం గుబాళించేలా కృష్ణాతీరానికి ప్రతినిధిగా అపూర్వమైన కథాశిల్పంతో రచనలు చేసినవారు మల్లాది రామకృష్ణశాస్త్రి గారు. వీరు రచించిన కథలు మొత్తం 120. ఇది 12 సంపుటాలుగా వెలువడ్డాయి.

ముఖ్యంగా అల్లోనేరేడు, కాముని పున్నమి, చెంగల్వి, చిత్రశాల, పదకేళిక, స్వరమేళ, రంగవల్లి, మునిగోరింట, మత్తకోకిల, శివరంజని, ఛాందోగ్యం మొదలగు కథలు విశిష్టత కల్గినది.

కొడవటిగంటి కుటుంబరావు :

తెలుగు కథను మరొక మలుపు తిప్పిన మహనీయుడు కొడవటిగంటి కుటుంబరావు గారు. వీరి తొలికథ "ప్రాణాధికం" మరియు నాకేంకావాలి, కారుణ్యం, స్వగతం, ఇల్లరికం, కాలభైరవుడు, వరప్రసాదం, లవనీరు, మొండివాడు, తల్లిలేనిపిల్ల, అపనమ్మకం, కొత్తపద్ధతులు, పాపఫలం, సుడిగుండాలు, దత్తపుత్రుడు, అమాయకురాలు, కులధ్వేషం, నువ్వులు - తెలకపిండి, మరో ఇల్లాలు, కొత్తజీవితం, తిండిదొంగ, కులంగాడి, అంత్యక్రియలు, ఆడజన్మ, లేచిపోయిన మనిషి, పాలౌట్, ఒంటిస్థంబం, మేడకథలు మొదలగు కథలను రాసారు.

త్రిపురేని గోపీచంద్ :

మానవతావాది, తత్వవేత్త తెలుగులోని గొప్ప కథకుల్లో ఒకరు త్రిపురేని గోపీచంద్. వీరు రచించిన కథలలో గీతాపారాయణం, సరేగానివ్వండి, దేవుని జీవితం, ధర్మవడ్డీ, మమకారం, తండ్రులూ - కొడుకులూ, భార్యలోనే ఉంది, దేశం ఏమయ్యేట్టు మొదలగు కథలు రాసారు.

బుచ్చిబాబు :

బుచ్చిబాబు అనగానే "చివరకు మిగిలేది" కథానిక మనకు గుర్తుకు వస్తుంది. వీరు రచించిన కథలలో ముఖ్యంగా ఆరుగురు కథకులు - ఒక నాయిక, తెరచాప దింపిన పడవ,ఊడిన చక్రం-వాడిన పుష్పం, మరుతా మన్న మరపురాదు,ఆ వాడిన ఆకులు, కలలోజారిన కన్నీరు, నిరంతంత్రయం, ఆమెనీడ, కాలచక్రం నిలిచింది, మూడుకోతులు, నన్ను గురించి కథలు రాయవూ మొదలగు కథలు రాసారు.

చాగంటి సోమయాజి (చాసో) :

ఒక సన్నివేశానికి ఉండే వివిధ కోణాలను పోల్చి ప్రారంభించి రచిస్తే అది గొప్ప కథ అవుతుందని కొని యాడిన మహనీయుడు చాసో. వీరి కథలలో వాయు లీనం, ఎంపు, పరబ్రహ్మం, దుమ్ములగొండి, కుక్కు టేశ్వరము, బండపాటు, కుంకుడాకు, భల్లూకస్వప్నం,

బుగ్గిబూడిదమ్మ, చిన్నాజీ, లేడీకరుణాకరం, ఏకరువు మొదలుగునవి విశిష్టమైన కథలు.

రావిశాస్త్రి :

సామాజిక సమస్యలే ప్రాణంగా రాజకీయ సాంస్కృతిక అవగాహనతో కథలు రచించిన కవి రావిశాస్త్రి. వీరు రచించిన కథలలో ఆరుసారా - కథలు, కలకంఠి, ఋక్కులు, ఆరుచిత్రాలు, కార్నర్‌సీటు, జరీ అంచు తెల్లచీర, కిటికి, ఎండ, నల్లమేక నీడలు, ఆఖరిదశ, న్యాయం, మాయ, పాపి,ద్వైతాద్వైతం, పిపీలికం, వెన్నెల, వేతనశర్మ, బుద్బుదం, రొట్టెముక్క మొదలుగునవి ప్రాముఖ్యత కలిగిన కథలు.

పాలగుమ్మి పద్మరాజు :

పద్మరాజు అనగా మనకు గుర్తుకొచ్చేది "గాలివాన" ఇది 1952వ ప్రాంతంలో "న్యూయార్క్ హెరాల్డ్‌ట్రిబ్యూన్" పత్రికలో నిర్వహించిన అంతర్జాతీయ కథానిక పోటీలో ద్వితీయ బహుమతి పొందింది. ఈ విదంగా తెలుగు కథకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత పద్మరాజు గారికి కలదు వీరి గాలివాన కథకు ఆంగ్లానువాదము 'సామర్ సెట్ మామ్' రచించిన "దిస్మార్ట్" ఇవే కాకుండా పడవ ప్రయాణం, కూలిజనం, పద్మరాజు కథలు మొదలగు కథలను రాసి తెలుగు కథలకు గుర్తింపు తెచ్చారు.

దేవరకొండ బాలగంగాధర తిలక్ :

తిలక్ కవి మాత్రమే కాదు మంచి కథకుడు కూడా. వీరు రచించిన కథలో మాధురి, ఆశాకిరణం, లిబియా ఎడారిలో, అద్దంలో జిన్నా, ఫలితకేశం, బొమ్మ కథలు మొదలగు కథలను రాశారు.

కేతువిశ్వనాథరెడ్డి :

రాయలసీమ ప్రజా జీవనంలోని సామాజిక ఆర్థిక సమస్యల్ని అద్దం పట్టిన ఘనత కేతువిశ్వనాథరెడ్డి గారిది. వీరు పీర్లచావిడి, నమ్ముకున్ననేల, కూలిన బురుజు, గడ్డి, సంహాసనం, ఇచ్చాగ్ని, జిప్సు, ఒకజీవుడి వేదన మొదలగు కథలు వీరి ఉత్తమ కథలకు నిదర్శనములు.

ముగింపు :

ఆధునిక కథాసాహిత్యము 19వ శతాబ్దం నుండి విస్తరించినా నేటి వరకు అనేక మంది ఆధునిక కవులు తమ కథలద్వారా సాహిత్యరంగానికి విశేష కృషి గావించారు సమ సామాజికం అంశాలయందు గల విభిన్న ధోరణిలను విశ్లేషించి తెలుగు కథా అభివృద్ధికి కృషి గావించడంలో ఆధునిక కవుల పాత్ర ఆధునిక కథా సాహిత్యానికే మూల స్తంభాలు వంటిది అనడంలో అతి శయోక్తిలేదు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్యచరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి
2. తెలుగు సాహిత్యసమీక్ష - డా॥ జి. నాగయ్య (2వ సంపుటం)
3. తెలుగు సాహిత్యదీపిక - డా॥ ఎన్.కె. మద్దిలేటి
4. తెలుగు సాహిత్యదర్శిణి - డా॥ ఎన్.కె. మద్దిలేటి
5. తెలుగు అధ్యాపక విజయం - కాటంరెడ్డి,రామలింగారెడ్డి.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాయలవారి యోగ దర్శన పాండిత్యం

– పతివాడ ధనంజయరాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు వారి కీర్తిని నలుదిశలా చాటిన సాహితీ సమరాంగణా సార్వభౌముడు రాయలు. కవనంలోనైనా, కథనంలోనైన రాయలవారికే వారే సాటి. ఇది చరిత్ర చెపుతున్న సత్యం. అయితే రాయలవారిలో అంతర్గతంగా ఉన్న మరొక అంశం తత్త్వం. ఔను రాయలవారు గొప్పతత్త్వవేత్త. భారతీయ తత్త్వశాస్త్రానికి మూలం అనదగ్గ ఆరు దర్శనాలపైన వారికి అపారమైన పాండిత్యం ఉన్నది. ఈ ప్రజ్ఞ వారి ఆముక్తమాల్యదలో ప్రస్ఫుటంగా కనపడుతున్నది. ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తుని వాదనను పురస్కరించుకుని వారు ఆరు దర్శనాలను ఖండించారు. వారికి ప్రియమైన విశిష్టాద్వైతమతాన్ని స్థాపించారు. అయితే రాయలవారికి ఆరు దర్శనాలలోకి ప్రియమైనది యోగదర్శనం. అంతేకాదు వీరు తన దినచర్యలో భాగంగా మల్లయుద్ధము, కత్తిసాము, కర్రసాములతో పాటు యోగము కూడా చేసేవారని మనకు రాయవాచకం ద్వార తెలుస్తున్నది. రాయలవారికి యోగ దర్శనం పై ఉండే అధికారం ఆముక్తమాల్యదలో ఇలా కనపడుతుంది.

ఆముక్తమాల్యద - యోగదర్శన ప్రభావము :

ప్రాచీన కవులందరికీ ఈ దర్శనముతో పరిచయ మున్నట్లు సర్వులకు విదితము. కాని రాయలవారు ఈ శాస్త్రంలో అపారమైన ప్రతిభ కలిగి ఉన్నారు. ఈ ప్రతిభ మిగిలిన కవులకంటే కాస్త ఎక్కువనే చెప్పాలి. ఖాండిక్య కేశిధ్వజి సంవాదంలో ఈ ప్రతిభ మరింత ప్రస్ఫుటంగా గోచరమవుతుంది. ఉదాహరణకు

"ఆ కేశిధ్వజు డంత నా నృపునిరాజ్యం బెల్ల జేర న్ఫలం
బాకాక్షింపక గెల్తు మృత్యువు నవిద్య న్బుట్టకుండుం
దుదన్
జాకుందు న్వడి నంచు యోగనియతిం జ్ఞానాశ్రయుం
డై మఖా
నీకంబు ల్రచయించు చం దొకటికిం దీక్షించి తా
నున్న చోన్" ఆ 3-18

పై పద్యంలో కవి యోగశాస్త్రసంబంధమైన అవిద్య అనే పదాన్ని ఉటంకించాడు. "వృత్తి సారూప్యమిత్యత్ర" అనే సూత్రం ద్వార పతంజలి అవిద్య గురించి వివరించాడు. యోగమునందు మనసు లేని పురుషుడు ఇతర భౌతికవిషయాలపై మనసును సారిస్తాడు అని దీని అర్థం.

కంధర నీలవర్ణ! మధు కైటభనాగ సుపర్ణ! యోగి హృ
ద్గ్రంథి భిదోత్థ భోగి వనితాస్వనవచ్ఛ్వసన స్రవచ్ఛిర
స్సంధి వసన్నిశాపతీ రసశ్రుతీ దుగ్ధపయోధి వీచికా
మంధర కెళికాదర! సమాశ్రితపంక్తి శిరోధి సోదరా!
5 వ ఆశ్వాసాంతము

ష్మంజనియించు అంజ నమాను వాయుగణ
మంతయు ఖంజిత చిక్కనజ్జవో
చిక్కని సమానపు వాయువులో నొకండు గ
ల్మింజనియించు దుర్యశము మేల్కని లేహనవేళ వాజు
లూర్పంజెడు మాణిబంధముకురంబులు కాళిమ పేర
గార్కొనున్ ఆ 2-28

పై పద్యాలలోని యోగశాస్త్ర విషయమగాధము. దుగ్ధాంబోధి మహా గృహోత్సకుడు అనడంలో ఆంతర్యం వేరుగ ఉన్నది. ఈ బ్రహ్మాండంలో ఏదో ఒక చోట పాల సముద్రం ఉండటం నిజమే అయినప్పటికీ అదే పాల సముద్రము మనలోనూ ఉన్నదని, ఆ మహావిష్ణువు మనలోనూ వశించుచున్నాడని కవి భావన. ఇక్కడే కవి పిండాండ బ్రహ్మాండములకు అభేదము చెప్పున్నాడు. కుండలిని అనబడే శక్తి యోగి హృదయ గ్రంథులను బేధించి బుసులు కొడుతుంది. దాని కంపన మూలంగా స్రవిస్తున్నటువంటి చంద్రరసస్రావణమనే క్షీరసముద్రంలో కేళీలోలుడై ఉన్నవాడా అని దీని అర్థం. ఇది యోగశాస్త్ర

విషయం. పద్యంలో చెప్పిన గ్రంథి, కుండలిని, విశాపతి, రసస్రుతి, శిరస్సంధి లాంటి శబ్దాలు యోగశాస్త్ర సంకేతిక పదాలు. యోగశాస్త్రం ప్రకారం మానవ శరీరంలో మూడు గ్రంధులున్నవి. 1.బ్రహ్మగ్రంధి 2. విష్ణుగ్రంధి 3.రుద్రగ్రంధి అలాగే శరీరంలో ఆగ్న, విశుద్ధ, అనాహత, మణిపూర, స్వాధిష్టాన, మూలాధార అనబడే ఆరు చక్రములున్నవి. ప్రతి రెండు చక్రములకు ఒక గ్రంధి విభక్తమై ఉన్నది. మూలాధార స్వాధిష్టానముల మధ్య బ్రహ్మగ్రంధి, మణి పూర, అనాహత, విశుద్ధములకు మధ్య విష్ణు గ్రంధి, ఆగ్నా చక్రమునకు పైన రుద్రగ్రంధి కలవు. ఈ మూడు గ్రంధులలో మొదటిది అన్నమయ కోశము, రెండవది ప్రాణమయ కోశము, మూడవది మనోమయ కోశము.ఈ విధంగా ఈ గ్రంధులు త్రివిధ జీవాకృతులై స్థూల సూక్ష్మ కారణ శరీర మూర్తులై ఉన్నవి. ఈ గ్రంధులు, చక్రములు బేధింపబడినపుడే భగవంతుడు దర్శనమిస్తాడు. ఈ బేధనకు యోగమే శరణ్యం. యోగానుష్టానము వలన మనలో నిద్రావస్థలో ఉన్న కుండలినీ శక్తి జాగృదావస్థకు చేరుకుని షట్చక్రములను, గ్రంధిత్రయమును బేధించి సహస్రారంలోని చంద్రకళామృతాన్ని స్రవింపచేస్తుంది. సహస్రారమందలి చంద్రకళామృతమే సుధాసింధువు. ఇది స్రవించడం వలననే మోక్షం కలుగును. దీనినే ఆది శంకరులు సుధాసింధోర్మధ్యే సురవిటపి వాటీ పరివృతే అని దేవీ స్థానంగా కీర్తించారు. మరోచోట రాయలవారు పరుగిడుతున్న గుర్రాలను వర్ణిస్తూ

"మధురానగరమందలి యశ్వము లొక్క యంగలోనే సమానవాయుగణమును జయించెను. సమానమను పేరు గల వాయువొక్కటి మాత్రము జితము కాక కడుపులోనే చిక్కెను. దానివల్ల గుర్రాలకపయశస్సు కలిగినది".

ఆ 1-45

ఈ వచనంలో సమాన వాయుగణమన్న మాట ఉన్నది. ఈ వాయువులు యోగశాస్త్రప్రసిద్ధములు. యోగ శాస్త్రం ప్రకారం మానవ శరీరంలో 5 ముఖ్యవాయువులు, 5 ఉపవాయువులు ఉంటాయి. అవి నాగ, కూర్మ, కృకర, ధనంజయ, దేవదత్తములు. ఇవి శరీరంలోని పలుస్థానాల్లో నివాసముంటాయి. ప్రాణవాయువు హృదయంలోనూ, అపానవాయువు గుదస్థానమందు, వ్యానవాయువు మూపులయందు, ఉదానవాయువు పాదహస్తముల యందు, సమానవాయువు సర్వశరీరమందు అమరి ఉంటాయి. గుర్రాలు సామాన్యమైనగాలిని ఓడించ గలిగాయి గాని తమ శరీరమంతటా ఇమిడి ఉన్న సమానవాయువును ఓడించలేకపోయాయి. తమలోని ఉన్న సమానవాయును ఓడించాలంటే అవి మానుషజన్మ మెత్తి, యమనియమాదులతో కూడిన యోగసాధన చేయాలి. లేనిచో వాటికాశక్తి లభించదు. తిర్యక్కులు ఆ విధంగా చేయలేవు కాబట్టి గుర్రములకు సమాన వాయువును గెల్చుట అసాధ్యమని కవిభావం.మధురలోని చాతుర్వర్ణాలను గురించి చెపుతు రాయలవారు పంచ యమాలలో ఒకటైన అపరిగ్రహం గురించి వివరించారు.

చిరసముపార్జితాగ్ని తడిజెంది నశించు నటంచునో, కృతా
ధ్వరత దదగ్ని మై నునికి దాన నొకంగము తాచు చేతనో
పురధరణీశుల్నిగమ భూధరము ల్జపయజ్ఞ శీలు రా
హరి ధనదాదులైన వలహస్తము సాచరు దానధారకున్

ఆ 2-34

మధురాపురములో గల బ్రాహ్మణులు ఎవరి నుండి దానము గ్రహించరని దీని భావం. ఈ విధంగా ఎవరి దగ్గర నుండి ఏమి గ్రహించకుండా ఉండడాన్ని యోగ శాస్త్రంలో అపరిగ్రహం అంటారు. పతంజలి అపరిగ్రహం గురించి చెప్తూ

"అపరిగ్రహస్థైర్యే జన్మకథాంత సంబోధః" ప 2-39

అని నిర్వచించాడు. దానధర్మాలు గ్రహించకుండే అపరిగ్రహంలో సుస్థిరుడై ఉండే వ్యక్తికి పూర్వజన్మకు సంబంధించిన ఎరుక కలుగుతుందని పతంజలి ఉద్దేశ్యం. ఈ సిద్ధిని పొందటంకోసం ఆ పురములోని బ్రాహ్మణులు దానధారకు వలహస్తము సాచరు. ఇదే పద్యంలో వేదప్రోక్తమయిన విషయమున్నది. మన

పూర్వులు అగ్నికి ప్రాధాన్యతనిచ్చారు. అగ్ని అనగా వారి ఉద్ధేశ్యం ప్రకారం కేవలం నిత్యావసరములకు వినియోగ పడేది మాత్రమే కాదు. ఇది భగవంతుని స్వరూపం. భగవంతుని భక్తుడిని హోమక్రియ ద్వార దగ్గర చేసేది. ఇక్కడ అగ్ని అనే పదానికి అర్థం వేరుగా ఉన్నది. చాలకాలం పాటు జపతపహోమాలు చేసి సంపాదించుకున్న పుణ్యం అనే అర్థంలో అగ్ని అనే పదం ప్రయుక్తమైనది.ఈ పుణ్యం ఎక్కడ దూరమవుతుందో అని అక్కడి బ్రాహ్మణులు దానం గ్రహించరని కవి భావం. రాయలవారి యోగదర్శన పాండిత్యం ఇంత లోతైనది. ఇన్ని రంగాలలో ఒకే వ్యక్తి ఉండగలగడం అనితర సాధ్యమైన విషయం. అందుకే రాయలవారికి రాయలవారే సాటి.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్నేహలతా కవితాసంఘ ప్రస్తావన

- డా॥ సి. నర్సింహులు, సహాయ ఆచార్యులు, తెలుగు విభాగం, యం.వి.యస్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, మహబూబ్‌నగర్.

ఆంధ్రసారస్వత పరిషత్తు 5వ వార్షకమపహాసభలు తూఫ్రాన్‌లో జరిగాయి. దానికి బిరుదు వేంకటశేషయ్య సభాధ్యక్షులు. వారు తెలంగాణ కవుల కవితా పాండిత్యాలను చిన్నబోసి మాట్లాడుతూ, తెలంగాణవారు సరియైన తెలుగు కావ్యరచనా పాటవాన్ని సంపాదించాలంటే పెద్ద బాలశిక్ష, సుమతీశతకం చదవడం అవసరమనియన్నాడట. అదివిని అసభలోవున్న కేశవపంతుల నరసింహశాస్త్రి నొచ్చుకొని తెలంగాణ కవుల పటిమను, పాండిత్య విశేషాలను జటప్రోలు సంస్థాన స్నేహలతా కవితా సంఘాన్ని,సంఘ చైతన్యాన్ని ఆశువుగా ఒక పద్యములో ప్రస్తావించారు. అది,

సీ॥. తడియారలేదు మాధవరాయ చంద్రికా
పరిణ యక్షర మషీపంకమందు
చినుగు దింకను సదాశివశాస్త్రి నరసభూ
పాలీయ టీకార్థ పత్ర వితతి
మార్మోతలిడుచుండె మల్లాది వారికి
చెవిలోన వెల్లాల సింహగర్జ
ముడివిప్పలేదింక మొన్న శ్రీపాదవా
రందిన వేయిరూప్యముల మూట

గీ॥. నేటికిని స్నేహలతపూయు నిరుపమాన
సుమములాంధ్రికి తలలోన సొమ్ములగుచు
ప్రాజ్ఞగుణమైన జటప్రోలు రాజ్యమహిమ
వినకమా రాష్ట్రమును కొల్తవేయదగునె.

అని తెలంగాణ కవుల గొప్పదనాన్ని, జటప్రోలు సంస్థాన స్నేహలతాకవితాసంఘ ప్రాభవాన్ని ప్రస్తావించారు. స్నేహలతా కవితా సంఘం-సాహిత్య చైతన్యం నైజాం రాజ్యంలో రాజభాషగా ఉర్దూ రాజ్యమేలుతున్న కాలమది. తెలుగుప్రాంతంలో తెలుగుభాష కొడిగట్టిన దీపంలా మిణుకుమిణుకుమంటుంది. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగు కాకుండ వుండడానికి నిజాంకు సామంతులుగావున్న సంస్థానాలు, కవులు, కళాకారులు చాలా ప్రయత్నం చేశారు. ఇక సంస్థానాలు నవయువకవులను రచనలో ప్రోత్సహిస్తు అనేక రచనలు చేయించారు. తద్వార ప్రజాచైతన్యం, భాషాచైతన్యం, సాంస్కృతికచైతన్యం కలిగించారు. ఇట్లు చేసిన పాలమూరు జిల్లాలోని సంస్థానాలన్నింటిలో జటప్రోలు సంస్థానానిది ఒక ప్రత్యేకత.

జటప్రోలు సంస్థాన రాజధానియైన కొల్లాపురంలో సంస్థానాధిపతి రాజ శ్రీ సురభి వేంకట లక్ష్మారావు గారు తన కూతురు వేంకట రాజరాజేశ్వరిదేవి గారి కుమారుడైన రాజ విజయఅప్పారావుకు చదువు చెప్పించడానికి 1927వ సంవత్సరములో శ్రీ వాజపేయాజుల రామసుబ్బారాయ కవిని కోవూరు నుండి రప్పించారు. రాజాగారితో కవి పరిచయం అభిమానంగా, స్నేహంగా మారి 1928వ సంవత్సరములో లక్ష్మారావు సుబ్బారాయ కవిని ఆస్థాన కవిగా నియమించారు.

స్నేహలతా కవితా సంఘస్థాపన :

ఈ విధంగా జటప్రోలు సంస్థాన ప్రవేశం చేసిన రామసుబ్బారాయ కవి శతాధిక గ్రంథాలు రచించి సాహిత్య చైతన్యం కలిగించారు. కావ్యాలు, ప్రబంధాలు, లఘు రచనలు, శతకాలు, పద్యోత్తరాలు, తారావళులు, తత్వములు, యోగములు మొదలైన సాహిత్య ప్రక్రియలను చేపట్టాడు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేయడానికి రాజావారి అనుమతితో 1929వ సంవత్సరములో స్నేహలత కవితా సంఘం అనునొక సాహిత్య సంస్థను ఏర్పాటు చేశాడు. పాలమూరు జిల్లాలోనే మొట్ట మొదటిసారిగా ఏర్పాటు చేయబడిన సాహిత్యసంస్థ. రామసుబ్బారాయ కవి శతాధిక గ్రంథాలు రచించినప్పటికి వీరికి చిరకాల కీర్తినార్జించి పెట్టిన సాహిత్యసంస్థ స్నేహలత

కవితా సంఘం. ఆంధ్రదేశంలో వెలసిన తొలి తెలుగు సాహిత్యసంస్థగా పేరు సంపాదించుకొన్నది. ఈ సంఘం దినదినాభివృద్ధిచెందుతూ, కొవ్వూరు, బిలాస్‌పూర్‌లకు శాఖోపశాఖలుగ విస్తరించింది. ఈ సంఘం ద్వారా దాదాపు రెండువందల (200) గ్రంథాలు ప్రచురింపబడి నాయంటే సంఘం యొక్క ప్రత్యేకతను తెలుసుకోవచ్చు. తనకు తెలుగు భాషపై గల అభిమానం, అభిరుచులే స్నేహలతా కవితా సంఘ స్థాపనకు తోడ్పడ్డాయని రామసుబ్బారాయ కవి తెలిపారు.

కాని రామసుబ్బారాయడు కలకత్తాలో చదువు చున్నపుడే 1916 లో ఈ స్నేహలతా కవితా సంఘం ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. తెలుగేతర ప్రాంతములో నివశించు తెలుగు కవులు తెలుగు భాషాభిమానులకు తెలుగుభాషలోని మాధుర్యాన్ని మరచి పోకుండా వుండడానికి ఏర్పాటు చేశాడు. ఈ కవితా సంఘం సంఘం పద్దెనిమిది (18) మంది సభ్యులతో ప్రారంభమై అనేక మంది సాహిత్యాభిలాషులకు చైతన్యం కలిగించింది. ఈ సంఘానికి మహారాజ పోషకురాలు సంస్థాన మహారాణి సురభి వేంకట రత్నమాంబ. ఈమె సంఘాభివృద్ధికి ఎంతో తోడ్పాటునందించింది.

సంఘ కార్యకలాపాలు :

స్నేహలతా కవితాసంఘానికి అధ్యక్షులుగా శ్రీ వాజపేయాజుల రామసుబ్బారాయడు. కార్యదర్శిగా ఆయన శిష్యురాలు చేబ్రోలు సరస్వతిదేవి గారు నియమింపబడినారు. వీరి అధ్వర్యంలో కవితాసక్తి గలిగిన కవులను ప్రోత్సహించి వారిద్వారా సాహిత్య సుమాలను వెలువరించడానికి నిరంతర కృషి జరిగినది. ఏ ముగ్గురు సంఘసభ్యులు కలిసినప్పుడు భాషాచర్చ చేయవలెనన్నది సంఘ నిబంధన. ఈ సంఘములో అలోచనశాఖ, అధికార శాఖ యను రెండు శాఖలు ఏర్పాటు చేయబడినవి. సంఘం నుండి ప్రతినెల రెడ్ లెటర్స్ పేరుతో లిఖితపత్రిక వెలువడేది. ఈ పత్రికకు కృష్ణకుమార మిత్రులు సంపాదకులుగా వ్యవహరించే వారు. ఇవి ప్రేమరసపూరితమైన పద్యలేఖలు. దూరప్రాంతాలలో ఉన్న సంఘ సభ్యులు అనురాగముతో ఒకే ప్రాంతములో కలిసి మెలిసి ఉన్నట్లు రాసుకున్న లేఖలు. ఇందులో కవుల ఆహ్లాదకరమైన భావాలు పొందుపరచబడినవి. ఎరుపురంగు శుభకారణ మగుట చేత ఈ లేఖలకు రెడ్ లెటర్స్ అను పేరు స్థిరపరచబడింది. ఈ పత్రికకు ముఖచిత్రాన్ని చిత్రకళా విశారద అను పేరు పొందిన మియాపురం రామకృష్ణరావు గారు చిత్రించుచుండిరి. ఈ సంఘం ద్వారా వార్షిక పత్రికగా వైజయంతి అను పత్రికకూడా వెలువరింపబడేది. ఈ పత్రికకు సంఘకార్యదర్శిగా వున్న చేబ్రోలు సరస్వతి దేవి గారు సంపాదకత్వం వహించుచుండిరి. భాషాసేవ చేయడం సంఘం ముఖ్యోద్దేశం. వైజయంతి పత్రికను పాళీ, సంస్కృతం, ఆంగ్ల భాషలలో వెలువరించాలని సంఘం నిర్ణయించింది. ఈ సంఘం చేపట్టిన కార్యక్రమాలకు ఇష్టపడి చాలామంది కవులు సంఘసభ్యత్వాన్ని స్వీకరించారు. వారిలో ప్రఖ్యాత వ్యావహారిక భాష ఉద్యమకారుడైన గిడుగురామమూర్తి పంతులు, వారి సతీమణి గిడుగులక్ష్మీకాంతమ్మ, వారి సోదరి జొన్నలగడ్డ శరదాంబ మొదలగువారు. సంఘ కార్యక్రమాలన్నింటిని పరిశీలించడానికి చేబ్రోలు రాజగోపాలరావుగారు నియమింపబడినారు. సంఘసభ్యులు వెలువరించిన సాహితీ సుమాలను పరిశీలించి తమ సంఘం ద్వారా ప్రచురింప జేసారు. సంఘస్థాపకుల యనుమతితో సమస్త కార్య కలాపాలు జరుపబడేవి. ఈ సంఘం నిర్వహించుచున్న కార్యక్రమాలకు ముగ్దుడై రాజ ఇనుగంటి వేంకటకృష్ణా రావు బహద్దర్ తేది. 01 సెప్టెంబర్ 1932న యోగ్యతా పత్రం అందజేశారు.

ఈ సంఘం నుండి ప్రచురించబడిన పుస్తకాలను పుష్పములనేవారు. ఈ స్నేహలతాకవితా సంఘం ద్వారా కొన్ని వందలకొలది పుస్తకాలను ప్రచురించారు. ప్రస్తుతము స్నేహలతకు పుష్పించిన కొన్ని పుష్పములను వాటి వికాస చైతన్యములను పరిశీలింతము.

స్నేహలతా కవితాపుష్పాలు :

కాశీయాత్ర :

రామసుబ్బారాయ కవి, వేంకటనారాయణ కవి ఇద్దరు కలిసి రచించిన ఏకాశ్వాస కావ్యము. ఇది 1934 సం.లో స్నేహలతా కవితా సంఘంద్వారా ముద్రించారు. ఇది భక్తిరస ప్రధానమైన కావ్యం. కాశి ప్రకృతి సౌందర్యానికి నెలవు. మోక్ష ప్రదమైన కాశీక్షే త్రాన్ని యాత్రానెపంతో పొగడి ఈ కవులు ధన్యులైనారు.

ఈ కావ్యంలో కవులు తాము నిరంతరము కవిత్వ రచన చేస్తున్నట్లు తెలిపారు. మిత్రులకు అసంఖ్యాకముగా లేఖలు రాస్తున్నట్లు, తమకు నిద్ర, విశ్రాంతి లేదని ఇక స్వర్గంలోనే విశ్రాంతియని రాసుకొన్నాడు. స్వర్గంలో కూడా లేఖలు రాసిపెట్టమని పరమేశ్వరుడు కోరితే అట్టి భాగ్యానికి తరింతుమన్నారు.

ఈ లోకంలో స్థిరమైనది, శాశ్వతమైనది ఏదిలేదు. అన్ని నీటిబుడగల వంటివే. ధనాన్ని సంపాదించడం మోక్షసాధనము కాదు. కాబట్టి మానవులకు ధనకాంక్ష తగదు అంటారు. సోదరకవులు సమస్థ క్షే త్రాలను, సకలదేవతలను దర్శించినట్లు చెప్పుకొన్నారు. ఈ కావ్యాన్ని రాట్కవి తల్లిదండ్రులైన రామనాథ సుబ్బమాంబలకు అంకితమిచ్చారు.

సీతాకళ్యాణం :

రామసుబ్బారాయ కవి, వేంకటనారాయణ కవి ఇద్దరు కలిసి రచించిన మరొక కావ్యం సీతాకళ్యాణం. ఇది మూడు ఆశ్వాసాల కావ్యం ఇందలి కథా వస్తువు వాల్మీకి రామాయణంలోని బాలకాండ. సీతాకళ్యాణఘట్టాన్ని మార్చకుండా, మూలకథకు భంగం రాకుండా మధ్య మధ్యన స్వతంత్ర వర్ణనలు చేసినారు. ఇందులో అయోధ్యనగరంలోని నాలుగు వర్ణముల ప్రజలను గూర్చి వర్ణించాడు. అట్లే రాజకుమారుల సుకుమారత్వాన్ని వర్ణించాడు.

విశ్వామిత్రుని వెంబడి పుత్రులను పంపలేక పుత్ర వాత్సల్యంతో దశరథుని బాధను వర్ణించిన పద్యం.

ఉ॥ రాముడు చిన్నవాడు రణరంగ మెఱుంగడు శస్త్రవిద్యలం
దేమియు నేర్వబోడు గ్రహింవగలేడు బలాబలమ్ములన్
రాముని బాయునాడు నికరాజ్యమదేటికి సౌఖ్యమేటికే
నేమెయి జూచినన్విడువ నిచ్చజనింపదు రామభద్రునిన్.

ఈ కావ్యాన్ని 1936 సం.లో సంఘం ద్వారా ముద్రించారు. దీనిని శ్రీరాజా సురభి వేంకట జగన్నాథరావు గారికి అంకితం చేశారు.

కవితా కాంతా విహారము :

ఈ కావ్యాన్ని రామసుబ్బారాయ కవి 1934 సం.లో రచించి స్నేహలతాకవితా సంఘం ద్వారా 27వ పుష్పంగా ప్రచురించారు. ఇది ఏకాశ్వాస కృతి. ఇందులో కవి కవిత్వ రచనకిచ్చు ప్రాధాన్యత వివరింపబడింది. స్వప్నంతో కలిగిన విషయాన్ని భార్యకు చెప్పినట్లు రచించారు. ఇందలి వస్తువు కల్పితం. విషయం కవిత్వరచనా విధానం.

సురభిలక్ష్మి :

జటప్రోలు సంస్థాన పాలకుడైన రాజా సురభి వేంకట జగన్నాథరావుగారి ధర్మపత్ని ఇందిరాదేవి. కవి ఈమె జీవిత చరిత్రను సురభిలక్ష్మి పేరుతో చిన్న కావ్యముగా రచించాడు. ఇతడు జటప్రోలు రాజదంపతులకు బాల్య గురువు. కాబట్టి ఈయన రాసిన సురభిలక్ష్మి కావ్యములోని విషయాలన్ని వాస్తవాలే. ఇందులో కల్పితం ఏమాత్రము లేదు. ఇందిరాదేవి వివాహం జగన్నాథరావు గారితో వైభవంగా జరిగిన విషయాన్ని వర్ణించాడు. అట్లే ఈమె మరణాన్ని గురించి రాజుగారి బాధను కరుణరస పూరితంగా రచించారు.

శ్రీకృష్ణ భారత ప్రాశస్త్యం :

ఈ కావ్యాన్ని శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు రచించి

1933లో సంఘం ద్వారా ప్రచురించిరి. శాస్త్రిగారు శతాధిక గ్రంథాలు వ్రాసి తృప్తి చెందక మహాభారతం రాయడానికి పూనుకొన్నట్లు శ్రీపాదవారే తెలిపారు.

చిరకారి :

రామసుబ్బారాయుడు రచించి 1957లో సంఘం 173వ పుష్పంగా ప్రచురించారు. ఇందలి కథ సంక్షిప్తంగా ఇలా ఉంది.

అహల్యపై కోపించిన గౌతమ మహర్షి ఆమెను చంపవలసిందిగా తన కుమారుడైన చిరకారిని ఆజ్ఞాపించాడు. తల్లిని చంపడం ఇష్టంలేని చిరకారి స్త్రీహత్య అందులో మాతృహత్య మహాపాపమని తండ్రితో వాదిస్తూ కాలాయాపన చేసి ఆమెను రక్షించడం ఇందలి కథాంశం. దీనివల్ల నిదానమే ప్రధానం అన్న సూక్తి దీని వల్ల తెలుస్తుంది. తొందరపాటు మనిషికి పనికిరాదు. ఏ విషయమైన బాగా ఆలోచించి చేయవలయునని ఈ కృతి ద్వారా రామసుబ్బారాయుడు సందేశం ఇచ్చాడు.

దేవి ప్రసన్నం :

ఈ కావ్యం 1944 సం.లో స్నేహలతా కవితాసంఘం 87వ పుష్పంగా రెండుభాగాలుగా ప్రచురించబడింది. ఇది జటప్రోలు రాణి సురభి రత్నమాంబ మనుమరాలైన సామ్రాజ్యలక్ష్మి వివాహసందర్భంగా తారహారము.

ఇందులో గృహిణి ఆచరించవలసిన ధర్మాలను అత్యంత రమణీయంగా వర్ణించాడు.

కోయిల్ కందాడై సంపత్కుమారాచార్యులు మరియు మియ్యాపురం రామకృష్ణా రావు :

వీరిద్దరు సంఘములో జంటకవులు. వీరిద్దరు కలిసి రచించిన కావ్యాలు. 1.రాఘవశతకం 2.పద్మాలయశతకం 3.సత్యనారాయణ స్తవరాజము 4.ఆంధ్రరామాయణ త్రయదర్శిని 5.శ్రీ త్రిపురేశ్వరస్తవము 6.గీతామృతము మొదలగునవి.

ఇంక సంఘం వెలువరించిన కావ్యాలు చాలా వున్నాయి. అందులో కొన్ని కావ్యాలు అవి,

1. రామకోటి తారావళి. 1937లో సంఘం ముద్రించింది. రచయిత రామసుబ్బారాయుడు.
2. రామాయణ సంగ్రహము. రచయిత పత్రి విశ్వేశ్వర శాస్త్రి.
3. శ్రీ కృష్ణదేవరాయ ప్రశంస. రచయిత పత్రి విశ్వేశ్వర శాస్త్రి.
4. మేఘసందేశం. రచయిత పత్రి విశ్వేశ్వర శాస్త్రి.
5. భావకవి. రచయిత పత్రి విశ్వేశ్వర శాస్త్రి.
6. రత్నలక్ష్మీ స్తవము. రచయిత శ్రీధర పరశురామ శాస్త్రి.
7. మాధవశతకము. రచయిత గంధం వేంకట నరసింహాచార్యులు.
8. భక్తామృతము. రచయిత గంధం వేంకట నరసింహాచార్యులు.
9. మణిహారము. రచయిత గంధం వేంకట నరసింహాచార్యులు.
10. ధృవచరిత్రం. రచయిత గంధం వేంకట నరసింహాచార్యులు.
11. లలితాశతకము. శ్రీ సరిపల్లె విశ్వనాథ శాస్త్రి.
12. కామవిలాసము. శ్రీ సరిపల్లె విశ్వనాథ శాస్త్రి.
13. గోమాత. శ్రీ సరిపల్లె విశ్వనాథ శాస్త్రి.
14. బ్రహ్మపత్రోపాఖ్యానము. రచయిత రామసుబ్బారాయుడు.
15. తస్కరణశతకము. రచయిత రామసుబ్బారాయుడు.

ఈ స్నేహలతా కవితా సంఘంలో రచయిత్రులు కూడా విరివిగా రచనలు చేసి సంఘం ద్వారా ముద్రించి సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

చేబ్రోలు సరస్వతీదేవి :

ఈమె స్నేహలతా కవితా సంఘం కార్యదర్శిగా ఉండి చాలా కావ్యాలు రచించారు. అవి 1.సరస్వతీ రామాయణం 2.ఉత్తర రామాయణం 3. శ్రీ సత్య నారాయణవ్రతకల్పం 4.సరస్వతీ శతకం 5.పతివ్రతా శతకం 6. ఆత్మోపదేశం 7. గురుగీత మొదలగునవి.

గిడుగు లక్ష్మీకాంతమ్మ మరియు జొన్నలగడ్డ శారదాంబ:

వీరు జంట కవయిత్రులు. స్నేహలతా కవితా సంఘం సభ్యులు. వీరి రచనలు 1. లక్ష్మీశారద గీతాలు 2.లక్ష్మీ శారద శతకాలు 3. లక్ష్మీశారద సుభాషితాలు మొదలగు నవి. వీరి పద్యోత్తరాల కావ్యం. లక్ష్మీసరస్వతీ సంవాదం. పద్యాలతో ఉత్తరాలు రాయడం ఈ సంఘం చేపట్టిన నూతన ప్రక్రియ. స్నేహలతా కవితా సంఘం స్థాపించిన తర్వాత దాదాపు 30 సంవత్సరాలు సాహిత్య పుష్పాలను వికసింపజేసింది. ఇందులోని ప్రతి పుష్పం పరిశీల నాంశమే. ఇంకా ఈ సంఘం ప్రతిపాదించిన పద్యోత్తరాలు పరిశోధకాంశాలు.

ఈ సంఘంలోని ఒక్కొక్క కవి రచన లపై ఒక్కొక్క సిద్ధాంతవ్యాసము రావలసిన అవసర మెంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. స్నేహలతా కవితా సంఘం. రాసురాట్కవి.
2. రాసురాట్కవి జీవిత చరిత్ర. పేరేశ్వర నారసింహకవులు.
3. కాశీయాత్ర. రామసుబ్బారాయ వేంకట నారాయణకవులు.
4. సురభిలక్ష్మి. రాసురాట్కవి.
5. చంద్రికాపరిణయ పీఠిక. కేశవపంతుల నరసింహాశాస్త్రి
6. చరిత్రకెక్కని చెరితార్థులు. బిరుదరాజు రామరాజు.
7. సురభివేంకట లక్ష్మారాయబహద్దర్ వారి జీవితం. రాసురాట్కవి.
8. విజ్ఞానసర్వస్వము. పుటలు. 802,803. కపిలవాయి లింగమూర్తి.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మహిళా ఔన్నత్య ముకురం – మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ

– డా॥. జగర్లమూడి శ్యామసుందరశాస్త్రి

సత్కావ్య నిర్మాణ చాకచక్యము గల్గి
పురుషోత్తముని మీద బుద్ధి గలిగి
వైరాగ్య భావ సంపత్తి గల్గి విశాల
పాండిత్య శాస్త్రవైభవము గల్గి
మంత్ర విద్యాప్రౌఢి మర్యాదలను గల్గి
ఆత్మవివేకంపు టంచు లెరిగి
మానవ సేవయే మాధవ సేవగా
గుర్తింపగల గొప్ప గుణము గలిగి
వినయమును శీలసంపద విజ్ఞతయును
సహజమగు భూషణంబులై సహకరింప
జీవితంబును సాగించె ఠీవి మెఱయ
వేడ్క దైవార దరిగొండ వెంగమాంబ!

"మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ" కావ్యం రచించిన కవి వేదగిరి వేంకట నరసింహ రాయశర్మ. ఇది వారి ఎనిమిదవ కావ్యం. ఏడాశ్వాసాలుగా - ఐదు వందలకు పైగా గద్య పద్యాలతో నిండిన కావ్యం. ప్రకాశం జిల్లాకు చెందిన పద్యకవులలో వీరు ప్రసిద్ధులు.

రాయలసీమ ప్రాంతీయులు, సాహిత్యాభిమానులు, కవిత్వాభినివేశంగల వారు,ఆంధ్రులందరూ గర్వించదగిన మహా కవయిత్రి తరిగొండ వెంగమాంబ. తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల వంటి మహాకవయిత్రుల సాహితీ వార సత్వాన్ని పుణికి పుచ్చుకున్న మహిళాశిరోమణి! కేవలం సాహిత్య రంగం మాత్రమే కాక, ఆధ్యాత్మిక రంగపు అంచులు చూసి, ఋష్యత్వం సాధించిన సాధ్వి !

ఆమెపై వ్యాసాలు, ఆమె రచనలపై పరిశోధనలు వచ్చాయి. ఆమె జీవితాన్ని చిత్రిస్తూ వచ్చిన పద్యకావ్యం ఇదే! ఆమె జీవితంలోని అనేక ముఖ్య ఘట్టాలను స్థూలంగా పొందుపరుస్తూనే, సందర్భోచితంగా సంబంధిత విశేషాలను కూడా ఈ కావ్యంలో జోడించారు నరసింహ రాయ శర్మగారు ! ఈ కావ్యాన్ని తరిగొండ నరసింహస్వామి వారికి అంకితం చేశారు.

ప్రథమాశ్వాసంలో అవతారిక, కావ్యప్రశస్తి, ఇష్ట దేవతాస్తుతి, అంకితము, తరిగొండ పూర్వ ఐతిహ్యము, వెంగమాంబ కథాప్రారంభము - తల్లిదండ్రులు, జననము, బాల్యము, వివాహము వంటి ఘట్టాలున్నాయి.

ద్వితీయాశ్వాసంలో వెంగమాంబ భర్త వేంకటాచలపతి నిర్యాణము, వెంగమాంబ విద్యాభ్యాసము, శారదా సాక్షాత్కారమందడం వంటి ఘట్టాలు చోటు చేసు కున్నాయి.

తృతీయాశ్వాసంలో వెంగమాంబ కావ్యరచనకు శ్రీకారం చుట్టడం, వెంగమాంబ తండ్రిని సనాతనులగు విప్రులు బెదరించుట, పుష్పగిరి శంకరాచార్యుల వారి రాక, వాదోపవాదాలు, వెంగమాంబ నిజస్వరూప నిరూ పణము, అర్చక స్వాముల అనూయా ద్వేషాలు, నరసింహస్వామిని ప్రార్థించి, బిలమార్గాన వేంకటా చలారణ్యమును ప్రవేశించుట, శ్రీ వేంకటేశ్వర స్వామి సాక్షాత్కారము, ఆంజనేయస్వామిని స్తుతించడం వర్ణిం చారు శర్మగారు.

చతుర్థాశ్వాసంలో 'మహంతు' ఆదరణ, తాళ్ళపాక వారి సాన్నిహిత్యం, ప్రధానార్చకుడు వేంకటేశ్వరస్వామి ఆశ్వాసనము, తుంబురు కోన చేరడం, 'చెంచునాటక 'యక్షగానరచన తదితరాలు వర్ణితాలు.

పంచమాశ్వాసంలో పుష్కరిణీజుడి వృత్తాంతము, వెంగమాంబ తిరుమల చేరడం, రథోత్సవంలో వెంగ మాంబ మహత్తును శ్రీ వేంకటపతి వెల్లడి చేయడం, ముత్యాల హారతి గురించిన వివరాలు శర్మగారు పొందు పరిచారు. షష్ఠాశ్వాసములో వెంగమాంబ కావ్యరచన, స్వయంగా శ్రీవేంకటేశ్వరస్వామి తొలి శ్రోతగా, విమర్శ కుడుగా కనిపించడం, భక్తురాలిని అనునయించడం,

భక్తుల దర్శనం కోసం స్వామి తిరిగి వెళ్ళాలనుకోవడం, స్వామిని ఆపే ప్రయత్నంలో వెంగమాంబ స్వామి చేలాంచలాన్ని పట్టి లాగగా అది చినిగి పోవడం, అర్చకులు గమనించి, చినిగిన వస్త్రాన్ని వెంగమాంబ దగ్గర కనుగొనడం, కవయిత్రిగా ఆమె రచనా విశేషాలు ఉన్నాయి.

సప్తమాశ్వాసంలో తన సాహిత్య వ్యాప్తి కోసం వెంగమాంబ అష్టఘంటముల మంటపమును ఏర్పాటు చేయడం, ప్రతులు తయారు చేయించడం, తన భర్త ఇంటివాడైన 'నరసప్ప'ను దత్తత తీసుకొనడం, వెంగమాంబకు ముత్యాలహారతి చేసే వరాన్ని ప్రసాదించి, కలలో మహంతుకు ఆదేశాల్విడం, వెంగమాంబకు స్వామి దర్వనమివ్వడం, వెంగమాంబ మహానిర్యాణము, సమాధి నిర్మాణము, భరతవాక్యంతో ముగింపుచోటు చేసుకున్నాయి.

ఈ కావ్యం ప్రధానంగా భక్తిరస ప్రధానమైనది. శ్రీవేంకటేశ్వర స్వామి వారి భక్తురాలైన వెంగమాంబ ఇందులో ప్రధాన పాత్ర. ఆమె బాల్యం నుండి - ప్రథమాశ్వాసంలో నుండే ఆమె భక్తిని వర్ణించారు శర్మగారు. అనేక సంఘటనలు ఆమె జీవితంలో ఎదురైనా వెంగమాంబ భక్తిమార్గాన్ని నిరంతరం అనుసరించి ఉండడం కావ్యంలో సాంతం కనిపిస్తుంది.

వేకువనే లేచి వేంకటేశ్వరునకు
సుప్రభాతము బాడు సుస్వరమున
పూల మాలలు వేసి పూజించు దరిగొండ
లక్ష్మీనృసింహుని లలితగుణుని
దేవాలయముల సందేహములను దీర్చు
భక్తజనుల కనురక్తి కలుగ
వినిపించు వైష్ణవ విజయ గాథల కొన్ని
బాలబాలికలు సంబరపడంగ

బాల బాలికలెల్లరు గేలిసేయ
అమ్మలక్కలు దరిజేరి యపహసింప
తల్లివాదించినను గాని యుల్లమునను
వీడ దయ్యెను ధ్యానంబు వెంగమాంబ !

వెంగమాంబ తరిగొండ నుంచి తిరుమల చేరిన తరువాత స్వామి సేవలో తన జీవితాన్ని తరింపచేసుకున్నది. స్వామి వారికి ప్రత్యేకంగా హారతినిచ్చి తన స్థానానికి ప్రత్యేకత సాధించింది. ఆస్థితిలో ఒక సాధారణ స్త్రీ స్వామివారికి హారతినివ్వగల స్థాయిలో ఉండడం అక్కడి అర్చకులకు అసూయ కలిగించింది.

తులసి మాలికలను తోరంపు భక్తితో
శ్రీనాథు గళసీమ జేర్చుటొకటి !
భువన మోహనునకు పూన్కితో హారతి
ఏకాంత సేవ యందిచ్చు టొకటి !
ముక్కుతిమ్మన వలె ముగ్ధ మోహనశైలి
ముద్దుగా కృతులను దిద్దుటొకటి !
బృందావనమున గోవిందు నామంబును
ప్రీతిగా జేరి జపించుటొకటి !

వ్రతములై చెల్లుచుండ గా నతుల భక్తి
భావనమున వెంగమాంబిక పన్నగాద్రి
పతిని సేవించి మన్నన బడయుచుండ
అర్చకుల కీర్ష్య జనియించె నయ్యదనున !

సేవచేయడం, హారతినివ్వడం, కృతిరచన ద్వారా స్వామి కీర్తన, గోవింద నామస్మరణలతో పలు విధాలుగా వెంగమాంబ స్వామివారి పట్ల తన భక్తిని ప్రకటించిన విధానం హృద్యంగా వర్ణించారు శర్మగారు. అంతేకాక స్వామి స్వయంగా వెంగమాంబను అనుగ్రహించిన విధానాన్ని భక్తిమార్గానికి పరాకాష్టగా రచించారుకూడా ! వెంగమాంబ కృతులకు తొలిశ్రోతగా, విమర్శకుడుగా, సవరణలు చేసి మెరుగులు దిద్దిన గురువుగా స్వామి వారిని నిలిపి అద్భుత రసావిష్కరణకు దారివేశారు.

వినుచుండు కూర్చుండి వెంగమ్మ రచించు
హృద్యమై పరగెడు పద్యచయము !
కమ్మగా బాడు వెంగమ్మ పాటల విని
ఓలలాడు రసాబ్ధి డోలలందు !

సంస్కరించి యొకింత సలహాలొసంగును
గుణ రత్ననిధి జగద్గురుడు గాన !
పలికించు మధువుల జిలికించు పదముల
ఇంపారగా కవయిత్రి నోట !
ఆడ దలచిన నాటల నాడి యాడి
పాడ దలచిన పాటల బాడి పాడి
వెంగమాంబిక కన్నుల వెలుగు నింపి
పోవు వేకువనే లేచి కోవెలకును
ఘనుడు విశ్వస్వరూపి వేంకట విభుండు !

ఇలా స్వామివారు సమక్షంలో నిలిచి పూజలందుకొని అనుగ్రహించారు. ఆభక్తి పారవశ్యంలోనే మరొక సందర్భంలో భక్తుల సందర్శనార్థం వెళ్లడానికి త్వరపడుతున్న స్వామి వారిని ఆపే ప్రయత్నంలో స్వామి వారి చేలాంచలాన్ని చించివేసింది వెంగమాంబ. నవవిధభక్తి మార్గాలలో సఖ్యభక్తిని-స్వామి సాక్షాత్కారాన్ని సాధించింది వెంగమాంబ. తన భక్తితో పీఠాధిపతులకే కనువిప్పు కలిగించిన భక్తశిరోమణి ఆమె! ఆమె ప్రశాంతతకు భంగం కలిగించిన వారికి తగిన గుణ పాఠం నేర్పిన తపోధనురాలుగా చరిత్రలో నిలిచిపోయింది వెంగమాంబ. ఆయా సన్నివేశాలను తగిన విధంగా వర్ణించి భక్తిరసాన్ని, అద్భుత రసాన్ని సమయోచితంగా పండించినారు శర్మగారు! ఆక్రమంలో పాఠకులు ఏ సందర్భంలోనైనా వెల్లవేసుకోగల అందమైన స్తోత్రపద్యాలను వెలువరించారు.

పద్యరచనలో శర్మగారికి కలిగిన ధారాశుద్ధివారి బహుళ గ్రంథపఠనానుభవాన్ని నిరూపిస్తుంది. పద్య రచనలో ఏవృత్తమైనా, దేశిఛందమైనా, అరుదైన తరువోజులు, మంజరీ ద్విపదలు, వసంతతిలక, తోటక వృత్తాలైనా నిరాటంకంగా, నిరాఘాటంగా పరుగులు పెట్టాయి. సీసపద్య రచనకు శర్మగారి కలం కదను తొక్కుతూ ముందుకురుకుతుందనిపిస్తుంది.

పదాల అమరిక, ఎంపిక, పోహళింపు,శయ్యకు అనువుగా అమరిపోయాయి. సులభంగా అర్థమవుతాయి!

"తెలియని విద్యలన్ గురుడు దెల్పెముదంబున వెంగమాంబకున్
కలిగె విశేష పాండితియు, గల్గె మహత్త్య కవిత్వ సంపదల్
తలచిన వెంటనే మృదు పదంబుల హసంగతుల్ పెలంగ, న
ప్పలుకుల కల్కి డెందమున భాసిలుచుండె, నీకేమి కావలెన్ !".

శర్మగారి మీద పోతన, శ్రీనాథుడు, అన్నమయ్య, జాషువా మహాకవుల ప్రభావం ఎంతో ఉంది. అవసరం వస్తే ఆ మహాకవుల పదాలు, పాదాలు గౌరవపురస్సరంగా తన కావ్యంలో ప్రయోగించడానికి వెనుకాడలేదు శర్మ గారు. దాన్ని ఆ పూర్వకవుల భిక్షగా.....కవితాభిక్షగా సవినయంగా గ్రహించారు.

తన ఇంటిముందు నిలిచిపోయిన స్వామివారి రథాన్ని కదిలించే ప్రయత్నంలో వెంగమాంబ నోట కీర్తనను పలికించారు.

"శరణు శరణు త్రిలోక నాయక ! శరణు పురహర నాయకా !
శరణు ముక్తి ఫలపద్రా యకా ! శరణుభక్త సహాయకా!
శరణు యోగి మనోబ్జబంభర ! శరణు శరణు చిదంబరా !

ఈ కీర్తన అన్నమయ్య 'శరణు శరణు సురేంద్ర సన్నుత' కీర్తనను స్ఫురణకు తేకమానదు! కీర్తనాగానం అనంతరం వెంగమాంబ హారతి ఇచ్చిన వెంటనే రథం ముందుకు కదలడం భక్తిరస, అద్భుతరసాల సమ్మేళనంగా శర్మగారి కల్పనాచాతుర్యానికి, చారిత్రక సత్యానికి అద్దం పడుతుంది. దాదాపు ప్రతి వద్యం ముక్తకంలాగా భాసిస్తుంది. అరుదుగా మరో పద్యంతో అన్వయం చేసుకోవలసిన అవసరం కనిపిస్తుంది. కథా కథనానికి తోడు భాషాసారళ్యం కూడా పాఠకులను కావ్యం వెంట పరుగులు తీయిస్తుంది.

వెంగమాంబ తుంబురుకోన చేరిన సందర్భంలో అక్కడి చెంచులు ఆమెను గౌరవించిన తీరు గమనించ డండి.

"కొందరు కందమూలముల గొందరు కమ్మని జుంటి తేనియల్
కొందరు గోఘృతంబు మరి కొందరు తియ్యని యిక్షుఖండముల్
కొందరు బర్హిపించఘముల గొందరు పున్నుజవాది, కస్తురిన్
కొందరు చందనంబు తరిగొండ మహాకవయిత్రికిచ్చుచున్ ! ".

ప్రధాన పాత్ర వెంగమాంబ కాగా, తరువాతి ప్రధాన పాత్ర శ్రీస్వామివారే ! మిగిలిన అన్ని పాత్రలు అక్కడి కక్కడి ప్రాధాన్యత కలవి మాత్రమే ! పుష్పగిరి శంకరా చార్యులు, వెంగమాంబ మహిమను తెలుసుకొని ఆమెకు నమస్కరించి, శుభాకాంక్షలననుగ్రహించినారు.

తాను గూర్చున్న పీఠంబు దగ్ధమగుట
కనులు విప్పార జూచిన మునివరుండు
మస్తకము వంచి భక్తి నమస్కరించి
వెంగమాంబను కొనియాడె వేయినోళ్ళ !

వేంకట రామదీక్షితులు వెంగమాంబ పట్ల తిరస్కార దృష్టితో ఆమెను అవమానించాలని ఆమె శాపానికి గురైనాడు. పుష్కరిణీజుడు ఆమె నుండి మేలుపొందిన కుష్ఠురోగి. తన తపస్సు ధారపోసి కుష్ఠురోగ విముక్తుని చేసి పుష్కరిణి ద్వారా తిరుమలలో ప్రవేశపెట్టింది వెంగ మాంబ. తన ఉనికి గురించి తెలియజేయ వద్దని ఆమె పెట్టిన ఆనను మీరి తలపగిలి మరణించాడు.

"బుఱ్ఱ గొరుగుట నేశాస్త్రములు వచించె ?
బుఱ్ఱ గొరిగింప వెండియు మొలచును గద !
బుఱ్ఱ గొరిగింతు, వెండియు మొలవకుండ
జేతురే ? మీరొకించుక జెప్పవలయు ! "

సమాజంలో స్త్రీకి గల చిన్నచూపును ఆమె జీవిత మంతా ఎదుర్కొన్నది. ఒక సామాన్య స్త్రీ తపమాచరించ డాన్ని, భక్తితో జీవితాన్ని స్వామివారికి అంకితం చేయడాన్ని పరిహసించిన వారినందరిని ఆమె ఎదుర్కొన్న తీరు, ఆమె అనుసరించిన భక్తిమార్గం స్త్రీలందరికి అనుసరణీయాలు! ఆమె వేదనను కవితా నివేదనగా మార్చుకున్న వైనం స్త్రీ జాతికే కాదు.... మానవులందరికీ ఆదర్శం.

సందర్భోచితంగా శర్మగారు వెలార్చిన పద్యాలు నిత్య సత్యాలుగా భాసిస్తాయి.

"మానినులను బాధించెడి
హీనులు పొందంగ జాలరిష్టార్థంబుల్
మానినుల గౌరవించెడి
మానవులకు శుభములిడు రమాధవుడరయన్ !

శర్మగారు ప్రకృతి ప్రేమికులు...సందర్భానికి తగినట్టుగా హద్దులు దాటకుండా ప్రకృతి వర్ణన చేశారు.

ఏనుంగు గున్నలు, ఏటి కోళ్ళర్పింప
పులికూనలరుదెంచి ముద్దులిడగ
భల్లూకములు వచ్చి బహుపరాకులు సేయ
పికములు వీనుల విందొనర్ప
బర్హిసంఘములు భరతనాట్యము సేయ
సింగపు కొదమలు చిందులాడ
జంకొకింతయు లేక జింకలు నడయాడ
కొమ్మలపై కోతి గుంపు లెగుర
పడగలను విప్పి గాలిమేపరులు దిరుగ
ప్రకృతిశోభను దిలికించి పరవశించి
తలచె నీరీతి వెంగమ్మ తన మనమున
అహహ ! పరమేశ్వరుని సృష్టి యద్భుతంబు !

బిలమార్గంలో వేంకటాచలారణ్యమును చేరిన వెంగమాంబ దర్శించిన ప్రకృతి సౌందర్యమిది.

కావ్యగమన రీతిలో అనేక ఇతర విశేషాలు చొప్పించి కావ్యాన్ని సుసంపన్నం చేశారు శర్మగారు. చానమ్మ, తాళ్ళపాక తిమ్మక్క వంటి తెలుగు కవయిత్రుల ప్రస్తావన కావ్యారంభంలోనే చేశారు. తరిగొండ పూర్వఐతిహ్యము,

హథీరాంజీ మఠానికి చెందిన మహంతులు, తాళ్ళపాక వారి సాన్నిహిత్యము, అష్టఘంటముల మంటపము, వెంగమాంబ నిర్యాణ కాలము, వెంగమాంబ మూర్తి మత్వము పాఠకులను అలరిస్తాయి.

శర్మగారి తెలుగు భాషాభిమానం వెంగమాంబ తెలుగు కృతుల రచనలో తేటతెల్లమౌతుంది. పూర్వుల రచనలు, కావ్యాలు చదువని వారు కొత్త కావ్యాలను సృజింపలేరు. వెంగమాంబ తన పూర్వుల రచనలు చదివి ఉండడం వల్లనే యక్షగాన, చంపూకావ్య, శతకాదులు రచించి మహాకవయిత్రుల కోవలో చేరింది. వాసిష్ఠ రామాయణము వంటి ఆధ్యాత్మిక ద్విపద కావ్యాన్ని ఆవిష్కరించింది.

తిక్కన్న పలుకుల తియ్యందనమ్మును
చవిజూచి నోరార సన్నుతించి,
తెన్నాలి కవి తీరు తెన్నుల బరికించి
పెద్దన్న సాహితీ హద్దులెరిగి
ముక్కు తిమ్మన ముద్దుముద్దు పల్కులెరింగి
రామరాడ్భూషణుప్రౌఢి నరసి
బమ్మెర పోతన్న భాగవతోద్యాన
మందార మకరంద మధువు జుఱ్ఱి
తాళ్ళపాక వారి తత్వంబు లారసి
రామదాస దాశరథి శతకము
సారమెరిగి ఆంధ్రసాహిత్య సేవకై
నడుము గట్టి ముందు కడుగువైచె !

తెలుగు వాఙ్మయలక్ష్మిని పలువిధముల
తీర్చిదిద్దిన కవయిత్రి తేనెలొలుకు
పదములను కావ్యములయందు పదిలపరచి
పొలుపు జెడనీక భాష నభ్యుద్ధరించె !

శర్మగారు వెంగమాంబ వంటి పూర్వకవుల నుండి గొప్పగా ప్రేరణ పొందినవారు. అందువల్లనే "కవిని నేను పద్యకవిని నేను " అని గర్వంగా చెప్పుకొని అనేక కావ్యాలు రచించి జీవితసాఫల్యం పొందారు.

వెంగమాంబ కేవలం కావ్య సృజనతోనే తన పని పూర్తయిందని భావించలేదు. ఆ సాహిత్యాన్ని భద్రపరచడం, వ్యాప్తి చేయడం తన సామాజిక కర్తవ్యంగా భావించింది. అందువల్లనే ఆమె మనసులో కలిగిన ఆలోచనకు 'అష్టఘంటముల మంటపంగా ' రూపాన్నిచ్చి, సమాజానికి గొప్ప సందేశానిచ్చింది. తన రచనలకు సామాజిక ప్రయోజనం ఉన్న విషయాన్ని ఆమె గుర్తించింది. నలుగురికీ అందుబాటులోకి తీసుకువచ్చింది.

తన యింటికి జేరువనే
ఘనముగ నొక మఠము గట్టి, కావ్యంబులకున్
ఎనిమిది మందిని నియమిం
చెను, వ్రాయసగాండ్ర బ్రతుల జేరి లిఖింపన్ !

వెంగమాంబ నిర్వహించిన ఈ సాహితీయజ్ఞాన్ని శర్మగారు ప్రముఖంగా ప్రస్తావన చేశారు. అందువల్లనే నేటికీ వెంగమాంబ రచనలు మనకు అందుబాటులో ఉన్నాయి.

ఆధునిక సమాజం తెలుగు భాష, తెలుగు సాహిత్యాల పట్ల చిన్నచూపు చూస్తున్న నేపథ్యంలో వెంగమాంబ గురించి, ఈ కావ్యంలో ఉన్న ఆమె తెలుగు భాషాభ్యున్నతీ వైదుష్యం, సాహిత్య విస్తరణ కార్యకలాపాలు తెలుగుజాతికి కనువిప్పు కలిగించి, ప్రేరణ నందించ గలవు!

వెంగమాంబ జీవిత చరమాంకంలో కూడ మరచిపోని మరొక సామాజిక బాధ్యత శర్మగారి కవనానికి పాత్ర మయింది. తన తరువాత కూడా స్వామి వారి కైంకర్యాలను యథాతథంగా నిర్వహించడానికి తగిన వ్యక్తిని పెంచి పోషించింది. భర్త వంశం వాడైన 'ఇంజేటి నరసప్ప' వెంగమాంబ పేరిట జరగవలసిన సేవలన్నింటిని తాను జరిపి తన తరువాత తన వంశం వారిచే నిర్వహింపజేశారు... చేస్తూ ఉన్నారు. మన సంప్రదాయాలను ఒక్కొక్కటిగా వదలి వేస్తున్న ఆధునికులు ఈ విషయాన్ని గ్రహించి తమ తప్పిదాలను సవరించుకోవాలని 'కవి' ఆకాంక్ష ! శర్మగారి ధ్యేయం నెరవేరాలని ఆ వేంకటేశ్వరుని కోరుకుందాం !

శ్రీరమణీయ గాత్ర ! సరసీరుహనేత్ర ! విశాలఘోర సం
సారవనీకుఠార ! సురసన్నుత ! కౌస్తుభ దివ్యరత్న ! కే
యూర కిరీటహార ! మహివోజ్వల చేల ! మనోజ్ఞమంగళా
కార ! భవాబ్ధితీరమును గ్రక్కున జేర్పగదయ్య ! మ్రొక్కెదన్ !

ఆధార గ్రంథాలు :

1. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ - వేదగిరి వేంకట నరసింహరాయశర్మ ,
2. శ్రీమదాంధ్ర మహాభాగవతము - బమ్మెర పోతన
3. పారిజాతాపహరణము - నందితిమ్మన
4. తరిగొండ నరసింహ శతకము - తరిగొండ వెంగమాంబ
5. జాషువా ఖండకావ్యాలు - గుఱ్ఱం జాషువా
6. అన్నమాచార్య సంకీర్తనలు - అన్నమాచార్యుడు
7. చాటుమణిమాల - టాగూర్ పబ్లిషింగ్ హౌస్

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆముక్త మాల్యద రాజనీతి

-పెరుగుపల్లి బలరామ్, తెలుగు అధ్యాపకులు, టి.జె.పి.యస్ కళాశాల, గుంటూరు.

శ్రీకృష్ణదేవరాయలు రచించిన గొప్ప కావ్యాలలో ముఖ్యమాంది, తెలుగు పంచ కావ్యాలలో తనదైన స్థానాన్ని నిలబెట్టుకున్న కావ్యరాజం ఆముక్తమాల్యద. దేవరాయలు తెలుగు పై ప్రేమతో రచించిన ఈ కావ్యంలో బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. అంతే కాకుండా సందర్భోచితమైన వర్ణనలతో ప్రజాభిమానంతో పాటు క్వాఫలాన్నికూడా పొందారు. ఇందులోని ఒకానొక సందర్భంలో యామునాచార్యునితో రాజనీతి విషయాలను తెలియ పరచారు కవిరాజు దేవరాయలు అవి ఈ క్రిందిన పేర్కోనడం జరిగింది.

యామునాచార్యుడు కొడుక్కి రాజనీతిని బోధిస్తూ "ఏ సందర్భంలోనూ విసుగు అనేది కలగకుండా ప్రజలని రక్షిస్తుండాలని. ఎవరు ఆపదలో ఉండి మొరపెట్టుకున్నా ఆ ఆపదని పోగొట్టాలని. ప్రవర్తన సరిగా లేనివాడపై కార్యభారాన్ని పెట్టకూడదని అలాగే.

ఆ॥ ఆజ్ఞ వలయు నృపతి కాభీరభిల్లాది
కంపకోల నూల నాజ్ఞ చెల్లు
నంట సార్వభౌముడైన భూపతియాజ్ఞ
కెల్లవారు దల్ల డిల్లవలదె

"ప్రజల మేలును రాజు కోరుకున్నప్పుడే, ప్రజలు కూడా రాజు మేలు కోరుకుంటారట. అదొక గొప్ప విశేషంగా భావించకూడదట. ప్రజలందరి హృదయాల లోని మొత్తం కోర్కెను తెలుసుకోవడానికి బ్రహ్మలాగా అవలంభిస్తారు. రాజు ఆజ్ఞకు ఎలాంటివారైనా వణుకుతూ బద్ధులై ఉండాలని అలాగే కోట కాపలా, రక్షణా భారాన్ని ఆప్త బంధువులకే అప్పగించాలని, ఎవరిని బడితే వారిని నమ్మి ఇలాంటి బాధ్యతలు ఇస్తే వారు కోటకే ప్రమాదం తీసుకువచ్చి రాజ్య విచ్ఛిత్తికి కారణం అవుతారట.

ఆయన స్వయంగా రాజు అందుతోను పాండిత్యకల వాడు కనుకనే శాస్త్రాలపట్ల అవగాహన కలింగిఈ పై విషయాలను కావ్యంలో యామునాచార్యుని పాత్ర ద్వారా చెప్పించాడు.

ఎవరినైనా ముందు అభిమానించి పెద్దలను చేయడం తేలికే, కాని అలా పెంచినవారు మళ్ళీ దిగువకు కుదించినప్పుడు వారు తమ పూర్వస్థితిని తలుచుకుని అలుగకతో శత్రువులు కావచ్చును. కనుక ముందుగా ఆశ్రయమిచ్చినప్పుడే వారి గుణశీలాన్ని గమనించాలి.ఈ షయాన్ని గమనిస్తే రాయలవారి సునిశిత బుద్ధి పాఠకులకు బోధ పడుతుంది.

ఆత్మగౌరవం లేనివాడిని, లోభిని, విద్య లేనివాణ్ని, పౌరుషం లేక బొంకేవాణ్ని ఆకతాయిని, గడుసువాణ్ణి, ఇతర దేశస్తుని, ఆశ్రయం ఇవ్వరాదు.ఈ విషయాలను గమనిస్తే వ్యక్తులలోని అరిష్ట్యర్థాలను అనుసరించి వ్యక్తుల మనస్థత్వాన్ని వివరించాడు.

ఆ॥ అనభిజాతు గీక టాలయునశ్రుతు
నలుకుమాని బొంకు పలుకువాని
నాతతాయి గడుసు నన్యదేశ్యున ధర్మ
విడుము విప్పునేల వేడితేని

ఇలాంటివాడు బ్రాహ్మణుడైనా విడిచి పెట్టమన్నాడు.

పూర్వం ఒక భ్రష్ట బ్రాహ్మణుడు ఒకపూట తిండికోసం తనని రక్షించిన కొంగనే చంపాడట. అందువలన భ్రష్టులైన వారిని దగ్గరకు చేరనివ్వకు.కనుక కులాన్నో ధనాన్నో చూసి వ్యక్తిని చేరదీయ రాదని గుణమే ముఖ్యమని సూటిగా చెప్పాడు.

చ॥ చదివి యధర్మ భేరు నృపశాస్త్ర విధిజ్ఞతల
న్వయస్సుడై
బ్బదిటికి లోను నేబదికి బాహ్యమునై యరు
జన్సురూపులై

మద మఱి రాజుప్రార్థనన మాత్యతగైకొని
తీర్చుపాఱువా
రొదవిన నంగముల్మిగుల నూర్జితమౌటకు
బూటసారుదే.

చదువు, పాపభీతి, రాజనీతి, శాస్త్రజ్ఞానము, ప్రకాశించే రూపము గల బ్రాహ్మణుని, ఏబదికి పైన 70 కి లోపు వయసుగల వాడిని బ్రతిమితాడి మరీ మంత్రి పదవి ఇవ్వాలట. మద మత్సరాలు లేనివాడు మంత్రి పదవికి ఒప్పుకుంటే అన్ని సమస్యలను ధర్మంగా తీర్చగలడని ఆయన నమ్మిక తద్వారా ఇతర విభగాలు కూడా త్వరగా బలపడతాయి పేర్కొన్నాడు.

కll. ధనముఖ్యము కేవలమే
పనికిన్ రాదాస్థ గలిగి పలువురు ప్రభువుల్
పనిచేయక తద్వశ్యం
బునకు నలోభాన్నశంస్యముల్ ఋతము జెలుల్

ఏ పనికైనా ధనం ముఖ్యం. మనదగ్గర చాలా ధనం ఉందని, ధన సంపాదన మానుకుని, ఉన్నదంతా ధారాళంగా ఖర్చుచేస్తే చివరికి సేవకుల కాళ్ళు పట్టు కోవలసి వస్తుంది.ఈ విషయం భవిష్యత్తు తరాల వారి కోసం ఆనాడే ఊహించారు ఇది కోవలం సామాన్య మానవులకే కాక రాజులకు కూడా ఒక చెంపపెట్టు

కోశాగారంలో ఎంత బంగారం వున్నా లెక్కించి జాగ్రత్త చూసేవారు లేకపోగ సింహాసనాలే శత్రువుల హస్తగతం అవుతాయి. కుటుంబసభ్యులు ఎక్కువ మంది ఉన్న వాడికి దేవాలయాల పెత్తనం ఇవ్వకూడదు. అలా ఇస్తే తన కర్చులకు దేవుని సొమ్ముని వాడుకుంటాడు. మళ్ళీ రాజే ఆ మొత్తాన్ని పూడ్చవలసి వస్తుంది. అందుకే ఒంటరి వాడికి ఆలయాల అధికారం ఇవ్వమంటున్నాడు. ఒకవేళ డబ్బుతిన్నా వాడొక్కడైనా పుష్టిగా ఉంటాడు.ఇందుతో ఎంత దార్శనికత దాగుందో చూడండి మంది ఎక్కువ కలవాడు సంపదని దోచుకున్నా అది వాడికి ఆ కుటుంబా నికి చాలక అటు ఇటు కాకుండా పోతుంది అదే ఒక్కడు కనుక దొంగిలిస్తే దాని వలన వాడైనా బాగుపడతాడు అని ఎంతో ఉదారతను చాటుకున్నా వ్యక్తిగా కనిపిస్తు న్నాడు.

రైతు ముందుగా తన పొలాన్ని దున్ని, ముల్లూ పుట్టా లేకుండా జేసి, కంప ఏరిపార వేసినట్లు రాజులు తమ బలగాలలో గాని, సామంతుల బలగంలో గాని, శత్రువు లను ఏరివేసి నిశ్చింతగా పాలన చేయాలి. ఎదుటివారు మాట్లాడేటప్పుడు వెంటనే ఖండించకుండా అతని మాటలలో నిబద్ధత లోకుంటే అప్పుడు వాడిని దూరం చేయాలి.మంచి గుర్రాన్ని గాని, మంచి కుక్కని గాని, ఆప్తమిత్రుని వంటి భటునికే ఇవ్వాలి. ఆప్త భటులైతే సకాలంలో ఆదుకుంటారు.

రైతు పొలం మొదలు ఇంటి పశువుల వరకు ఇలా అన్నిటి పాలన రక్షణను తెలియజోసి రాయల వారి పరిశీలనా శక్తిని గమనింపజేస్తున్నాడు.

తేll. కార్య మొక్కడు కనిన మాత్సర్యమున నొ
కండు గాదని ఖండించు గన్నెఱింగి
యిరువురును గాదనక కొల్వు విరిసి మీద
నల్ల వాడెన్ననది సేయనగు శుభంబు

ఒకడు విజయం సాధించినప్పుడు మరొకడు అసూయతో ఆ నిజయంలో లోపాలను చూపుతూ ఖండి స్తాడు. ఆ విషయం గ్రహించి ఇద్దరికీ నచ్చజెప్పి పంపించి ఆ తరువాత గెలిచినవాడిని సన్మానించాలి.ఇలా చేయడం వలన ఇద్దరి మధ్య ఎటివంటి పొరపత్యాలు లేకుండా మైత్రిగావుండి రాజును గౌరవిస్తారు గదా !

సామాన్యులు శూరులమని డంబాలు పలికినా చిరునవ్వు నవ్వి ఊరుకో, ఇతర వీరులు డంబాలు పలికి తేనే నీ శూరత్వం చూపించు.రేవులో, ఏనుగులు, రత్నాలు, ముత్యాలు దిగుమతి అయితే వాణిజ్యం పెరుగుతుంది. అన్యదేశీయులకు సత్రాలలో మర్యాదలు చేయాలి. దూరపు దీవుల నుంచీ వ్యాపారానికి వస్తే వారికి ఇళ్ళు, ఊర్లు, రాజోద్యాగాలు ఇస్తే వాళ్ళు ఇక్కడే నివసిస్తారు. మన దేశ సంపద పెరుగుతుంది. శత్రువు ప్రార్థిస్తే అడిగిన

దాంట్లో సగం భూమినిచ్చి, మైత్రిని సాధించు, పాము పగవంటి శత్రుభయాన్ని దూరం చేసుకోవటం మంచిది.

పై విధంగా అణకువను,కుదరక పోతే ప్రతాపాన్ని ఎలో చూపాలి ఆర్థికంగా రాజ్యం ఎదుగుదలకు విదేశాలతో స్నేహ బంధాన్ని ఇచ్చిపుచ్చుకునే విధానాన్ని చెప్పడం వలన ఎకానమి గురించి అప్పటికే ఎంతటి అవగాహన కలిగి ఉన్నారనేది తెలుస్తుంది.అలాగే స్నేహాన్ని ఎలా పండాలి, పగను ఎలా తుంచాలో వివరించారు.

అడవులు దేశాభివృద్ధికి చాలా అవసరం, దట్టంగా పెంచాలి. కాపలా కాయాలి. చెట్లను నరికే వారికి ఖండ ఖండాలుగా నరికే శిక్ష విధించు అనడంతో - ఆ నాడే రాయల వారు పర్యావరణం గురించి ఆలోచించిన తీరు నేటి గ్లోబలైజేషన్ విధానాన్ని గుర్తు చేస్తుంది.

రాజు విచిత్ర వ్యక్తిత్వం కలిగి ఉండాలి. ఒకర్ని చంపినా ధార్మికుడని భార్యవున్నా బ్రహ్మచారేనని, బొంకిన సత్యసంధుడేనని, భోంచేసినా ఉపాసం ఉన్నానని, ఓడినా శూరుడని, పేదవాడైనా ధనికుడనని కీర్తించేలా నడుచుకోవాలి.శత్రువుల్ని జయించడానికి రాజు స్వయంగా వెళ్ళకుండా తన వీరుల్లో 100 మంది, నాయకుడిగా నియమించి శత్రువుపైకి పంపాలి. శత్రువు ఓడవచ్చు లేదా వాడిసైన్యం బలం, రథాలు, ఏనుగులు మరణించే వాడే తగ్గి సాయంకోరి రావచ్చు, ఇలా రాయల వారు ఎన్నో విషయాలను ఈ కావ్యంలో వివరించారు.

ముగింపు :

శ్రీకృష్ణదేవరాయలు రాజే అయినప్పటికి సాహిత్యం పట్ల ఆయనకున్న మక్కువ రచనల పై ఆకున్న పట్టు, కవుల పట్ల ఆదరణ ఒకచేత కత్తి మరొక చేత కలం పట్టి తెలుగు సాహిత్య జగత్తుతో తనకంటూ ఒకస్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఆయన కలం నుంచి పుష్పించిన కావ్య కుసుమాలను కావ్య సరస్వతి మెడనలంకరించి వాడిపోని వీడి పోని అజరామర కీర్తినార్జించిన గొప్ప రాజకవి రాయలవారనడంలో సందేహించనవసరం లేదు.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద సంగీతం – ప్రాముఖ్యత

– గాదె చంద్రశేఖర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

సాంప్రదాయికంగా జనసముదాయంలో ప్రచారమైన సంగీతం జానపద సంగీతం. అరవైనాలుగు కళల్లో సంగీతం ఉత్తమమైనది. ప్రామాణిక పద్ధతి అంటూ జానపద సంగీతానికి నిర్దిష్టమైనదేదీ లేదు. వివిధ తాళాలతో పాడడం జానపద సంగీతంలో ప్రధానంగా కన్పిస్తుంది.

"శిశుర్వేత్తి, పశుర్వేతి, వేత్తిగానరసంఫణీ" అని గానాన్ని కొనియాడారు. విషజంతువైన నాగుపాము మొదలు సమస్త జీవరాసులూ గానం చేత ఆనందింపగలుగుతున్నాయంటే సంగీతానికి ఉండే మాధుర్యం చెప్పనలవి కావు.

సంగీతంలో వాద్య సంగీతం, గాత్ర సంగీతం, సాహిత్యం అన్నవి మూడు ప్రధాన భాగాలు, వాద్య సంగీతం ప్రత్యేకంగా ఉండవచ్చు లేక గాత్ర సంగీతానికి సహకారిగా ఉండవచ్చు కాని జానపద గేయాలతో గాని, కథా గేయాలలో గాని అనుబంధంగా పాడే సంగీతానికి ఎక్కువ వాద్యాలు అవసరం లేదు. ఒకటో రెండో ఉంటే చాలు. వాద్య సంగీతం అరవైనాలుగు కళల్లో ఒకటి. వీణావేణు మృదంగాలు వాద్యత్రయమని వేదకాలంలోనే వాడుక. భారత దేశంలో అయిదు వందలకంటే ఎక్కువ వాద్యాలున్నాయి. వీటిలో కొన్ని తంత్రీ వాద్యాలు, కొన్ని లోహవాద్యాలు, కొన్ని చర్మవాద్యాలు మరికొన్ని ఊదే వాద్యాలు. సంగీత వాద్యాలలో మేళవాద్యాలు, దేవాలయ వాద్యాలు, రణ వాద్యాలు, జానపద వాద్యాలు అని విభజించారు.

జానపద సంగీతం - స్వరూప స్వభావాలు :

జానపద సంగీతంలో కూడా కొన్ని శాస్త్రీయరాగాలు, తాళాలు ఉండవచ్చు. లాలి పాటల్లో ఆనందభైరవి, నీలాంబరి మొదలైన రాగాలు వినిపిస్తుంటాయి. జానపద సంగీతం హృద్గతమైనది. ప్రకృతి దత్తంగా వచ్చిన శ్రుతిజ్ఞానమే జానపద సంగీతానికి జీవమని చెప్పవచ్చు. జానపద సంగీతాన్ని శ్రుతి తప్పకుండా లేక చాలా వరకు అదే శ్రుతిలో కోన సాగించడానికి కావలసిన శక్తి జానపదునికి ప్రకృత్తి దత్తమైనది. శబ్దానికి నాదానికి ఉండే భేదం జానపదులకి తెలుసు.

తెలుగు జానపద సంగీతానికి వందల ఏళ్ళుగా ప్రాణ భిక్ష పెట్టినవారు భిక్షుకగాయకులు, పాల్కురికి సోమన, నన్నెచోడుడు మొదలయినవారు. ఆనాటి గాయకుల్ని గురించి, వివిధ గీతాలను గురించి చెప్పడం అంతకు కొన్ని వందల ఏళ్ళనుంచే సంగీతపరంపర వర్ధిల్లుతూ ఉందని తెలుస్తుంది.

జానపద భిక్షుక గాయకులైన పిచ్చుకుంట్లు, శారదకాండ్రు, వీర ముష్టులు, జంగాలు, భాగవతులు, గంగిరెద్దులవారు, దాసర్లు, బుడబుడకల వారు. కొమ్ములవారు, జక్కులవారు, బొమ్మలాటకాండ్రు, జానపద సంగీతాన్ని గాత్ర సంగీత రూపంగా రెండు రకాలుగా కాపాడుకుంటూ వస్తున్నారు. వీరిలో చాలావరకు దేశదిమ్మరులే. పిచ్చుకుంట్లలోని ఏడు ఉపజాతుల్లో గంటవారు, తిత్తివారు వాద్యాల వల్లనే ఏర్పడ్డారు. శారదకాండ్రు వాడే వాద్యాలలో శారద ఉంది. ఆడ వాళ్ళు డిమ్మికి వాడుతారు.

బీరన్నల వారికి ఒగ్గువారని కూడా పేరు. ఇదీ వాద్యం వల్ల ఏర్పడిందే. శైవులైన వీరముష్టి వారు జేగంటను లేక తాపెటను వాడుతారు. బవనీలు కూడా కొన్ని వందల సంవత్సరాల నుంచి ప్రసిద్ధులు. క్రీడాభిరామంలో ఏకవీర ఎదుట నిల్చి పరశురాముని కథలు పాడిన బవనీలు ప్రసక్తి ఉంది. వీళ్ళువాడేది జమిడిక లేక బవనిక అంటారు. శ్రుతికోసం వంతపాటగాడు చిన్న జమిడికను వాయిస్తాడు.

దాసర్లు తెలుగుదేశంలో కన్నడ దేశంలో కూడా ప్రసిద్ధులు బుక్కదాసరి, భాగవత దాసరి, దండె దాసరి,

మాలదాసరి, నక్కాదాసరి మొదలైన వాళ్ళున్నారు స్త్రీవేషం వేసి గజ్జెలు కట్ట తాళమృదంగ ధ్వనులతో నాట్యం కూడా చేస్తారు. కిన్నెరసు వాయిస్తారు. గొల్లసుద్దులు కొమ్ములు, వీరణాలు ఉపయోగిస్తారు. పెద్దడోలు వంటి వీరణంతో పాటు శంఖాన్ని కూడా వీళ్ళు ఉపయోగిస్తారు.

జంగాలు బుడిగె, గుమ్మటం మొదలైన వాద్యాలను సంగీతానికి వాడుకుంటారు. బుడిగెను ఇత్తడితో గాని, కంచుతో గాని చేస్తారు. ఈ విధంగా తెలుగుదేశంలో జానపద గాయకులు తమ గాత్రంతో, వాద్యాలతో జన సముదాయానికి వీనుల విందుగా, కమ్మగా గుండెల దిరేలా, చిందులు తొక్కించేలా ఇంకా కొంత సంగీతాన్ని తరతరాలుగా పోషించుకుంటూ వచ్చారు.

డా॥ బి. రామరాజు గారు "ఫోక్‌లోర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అనే ఆంగ్ల గ్రంథంలో ఇంట్లో సంగీతం, బయటి సంగీతం అని రెండు ముఖ్య విభాగాల కింది సంగీతాన్ని విభించారు.

"శిశుర్వేత్తి పశుర్వేత్తి గానరసం ఫనిః" అని సాంప్రదాయికంగా చెప్తున్న మాట శిశువులను, పశువులను ఎక్కువగా అలరించేది జానపద సంగీతమే. మానవుని మూలభూతి ప్రకృతులకు దగ్గరగా, హృదయాన్ని ఆర్ద్ర మొనరించే గుణంతో వెలవడేది జానపద సంగీతం. జానపద సంగీతంలో ఒక విధమైన సమ్మోహనశక్తి ఇమిడి ఉంది. జాతర్లలోగాని,, ఉత్సవాలలో గాని పాల్గొనేవారు కొన్ని "అద్భుతాలను" ప్రదర్శించడానికి, దేవుడు ఒంటి మీదికి రావడానికి కారణం స్వయం సమ్మోహనం. ఈ విధమైన స్థితికి జానపదులను తీసుకువెళ్ళడానికి జానపద సంగీతం చాలా ఉపకరిస్తుంది.

జానపద గేయాన్ని పాడే సమయం, పాడేవారు, వాద్యాలు, పల్లవి, భౌగోళిక వ్యాప్తి, సామాజికంగా ఉండే విలువ, సాహిత్యపరమైన సౌందర్యం, శైలి, చందస్సు, సంగీతం, మనోవైజ్ఞానికంగా ఉండే విలువ - ఇవన్నీ గమనిస్తే సంపూర్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

జానపద వాద్యాలను గురించి చెప్పాలంటే తంబుర మీటితే ఎలా ఉంటుంది. ఒగ్గువాయిస్తే ఏ శబ్దం వస్తుంది. ఇలాంటివన్నీ ధ్వని ముద్రణ ద్వారా తెలుసుకోవచ్చు. జానపద సంగీతాన్ని రచనల ద్వారా, ధ్వని ముద్రణ ద్వారా, బొమ్మల ద్వారా, చలనచిత్రం ద్వారా చూపిస్తేనే దాని స్వరూపం పూర్తిగా బోధపడుతుంది.

డా॥ బి.రామరాజుగారు జానపద గేయాల్లోని సంగీతాన్ని, డా॥ తంగిరాల వెంకటసుబ్బారావు గారు ప్రస్తావించారు. శ్రీహరి ఆదిశేషువు గారు తమ జానపదగేయ వాఙ్మయ పరిచయంలో జానపద గేయాల్లోని సంగీతాన్ని కొంత ప్రస్తావించారు.

శ్రీమతి విజయమూరి సీతాదేవి గారు జానపద గేయ సంగీత విశేషాల్ని గూర్చి పరిశోధించారు. జానపద సంగీతం అధ్యయనం చెయ్యడానికి అన్ని రకాల పద్ధతులనూ అనుసరించాలి. అపారమైన జానపద సంగీత సంపదను సద్వినియోగం చేసుకోవాలి. తెలంగాణలో జానపద సంగీతానికి అధిక ప్రాముఖ్యత ఉంది. జానపద సంగీతంపై శాస్త్రీయమైన పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వేణుసంకోజు సాహిత్యం – పరిశీలన

– డా॥. జి. భాస్కర్ యాదవ్, తెలుగు శాఖ అధ్యక్షులు, ఆంధ్ర విద్యాలయ కళాశాల, హైదరాబాద్.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేకులు అనేక విధాలుగా పోరాటాలు చేసారు. కొందరు తమ రచనలతో ప్రజలను ప్రభావితం చేసారు. ఇంకొందరు తమ వాగ్దాటితో ప్రజలలో చైతన్యాన్ని రగిలించారు. అనేకులు ప్రత్యక్ష ఉద్యమంలో పాల్గొని పోరాడారు. మరికొందరు ఈ మూడింటిని సాధనాలుగా చేసుకొని తమ కలం ద్వారా, గళం ద్వారా ముందుండి ప్రజలను నడిపించడం ద్వారా తెలంగాణా సాధనకు అహర్నిశలు పోరాటం చేసారు. అదిగో ఆ చివరి కోవలోని వారే నల్లగొండ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, వక్త, శ్రీవేణు సంకోజుగారు. వేణుసంకోజు అనగానే నరనరాన తెలంగాణావాదాన్ని పుణికి పుచ్చుకున్న మేధావిగా, సాహితీవేత్తగా, ఉద్యమకారునిగా తెలంగాణా ప్రజలకు సుపరిచితం. వారి గురించి కొన్ని అంశాలు ఇప్పుడు ప్రస్థావిస్తాను.

సాహిత్యపరంగా, సాంస్కృతిపరంగా నల్లగొండ జిల్లాలో అత్యంత చైతన్యవంతమైన ప్రాంతం చండూరు అంబటి పూడి వేంకటరత్నం. ధవళా శ్రీనివాసరావు. మద్దోజు సత్యనారాయణాచారి వంటి సాహితీ దిగ్గజాలకు నెలవైన నేల అది. దాశరథి కృష్ణమాచార్యుల "అగ్నిధార" ను ఆవిష్కరించుకుని పునీతమైన పుణ్యభూమి అది. ఆ చండూరు గ్రామంలో 1-1-1951 రోజున శ్రీ సంకోజు వీరబ్రహ్మం - శాంభవి దంపతులకు ప్రథమ సంతానంగా శ్రీవేణు సంకోజు గారు జన్మించారు. శ్రీ వీరబ్రహ్మం గారు వృత్తి రీత్యా రాగి, ఇత్తడి, కంచు లోహాలతో చక్కని నగషీలు చెక్కేవారు. వృత్తిలో చక్కని నైపుణ్యం కలవారు. ప్రజల జీవన ప్రమాణస్థాయి దృష్ట్యా వీరికి చేతినిండా పని దొరికే స్థితి నాటి తెలంగాణ పల్లెల్లో లేదు. విధిలేని పరిస్థితుల్లో కుటుంబ పోషణకై పల్లె నొదిలి పట్నం దారి పట్టారు. సికిందరాబాద్ కంచరబస్తీకి చేరుకొని అక్కడే కులవృత్తిని సాగిస్తూ స్థిరపడ్డారు.

వేణు సంకోజు గారి బాల్యమంతా సికాందరాబాద్‌లోనే గడచింది. కళాసీగూడ గవర్నమెంట్ హైస్కూల్‌లో ఎన్.ఎన్.సి. విద్యనభ్యసించారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు చిన్నతనం నుండే మిక్కిలి. చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. ప్రాథమిక విద్య తెలుగులోనే చదివాడు. ఆరవ తరగతి తర్వాత ఆంగ్ల మాధ్యమంలో చేరడానికి ఉపాధ్యాయులను కోరగా వారు వారించారు. ఫెయిల్ అవుతావని భయపెట్టారు. పట్టుదలతో చదివి ఫస్టు ర్యాంకు తెచ్చుకున్నారు. ఇది వారి దీక్షాదక్షతకు నిదర్శనం. నేటికీ ఈ గుణం వేణుగారి కనిపిస్తుంది. తాను ఏదైనా కార్యం తలపెడితే విజయవంతం అయ్యేవరకు విశ్రమించకుండా నిరంతరం శ్రమిస్తూనే ఉంటాడు. వారి ఇల్లే ఓ సాహితీ కార్యశాలగా గోచరిస్తుంటుంది. శ్రీశ్రీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేని విధంగా నల్లగొండలో నెలనెలా శ్రీశ్రీ పేరిట సభలు నిర్వహించడం. లబ్ధప్రతిష్టులైన వక్తలను పిలిచి ప్రసంగాలు ఇప్పించడం, ఆ ప్రసంగాల సారమంతా "ప్రజల పక్షాన ప్రతిజ్ఞ" పేరిట గ్రంథరూపంగా ప్రకటించడం ఇదంతా నల్లగొండలో ఒక ఏడాది పాటు ఒక యజ్ఞంలా సాగింది. దీని వెనుక వేణుసంకోజు గారి కృషి చూసిన వారు తప్ప ఇతరులు ఊహించలేదు. ఇది వారి కార్యదక్షత.

దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వీరి జీవితంలో 1969లో తండ్రి మరణం ఒక శరాఘాతమైనది. అప్పటికే విద్యార్థి ఉద్యమ నాయకుడుగా. తెలంగాణ వాదిగా ఉద్యమాల్లో చురుగ్గా ఉన్న వీరు కుటుంబ భారము తలకెత్తుకోవలసి వచ్చింది. తమ్ముళ్ళను,

చెల్మెలను పోషించడానికి అనేక పనులు చేసారు. ఒక వైపు ఉన్నత చదువులు చదువుతూనే ఆయిల్‌మిల్ గుమస్తాగా, బుక్‌బైండర్‌గా పనిచేసారు. తరువాత ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆఫీస్‌లో యుడిసిగా, హెడ్‌క్లర్క్‌గా హైదరాబాద్, గుంటూర్‌లలో పనిచేసారు. 1982 లో పౌరశాస్త్రం జూనియర్ లెక్చరర్‌గా అధ్యాపక వృత్తిలోనికి ప్రవేశించారు. నల్లగొండ, మహబూబ్‌నగర్ నర్సాపూర్‌లో అధ్యాపకులుగా విద్యార్థుల ఆదరాభిమానాలను చూరగొన్నారు. అనంతరం డిప్యూటేషన్ పై ఇంటర్మీడియట్ బోర్డులో ఆడియో విజువల్‌గా సేవలందించారు. తరువాత సంగారెడ్డిలో అధ్యాపకులుగా ఉన్నపుడే పదోన్నతిపై 1999 లో రాజనీతి శాస్త్ర అధ్యాపకులుగా రామన్నపేట డిగ్రీ కళాశాలకు వచ్చారు. తరువాత నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాలలో పనిచేసి పదవీ విరమణ పొందారు. శ్రీ వేణుసంకోజు గారు ఎక్కడ పనిచేసినా అక్కడ విద్యార్థుల మనఃఫలకాలపై చెరగని ముద్ర వేసారని చెప్పవచ్చు. దీనికి నిదర్శనం నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాలలో వీరి సంపాదకత్వంగా వచ్చిన "చలనం" సంకలనం. పల్లెటూర్ల నుండి సాధారణమైన ప్రభుత్వ పాఠశాలల్లో చదివి వచ్చిన విద్యార్థినులను పఠనం వైపు మళ్ళించి వారి చేతనే సమీక్షలు రాయించి ఆ సమీక్షలను, విద్యార్థుల సృజనాత్మక రచనలను గ్రంథంగా ప్రకటించడం ఓ ప్రయోగం. అపూర్వం కూడా "చలనం" లోని ప్రతి సమీక్ష ఓ కొత్త కోణాన్ని ఆవిష్కరించడం, చేయి తిరిగిన సమీక్షకులు రాసిన స్థాయిలో ఉండడం, ఆ ఘనత విద్యార్థులను ఆ విధంగా సానపెట్టిన వేణుసంకోజు గారికే దక్కుతుంది. ఇలా విద్యార్థుల చేత కవిత్వం రాయించడం, విమర్శనాత్మకంగా ఆలోచించేలా ప్రోత్సహించడం, వేణుగారికి విద్యార్థి లోకంలో ఓ అపూర్వ గౌరవాన్ని సంపాదించి పెట్టింది.

శ్రీ వేణు సంకోజు గారు వృత్తిరీత్యా రాజనీతిశాస్త్ర అధ్యాపకులు, ప్రవృత్తి రీత్యా సాహితీ సృజన. ఈ రెండింటిని మేళవించి సమన్వయం చేస్తూ వీరు ఎం.ఫిల్. కోసం చేసిన పరిశోధన "తెలుగు నవలల్లో చిత్రితమైన రాజ్యము రాజ్యంగ యంత్రాంగము" (State and administration in India perceptions in the Telugu novel) రాజనీతి శాస్త్ర పండితులను సైతం అబ్బురపరచింది.

కవిగా, రచయితగా శ్రీ వేణుసంకోజు గారు సాహితీ క్షేత్రంలో బంగారాన్నే పండించారు. అనవసరమైన ఉపమానాలు, ఆడంబరాలు వీరి కవిత్వంలో కనిపించవు. శిల్పసౌందర్యం ఉట్టిపడేటట్లు ముక్కుసూటిగా నిజాన్ని నిర్భయంగా ప్రకటించడం వీరి కవిత్వంలో గమనించవచ్చు.

తెలంగాణా! తెలంగాణా!
తీగలెత్తిన రుద్రవీణా!
వ్రణంపై వ్రణమై లోలోపలే
విరుగుతున్న దానా కరుగుతున్నదానా!
గుడిసెలు రాళ్ళు బాడిసెలూ దాళ్ళు
చెట్లు కూడా ఎన్‌కౌంటరైన తాన
చావుమీటిన ఆకలికోనా!
తెలంగాణా! తెలంగాణా!

అంటూ ఆక్రోశంతో ఆవేశంతో నాటి తెలంగాణా విధ్వంసపు స్థితిని ప్రకటిస్తాడు. పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే 1964 లో జవహర్‌లాల్ నెహ్రూ మరణించినపుడు నెహ్రూ మీద ఎలిజీ (స్మృతి గీతం) రాసారు. ఇది వారి తొలి రచన. వేణు గారి తొలికవితా సంపుటి మనిషిగా పూచే మట్టి 1975 లో వెలువడింది. తరువాత మనం 2001 లో పదవీ విరమణ సందర్భంగా 2008లో "నేలకల", "ప్రాణ ప్రదమైన" కవితా సంపుటాల వెలువరించారు. వీరి కథాసంకలనం "స్పర్శ".

సహజమయిన అభివ్యక్తి, నిజాయితీతో కూడిన శక్తి, వేణు సంకోజు కవితకు జీవలక్షణాలని చెప్పవచ్చు. ఎక్కడా వ్యాకరణ చట్రంలో బందీ కాకుండా అత్యంత సహజంగా సమకాలీన అంశాలను కవిత్వీకరిస్తారు.

ఎకరాల నుండి గజాలకు దిగజారి
గజాల నుండి అంగుళాలుగా హరించుకుపోయిన

అదో వింతరకపు ఆట స్థలమివాళ బాల్యం.
ఎదక్క ముందే ఎండుకుపోతున్న
లేలేత వృక్షం బాల్యం.

సమకాలీన పరిస్థితులను దర్పణమీ కవిత. ర్యాంకుల మార్కులు గోలలో చిన్నారుల బంగారు బాల్యాన్ని హరిస్తున్న సమాజానికి కవి చేస్తున్న హెచ్చరిక ఇది. "సెలవు కావాలి" అనే కవితలో "అమ్మ ఒడి కావాలి - ఆత్మీయ స్పర్శ కావాలి" రవంత ఆటవిడుపు కావాలి అంటూ బాలల హక్కుల గీతాన్ని ఆలపిస్తారు.

చంద్రణ్ణి మునివేళ్ళపై నుతారంగా ఆడించేదే పనితనం.
దరిలేని సంతోషాల సముద్రమే పసితనం.
మళ్ళీ నేను పసివాడినౌతాను.

అంటూ బాల్యం స్మృతులను నెమరు వేసుకుంటారు.

శ్రీ వేణు సంకోజు గారి అక్షర విన్యాసాన్ని, శిల్పశ్రద్ధను పట్టించే ఓ కవితను ఉటంకిస్తాను. ఉదయం లేవగానే దినపత్రికను చూసినపుడు కలిగే అనుభూతిని వారు ఇలా అక్షరీకరిస్తారు.

తెల్లారిలేవగానే అన్నీ అసంగతాలే
ఒక కట్టగా తలుపుతడుతాయి
యదార్థాలకు వార్తలుగా భూతద్దం పెట్టి
వెదుక్కోవలసిందే
గుండాలు హంతకుల ముఖాలే
బాక్సు కట్టిన జాగాలో
సకిలింపుగా చూస్తుంటాయి
దేహమంతా రంగులు పులుముకున్న పత్రికలు

అచ్చయిన పదినిముషాలకే విషాదారాగాలాపను దిగుతాయి.

ప్రపంచంలో పెరిగిపోతున్న హింసోన్మాదాన్ని ప్రతి ఫలిస్తున్న పత్రికల పట్ల కని హృదయం స్పందించిన తీరిది ఇలా చెపుతూ పోతే వేణుసంకోజు గారి ప్రతి కవితా ఉట్టంకానర్హమే. ప్రతి అంశాన్ని తన అంతర్నేత్రంతో దర్శించి, అన్వేషించి నికార్సయిన, స్వచ్ఛమయిన, స్వేచ్ఛాయుతమయిన, వాస్తవికమైన అంశాలను కవిత్వంగా మలచడంలో శ్రీ వేణు సంకోజు గారిది అందెవేసిన చేయి.

ఏ సాహిత్య ప్రక్రియను కొనసాగించాలన్నా, ఒక రచనను ఆకలింపు చేసుకోవాలన్నా సమకాలీన సామాజిక పరిస్థితులపై అవగాహన, విషయ పరిజ్ఞానం అవసరం. ఇవి ఉన్నపుడే ఆ రచన వాస్తవానికి దగ్గరగా ఉంటుంది. పది కాలాల పాటు నిలబడగలుగుతుంది. మానవ జీవన సంబంధాలు, సంఘర్షణలు జీవితంలో ఎదురయ్యే సంఘటనలు, అనుభవాలు వీటన్నిటి కలబోత "స్పర్శ" కథా సంకలనం. చదువులో ఓడిపోయిన ఓ యువకుడు ఆదర్శరైతుగా విజయం సాధించడం "మొరం" కథలో వస్తువు. ఈ కథ వేణు సంకోజు గారికి అన్నదాతల పట్ల నెనరు, గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది. స్పర్శ కథలో స్త్రీ స్వేచ్ఛను, అమాయకంగా పరాయి పురుషుని నమ్మివెళ్ళిన స్త్రీ అతడు విడిచి పెడితే అనుభవించిన దుర్భరస్థితిని కళ్ళకు కట్టి చూపించారు. మధ్యతరగతి జీవితాలను రూపుకట్టే మరోకథ "ఫంక్షన్". సగటు స్త్రీ తాహతుకు మించిన కోరికలతోపడిన ఇబ్బందులను స్పృశించారు. చివరకు వాస్తవాలను గ్రహించి సర్దుబాటు చేసుకున్న అపర్ణ శ్రీధర్ దంపతుల పాత్ర ద్వారా సంసార జీవితంలో సర్దుబాటు అవసరాన్ని తెలియబరిచారు. చదువుకున్న ఇల్లాలు తన సమస్యలను తానే పరిష్కరించుకునే ఇతివృత్తంతో సాగిన కథ "కేసు". సమాజం మనకేమిచ్చిందని కాదు. సమాజానికి మనం ఏమిచ్చాము అనే ఆలోచనను పాఠకులలో కలుగజేసే కథ గౌరవం 100 నాలు ఉన్నత వ్యక్తిత్వం, విశాల హృదయం, నిస్వార్థం ప్రతి ఒక్కరు అవరచుకోవాలనే సందేశాన్ని రచయిత ఈ కథ ద్వారా అందించారు. దుర్వ్యసనాలు వలన జీవితాలు చిన్నాభిన్నమవుతాయనే అంశాలను స్పృశించిన కథ "పలాయనం" చేయని తప్పుకు ప్రతిఫలంగా వచ్చిన 'ఎయిడ్స్' తో సామాజికంగా వచ్చే ఇబ్బందులను పట్టి చూసిన కథ స్టాంపు.

ఇలా కవిగా, రచయితగా శ్రీవేణుసంకోజు గారు పోషిస్తున్న పాత్ర ఎనలేనది. శ్రీ వేణు సంకోజు గారి సాహిత్యం ఒక ఎత్తయితే తెలంగాణ, ఉద్యమకారుడిగా, పత్రికా రచయితగా, సాహితీ కార్యక్రమాల నిర్వహణ కర్తగా వారి సేవలు మరొక ఎత్తు నేడు నల్లగొండలో ఓ సాహితీ వాతావరణం ఉంది అంటే దాని వెనుక వేణు సంకోజు గారున్నట్లే. తెలంగాణ ఉద్యమ సమయంలో నల్లగొండలో తెలంగాణా చౌరస్తా (క్లాక్‌టవర్ సెంటర్) తన కేరాఫ్ అడ్రస్ అయ్యింది. ఐక్యకార్యచరణ కమిటి అధికార ప్రతినిధిగా ఉద్యమగొంతుక ఐనారు. "వీర తెలంగాణ" పత్రికను అనేక కష్టనష్టాలకోర్చి పద్దెనిమిది నెలల పాటు నడిపారు. ఆ పద్దెనిమిది సంచికలు మలి తెలంగాణ ఉద్యమ చరిత్రను పూర్తిగా రికార్డు చేసినాయనడంలో అతిశయోక్తి లేదు. డా॥ అమ్మంగి వేణుగోపాలు, డా॥ కేశవరెడ్డి, డా॥ పి. లక్ష్మీనారాయణ, దొంకెన శ్రీశైలం, డా॥ నోముల సత్యనారాయణ మొదలగు వారితో కలిసి ఏర్పాటు చేసిన "జయమిత్ర" సాహిత్య సాంస్కృతిక సంస్థకు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

జయమిత్ర నేటివరకు దాదాపు 500 పుస్తకాలను ప్రటకించింది. వందలాది సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక అయింది. అవుతుంది కాళోజీ శతజయంతి సందర్భంగా నల్లగొండలోని మారుమూల గ్రామాల్లో కూడా సభలు నిర్వహించారు. కాళోజీ తత్వాన్ని విద్యార్థులకు అందిం చడంలో శ్రీవేణు సంకోజు గారు కృతకృత్యులయ్యారు. అంత మాత్రాన ఆయన ఇతర ప్రాంతీయులకి వ్యతిరేకి కాదు. చార్లీచాప్లిన్, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, అద్దేవల్లి రామ్మోహనరావు వంటి వారి జయంతులు, వర్ధంతులు, సంస్మరణలు నిర్వహించడం వారి హృదయ వైశాల్యానికి నిదర్శనం.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ రాష్ట్రంలో తెలుగు భవితవ్యం

– డా॥. చవ్వా వెంకటరెడ్డి , తెలుగు ఉపన్యాసకులు, హైదరాబాదు.

"మీరందరూ ప్రాథమిక స్థాయి విద్యా బోధనాభ్యసనల్లో తెలుగు భాషకే ప్రాధాన్యత ఇవ్వండి" అని ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్బోధించేందుకు అవకాశాలు కనిపించవు. ఎందుకంటే ఇది అన్నిరంగాల్లో ప్రపంచీకరణ ఆవరించుకున్న సమయం. ఈ సందర్భంలో అవకాశాలు అందిపుచ్చుకోవడమే ముఖ్యమని నవతరం భావిస్తోంది.

ప్రపంచంలో అత్యధిక యువ జనాభా సంఖ్య ఉన్న దేశాలలో మన దేశం ఒకటి. ప్రపంచమంతటా సాంకేతిక విద్యాపవనాలు బలంగా వీస్తున్నాయి. ఈ రంగంలో రాణించేందుకు ప్రాంతీయభాషా పరిజ్ఞానం సరిపోదని నిపుణులు ఒక అభిప్రాయాన్ని బలోపేతం చేశారు. ఇందులోనూ వాస్తవం ఉంది. అయితే భాష అనేది ఒక సాంస్కృతిక స్వరూపం. దాన్ని కేవలం ఉపాధి-ఉద్యోగ అవకాశాల మేరకే పరిమితం చేయడం ఏమాత్రం సహేతుకం కాదు. అంటే ఇప్పుడు తెలుగువారితోపాటు దేశంలోని అన్ని ప్రాంతీయభాషలూ సంక్లిష్టమైన సవాల్‌ను ఎదుర్కొంటున్నాయన్నమాట. అవి ఒకవైపు నవతరం ఆకాంక్షలకు ఎంతో కొంత ప్రాధాన్యతను కల్పించాలి. సాంస్కృతిక అస్తిత్వంగా తమ విశిష్టతను కాపాడుకోవాలి.

దేశంలోని ప్రాంతీయ భాషల్లో మూడు నాలుగు మాత్రమే తమ అస్తిత్వాన్ని ప్రబలంగా నిలబెట్టుకుంటున్నాయి. వాటిలో తమిళానికి అగ్రస్థానం. తమిళులు వారి భాషను ప్రాణం కంటే మిన్నగా పరిగణిస్తారు. అది వేల సంవత్సరాలుగా ఏర్పడిన ఒక సంప్రదాయం. తమిళులతో భాషా విషయంలో హిందీవారు పోటీ పడతారు. హిందీ భాషాభిమానులు తమ భాషా సాహిత్య ప్రచారాల కోసం ఎప్పటివలెనే ప్రయత్నిస్తున్నారు. ఆధునికయుగ ఆరంభంలో సుసంపన్నమైన సాహిత్యాన్ని సృష్టించిన బెంగాలీల భాషాభిమానం కూడా తక్కువేమీ కాదు. ఈ వరుసలో చేర్చదగిన నాల్గవ భాష మరాఠీ. ఆ భాష మాట్లాడే మహారాష్ట్రలోని అన్ని ప్రాంతాల్లోనూ బొంబాయి మహానగరంతో సహా మరాఠీ అభిమానం తొణికిసలాడుతూ ఉంటుంది. భాష పట్ల అనాసక్తిని ప్రదర్శించే ప్రాంతాలు వాటికంటే ఎక్కువే ఉన్నాయి. తెలుగు మాట్లాడే రెండు రాష్ట్రాలలో ఇదే పరిస్థితి ఉంది. తెలుగు భాష పట్ల అతి తీవ్రమైన మమకారం ఆధునిక యుగంలో ఈ ప్రాంతాలలో కనిపించనే లేదు. ఇది చరిత్ర చెబుతున్న నిజం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉనికిలో ఉన్న (1956-2013) కాలాన్ని పరిశీలించినపుడు భాషా వినిమయంలో కొన్ని గుణాత్మక తారతమ్యాలు ప్రస్ఫుటమవుతాయి. భాషాప్రయుక్త రాష్ట్ర సూత్రీకరణతో తెలుగువారందరూ ఒకే గొడుగు నీడలో జీవించాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైన సంగతి తెలిసిందే. రాష్ట్రం అవతరించిన తొలి సంవత్సరాలలో భాష తాలూకు ఉద్విగ్నత కొంత కనిపించేది. మహాకవి దాశరథి మహాంధ్రోదయ కావ్య రచనతో పాటు ఆ కాలంలో బాగా ప్రచారాన్ని పొందిన 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' వంటి గీతాల్ని ఇదే దృష్టితో చూడాలి. అయితే రానురాను ఈ ఉద్విగ్నతలు బాగా బలహీనపడ్డాయి. కోస్తాంధ్రలో అప్పటికే బాగా వ్యాప్తిలో ఉన్న ఇంగ్లీషు, తెలంగాణలో ఆరేడు దశాబ్దాలు అధికార భాషగా ఉన్న ఉర్దూతో పాటు తెలుగు కూడా ఒక ప్రాచీన భాష అన్న అభిప్రాయమే బలపడుతూ వచ్చింది. అయితే తెలుగుకు ప్రత్యేక ప్రాధాన్యత తప్పకుండా ఇవ్వవలసిందే అన్న వాదన మాత్రం ప్రధాన స్రవంతిలో విధాన నిర్ణేతల నుండి వినిపించలేదు.

అధికార భాషా సంఘం ఏర్పాటు అన్న ప్రక్రియకే దాదాపు దశాబ్ద కాలం (1966-1974) అవసరమైంది. భాష - దాని ప్రచారాల విషయంలో రాజకీయ ఆసక్తులు చోటు చేసుకున్నాయి. 1975లో ఆనాటి ముఖ్యమంత్రి జలగం

వెంగళరావు నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల లోనూ వాతావరణంలో పెద్దగా మార్పు వచ్చినట్టు కని పించదు. మరొక పదేళ్ళ కాలవ్యవధి తరువాత తెలుగు వారి ఆత్మగౌరవ నినాదంలో ఎన్.టి.రామారావు అధి కారంలోకి వచ్చారు. ఆయన అదివరకు మూడు దశాబ్దాల పాటు మదరాసు మహానగరంలో ఉన్నారు. అందులో అధికభాగం అక్కడ ద్రవిడ పార్టీల ప్రభుత్వాలు అధి కారంలో ఉన్నాయి. ఈ రాజకీయపక్షాలు తమిళ భాషకు ఇస్తున్న ప్రాధాన్యతను రామారావు సన్నిహితంగా గమనించారు. సాంస్కృతిక అస్తిత్వానికి ఒక ప్రాంతపు గత వైభవానికి భాష ఏ రకంగా సంకేతం అవుతుందో ఆయన గుర్తించారు. దీనితోపాటు ఆయనకు తెలుగుభాష పట్ల ఉన్న నిరుపమానమైన ఆదరణ కారణంగా తాను అధికారంలోకి వచ్చిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లోనూ భాషాభిమానాన్ని పెంపొందించే కృషి చేశారు. అన్ని రంగాలలోనూ తెలుగు వినిమయం అనివార్యం కావాలని ఆయన ఆశించారు.

పునాది స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం స్పందన ఆశించిన స్థాయిలో లేకపోవడం, భాషా వ్యవహర్తల్లోనూ ఊహించిన రీతిలో అభిమానం కనిపించకపోవడంతో తెలుగు భాష రామారావు అనుకున్న స్థాయిలో వైభవాన్ని సాధించలేకపోయింది. రామారావు అనంతర కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దాదాపు ఒక దశాబ్దం పాటు చంద్రబాబునాయుడు పరిపాలించారు. ఆయన ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలోనే తెలుగు భాష దురవస్థకు పునాదులు పడ్డాయని చాలామంది అభిప్రాయం. అన్ని రంగాలలోనూ చంద్రబాబు సంప్రదాయిక విద్యా విధానాన్ని పూర్తిగా నిరుత్సాహపరిచారు. చరిత్ర వంటి అతి కీలకమైన సామాజిక శాస్త్రాలతో పని లేదన్నారు. ఆంగ్ల మాధ్యమానికి ఆయన హయాంలో అపరిమితమైన ఆదరణ లభించింది. ఎవరైనా నిశితంగా పరిశీలిస్తే గణాంక వివరాలతో సహా ఈ సత్యం వెలుగు చూస్తుంది.

చంద్రబాబు హయాంలో ప్రతి ఊరిలోనూ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు వెలిశాయి. ఆంగ్ల మాధ్యమంలో చదివినవారికి మాత్రమే అద్భుతమైన అవకాశాలు లభిస్తాయనే ప్రచారం దండిగా జరిగింది. తెలుగు వంటి ప్రాంతీయ భాషలు ఉజ్వల భవితవ్యానికి అసలే మాత్రం పనికిరావనే సామూహిక భావన పల్లెలు, పట్టణాల్లో వ్యాపించింది. ఇందుకు ప్రభుత్వం అందించిన పరోక్ష ప్రోత్సాహం ఎంతో ఉంది. చంద్రబాబు పాలనాకాలంలో విద్య కార్పోరేటీకరణ అన్నది విశ్వరూపాన్ని పొందింది. అయితే ఆంగ్ల మాధ్యమ బోధనలో ప్రమాణాల సంగతిని ఎవరూ పట్టించుకోలేదు. ఈ పాఠశాల్లో బోధించే ఆంగ్లం ఎంతమేరకు ప్రామాణికమైనదని ఎవరూ ప్రశ్నించలేదు. అప్పటి పరిస్థితుల పర్యవసానాలు అటు తరువాత కాలంలో ప్రస్ఫుటమవుతూ వచ్చాయి. పలు ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో వాడుతున్న ఇంగ్లీషు బాగా నాసిరకంగా ఉంటున్నదనీ, వాటిల్లో చదివిన విద్యార్థులు అటు ఇంగ్లీషులో నిపుణత సాధించలేక, ఇటు మాతృభాష తెలుగులోనూ పట్టు ఏర్పరచుకోలే నతమతమవు తున్నారని గత కొంత కాలంగా విద్యారంగ మేధావులు అభిప్రాయపడుతున్నారు. వారి ఆందోళన వాస్తవానికి బాగా సన్నిహితంగా ఉన్నది.

రెండవసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. గత అనుభవాలు అందించిన పాఠాల ఆధారంగా భాషా విధానంలో ఆయన తీరు మారుతుందని భాషాభిమానులు కొంతమంది ఊహిం చారు. అయితే వారి ఊహలు నిజాలు కావని ఆ కాలపు పరిణామాలు స్పష్టం చేశాయి. ఆంగ్ల మాధ్యమ ప్రాధాన్యత, ప్రాంతీయ భాష తెలుగుకు నామమాత్రపు స్థాయి అన్న పాలకుని పూర్వవైఖరిలో ఎటువంటి మార్పు రాలేదు. తెలుగు భాషోద్యమ సమాఖ్య వంటి సంస్థలు ఈ విషయంలో అప్పటి ప్రభుత్వాన్ని సునిశితంగా విమర్శించాయి. ఎంతోమంది భాషావండితులు తెలుగుకు ప్రాధాన్యత తగ్గిపోవడంపై నిరసన ప్రకటిం చారు.

కాలక్రమంలో అనేక ఉద్యమాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ప్రస్తుతకాలంలో ఇక్కడి పరిస్థితుల్ని సమీక్షిద్దాం.

మాతృభాషను ప్రాణంతో సమానంగా ప్రేమించే తమిళులతో 20వ శతాబ్ది తొలి దశాబ్దాల తెలుగువారు సమవుజ్జీలుగా కనబడతారు. తులనాత్మక పరిశీలన జరిపితే ఈ నిజం ఇంకా విస్పష్టంగా బయటపడుతుంది. అనాటి నిజాం సంస్థానంలో తెలుగు భాషా వ్యవహర్తల సంఖ్య ఎక్కువ. అయినా అసఫ్‌జాహీ పరిపాలకులు తొలుత పార్శీని అధికార భాషగా చేశారు. అటు తరువాత ఉర్దూకు అధికార భాష స్థాయిని కల్పించారు. తెలుగుకు ఈ స్థాయిని ఏనాడూ వారు అందించలేదు. తెలుగు భాష మాట్లాడేవారిని అనాటి అధికార వర్గాలు చులకనతో చూశాయి. అయినా ఎందరో మహానుభావులు తెలుగును బలంగా నిలబెట్టారు. ఏటికి ఎదురీత అన్నట్టుగా సాంస్కృతిక ఉద్యమాలు నడిపించారు. అధికారికమైన ప్రతిఘటనలు ఉన్నప్పటికీ తెలుగు కనుమరుగు కాకుండా కాపాడుకున్నారు. అంతటి ఘన చరిత్ర తెలంగాణ స్వంతం.

ప్రస్తుతకాలంలో తెలంగాణ రాష్ట్రంలో పాఠశాల స్థాయిలో తెలుగుకు ఇబ్బందేం లేకపోయినా, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలలో తెలుగు స్థానానికి సంస్కృతం సవాలు విసురుతోంది. తెలుగుతో పోలిస్తే సంస్కృతంలో ఎక్కువ మార్కులు వస్తూ ఉండడమే ప్రధాన కారణం. ప్రైవేటు కళాశాలల్లో తెలుగు మృగ్యం అయిపోయింది. తెలుగు మాధ్యమం ప్రైవేటు విద్యారంగంలో ఎప్పుడో మృగ్యమై పోయింది. ఆంగ్ల మాధ్యమానిదే అగ్రపీఠమై పోయింది. ద్వితీయభాషగా కూడా తెలుగు సంస్కృతపు దాడిని తట్టుకోలేని పరిస్థితుల్లోకి నెట్టబడింది. ఆయా స్థాయిలలో నేర్పే సంస్కృతం విద్యార్థుల్లో ఏమాత్రం పాండిత్యాన్ని కలిగించడం లేదనేది నిర్వివాదాంశం. దీన్ని సంస్కృత ఉపన్యాసకులు, పండితులు కూడా అంగీకరిస్తున్నారు.

ఇప్పుడు ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సంస్కృతాన్ని ద్వితీయభాషగా ప్రోత్సహించే దిశలో నిర్ణయాలు తీసుకుంటున్నది. దీనితో తెలుగు భవితవ్యం అంధకారంగా మారే దిశలో సాగుతోంది. అంటే ఇప్పుడు ఇంగ్లీషు మాధ్యమ బోధనాభ్యసనాల పర్యవసానంగా తెలుగుభాషకు ఏర్పడిన సవాల్‌ను కూడా తెలంగాణ సమాజం ఎదుర్కోవలసి ఉంది. ఇంగ్లీషు మాధ్యమ బోధనాభ్యసనల్ని విమర్శించకుండానే నిర్మాణాత్మక రీతిలో తెలుగుకు పూర్వ వైభవాన్ని సాధించవచ్చు. అందుకు ఆచరణాత్మకమైన కొన్ని పద్ధతులు ఉన్నాయి.

రాజకీయ రంగాన్ని గురించి ఎవరు ఎంతగా విమర్శలు చేసినప్పటికీ ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయాలకే పెద్దపీట దక్కుతుంది. సమాజంపై రాజకీయరంగ ప్రభావం అపారంగా ఉంటుంది. రాజకీయరంగంలోని అధికార పీఠంలో ఉన్నవారు తీసుకునే విధాన నిర్ణయాలే ఆధునిక సమాజంలో ప్రభావకారకాలుగా మారుతున్నాయి.

ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర రావు రాజకీయ దిగ్గజంగా గుర్తింపును పొందారు. వ్యూహరచనలో ఆయనను అపర చాణుక్యుడిగా అభివర్ణిస్తారు. రాజకీయపరమైన ఎత్తుగడలు వేయడంలో తనకుతానే సాటి అయిన చంద్రశేఖరరావు తెలుగు సాహిత్యంలో మంచి పట్టు ఉన్నవారు. గొప్ప భాషాభిమాని. ప్రాచీన-ఆధునిక తెలుగు సాహిత్యాన్ని చక్కగా విశ్లేషించగల మేటి. ఈ విషయంలో ఆయనను కరుణానిధి వంటి పండితులైన నేతలతో పోల్చవచ్చు. గతంలో భాషా పరిరక్షణ కోసం తెలంగాణ తెలుగు ప్రముఖులు చేసిన కృషి ఆయనకు తెలియనిది కాదు. తెలంగాణ ఉద్యమ వ్యాప్తికి తెలుగు ఆధునిక వాగ్గేయకారులు జరిపిన వాఙ్మయ కృషి, తన ప్రసంగాలలోని తెలుగుదనపు నుడికారపు సొంపు వలన కలిగిన విశిష్టతలూ ముఖ్యమంత్రికి తెలుసు. తాను ముఖ్యమంత్రి యైన తొలిపర్యాయంలోనే తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచ

తెలుగు మహాసభల్ని నిర్వహించి, తన భాషాభిమానాన్ని చాటుకున్నారాయన. ఆచరణకు సాధ్యంకాని ఆదర్శాలతో కాలం వెళ్ళదీసే మనిషి కాడాయన. తెలంగాణలో తెలుగు భాషా వైభవాన్ని కాపాడడం కోసం ఆయన దీక్షతో కొన్ని చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది. ఈ రకంగా ఆయన ఆధునిక యుగంలో తెలుగు భాషా వైతాళికుడు గానూ కీర్తిని పొందుతారు.

అనేక సంవత్సరాల ప్రయత్నాల తరువాత అవతరించిన అధికార భాషా సంఘం ఉమ్మడి రాష్ట్రంలో చాలా సందర్భాలలో నిష్క్రియాత్మకంగా వ్యవరించిందనే విమర్శలు ఉన్నాయి. రాజకీయనేతలకు సన్నిహితులు, పదవీ విరమణ పొందిన విద్యావేత్తలు ఈ సంఘ సారధ్యాన్ని చేపట్టే కాలక్షేపం చేశారనే నిశిత విమర్శలూ వినిపిస్తాయి. ఇపుడు తెలంగాణ అధికార భాషా సంఘం కూడా ఏర్పాటు అయ్యింది. దానికి సారధ్యం వహిస్తున్న దేవులపల్లి ప్రభాకర రావుకు భాషావాదిగా పేరుంది. అతడిలో తెలుగును ప్రస్తుత పరిస్థితుల్లో బలోపేతం చేసే ఆలోచనా ధోరణి నిండుగా ఉందని భావించవచ్చు. అధికార భాషా సంఘం సారథితో పాటు కనీసం ఐదుగురు భాషాభిమానులైన తెలుగు నిపుణులకు ఇందులో సభ్యత్వం కల్పించాలి. కర్ణాటక వంటి కొన్ని రాష్ట్రాలలో కేవలం కన్నడ భాషా వ్యవహారాల పర్యవేక్షణకే ఒక మంత్రిని నియమిస్తారు. ఈ సంప్రదాయాన్ని తెలంగాణలోనూ ప్రవేశపెట్టడం అవసరం. అలా చేసినప్పుడే భాష పట్ల ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం చూపుతున్న శ్రద్ధాసక్తులు సమాజానికి అర్థమవుతాయి. భాషాభిమానుల్లో సంతృప్తి, నిశ్చింతలు బలపడతాయి.

సాహిత్య ప్రచారం కోసమే ఏర్పాటైన తెలంగాణ సాహిత్య అకాడమీ రాజకీయ ప్రభావాలకు దూరంగా తన పనిని కొనసాగించాలి. సుసంపన్నమైన తెలంగాణ ప్రాచీన సాహిత్యాన్ని మరింతగా అందరికీ అందుబాటులో ఉండే రీతిలో తిరిగి ప్రచురించాలి. ప్రభుత్వం, అధికార భాషాసంఘం, సాహిత్య అకాడమీలు ఇప్పటికే తమశక్తి మేరకు కృషి చేస్తున్నా, పరస్పర సహకారంతో తెలుగు అభివృద్ధికి ప్రణాళికలు రచించి, ఆ దిశలో కృషి చేయాలి. అప్పుడే తెలంగాణ విద్యారంగంలో, ప్రచురణ, ప్రసార రంగాల్లో తెలుగు మళ్లీ వెలుగులు విరజిమ్మగలుగుతుంది.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు తమిళ తొలి నవలలు – సమాజం

– డా॥. కె.చంద్రుశేఖరరావు, తెలుగు ఉపన్యాసకులు, హైదరాబాదు.

మానవునిలో అక్షరాస్యత పెరిగిన కొద్దీ జ్ఞానతృష్ణ అధికమౌతుంది. విద్య నేర్చిన వ్యక్తి విజ్ఞానం కోసం ఎంతగా పరితపిస్తాడో ఆనందం కోసం కూడా అంతే అర్రులు చాచడం సహజం. అలా విజ్ఞానం, వినోదం అందించే సాహిత్య ప్రక్రియలు కొన్ని ఉన్నాయి. వాటిలో నవలా ప్రక్రియ ఒకటి. ఒక జీవిత భాగాన్ని చిత్రించేది నవల. జీవితాన్ని వివిధ కోణాల నుండి దర్శింప చేయ గలిగిన విస్తృతమైన పరిధే ఈ నవల ప్రక్రియ విశిష్టత. సాహిత్య కళాకారుడు కనిపెట్టిన దీని రూపం వాస్తవికతను విశదీకరించడానికి, లోతుగ చిత్రించడానికి అనువైనది. చారిత్రిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, నైతిక, తాత్త్విక విషయాల్ని, ఆఖరుకు మనస్తత్వాన్ని కూడా చిత్రించగలిగి, సమగ్ర సామాజిక చైతన్య ప్రతిబింబీకరణ ద్వారా విశిష్టతను సంపాదించుకున్నదే నవలా ప్రక్రియ. కాలం గడుస్తున్న కొద్దీ మారుతున్న ప్రపంచంతో పాటే నవలా రచనా స్వరూపం కూడా మారిపోయింది. రొమాంటిసిజం, నేచురలిజం, సింబాలిజం, అస్తిత్వవాదం, మార్క్సిజం, హేతువాదం, మనోవిశ్లేషణ సిద్ధాంతం, చైతన్యస్రవంతి మొదలైన సాహిత్యవాదాలు నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి.

ఆధునిక యుగంలో వ్యక్తి జీవితంలో సమాజ జీవితంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నవల పరిణామం చెందుతూ, వికసిస్తూ వచ్చింది. వైజ్ఞానిక రంగంలోని నూతన ఆవిష్కరణల్ని ముఖ్యంగా మనో వైజ్ఞానిక రంగంలోని పరిశోధనల్ని, ఆర్థిక రాజకీయ రంగంలోని మార్పులు మానవుని జీవితంలో తెచ్చిన పరి ణామాన్ని నేటి నవల ప్రతిబింబించగలుగుతుంది. ఆయా విషయాల్ని చిత్రించటానికి అనువుగా నవలా శిల్పం రూపుదిద్దుకుంది. వస్తువు స్వీకరించడంలో, రచనా విధానంలో, భాషా విషయంలో నవల పుట్టిన తొలినాళ్లకు ఈ నాటికీ కొట్టవచ్చినట్టుండే తేడా కనిపిస్తుంది. ఈ మూడింటిలోనూ సమాజానికి మరింత చేరువ కావడం, పాఠకుని చైతన్యానికి దోహదం చేయడం జరుగుతున్నది. అంటే మొత్తం మీద నవలా స్వరూపంలో, స్వభావంలో గుణాత్మకమైన మార్పు రావడం జరిగింది. ఈనాటి నవల సమాజాన్ని, సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించేందుకు శక్తివంతమైన మాధ్యమంగా తయారుకావడం జరిగింది.

నవలకు వస్తువు ప్రధానంగా సమకాలీన జీవితమే అన్నది స్పష్టం. చారిత్రిక విషయాల్ని వస్తువుగా గ్రహించిన చారిత్రిక నవలలు వచ్చాయి. రాజకీయ సాంఘిక ఉద్యమాలు వస్తువుగా గ్రహింపబడిన నవలలూ వచ్చాయి. రాజకీయ సాంఘిక ఉద్యమాలు ఒకనాటి సామాజిక జీవితంలోని సమస్యల నుండి తలెత్తినవే కనుక వాటిని వస్తువుగా గ్రహించిన నవలలూ సామాజిక నవలలే అవుతాయి. నేటి నవల ఎంతో సంశ్లిష్టమైపోయిన ఈ వ్యవస్థలోని సాంఘిక ఆర్థిక, రాజకీయ సమస్యల్ని, భిన్న ఆలోచనలతో కూడిన న్యాయ, నైతిక రంగాలను, వివి మైన తాత్త్విక ఆలోచలను ప్రతిబింబిస్తున్నది. మానవుని భౌతిక జీవన సమస్యల్నే కాదు, వ్యక్తి మనోలోకాలనూ దర్శింపజేస్తున్నది. అంటే జీవితాన్ని సమగ్రంగా పరిశీలన చేయడానికి ఈ నవలకు సాధ్యమౌతున్నది.

తెలుగు భాషలో నవలా పక్రియ మొదలై నూరు సంవత్సరాలు దాటింది. ఏది మొదటి తెలుగు నవల అని జరిగిన విస్తృత చర్చలో అధిక సంఖ్యాకులు ఆ గౌరవాన్ని కందుకూరి వీరేశలింగం పంతులు 1878 లో వ్రాసిన రాజశేఖర చరిత్రానికే ఇచ్చారు. మన పొరుగున ఉన్న తమిళనాట 19 శతాబ్దపు తొలి పాదంలో అనేక మంది నవలాకారులు తమ నవలలను వెలువరించారు.

దాదాపుగా ఈ నవలలన్నీ కల్పిత ఇతివృత్తాలతోనే సాగాయి. శామ్యూల్ వేదనాయకం పిళ్లై తమిళ తొలి నవల ప్రతాప మొదలియార్ చరిత్రమ్‌ను రచించి 1879లో ప్రచురించాడు.

ఇలా ఆరంభమైన తెలుగు, తమిళ నవలలు తద నంతర కాలంలో అనేక నూతనాంశాలను, సామాజికాంశా లను ఇతివృత్తాలుగా స్వీకరించి, విస్తరించడమే కాక సాహిత్య ప్రక్రియలలోనే ప్రముఖమైనవిగా వికసించాయి. కాలక్రమంలో ఈ ప్రక్రియలో అన్ని అధునిక సామాజిక వాదాలు ఇతివృత్తాలుగా మారాయి. దీన్ని మరింత ప్రభావవంతమైన ప్రక్రియగా మార్చాయి.

తమ తమ భాషలలో తొలి నవలాకారులుగా ప్రఖ్యాతి గాంచిన వారు కందుకూరి వీరేశలింగం పంతులు, శామ్యూల్ వేదనాయకం పిళ్లై. కందుకూరి ఆధునిక తెలుగు సాహిత్యానికి ప్రతీకాత్మకంగా నిలిచిన సాహితీ మూర్తి. ఆయన జీవన పరిచయం తెలుగు సాహిత్య విద్యార్థులు అందరికీ తెలిసినదే. ఇక వేదనాయం పిళ్లై విషయానికి వస్తే ఆయన 1826లో జన్మించి అప్పటి బ్రిటీషువారి ప్రభుత్వంలో పౌర సేవా అధికారిగా, కలెక్టర్‌గా, జిల్లా మున్సిఫ్‌గా పనిచేశారు. నీతినూల్, తిరువారుళ్ మాలై, తిరువారుల్ అంతాది, దేవమాత అంతాది, పెరియనాయకి అమ్మన్ పతిగమ్ అనే కావ్యాలు, ప్రతాప ముదలియార్ చరిత్రమ్, సుగుణాం బాళ్ చరిత్రమ్ అనే నవలలు, దేవ స్తోత్ర కీర్తనైగళ్, సర్వసమయ సమరస కీర్తనైగళ్ అనే సంగీత రచనలు చేశారు.

తెలుగు, తమిళ తొలి నవలలు రెండూ తత్కాలికాలు కాక, రచనా కాలానికి దాదాపు రెండు వందల సంవత్సరా లకు ముందు జరిగిన సంఘటనలుగా చెప్పబడ్డాయి. కందుకూరి వీరేశలింగం పంతులుగారు, వేదనాయకం పిళ్లైగారు కేవలం రచనాకారులే కాదు. స్వయంగా సంఘ సంస్కరణ భావాలున్న ఆదర్శవ్యక్తులు. వారు తమ సాహితీ నైపుణ్యాలను సైతం ఈ అభ్యుదయ, సామాజికాభి వృద్ధి భావజాలన్ని సామజికులకు అందించే వాహికగా వాడుకున్నారు. కందుకూరి వారు శారీరకంగా దుర్బలులై అయినా అవక్రవిక్రమంగా దంభ సమాజాన్ని ఎదిరించిన కార్యశూరులు.

తమిళంలో తొలినవలయైన ప్రతాపమొదలియార్ చరిత్ర, తెలుగులో తొలి సాంఘిక నవల అయిన రాజ శేఖర చరిత్ర నాటి సమాజంలోని దుర్నీతులను ఎండగట్టే ప్రయత్నం చేసిన మహత్తర కృతులు. ఈ నవలల రచయితలు ఇద్దరూ సమాజాన్ని చాలా దగ్గరనుంచి గమనించినవారే. ఇద్దరూ అభ్యుదయ భావాలు ఉన్నవారే. పాశ్చాత్య సాహిత్య, సామాజిక చరిత్రలవంటి విషయాల పట్ల అవగాహన కలిగినవారే. ఆ క్రమంలో వారు సమాజాన్ని గమనించిన తీరు సంప్రదాయికంగా మనదేశాన్ని గమనించిన తీరుకు భిన్నంగా కనిపిస్తుంది.

ఈ నేపథ్యంలో వచ్చిన ఈ రెండు నవలలూ ఆయా రచయిత కాలంలో జరిగిన కథావస్తువును స్వీకరించక అంతకన్నా ముందు ఉన్న కాలానికి సంబంధించినవి. రాజశేఖర చరిత్ర ముగింపులో కందుకూరి 'రాజశేఖరుడు గారు కాలము చేసి ఇప్పటికి రెండు వందల సంవత్సరము లయినను' అని చెప్పారు. రాజశేఖర చరిత్ర రచనాకాలం 1897. రాజశేఖరుడు అంతకు ముందు 2 వందల సంవత్సరములకు గతించాడు అంటే కథాకాలం రమారమిగా 1695-1697 అయి ఉండాలి. అలాగే ప్రతాప ముదలియార్ చరిత్ర 'ఈ దేశాన్ని ఆంగ్లేయులు స్వాధీనం చేసుకోవడానికి పూర్వం' అని ఆరంభమౌతుంది. మనదేశం కంపెనీ పాలననుండి ఆంగ్లేయుల పాలనలోకి వచ్చింది 1857లో. అంటే కథాకాలం 1857కు ముందుది అన్నమాట. అంటే రెండు నవలలూ కంపెనీ పాలనా కాలానికి సంబంధించిన దేశీయ రాజరిక వ్యవస్థ ఉన్న కాలం నాటి కథావస్తువును స్వీకరించాయి.

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన జరుగుతున్న ఆ కాలంలో రాజులు, జమీందారుల పాలన సాగుతున్నది. హైందవ సామాజిక వ్యవస్థ పాటించడం, సంప్రదాయా

లను కాపాడుకోవడం అనేవి ఆనాటి అధికార వర్గపు లక్షణాలుగా ఉండేవి అని చెప్పవచ్చు. ఫలితంగా అప్పటి కులీన వర్గాలవారు ఆ సంప్రదాయాలను, అవి ఎంత లోపభూయిష్ఠంగా ఉన్నా, వాటిని పాటించడం తమ బాధ్యతగా భావించేవారు. ఈ రెండు నవలల ప్రధాన పాత్రలైన ప్రతాప ముదలి, రాజశేఖరుడు ఇలాంటి భావనలనే కలిగిఉండడాన్ని మనం గమనించవచ్చు.

ఈ రెండు నవలలలో దేశీయ సంస్కృతి, కుటుంబ జీవితం, దక్షిణభారత ప్రజల ఆచార వ్యవహారాలు వర్ణింప బడ్డాయి. కుటుంబ సభ్యుల మధ్య ఉండే ప్రేమలు, అభిప్రాయభేదాలు, సత్ప్రవర్తన, సద్గుణాలు, ఇతరుల మేలు కోరడం, సమాజం పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండడం వర్ణింపబడడాన్ని మనం గమనించవచ్చు.

ఈ రెండు నవలలు కల్పిత ఇతివృత్తాన్ని కలిగి ఉన్నాయి. నాటి సమాజం గురించి, ఆ సమాజంలోని గుణ దోషాలను ఇవి వ్యక్తం చేస్తున్నా, ప్రాంతాలు, సామాజిక పరిస్థితులు వాస్తవికాలే అయినా, నాటి చరిత్రను ఇవి వివరిస్తున్నా, సమాజానికి దర్పణం పట్టేందుకు, అందులోని దుర్నీతులను ఖండించడానికి కల్పిత పాత్రలను సృష్టించారు. మూలకథతో పాటే ఆనాటి సమాజంలోని దుష్ట సంప్రదాయాలను సూటిగా, స్పష్టంగా ఖండించారు. మూలకథతో పాటే తమ లక్ష్యాలను సాకారం చేసుకునేందుకు గాను మూలకథలో సంబంధంలేని అంశాలను సైతం వర్ణించారు. ఫలితంగా రెండు నవలలలో కథాగమనం చాలా నెమ్మదిగా సాగుతుంది.

ఈ రెండు నవలలలోని ప్రధానపాత్రలు అంటే ప్రతాపుడు, రాజశేఖరుడు కాయకష్టంతో పనిలేని కులీన కుటుంబాలకు చెందినవి. సంప్రదాయ భావాలను కలిగి ఉన్నా, సమాజంలోని అధికారవర్గంతో సంబంధాలు ఉన్న కారణంగా ఆధునిక భావాలకు దగ్గరైన పాత్రలు. వీరిలో ప్రతాపుడు యువకుడు కాగా, రాజశేఖరుడు వృద్ధుడు. ఈ కారణంగా రాజశేఖరుడు కాస్త ఎక్కువ సంప్రదాయవాదిగా కనబడుతాడు. ప్రతాపుడు ఆధునిక భావాలను ఎక్కువగా కలిగి ఉన్నట్లుగా కనిపిస్తాడు.

కులీన కుటుంబాలను ఆశ్రయించి ఉండే అన్యులు అంటే వీరి సంప్రదాయ భావాలను అడ్డం పెట్టుకుని జీవితం సాగించుకునే పాత్రలకు ఈ రెంటిలోను కొదవ లేదు. జ్యోతిషులు, శాస్త్రులు, పురోహితులు, సలహాదారులు ఇలా అందరూ డబ్బున్న కుటుంబాల వ్యక్తుల మనోభావాలకు అనుకూలంగా మాట్లాడి జీవితాలను సాగదీస్తుంటారు. అందుకు అవసరమైతే అబద్ధాలు ఆడతారు. మోసాలు చేస్తారు. కూటసాక్ష్యాలను ఏర్పాటు చేసుకుని మరీ ధనం కోసం ఈ కులీన కుటుంబాలను ఆర్థికంగా మోసగించడాన్ని ఈ నవలల్లో మనం చూడవచ్చు. రాజశేఖర చరిత్రలో రాజశేఖరుడు ఇలాంటివారి మాయలో పడతాడు. ప్రతాప ముదలియార్ చరిత్రలో ప్రతాపుడు వివేకంతో తర్కించుకుని, ఇలాంటి మాయలకు దూరంగా ఉంటాడు.

ఇక స్త్రీ పాత్రల విషయానికి వస్తే రాజశేఖర చరిత్రలోని స్త్రీ పాత్రలు చాలా సంప్రదాయికమైన ధోరణిలోని పాత్రలు. ప్రతాప ముదలియార్ చరిత్రలో ప్రతాపుని తల్లి, భార్య ఆధునిక భావాలను కలిగి ఉన్న పాత్రలు. ప్రతాపుని భార్య జ్ఞానాంబాళ్ చాలా ఆధునికమైన, అభ్యుదయ భావాలు కలిగిన పాత్ర. ఈ పాత్రకు సాటిరాగల స్త్రీపాత్రలు ఈ రెండు నవలలో వేరేవి ఏవీ లేవు. జ్ఞానాంబాళ్ ప్రతాపునికి స్ఫూర్తిమంత్రంగా వ్యవహరిస్తుంది. సలహాను ఇస్తూ, ప్రోత్సాహాన్ని ఇస్తూ, ప్రతాపుడు కష్టాలలో ఇరుక్కున్నప్పుడు అతణ్ణి కాపాడుతూ, ఈ పాత్ర చాలా ప్రముఖమైనదిగా నిలిచింది.

రాజశేఖర చరిత్రలో రాజశేఖరుని భార్య మాణిక్యాంబ, కుమార్తె రుక్మిణి ప్రాధాన్యం ఉన్న పాత్రలు. ఇవికాక కథాగమనంలో కనిపించేది చిన్నదైన సీత పాత్ర. అపహరణకు గురై, తిరిగి ఇల్లు చేరడం తప్పించి, ఈ సీత పాత్రపై కథాగమనం ఆధారపడదు. రుక్మిణితో అత్తరికం కోడరికం ముచ్చట్లు చెప్పుకున్న అమ్మలక్కలు ప్రధాన లేదా ఉపకథలకు ఏ మాత్రం సంబంధం లేని పాత్రలు. పాత్రల మధ్య సంభాషణల్లో ఇతర స్త్రీల

ప్రస్తావన వస్తుందే తప్ప, వారూ కథాగమనానికి ఎలాంటి చురుకుదనాన్ని ఇవ్వరు.

ప్రతాప ముదలియార్ చరిత్రలో ప్రధానమైన స్త్రీ పాత్రలు కథానాయకుడైన ప్రతాపుని తల్లి సుందర అణ్ణి, ప్రతాపుని భార్యయైన జ్ఞానాంబాళ్. మిగిలిన స్త్రీ పాత్రలు కథాగమనానికి ఎలాంటి ప్రయోజనం కలిగించనవి. ఈ రెండు పాత్రలను గురించి నవలాకారుడైన వేదనాయగం పిళ్లై నవల ముందుమాటలో ఇలా చెప్పారు-

'ఈ నవలలో ముఖ్యమైన స్థానాన్ని వహిస్తున్నవారు కథానాయకుని తల్లి సుందర అణ్ణి. కథానాయకుని భార్య జ్ఞానాంబాళ్. ఈ ఇరువురూ ఉన్నత వంశానికి చెందిన సంపన్నుల ఇంట్లో జన్మించినవారు. నద్గుణాలన్నీ మూర్తీభవించిన వారు. మహిళాలోకానికే ఆభరణాల వంటివారు. జీవన సంక్షోభ ఘట్టాలలో ఉన్నతములైన వీళ్ల గుణాలు ప్రకాశమానమవుతున్నాయి. తమకు ఎదురైన కష్టనష్టాలను లెక్కచేయక అన్ని సందర్భాలలోనూ వీరు నీతిని, మానవత్వాన్ని సంరక్షించడానికి ముందుకు వచ్చారు' (ప్రతాప ముదలియార్ చరిత్ర (అనువాదకుల ముందుమాట))

నవలాకారుని ఈ మాటలు సుందర అణ్ణి, జ్ఞానాంబాళ్ పాత్రల ప్రాముఖ్యాన్ని తెలియజేస్తున్నాయి. ఈ రెండు నవలలలోని స్త్రీ పాత్రలలో వయోక్రమంగా, పాత్ర ప్రాధాన్యతలను బట్టి మాణిక్యాంబ-సుందర అణ్ణిలను, రుక్మిణి-జ్ఞానాంబాళ్‌లను రెండు వర్గాలుగా విభజింప వచ్చు.

ఈ రెండు పాత్రలు వయస్సులో పెద్ద పాత్రలు. మాణిక్యాంబ రాజశేఖర చరిత్రలో కథానాయకుడైన రాజశేఖరుని భార్య కాగా, సుందర అణ్ణి ప్రతాప ముదలియార్ చరిత్ర కథానాయకుడైన ప్రతాపుని తల్లి. మాణిక్యాంబ బ్రాహ్మణ గృహిణి కావడం వల్ల విధాన నిర్ణేత కాని స్త్రీ. చాలా సామాన్యురాలిగా కనిపించే ఈ పాత్ర గొంతెత్తి ఏ అంశాన్నీ ప్రశ్నించినట్లు కనిపించదు. పైపెచ్చు ఏమాత్రం ధైర్యసాహసాలు లేని స్త్రీ.

రాజశేఖరుడు ఆర్థికంగా సుస్థిరంగా ఉన్నప్పుడు మాణిక్యాంబ జీవితం కేవలం భర్త చుట్టూ తిరిగే భజన బృందానికిఅడపడుచు సుబ్బమ్మ సహకారంతో వండి వడ్డించడమే జీవితం నిర్వహించింది. ఆశ్రితులు అరగించిన డబ్బు, రాజశేఖరుని సువర్ణవిద్య ఫలితంగా ఇంట్లో చేరిన బైరాగి ఎత్తుకుపోయిన నగలు రాజశేఖరుని కుటుంబాన్ని వీధిపాలు చేసింది. కుటుంబం ప్రవాసం పాలు అవ్వవలసి వచ్చింది.

తోడుగా ఉన్న సుబ్బమ్మ మరణం, అల్లుడు నృసింహ స్వామి మరణవార్త విని రుక్మిణి ఆరోగ్యం చెడిపోవడం, ప్రవాసంలో రుక్మిణిని కోల్పోవడం, సీత అపహరణకు గురికావడం, రాజశేఖరుడు కారాగారం పాలు కావడం , సుబ్రహ్మణ్యం పితాపురానికి పోవడం మాణిక్యాంబను ఒంటరిని చేశాయి. అయినా ఆమె ధైర్యం కోల్పోకుండా ముందుకు సాగింది. ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు.

మాణిక్యాంబతో పోలిస్తే సుందర అణ్ణిది సుఖకరమైన జీవితం. అధికారం చేతిలో ఉండడం, ఆర్థిక సుస్థిరత ఉండడం సుందర అణ్ణిని వ్యక్తిత్వపరంగా ఉన్నతంగా ఉండేలా చేశాయి అని చెప్పవచ్చు. మామగారైన ఏకాంబర ముదలి నవాబుగారి దగ్గర ఉన్నతాధికారి కావడం, భర్త కనకాచల ముదలి ఈమె స్వతంత్రానికి విధినిషేధాలు విధించకపోవడం ఇందుకు సహకరించాయి. ఫలితంగా సుందర అణ్ణి విద్యావతి, వివేకవతిగా కనిపిస్తుంది.

బాల్యం నుంచి కుమారుడు ప్రతాపుడు, మేనకోడలు జ్ఞానాంబాళ్, అనాథగా వచ్చి చేరిన కనకసభాపతులను వివేకవంతులను చేయడంలో సుందర అణ్ణి పాత్ర ముఖ్యమైనది. ప్రతాపుడు బాల్యంలో అల్లరి చిల్లరిగా తిరుగుతుంటే అతనికి విద్య, వివేకం, జ్ఞాన ప్రాముఖ్యాలను వివరిస్తుంది. మేనకోడలు జ్ఞానాంబాళ్‌లో కనిపిస్తున్న నేర్పరితనాన్ని, వివేకస్ఫూర్తిని ప్రోత్సహిస్తుంది. జ్ఞానాంబాళ్‌ను చూసి నేర్చుకోమని ప్రతాపునికి, సభాపతికి చెబుతుంది. ఈ ఘటన సుందర అణ్ణిలోని నిష్పాక్షికతను వ్యక్త పరుస్తుంది.

ఇంత ప్రత్యేకవ్యక్తిత్వం ఉన్నా సామాజికంగా ఆరోజుల్లో భార్య భర్తను అనుసరించడమే ధర్మం కాబట్టి తన తమ్మునితో భర్త కనకాచలం వివాదం పెట్టుకుని ప్రతాప - జ్ఞానాంబాళ్‌ల పెళ్లికి వ్యతిరేకించి, మరో పిల్లతో సంబంధం ఖాయం చేస్తే ఏమీ చేయలేకపోతుంది. బావబావమరుదులు తరువాత ఏకీభావానికి వచ్చి వాళ్లిద్దరి పెళ్లి చేసి, మళ్లీ పుట్టబోయే మనవణ్ణి ఎవరు ఉంచుకోవాలి అన్న వ్యర్థ విషయంలో తగాదా పడితే వారిని ఆపలేక పోతుంది.

స్థూలంగా గమనిస్తే మాణిక్యాంబ కన్నా మెరుగైన పాత్ర సుందర అణ్ణిది. రాజశేఖర చరిత్రలో రాజశేఖరుని కుమార్తె అయిన రుక్మిణి వివాహిత. కథ ఆరంభమయ్యే సమయానికి ఆమె భర్త నృసింహస్వామి మిత్రుల మాయలో పడి చెప్పాపెట్టకుండా కాశీకి పోవడంతో ఈమె తండ్రి వద్ద ఉంటుంది. బాల్యం నుంచి చదువుకోవాలనే కోరిక ఉన్న రుక్మిణికి రాజశేఖరునిలో ఉన్న పుత్రికప్రేమ పుస్తక అధ్యయనానికి తోడ్పడుతుంది. అనాటికాలంలో బ్రాహ్మణ కుటుంబాల్లో ఆడపిల్లలను ఇల్లుదాటి బయటికి పోనిచ్చేవారు కాదు కాబట్టి రాజశేఖరుడు రుక్మిణిని ఎక్కడా బడిలో చేర్చినట్లు కనిపించదు. అయితే ఆమెలోని ఆసక్తిని గమనించి తానే స్వయంగా కూతురికి చదువు నేర్పాడు. ఆ విద్య ఆమెను వివేకవతిని చేసింది.

గోదావరి ఒడ్డున స్త్రీలందరూ అత్తకోడళ్ల సంబంధాలపై మాట్లాడుతున్నప్పుడు రుక్మిణి వారిని తన వివేకవంతమైన మాటలతో వారిస్తుంది. భర్త మరణవార్త తెలిసి ఆరోగ్యం చెడి ఉన్న రుక్మిణి, తండ్రి నిర్ధనుడు మారినప్పుడు శారీరికంగా అననుకూలత ఉన్నా కూడా ఆయనతో ప్రవాసానికి సిద్ధమౌతుంది. మార్గమధ్యంలో దొంగలు దాడి చేసినప్పుడు గాయపడి మృతప్రాయులు అవుతుంది. అందరూ తనని అక్కడే వంటరిగా వదిలివేసి వెళ్లినా తెరుకుని, ఆత్మస్థైర్యంతో నిర్ణయం తీసుకుంటుంది. పురుషవేషంతో ముసలి కరణం ఇల్లు చేరుతుంది. తన అసలు స్వరూపం బయటపడకుండా వేంకటేశ్వర మొక్కును అడ్డం పెట్టుకుంటుంది. చెల్లెలు సీతను అపహరించి జగ్గంపేట చేరినప్పుడు, సీతను గుర్తించి, వారి బారి నుంచి ఆమెను కాపాడి రామరాజు సాయంతో తల్లి వద్దకు చేరుస్తుంది. తల్లిని గుర్తు పట్టేవరకు తన పురుషవేషాన్ని కొనసాగిస్తుంది. ఇలా రుక్మిణిలో సంపద్రాయపు భార్య, వివేకవతి, సమయ స్ఫూర్తి ఉన్న మహిళ కలగలసి కనిపిస్తారు.

ఇక జ్ఞానాంబాళ్ విషయానికి వస్తే, ఈమె ఆధునిక కాలానికి చెందినది. కోర్టులు, చట్టాలు ఉన్న కాలంలోని వ్యక్తి. రుక్మిణి మాదిరిగా మరీ రాచరిక కాలపు గృహిణి కాదు. ఫలితంగా బడిలో చదివే అవకాశం జ్ఞానాంబాళ్‌కు వచ్చింది. ఆర్థిక సుస్థిరత, అధికార కుటుంబం, మేనత్త, మేనబావల ప్రేమ ఈమె బాల్యాన్ని సుఖప్రదం చేశాయి. విద్యలో ముందంజ వేసేందుకు కావలసిన వాతావరణాన్ని అందించాయి. బావ, కనకసభాపతుల కన్నా వివేకవంతురాలు, తెలివైనది అని పేరు తెచ్చుకున్నది.

తండ్రి, మేనమామ తన వివాహ విషయమై వివాదపడ్డప్పుడు, వివాహమైన తరువాత పుట్టబోయే పిల్లవాడిని ఎవరు పెంచుకోవాలి అన్న విషయంలో మళ్లీ వాళ్లు వివాద పడినప్పుడు జ్ఞానాంబాళ్ ప్రతాపుడు సరైన నిర్ణయాలు తీసుకోవడంలో సహకరించింది. భర్తతో కలిసి ఇల్లు వదిలి వచ్చినప్పుడు భర్తకు స్ఫూర్తిప్రదంగా నిలుస్తుంది. అడవిలో భర్త నుంచి తప్పిపోయినప్పుడు విచారపడకుండా, పురుషవేషం ధరించి ముందుకు సాగుతుంది. ఏనుగు తన మెడలో మాల వేసి రాజుగా ఎంపిక చేసినప్పుడు, భర్తను వెదికించి, మరల కలిసేందుకు అదొక అవకాశంగా భావిస్తుంది. రాకుమార్తె తన పురుషవేషాన్ని చూసి మోహించినప్పుడు ఆమెకు సత్ప్రవర్తన ప్రాధాన్యాని వివరిస్తుంది.

ఆనాటి సమాజంలో స్త్రీలు తమంత తాముగా సాహస కార్యాలు చేయడం కష్టం కనుక విధిగా పురుషవేషాలు వేసుకోవలసి వచ్చిందని ఈ రెండు పాత్రల ద్వారా చెప్పారు. జ్ఞానాంబాళ్ దేశప్రభువుగా మహిళను అంగీక

రించరు కనుక పురుష వేషం వేసుకుంటుంది. రాజుగా ఉన్న అధికారాలతో అన్యాయంగా కారాగారంలో ఉన్న భర్తను రక్షించుకుంటుంది. రుక్మిణి సమయస్ఫూర్తితో తనంత తాను ప్రమాదాల నుంచి బయటపడడానికి పురుషవేషం ధరిస్తుంది. అంటే స్త్రీలకు సమాజంలో భద్రత లేదని తెలుస్తుంది. రుక్మిణి ఉన్న కాలం, జ్ఞానాంబాళ్ ఉన్న కాలం వేరువేరు అయినప్పటికీ, కష్ట సమయాల్లో వారిద్దరూ పురుషవేషాలు ధరించాల్సి రావడం ఆనాటి సమాజంలో మహిళ భద్రతకు హామీ లేదని తెలుపుతుంది.

కథాకథనంలో సూచనాప్రాయంగా చెప్పినా, సంభాషణల మాధ్యమంగా చెప్పినా దుర్నీతులు దుర్నీతులే. వాటి నిరనన నిరననే. రాజశేఖర చరిత్రలో అలా ప్రస్తావించబడిన కొన్ని సామాజిక దుర్నీతుల ప్రస్తావన ఇలా ఉన్నది-

కందుకూరివారు తమ స్వీయచరిత్రలోను, ఇతర సాహిత్యకృతులలోను ఎక్కువగా విమర్శించినది జ్యోతిషాన్ని, జ్యోతిషాన్ని మోసానికి వినియోగించే జ్యోతిషులను, దానిని, వారిని గుడ్డిగా నమ్మే మూఢులను. గ్రామంలో ఉండే పురోహితుడే సర్వసాధారణంగా ఆ గ్రామానికి జ్యోతిషం కూడా చెబుతుంటాడు. అతను చెప్పినవి ఒక్కోసారి జరగవచ్చు, ఒక్కోసారి జరగకపోవచ్చు. అయితే జరగకపోవడానికే ఎక్కువగా అవకాశలున్నాయి. ఆ మాటనే ఇలా ప్రస్తావిస్తున్నారు.

'సిద్ధాంతి యాలోచన లేక యా చేరువ గ్రామములలో ఏ శుభకార్యముగాని యశుభ కార్యము కాని జరుగదు. అతడు చెప్పెడి జ్యోతిశము తఱుచు అబద్ధమే యగుచు వచ్చినను, అప్పుడప్పుడు కాకతాళీయముగా కొన్ని సంగతులు నిజమగుటయు గలదు గనుక జనులాతని మాట యమోఘమని నమ్ముచునే యుండిరి.'(రాజశేఖర చరిత్రము పుట. 11)

జ్యోతిషుడు చెప్పింది జరిగితే అది అతని ఘనత, జరుగకపోతే అది జ్యోతిష శాస్త్రానికి ఉన్న పార్వతీదేవి శాపం అని ఒక అపవాదు ప్రచారంలో ఉన్నది. దానినే కందుకూరివారు ఇక్కడ ప్రస్తావిస్తున్నారు. శుభకార్యమైనా, అశుభ కార్యమైనా జ్యోతిషుని సంప్రదిస్తారు సామాన్యులు. శుభ నందర్భమైతే ఏది మేలు చేసే సమయమో తెలుసుకోవడానికి జ్యోతిషుని సంప్రదిస్తారు. అలాగే అశుభ సందర్భాలైతే, అవి జరిగిన సమయాలు తమకు ఏమైనా హాని చేస్తాయోననే భయంతో సంప్రదిస్తారు.

అలా నంప్రదించేది శాస్త్రాన్ని ఔపోనన పట్టిన పండితుణ్ణి అయితే సబబైన ఫలితాలు చెప్పగలుగుతాడు. కేవలం పొట్టకూటి కోసం శాస్త్రాన్ని అడ్డం పెట్టుకుని బ్రతికే కుహనా పండితుని అడిగితే వచ్చే ఫలితాలు అస్తవ్యస్తంగానే ఉంటాయి, అవి ఫలించవచ్చు లేదా ఫలించకపోనూ వచ్చు. ఎక్కువగా ఫలించకపోవడానికే అవకాశాలు హెచ్చు. తరచు జరుగకపోవడం, కాకతాళీయంగా కొన్ని నిజమగుట అనే వాక్యఖండికలు ఆ జ్యోతిషులు చెప్పేవి విఫలమవడమే సర్వసాధారణం అన్న భావాన్ని స్పష్టీకరిస్తున్నాయి. జనులాతని మాట యమోఘమని నమ్ముచునే యుండిరి అన్న వాక్యఖండిక అప్పటి ప్రజానీకంలో జ్యోతిషునిపై ఉన్న గుడ్డి నమ్మకాన్ని, ఆ శాస్త్రం పట్ల వారికి ఉన్న మూఢవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంది.

జ్యోతిషాన్ని గుడ్డిగా నమ్మేవారున్నట్లే కాస్త వివేకంతో వ్యవహరిస్తూ ఆ శాస్త్రానికి పెద్దగా ప్రాముఖ్యం ఉవ్వని వారు కూడా అంటారు. అసలు జ్యోతిషం ద్వారా రాబోయే కాలంలో జరుగబోయే విషయాల్ని ముందుగానే తెలుసుకుంటే వ్యక్తిలోని స్థైర్యం దెబ్బతింటుంది. జరుగబోయేది హాని అని ముందుగా తెలిస్తే మానసికంగా నిస్సహాయత ఏర్పడుతుంది. జరుగబోయేది మంచి అని ముందే తెలిస్తే వ్యక్తిలో నిర్లక్ష్యధోరణి, రాబోయే మేలు పట్ల ఆశ పెరిగిపోతాయి. రెండూ ప్రమాదకరమే. ఈ విషయాన్నే చెడిబతికిన రాజశేఖరుని పాత్ర ద్వారా ఇలా పలికించారు కందుకూరివారు.

'మీరు చెప్పెడు ఫలము నిజమైనను నాకక్కరలేదు. నాకు ముందు మేలు కలుగుననెడి పక్షమున వచ్చెడు ననుకొన్నది రాకపోయెనేమి మిక్కిలి వ్యసనముగా

నుండును. నిజముగా వచ్చెనేని ఆ వఱకే దాని నెదురు చూచి యుండుటం జేసి వచ్చినప్పు డధిక సంతోషము కలుగదు. కీడు కలుగునని చెప్పెడు పక్షమున నిజముగా వచ్చినప్పుడు దుఃఖపడుట యట్లుండగా ఇప్పటి నుండియు నిరాశ పడవలసి వచ్చును. ఒకవేళ రాక పోయెడు పక్షమున వ్యర్థముగా లేనిపోని చింతపడవలసి వచ్చును. ఆ వట్టి విచారము చేతనే కీడు గలిగినను గలుగవచ్చును గాని, సంతోషపడుట చేత మేలు మాత్రము కలుగనేరదు.' (రాజశేఖర చరిత్రము పుట. 137)

మేలు జరుగబోతున్నది రాబోయే కాలంలో అని జ్యోతిషం ద్వారా తెలుసుకుంటే దాని పట్ల ఆశ పెరుగుతుంది. ఆ మేలు అనుకున్నంత స్థాయిలో జరుగకపోతే నిరాశ కలుగుతుంది. ముందుగానే తెలిసిపోయినందున మేలు జరిగినప్పుడు సంతోషం వేయదు. అదే కీడు కలుగుతుంది అని తెలిస్తే, అలా జరుగుతుందేమోనన్న విచారం పట్టి వేధిస్తుంది. రాబోయే సుఖదుఃఖాలు రాకమానవు. అలాంటి వాటి కోసం జ్యోతిషాన్ని ఆశ్రయించడం వ్యర్థమని రాజశేఖరుడు ఇలాంటి జ్యోతిషుల వల్ల మోసపోయిన తరువాత నేర్చుకున్న పాఠం. జీవితం నేర్పే పాఠం చాలా కర్కశంగా ఉంటుందనడానికి రాజశేఖరుడే సాక్ష్యం.

జ్యోతిషం సరిగా చెప్పలేకపోవడమే కాదు కుహనా జ్యోతిషులు ప్రశ్నశాస్త్రం పేరిట, ఇతర దంభాచారులు వివిధ తంతుల పేరిట మూఢవిశ్వాసంలో మునిగిపోయిన సామాన్యులను పీడించేవారు. ఈ మోసాన్నే కందుకూరి వారు ఇలా బహిరంగపర్చారు.

'సిద్ధాంతియు, శాస్త్రియు రహస్యముగా నన్ని సంగతులను మాట్లాడుకొని రాజశేఖరుడు గారిచ్చు బహుమతిలో చెరిసగము బుచ్చుకొనునట్లు సమాధానపడిరి. కాబట్టి రాజశేఖరుడు గారికి నమ్మకము పుట్టించుటకయి ముందుగా చేయవలసిన తంతును కూడబలుకుకొన్న తరువాత, వస్తువును దాచినవాడు, పళ్లెములో బియ్యము పోయగానే వెనుక దాను పోసేదననియు వాడే దానిని తీసి దాచినాడని చెప్పవలసినదనియు సిద్ధాంతి ఇంటి వద్దనే నిర్ణయము జేసినందున, శాస్త్రులతని సహాయ్యము చేత నిముషములో నుంగరమును దీసినవాని జూపగలిగెను.'(రాజశేఖర చరిత్రము పుట. 68)

ప్రజలను మోసం చేసేవారంతా నదిలో మొసళ్లలాంటి వాళ్లు. ఒక మొసలి మరో మొసలిని దెబ్బతీయదు. సరిగదా వేటలో సాయం చేస్తుంది. అలాగే ఒక మోసగాడు మరో మోసగానిని మోసపుచ్చడు. ఇద్దరు కలిసి ఇతరులని వేధిస్తారు. పీడిస్తారు. సిద్ధాంతులు, శాస్త్రులు ఇలా చేతులు కలిపితే అక్కడ శాస్త్రం పేరిట జరిగేది పచ్చి మోసమే, చేసేది దోపిడీయే. ఆ మోసం చేసే ప్రక్రియని, వాళ్లు కూడబలుక్కునే విధానాన్ని ఇక్కడ వర్ణించారు కందుకూరి. పోయిన వస్తువును దొంగిలించినవానిని కనిపెట్టడం అనే ప్రక్రియ సంప్రదాయ శాస్త్రాలలో లేకపోయినా ఉన్నట్టే నాటకమాడుతారు సిద్ధాంతి, శాస్త్రులు. మూఢంగా వారిని విశ్వసించడం అంటే మోసం చేయమని ఆహ్వానించడమే.

అలాగే పోయిన వస్తువులు కనిపెడతామని, వాటిని దొంగిలించిన వారి వివరాలు మంత్రాల ద్వారా, తంత్రాల ద్వారా తెలుసుకుని చెబుతామని చెప్పే మంత్రగాళ్లకు రాజశేఖర చరిత్ర రచనాకాలం స్వర్ణయుగం అని చెప్పవచ్చు. ఎవరైనా ఏదైనా వస్తువు పోతే వెంటనే ఈ మంత్రగాళ్లను సంప్రదించేవాళ్లు. ఈ మంత్రగాళ్లు ఏదో హడావిడి చేసి ఎవరో ఒక అమాయకుని పేరు చెప్పే వాళ్లు. గృహస్థు నుంచి డబ్బు రాబట్టుకునేవారు. ఆలా వారు చేసే తంతుని ఇలా వర్ణించారు కందుకూరి.

'ఆ కాగితం మీద హారది కర్పూరముతో బీజాక్షరములు రాసేది యుల్లిపాయ కంపుపోవుటకేగాని మరియొకందుకు గాదు. తరువాత సాంబ్రాణి పొగలోను కర్పూరపు దీపము మీదను పొగచూరబెట్టుట మున్ను కనబడకున్న యక్షరములు స్ఫుటముగా గనబడునట్లు చేయుటకయి గావించిన తంత్రము.' (రాజశేఖర చరిత్రము పుట. 70-71)

గృహస్థుని మోసం చేయడానికి గాను మంత్రగాళ్లు తెల్లకాగితం పైన ఉల్లిపాయ రసంతో ముందుగానే ఎవరిదో ఒకరి పేరు రాసేవారు. తరువాత ఆ కాగితాన్ని తెల్లకాగితంగా నమ్మిస్తూ, కాస్త తంతు నిర్వహించి దీపం దగ్గరికి తీసుకుపోగానే దీపపు మసివల్ల ఆ ఉల్లిపాయ రసపు అక్షరాలు నల్లబడి కనిపించేవి. దానితో దేవుడే ఆ పేరును బయటపెట్టినట్లు హడావిడి చేసేవారు. ఆ ఉల్లిపాయ వాసనను ఎవరూ గుర్తుపట్టకుండా ఆ కాగితానికి హారతి కర్పూర చూర్ణాన్ని రాసి, సాంబ్రాణి పొగ వేసేవారు. ఇదంతా ఉల్లివాసన పోయేందుకే. ఇది తెలియని అమాయకుడైన గృహస్థు ఈ కుహనా తాంత్రికులకు, మాంత్రికులకు, జ్యోతిషులకు డబ్బు కట్టి మూర్ఖుడౌతాడు. ఈ తతంగంలో ఒక అమాయకుని పేరు బయటపడడం వల్ల వాడి జీవితం దుర్భరమౌతుంది.

ఇలా గృహస్థుని మోసం చేసేది కేవలం చదువుకున్న సిద్ధాంతులు, శాస్త్రులు మాత్రమే కాదు. ఇతరులు కూడా అవకాశం దొరకాలే కాని, తామూ మోసం చేయకుండా వదిలిపెట్టరు. ఇతరులు సైతం ఇలాంటి మోసాలను ఎలా చేస్తారో కూడా కందుకూరి ఇలా వివరించారు -

'అంజనము వేయువాడు దాసిదాని చేత గది నొక దానిని నలికించి, అందొకమూలను నూనెతో గొప్ప దీపమును వెలిగించి, తాను స్నానము చేసివచ్చి, దీపము ముందట పిండిముగ్గుతో నొక పట్టుపట్టి పంచాంజనేయ విగ్రహమును కాటుక కరాటమును ఉంచి పూజ చేయుచుండెను. చాకలివాడు వచ్చినతోడనే యాతడు తన పూజను చాలించి, పట్టులో వానిని గూరుచుండబెట్టి, బరిణలోని కాటుకను వాని కుడిచేతికి రాచి, దానిని నిదానించి చూచి, దానిలో నేమి కనబడునో దానినెల్ల తనకు జెప్పుచుండమని యుత్తరవు చేసెను....' (రాజశేఖర చరిత్రము పుట. 159)

శాస్త్రాన్ని అడ్డం పెట్టుకుని సిద్ధాంతులు, శాస్త్రులు మోసాలు చేస్తే, కాస్తో కూస్తో వాక్చాతుర్యం, క్రియా చాతుర్యం ఉన్న బ్రాహ్మణేతరులు కూడా ఈ మోస మార్గాన్ని వదిలిపెట్టలేదు. అంజనం వేసేవాడు చాకలివాని కంటికి ఒక ప్రత్యేకమైన కాటుకను పట్టించి, వాని సహాయంతో పోయిన వస్తువును కనిపెట్టినట్లు చెబుతాడు.

కాటుక పెట్టుకున్న వాని కంటికి హనుమంతుడు కనిపించి పోయిన వస్తువు వివరాలను, దొంగిలించినవాని వివరాలను చెబుతాడని ఒక విశ్వాసం. ఈ విశ్వాసాన్ని అడ్డం పెట్టుకుని అంజనం వేసేవారు మోసం చేస్తారు. ముందుగానే చాకలితో కూడబలుక్కుని, వానిని ఈ ప్రక్రియకు సిద్ధం చేస్తారు. అంజనంలో చెప్పవలసిన దొంగ పేరును, రూపురేఖలను ప్రశ్నల మాధ్యమంగా, మార్మికంగా వానికి సూచనలుగా అందిస్తారు. ఆ చాకలి ఈ ప్రశ్నలను బట్టి సూచనలు అర్థం చేసుకుని, ముందే నిర్ధారించుకున్న దొంగ పేరు చెబుతాడు. పోయిన వస్తువు తిరిగి దక్కదు సరిగదా, ఈ కుతంత్రానికి ఒక అమాయకుని బతుకు నాశనమవడమే కాదు, గృహస్థు కూడా ఆర్థికంగా నష్టపోతాడు.

ఇక భూతాలను వదిలించేవారూ ఆ కాలంతో తక్కువేం కాదు. దీర్ఘకాలం వియోగంలో ఉన్న రుక్మిణి లాంటి వారు మనస్తాపానికి చిక్కిపోతుంటే, ఆ వాస్తవాన్ని గ్రహించక, ఆమె అనారోగ్యాన్ని భూతం పట్టినట్టుగా భావించడం నాటి సమాజంలోని మూఢనమ్మకాలకు అద్దం పడుతున్నది. హరిశాస్త్రులు అనే భూతమాంత్రికుడు చేసిన తంతును పంతులుగారు ఇలా వర్ణించారు.-

'ఒకనాడు హరిశాస్త్రులు వికృతవైషముతో మరల వచ్చి రుక్మిణి చేయిచూచి భూతనాడి యాడుచున్నదని చెప్పెను. బైరాగి చేత విభూతి పెట్టించి లోపలికి తీర్థ మిప్పించిరి కాని, అందువలన రుక్మిణి కేమియు గుణ మగపడలేదు. ఒకనాడొక బుడబుక్కలవాడు నెత్తిమీద తలగుడ్డలో బక్షియాకలను, బుజము మీద వ్రేపబెత్తముల కట్టయు, వీపున బెత్తములకు వ్రేలాడగట్టిన బెద్ద తోలు సంచియునుండ డక్కలను వాయించుచు వచ్చి, మాణిక్యాంబ శకునమడిగినప్పుడు గీతలను బొమ్మలను వేసియున్న తాటాకుల పుస్తకము చూచి తీర్థమునకు వెళ్లిన

దినము రావిచెట్టు మీదనుండి వచ్చి యొక కామినీ గ్రహము సోకినదనియు, దిగదుడుపు పెట్టినబోవుననియు జెప్పి యొక వేరుముక్క యిచ్చి దానిని వెండి తాయెత్తులో బెట్టి దండచేతికి గట్టుమని చెప్పి యొక రూపాయి పుచ్చుకొని పోయెను. ఆ ప్రకారముగా మాణిక్యాంబ రుక్మిణికి దిగదుడుపు పెట్టెనుగాన యందువలన గార్యమగపడలేదు. (రాజశేఖర చరిత్రము పుట. 76)

ఇలా మూఢనమ్మకాలను అడ్డం పెట్టుకుని అమాయకులను దోచుకోవడం సులభమేమీ కాదు. కష్టాలు వచ్చినప్పుడు మంత్రతంత్రాలను చేసి ధనం సంపాదించే అవకాశాలు బాగానే ఉన్నా, ఒక్కోసారి తమకు వచ్చే కష్టాలకు ఈ మాంత్రికులే కారణం అని ప్రజలు నమ్మే అవకాశం కూడా ఉన్నది. భూతాలు వదిలించగలవారు భూతాలను ఆవేశింపజేయగలరు అని ప్రజలు నమ్మడమే ఇందుకు కారణం. ఒక్కసారి అపనమ్మకం ఏర్పడ్డ తరువాత, తమకు జరిగే ప్రతి కష్టానికి ఆ మాంత్రికుడే కారణం అని జనం నమ్ముతారు. అది విపత్కర పరిస్థితి. ఇలాంటిది వచ్చినప్పుడు పోటీదారుడైన మరో మాంత్రికుడు లాభపడతాడేగాని, ప్రజలకేం లాభం ఒరగదు.

సూచనాప్రాయంగా ఇలా అనేక సామాజిక దుర్నీతులను కందుకూరివారు తమ రాజశేఖర చరిత్రలో అవకాశం ఉన్న ప్రతిచోట ప్రస్తావించారు. పాత్రల సంభాషణ మాధ్యమంగా, స్వగతాల మాధ్యమంగా వాటిలోని డొల్లదనాన్ని వెక్కిరించారు.

కందుకూరి వారివలెనే స్వయంగా సంఘ సంస్కర్త యైన వేదనాయకం పిళ్లై తన ప్రతాప ముదలియార్ చరిత్రలో ఇలా సమాజంలో నాడు వ్యాపించి ఉన్న అనేక దుర్నీతులను ఖండించారు. ఈ నవలలో నీతికథలు, ప్రముఖుల జీవితాలలోని సందర్భాలను యథోచితంగా చెప్పిన సందర్భాలలోను, ప్రతాపుని అభిప్రాయాల రూపంలోను అనేక దుర్నీతులను వారు ప్రస్తావించారు.

కందుకూరివారి వలెనే వేదనాయకంగారు కూడా జ్యోతిషం పేరిట జరిగే తంతుకు వ్యతిరేకులు. ఆయన అభిప్రాయానుసారం జ్యోతిషం చెప్పడమనేది ఉదర పోషణార్థం చేసే పనులలో ఒకటి. ప్రతాప ముదలియార్ చరిత్రలో ఒక జ్యోతిషుని పాత్రద్వారా సత్యాన్ని ఇలా చెప్పించారు -

మన విద్యలన్నీ శుద్ధ అబద్ధం. ఏమాత్రం నిజం కాదు. ప్రపంచంలో ఉదర పోషణార్థం జనులు ఎన్నెన్నో వేషాలు వేస్తూ జీవిస్తుంటారు. ఆవిధంగా నేను కూడా ఈ వేషాన్ని ధరించి తిరుగుతున్నాను. నా విషయంలోనే ఈ శాస్త్రం ఫలించలేదంటే ఇక అన్యుల విషయంలో అడగవలసినది ఏమున్నది. (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 30)

ఈ జ్యోతిషుడు తాము చేస్తున్నది మోసం అని బయట పడిన తరువాత ప్రతాపునితో పై మాటలు అంటాడు. ఉదర పోషణార్థం బహుకృత వేషం అన్నదానిలో ఇది ఒక భాగమేనని అంగీరిస్తాడు. అయితే ఈ మాటలలో సంప్రదాయం పేరిట చేస్తున్న తంతులు ఏవీ సబబైనవి కావన్న అభిప్రాయం కూడా జ్యోతిషుని మాటలలో కనిపిస్తున్నది. మన విద్యలన్నీ శుద్ధ అబద్ధం. ఏ మాత్రం నిజం కాదు అన్నది కేవలం పొట్టకూటికి వాడుకునే గారడీ విద్యలనే మనం గ్రహించాలి. అదే జ్యోతిషుడు మరికొంత ముందుకుపోయి తాను జ్యోతిషం చెప్పే విధానాన్ని ఇలా వివరిస్తున్నాడు -

మంత్రతంత్రాల కన్నా తెలివితేటలు మిన్న అన్న సామెత ప్రకారం నా తెలివితేటలతో జీవినాన్ని గడుపుతున్నానే కాని, శాస్త్రంతో జీవించడంలేదు. అందరికీ సుఖదుఃఖాలు కలిసే వస్తుంటాయి. నేను కూడా సుఖాన్ని, దుఃఖాన్ని కలిపి అందరికీ శాస్త్రం చెబుతూ వస్తూ ఉంటాను. అయితే సుఖాన్ని అందరూ ఇష్టపడడం వల్ల, సుఖాన్నే అధికంగా చెప్పి అందరినీ సంతోషపెట్టడం నా అలవాటు. (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 31).

వాస్తవంగా మంత్రతంత్రాలు లేవని, కేవలం తాను తన తెలివి తేటలతో మాత్రమే జీవిస్తున్నానని జ్యోతిషుడు అంగీకరిస్తున్నాడు. అంతేకాదు. జనుల జీవితాలలో వచ్చే సుఖదుఃఖాల సమాహార స్వరూపాన్ని తాను ఎలా

ఉపయోగించుకుంటున్నాడో కూడా వివరిస్తున్నాడు. సాధారణంగా ఎవరైనా భవిష్యత్తులో తమకు మేలు జరుగుతుందో లేదో అని తెలుసుకోవడానికే జ్యోతిషుని ఆశ్రయిస్తారు. అంతేకాని, తమకు రాబోయే కష్టాలను తెలుసు కోవాలని ఎవరూ అనుకోరు. కాబట్టి అలాంటి వారికి రాబోయే సుఖాల గురించి, ఉన్నతి గురించి చెబితేనే నాలుగు రాళ్లు దక్కేది. అందుకే జ్యోతిషుడు తెలినిని ఉపయోగించి అడిగినవారికి కేవలం సుఖం గురించే అధికంగా చెప్పి వారిని సంతోషపెడుతున్నాడు. తద్వారా నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నాడు.

జ్యోతిషాన్ని నమ్మడం నమ్మకపోవడం వ్యక్తిగతమై అయినా, అలా నమ్మి పోనపోవడం మోనగాళ్లను ప్రోత్సహించడమే అవుతుంది. జ్యోతిషులే తాము శాస్త్రాన్ని నమ్ముకోక, తెలివితేటల్ని నమ్ముకుంటున్నాం అని చెప్పినప్పుడు, వ్యక్తులు తమ వివేకానికి పని చెప్పాల్సి ఉంటుంది. ప్రతాపుడు జ్యోతిషుని మాటలు విన్న తరువాత జ్యోతిషం పేరిట జరుగుతున్న మోసాన్ని గ్రహించాడు. అందుకే జ్యోతిషుల మాటలను నమ్మి భవిష్యత్తును తెలుసుకోవడం మూర్ఖత్వం అవుతుందని తెలుసుకున్నాడు. జ్యోతిషం ద్వారా భవిష్యత్తును తెలిసుకోవడం అన్ని వేళలా శ్రేయస్కరం కాదు అన్న కందుకూరి అభిప్రాయంతో సమానమైన అభిప్రాయాన్ని ఇలా వ్యక్త పరిచాడు.-

జ్యోతిషం అబద్ధమనేది ఆ జ్యోతిష్కుడే అంగీకరించినందు వలన ఇకమీదట మీకు వేరే సాక్ష్యం అవసరం లేదు. మన నిత్యజీనితంలో జరిగే సంఘటనలన్నీ మనకు తెలియకుండా మన మంచి కోసమే భగవంతుడు బహిర్గతం కానీయక మరుగుపరిచి ఉంచాడు. రాబోయే కష్టాలు మనకు తెలియకుండా ఉండడం వలన ఆ కష్టాలు మనకు ఆసన్నమయ్యే వరకు మనం దుఃఖం లేకుండా ఉంటాము. అది ముందే తెలిస్తే ముందు దుఃఖం వెనుక దుఃఖం ఎల్లప్పుడూ దుఃఖంగానే పరిణమిస్తూ ఉంటుంది. ఆ విధంగానే సుఖాలు మనకు తెలియకుండా వచ్చినట్లయితే అధికమైన సంతోషాన్ని కలిగిస్తుంది. అలా కాకుండా ముందుగా తెలిస్తే సంతోషం అంత అధికంగా ఉండదు. దీర్ఘదర్శనం అన్నది ప్రస్తుతం ప్రపంచంలో లేదు. అపురూపమైనటువంటి ఆ విద్య ఎంతోమంది భక్తులు, మేధావులు ఉండగా వారికి ఇవ్వకుండా ఈ జ్యోతిష్కుని పోలిన మూఢులకు, బుడబుక్కల వారికి, ఎరుకలవారికి భగవంతుడు ఇచ్చి ఉంటాడా? (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 31)

మంచి, చెడులు మన కర్మల ప్రకారం జరుగుతాయి. భగవంతుడు ఇందుకుగాను ఒక క్రమాన్ని ఏర్పరచాడు. మంచి జరుగాల్సిన సమయంలో మంచి జరుగుతుంది. అలాగే చెడు జరుగవలసిన సమయంలో చెడు జరుగుతుంది. ఈ ఎరుక ఉంటే భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలుసుకోవలసిన అవసరం వ్యక్తులకు ఏర్పడనే ఏర్పడదు. సుఖం మనకు తెలియకుండా వస్తేనే దాని వల్ల సంతోషం కలుగుతుంది. అలాగే దుఃఖం మన భాగ్యంలో ఉంటే అది వచ్చేవరకైనా సుఖంగా ఉంటాం. అదే దుఃఖం వస్తుందని ముందే తెలిస్తే, ఆ సంతోషం పెద్దగా ఆనందాన్ని ఇవ్వదు సరిగదా అప్పటి వరకూ ఉన్న జీవిత దుఃఖభాజనంగా మారుతుంది. అందుకనే భగవంతుడు ఈ కాలజ్ఞాన విద్యను అందరికీ అందించడు. జీవితాన్ని కాచి వడబోసిన పెద్ద పెద్ద భక్తులు, మేధావులను వదిలిపెట్టి భగవంతుడు ఇలా భవిష్యత్తును దర్శించే విద్యను జ్యోతిషులకు, బుడబుక్కలవారికి, ఎరుకలవారికి అందించడని ప్రతాపుడు అభిప్రాయ పడతాడు.

ఒకవిధంగా గమనిస్తే ఈ అభిప్రాయం సరైనదే. చాలాకాలం దీక్షలలో నియమితంగా జీవితం గడిపిన మహాభక్తులకు భవిష్యద్దర్శన విద్య ఉంటే వారు సమాజం మేలుకు ఆ విద్యను ఉపయోగిస్తారు. సదా సమాజ శ్రేయస్సుకు కృషి చేసే మేధావులకు ఈ విద్య అందితే వారు రాబోయే కష్టాలను ఎదుర్కొనే మార్గాలను కనుగొనడానికి ఆ విద్యను వాడుతారు. అంతేగాని ఈ విద్య

కేవలం జీవనాధారం కోసం తమకు తెలిసిన విద్యలను, చాతుర్యాన్ని వాడుకునే జ్యోతిషులకు, విద్యకు కాస్త దూరంగానే ఉండిపోయే బుడబుక్కలవారికి, ఎరుకల వారికి ఈ విద్య అందడం వల్ల సమాజానికి లాభించేది ఏమీ ఉండదు సరిగదా, ఆ విద్య జీవికకు ఆలంబనగా మారడం వల్ల వారు అమాయక ప్రజలను మోసం చేసి డబ్బు గడించే అవకాశాలను పెంచుతుంది. ఈ అవ కాశాలు సమాజాన్ని మోసం చేసే అవకాశాన్ని మోసకారులైన వ్యక్తులకు ఈ విద్యలు అందిస్తాయి. అందుకే పొట్టకూటి కోసం జ్యోతిషాన్ని చెప్పేవారిని నమ్మకూడదు అని వేదనాయకం ప్రతాపుని పాత్ర మాధ్యమంగా ఉప దేశించారు.

ఇలా సమాజాన్ని స్వార్థప్రయోజనాలను జ్యోతిషుల వంటివారు వాడుకుంటున్నది కేవలం ధన సంపాదన కోసమే. ధనమే సర్వస్వం కాదు. కేవలం ధనం సంపా దించడం సుఖాన్ని ఇవ్వదు. అందుకే జీవితంలో ధనమే ప్రధానం కాదు అని వేదనాయకం ప్రబోధించారు -

ఇహలోక సుఖాలను అనుభవించడానికి ధనం మాత్రం సరిపోదు. ధనంతోపాటు పుణ్యం కూడా చేరి ఉండడం అవసరం. కొందరు ధనవంతులు తాము అనుభవించక, ఇతరులకు ఉపకారం చేయక ధనాన్ని పెట్టెలో పెట్టి తాళం వేసి కాపాడుతుంటారు. వాళ్లకు ఇహలోకంలోను, పరలోకంలోను ఏ సుఖం ఉంటుంది? (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 31)

ఈ లోకంలో సుఖంగా జీవించాలంటే కేవలం డబ్బు ఉంటే చాలదు. దానితో పాటే సుఖంగా జీవించడానికి తగినంత పుణ్యం కూడా మనం సంపాదించుకుని ఉం డాలి అని తాత్వికంగా చెప్పారు వేదనాయకం పిళ్లై. ధనం సంపాదించి, ఆ ధనాన్ని తాము అనుభవించక, ఇతరు లకు అవసరకాలంలో సహాయం చేయడానికి వాడకపోతే ఆ ధనం వ్యర్థమే. అది కేవలం ఇనపపెట్టెలకు మాత్రమే పరిమితమౌతుంది. అలాంటి ధనం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. అందుకే కేవలం ధన సమూపార్జనే ధ్యేయంగా జీవించేవారికి ఆ ధనం వల్ల ఇహలోకంలో సుఖం ఉండదు. ధనార్జన కోసం చేసే దుర్మార్గాల వల్ల పరలోకంలో ప్రశాంతత ఉండదు. అంటే ధనాశ ఇహపరా లను రెంటినీ చెడగొడుతుందన్న మాట. ఈ తాత్విక వాన్తవాన్ని వేదనాయకం పిళ్లై ప్రతాపుని పాత్ర మాధ్యమంగా మనకు బోధిస్తున్నారు.

ఇలా పాపపుణ్య విచక్షణ, సమాజంలో నడుచు కోవలసిన విధానం, వివేకం కలగాలంటే విద్య ఉండాలి. అందుకే వేదనాయకం విద్య ఆవశ్యకతను ఇలా చెప్పారు. -

నా చిట్టితండి, నీవు చెప్పినది ఆవగింజంత కూడా సరికాదు. చదువు సంధ్యలు బొత్తిగా లేని పామరజనులను చూడు. వాళ్ల చేష్టలకు, మృగాల చేష్టలకు ఏం భేదం ఉంది? చదువు లేనట్లయితే భగవంతుని యథార్థ స్వరూపాన్ని, అతని అనంత కళ్యాణగుణగణాలను, ధర్మాధర్మాల భేదాలను, విజ్ఞానశాస్త్రాలను, భూగోళం, ఖగోళం, గణితం మొదలైన శాస్త్రాలను, ఇహపర సుఖాలను అందుకోగల మార్గాంతరాలను మనం ఎలా తెలుసుకోగలం? మనకు కళ్లు ఉన్నప్పటికీ సూర్యప్రకాశం లేనట్లైతే ఏమి ప్రయోజనం? మన కళ్లకు విద్య అనే జ్ఞానకాంతులు అత్యావశ్యకములు కాదా- రత్నం సాన పట్టకనే ప్రకాశిస్తుందా? (ముదలియార్ చరిత్ర పుట 4)

విద్య లేనివాడు వింతపశువు అని నానుడి. దీన్నే చెబుతున్నాయి పై వాక్యాలు. విద్యలేని పామర జనుల ప్రవర్తన మృగసమానంగా ఉంటుంది. వారిలో వివేకం, కర్తవ్యాకర్తవ్యాల విచక్షణ ఉండదు. విద్య లేకపోతే ఈ ప్రపంచ నిర్వహణం అర్థం కాదు. భగవంతుని సంకల్పం తెలుసుకోలేం. విద్య లక్ష్యం మేలును, శ్రేయస్సును తెలుసుకోవడమే.

ఈ సృష్టి నిర్మాత గురించి, ఆయన గుణగణాల గురించి, మన జన్మల సార్థకతను గురించి, ఈ లోకంలో ప్రవర్తించవలసిన విధానం గురించి, ధర్మాధర్మాల భేదాన్ని గ్రహించడం కోసం విద్య చాలా అవసరం. విద్య ఉ

ంటేనే మనం వివిధ శాస్త్రాలు ఎలా సమాజానికి ఉప యోగపడతాయో, వ్యక్తుల జీవితాలను సాఫల్యం దిశగా తీసుకుపోతాయో తెలుసుకోగలుగుతాం. ఉత్తమమైన మానవజన్మ ఎత్తిన తరువాత కూడా విద్యను సంపాదించ పోతే ఆ జన్మ వృథా. ముడి రత్నాన్ని సానబడితేనే ప్రకాశం. ముడి రత్నం వంటి మానవ జన్మను విద్య అనే సానపైన రాపాడిస్తేనే ఆ రత్నం ప్రకాశించేది. ఇలా విద్యతో రాపాడించనప్పుడు ఆ ముడి రత్నం అలానే కాంతి హీనంగా, ప్రకాశహీనంగా, సౌందర్యహీనంగా మిగిలి పోతుంది. కాబట్టి విద్య మనిషికి చాలా అవసరం అని వేదనాయకం ఉపదేశించారు.

స్వయంగా న్యాయమూర్తి అయిన వేదనాయకం న్యాయవ్యవస్థలోని సర్వత్ర వ్యాపించి ఉన్న కుళ్లను గ్రహించారు. ఏ రకమైన ప్రభుత్వ వ్యవస్థ ఉన్నా ప్రజలు ఆ వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచుకునే జీవిస్తారు. రాచరికంలో రాజు న్యాయం చేస్తాడని, అధికారస్వామ్యం ఉంటే అధికారులు న్యాయం చేస్తారనే నమ్మకం ఉంటేనే ప్రజలు ఆ వ్యవస్థలో సుఖంగా జీవిస్తారు.

వివాదాలు చెలరేగినప్పుడు రాజు, లేదా అధికారులు న్యాయబద్ధంగా వ్యవహరిస్తే ఆ వ్యవస్థ లోపరహితంగా ముందుకు సాగుతుంది. అలాకాక న్యాయవ్యవస్థ లోపా లతో కునారిల్లుతుంటే సమాజంలో అన్యాయం రాజ్యం ఏలుతుంది. కాబట్టి ఎలాంటి సామాజిక పాలనా వ్యవస్థ ఉన్నా, అందులోని న్యాయవ్యవస్థ లోపరహితంగా ఉండాలి.

ప్రతాప ముదలియార్ చరిత్ర రచనాకాలానికి న్యాయ వ్యవస్థ ఎలా ఉన్నదో, అందులో దుర్మార్గం ఎంత వ్యవస్థీ కృతంగా సాగుతూ ఉండేదో ప్రతాపుని పాత్ర మాధ్యమంగా వేదనాయకం పిళ్లై వ్యక్తపరిచిన అభి ప్రాయాల ద్వారా తెలుస్తున్నది. అప్పట్లో న్యాయ మూర్తులు, న్యాయవాదులు న్యాయవ్యవస్థను ఎంతలా భ్రష్ట పట్టించారో ఈ క్రింది వాక్యాలు వివరిస్తున్నాయి.

న్యాయాధిపతులు మొదలైన అధికారులు లాభాలు ఏవీ ఆపేక్షించనందు వలన వాళ్లకు ప్రభుత్వం చాలినంత జీతాలు ఏర్పాటు చేసి ఉన్నారు. అట్లున్నప్పటికీ పై అధికారులు ప్రతి వాజ్మూలంలోను వాది, ప్రతివాదు లిరువురి దగ్గర నుండి లంచం తీసుకుని దానిని పని చేయడానికి ఇరు పక్షాలవారికి కొంత అనుకూలం, కొంత ప్రతికూలము చేస్తుంటారు. ఒకరికి పూర్తిగా సాను కూలంగా గాని పక్షంలో అతని దగ్గర తీసుకున్న లంచాన్ని తిరిగి ఇవ్వక ఇకమీద వచ్చే వాజ్మూలానికి బయానాగా ఉంచుకుంటారు. అంతే కాక, వారి కుటుంబ సభ్యు లందరికీ ఏడాదికి సరిపడే వస్త్రాలను, జవుళీ వ్యాపారులు ఇస్తూ ఉంటారు. అలాగే ఉప్పు మొదలుకొని కర్పూరం వరకు గల అన్ని వస్తువులను వ్యాపారులు ఉచితంగా ఇస్తూ ఉంటారు. మేము అమావాస్యనాడు మాత్రమే దొంగలించడానికి వెళ్తాము. ఆ అధికారులు అహో రాత్రాలు దోపిడీ చేస్తూ ఉండడం వలన వారి దోపిడీని మా దోపిడీతో పోల్చడానికి వీలవుతుందా? (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 140)

న్యాయాధిపతులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం కోసమే ప్రభుత్వం వారికి పెద్ద జీతాలను ఇస్తుంది. ఇతరులు న్యాయమార్గంలో ఉండేలా చూడడానికి వీరికి ప్రత్యేకంగా శిక్షించే అధికారాన్ని కట్టబెట్టింది. అయితే కొందరు స్వార్థపరులైన న్యాయమూర్తుల కారణంగా న్యాయవ్యవస్థే కునారిల్లే పరిస్థితి వచ్చింది. మెల్ల మెల్లగా న్యాయాధిపతులే లంచగొండులుగా మారడం వల్ల సంపూర్తి న్యాయవ్యవస్థ అన్యాయ వ్యవస్థగా మారి పోయింది. న్యాయమూర్తులు వాదులు, ప్రతివాదుల ఇద్దరి వద్ద నుంచి లంచాలు తీసుకునేవారు. అలా ఇద్దరి దగ్గరునుంచి లంచం తీసుకున్నప్పుడు ఇద్దరికీ న్యాయం చేయాలి కాబట్టి తీర్పులను మధ్యస్థంగా అంటే కొంత వాదికి అనుకూలంగా, మరికొంత ప్రతివాదికి అను కూలంగా ఇచ్చేవారు. ఒకవేళ తీర్పు ఎవరో ఒకరికి అధికంగా మేలు చేసేదిగా ఇవ్వవలసి వస్తే, రాబోయే

కాలంలో వేయబోయే వ్యాజ్యాలకు బయానాగా ఓడినవారిచ్చిన లంచాన్ని ఉంచేసుకునేవారు. అంటే మళ్లీ వ్యాజ్యానికి ఆస్కారం కల్పిస్తూ తీర్పు ఉంటుందన్న మాట. మళ్లీ వ్యాజ్యానికి అవకాశం ఉంటే మళ్లీ లంచాన్ని తీసుకునే అవకాశం ఏర్పడుతుంది.

ఇది ఒక విషవలయంలాంటిది. అందుకే ఓడినవాడు న్యాయస్థానంలోను, గెలిచినవాడు ఇంటిలోను ఏడుస్తారనే మాట పుట్టింది. పంతాలకు పోయి, వ్యాజ్యాలు వేసుకుని, న్యాయమూర్తులకు లంచాలు ఇచ్చి, తీర్పు అనుకూలంగా తెచ్చుకున్న తరువాత మళ్లీ వ్యాజ్యానికి అవకాశం ఉంటే గెలిచినవాడు సాధించిందేమి ఉండదు. మళ్లీ లంచాలు ఇచ్చి తీర్పుని తెప్పించుకోవాలి. అది కాలనష్టం, ధననష్టం కూడా. ఓడిన వ్యక్తి మళ్లీ గెలుస్తాననే ఆశతో వ్యాజ్యం వేయడం న్యాయవాదులను, న్యాయ మూర్తులను పరోక్షంగా లంచాల ద్వారా పోషించడమే. ఎందుకంటే న్యాయమూర్తులు మళ్లీ లంచాలు తీసుకుని మధ్యస్థంగానే తీర్పు ఇస్తారు కాబట్టి. ఈ వలయం ఎప్పటికీ తెగదు. వాది, ప్రతివాదులు న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ, న్యాయవాదులను, న్యాయ మూర్తులను పోషిస్తూ, ధనవ్యయం చేసుకుని పేదలుగా మారుతారే తప్ప, న్యాయాన్ని పొందలేరు.

న్యాయస్థానాలు ఇలా కుళ్లిపోవడానికి కేవలం న్యాయమూర్తులు, న్యాయవాదులే కారణం కాదు. కూటసాక్ష్యాలను చెప్పడానికి సిద్ధంగా ఉండేవారు కూడా కారకులే. ఈ కూటసాక్షులు చెబుతున్నది అసత్యం అని తెలిసినా న్యాయమూర్తులు వాటిని న్యాయస్థానాలలో అంగీకరిస్తారు. సాక్షులు చెబుతున్నది కూటసాక్ష్యం అని న్యాయమూర్తులకు తెలుసు, న్యాయమూర్తులకు ఈ విషయం తెలుసని సాక్షులకూ తెలుసు. ఇద్దరూ వాది ప్రతివాదులను దోచుకోవడానికి న్యాయవ్యవస్థని మార్గంగా ఎంచుకున్నవారే. ఈ కూటసాక్షులు న్యాయస్థానాలలో నిర్భయంగా దొంగసాక్ష్యాలు చెప్పడానికి వత్తాసుగా న్యాయమూర్తుల ప్రవర్తన ఉంటున్నది అని వేదనాయకం ఇలా చెప్పారు.-

దొంగ వాజ్మూలాలు రావడానికి న్యాయాధిపతుల అజ్ఞానము, పక్షపాత దృక్పథము, కళంకిత హృదయమే ముఖ్య కారణాలుగా ఉంటున్నాయి. న్యాయాధిపతులు సమర్థులుగాను, శాస్త్రజ్ఞాన నిపుణులుగాను, అనుభవ జ్ఞులుగాను, నీతిమార్గ ప్రవర్తకులుగాను ఉన్నట్లయితే వాళ్ల ముందుకు దొంగ వాజ్మూలాలు వస్తాయా? వచ్చినా అవి జయిస్తాయా? (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 186)

ఇలా దొంగ వ్యాజ్యాలు, దొంగసాక్ష్యాలు, లంచగొండి న్యాయాధికారులు ఉండడం వల్లనే సామాన్యులు తమ బాధలను న్యాయస్థానాల దృష్టికి తీసుకుపోలేక పోతున్నారు. పైగా న్యాయవ్యవస్థ ఒక విచిత్రమైన భాషా ప్రయోగానికి వేదికగా నిలవడం, సామాన్యులకు ఆ న్యాయభాషతో, అందునా విదేశీ భాషయైన ఆంగ్లంలో ఉండడం కూడా పేదలను న్యాయానికి దూరంగా ఉంచుతున్నది. ఆనాటి న్యాయస్థానాలలో ఆంగ్ల ప్రతాపం ఎలా ఉండేదో ఈ క్రింది వాక్యాలలో మనం గమనించవచ్చు.-

న్యాయాధిపతులు కూడా కోర్టులో సదా ఆంగ్లంలోనే మాట్లాడి కోర్టు వ్యవహారాలన్నీ ఆంగ్లంలోనే జరిపిస్తున్నారు. కొన్ని సమయాల్లో వకీళ్లు, న్యాయాధిపతులు ఇరువురూ ఆంగ్లం చక్కగా తెలియకపోవడం వలన ఒకరు చెప్పింది మరొకరికి అర్థం కాక సంజ్ఞలతో అవస్థ పడుతుంటారు. ఆ కోర్టులు నాటకశాలల వలె కనిపిస్తున్నాయి కాని, న్యాయసభవలె తోచడం లేదు. (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 201)

ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో వచ్చిన చట్టాలు ఆంగ్లంలో ఉన్నందున న్యాయాధిపతులు, న్యాయ వాదులు ఆంగ్లంలో మాట్లాడుకుంటారు. వీళ్లూ ప్రజల లోంచి వచ్చినవారే అయినా అందరికీ అర్థమయ్యే మాతృ భాషను వదిలి వచ్చీరాని ఆంగ్లాన్ని ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా ఆంగ్ల భాషా ప్రావీణ్యం లేని న్యాయాధికారి, ఆంగ్లం సరిగా రాని న్యాయవాది న్యాయస్థానంలో

ఆంగ్లంలో మాట్లాడుతూ ఉంటే వారి మధ్య భావ వ్యక్తీకరణ సాధ్యం కాదు. అందుకే అవసర నిమిత్తం ఆంగ్లం ప్రయోగంతో పాటు ఆంగిక సంజ్ఞలు కూడా చోటు చేసుకోవాల్సిన అగత్యం ఏర్పడుతున్నది. ఇలా సంభాషణ, అభినయం రెండూ ఉండడం వల్ల ఆ వేదిక న్యాయసభ లాగా కాకుండా నాటకశాల లాగా కనిపిస్తుంది. అందుకే వేదనాయకం పిళ్ళై న్యాయస్థానాలని నాటకశాలలుగా కనిపిస్తున్నాయని వెటకారం చేశారు.

న్యాయమూర్తిగా జీవితాన్ని గడిపిన వేదనాయకం పిళ్ళై సమాజంలో పాతుకుపోయిన అనేక రకాలైన మోసాలను, దోపిడీలను, దుర్మార్గాలను దగ్గరగా గమనించారు. తాను గమనించిన మోసాలను, దుర్మార్గాలను ప్రతాప ముదలియార్ చరిత్రలో ప్రతాపుని పాత్ర ద్వారా ఖండించారు. అయన గమనించిన మోసాలలో వృత్తి వ్యాపారులు చేసేవి కొన్ని.

అందమైన బట్టలంటే అందరికీ మోజే. అందుకే బట్టల ఎంపిక చాలా సమయం తీసుకుని మరీ చేస్తారు. పండగలు, పబ్బాలకు బట్టలు కొనడం, పెట్టుపోతలకు బట్టలు కొనడం సర్వసాధారణమైన విషయం. కాబట్టి వస్త్ర వ్యాపారులకు మళ్లీ మళ్లీ అమాయకులను మోసం చేసే అవకాశం వస్తుంది. వారు చేసే మోసాలను వేదనాయకం ఇలా వర్ణించారు-

వస్త్రవ్యాపారుల జిత్తులు ప్రపంచ ప్రసిద్ధమైనవి. కాబట్టి వాటిని నేను వివరించవలసిన పని లేదు. వాళ్ల వస్త్రాలలోని నూలుపోగులను లెక్కపెట్టవచ్చుగాని, వాళ్లు చేసే కుతంత్రాలను లెక్కపెట్టడం అసాధ్యం. వాళ్లు పాత వస్త్రాలను కొత్తవిగా చేసి, తెల్లవాటిని నల్లవి చేసి, నల్ల వాటిని ఎర్రవిగా చేసి ఇంద్రజాల విద్యలు చేస్తూ ఉంటారు. (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 142)

ఈ బట్టల వ్యాపారులు చేసే మోసాలు చాలా రకాలుగా ఉంటాయి. పాతవాటిని కొత్తవిగా అమ్మడం, నాణ్యత లేనివాటిని నాణ్యమైనవిగా అమ్మడం వాటిలో కొన్ని మాత్రమే. చిరుగులు లేని పాత వస్త్రాలను కొని, వాటిని చలువచేసి, శుభ్రపరిచి, చక్కగా ఇస్త్రీలు చేసి, పొందికగా మడతలు పెడితే అవి కొత్తవిగానే కనిపిస్తాయి. సామాన్యులకు ఇలా మళ్లీ కొత్తవిగా మార్చబడ్డ వస్త్రాలకు, పాతవాటికి మధ్య తేడా తెలియదు. అలాగే పాత బట్టల రంగులు మార్చి కొత్తవిగా చేసినప్పుడు కూడా సామాన్యులు అవి పాతవే అని గ్రహించలేరు. పైగా వ్యాపారుల మాటల చాతుర్యం ఈ పాతవాటినే కొత్తవిగా నమ్మేలా చేస్తుంది. ఇలా వస్త్రవ్యాపారులు పాత బట్టలనే కొత్తవిగా అమ్ముతూ సామాన్యులను మోసం చేస్తుండే వారు.

మోసం చేయడంలో వీరికి ఏమాత్రం తీసిపోనివారు స్వర్ణకారులు. బట్టల తరువాత సామాన్యుల చూపుపడేది నగలపైన. కాస్త ఆర్థిక స్తోమత బాగుపడిన ప్రతి ఒక్కరు పండుగకో, పబ్బానికో నగ చేయించుకోవడం సర్వసాధారణం. ధనికులు మాట మాటికి చిన్న చిన్న నగలు చేయించుకోరు. మధ్య తరగతివారు, పేదలు చిన్న చిన్న నగలు అప్పుడప్పుడు చేయించుకుంటారు. అలా వచ్చిన వారిని తెలివిగా దోచుకుంటారు స్వర్ణకారులు. వాళ్లు చేసే వృత్తిపరమైన మోసాలను వేదనాయకం పిళ్ళై ఇలా వర్ణించారు-

కంసాలుల మోసాలు చెప్పడానికి వేయి నోళ్లున్నా సరిపోతాయా? వేయిమంది తనను జాగ్రత్తగా కని పెట్టి చూస్తున్నప్పటికీ అందరి కళ్లూ కప్పి, ఆర వరహా తూకమున్న బంగారంలో పావు వరహా తూకం బంగారాన్ని దొంగలించి బదులుగా రాగిని కలిపివేస్తుంటారు. ఇనుము మొదలైన లోహాలను బంగారంగా మార్చే రసవాదులున్నట్లు ప్రజలు చెబుతుంటారు. వాళ్లు కంసాలులే తప్ప వేరెవరినీ మనం ప్రత్యక్షంగా చూడలేదు. వాళ్లు దొంగిలించి ఎంత హస్తలాఘవం సంపాదించుకున్నారంటే వాళ్లు స్వంత ఉపయోగానికి నగలు చేసినప్పటికీ దానిలోనూ కొంత బంగారాన్ని దొంగిలిస్తారట. (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 143).

స్వంత భార్యకు పుస్తెలు చేసేటప్పుడు కూడా స్వర్ణకారులు బంగారం కొట్టేస్తారని ప్రతీతి. అలాంటివారికి 19వ శతాబ్ది తొలిచరణంలో కొరత లేదని తెలుస్తున్నది. అర వరహా బంగారంలో పావు వరహా తూకం బంగారాన్ని దొంగిలించడమంటే సగానికి సగం దొంగిలిస్తారన్న మాట. ఆ దొంగిలించిన బంగారం స్థానే రాగి కలుపుతారు. వాళ్ల స్వంత ఉపయోగానికి నగలు చేసినప్పటికీ దానిలోనూ బంగారాన్ని దొంగిలించేవారికి ఇతరుల బంగారం ఏ మూలకి? ఇలా మోసపుచ్చడం వారి స్వార్థమైతే, పోస పోవడం సామాన్యుల ఖర్మం.

ఇలా మోసాలు చేసేనారు వ్యాపారులైతే, సామాన్యులు కనీసం ఆయా వ్యాపారుల జోలికి పోకుండా ఉండవచ్చు. ఇలాంటి మోసగాళ్లు దేవాలయాలలో అధికారులుగా మారితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

నేను ఇంతవరకు మనుషుల సొత్తును అపహరించే దొంగల గురించి మాత్రమే ప్రస్తావించాను. దేవుని సొత్తును అపహరించే దొంగలు ఎంతోమంది ఉన్నారు. దేవాలయం, ధర్మసత్రం మొదలైన ధార్మిక సంస్థల ధర్మకర్తలు తదితర ఉద్యోగులు చేస్తున్న దోపిడీకి పరిమితి అంటూ ఉందా? పుస్తకాలలో రాయడానికి వీలుపుతుందా? ఈ విధంగా లోకంలో అసంఖ్యాకములైన పగటిదొంగలు ఉండగా, వాళ్లని దండించకుండా వదిలిపెట్టి దరిద్ర బాధచే దొంగతనానికి దిగిన నా మీద నేరారోపణ చేయడం ధర్మమా? (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 144)

మానవులు తాము ఈ లోకపు వత్తిడులు, సమస్యల నుంచి కాస్త ఉపశమనం కోసం దేవాలయాలకు వెళతారు. అక్కడ కూడ మోసగాళ్లు తయారైతే పరిస్థితి ఘోరంగా ఉంటుంది. దేవాలయాలలో, ధర్మసత్రాలలో, ధార్మిక సంస్థలలో ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్న వ్యక్తులు స్వార్థ పూరితంగా ప్రవర్తిస్తూ ధర్మానికి చెడ్డపేరు తీసుకురావడం ఆనాడూ, ఈనాడూ కనిపిస్తున్న విషయమే. ఈ లక్షణాన్ని వేదనాయకం పిళ్లై 'పగటి దొంగతనం' అని వ్యవహరించారు. వీళ్లకన్నా పొట్టకూటి కోసం దొంగతనాలు చేసేవారు మేలు అని ఆయన అభిప్రాయం.

సమాజంలో ఇలా దుర్నీతులు రాజ్యం చేయడం రాజు లేదా పరిపాలకుని అసమర్థత వల్లనే. రాజు లేదా పరిపాలకుడు సత్పథంలో నడిస్తూ ఉంటే ప్రజలు కూడా సక్రమ మార్గంలో వ్యవహరిస్తారు. అందుకే రాజు లేదా పరిపాలకుడు వ్యవహరించవలసిన తీరును వేదనాయకం ఇలా చెప్పారు.-

కొంత కూలి మాత్రమే తీసుకుని పనిచేసేవాడు రేయింబవళ్లు శ్రమిస్తాడు. అలా ఉన్నప్పుడు అసంఖ్యాకములైన అధికారాలను, సంపదను ప్రజల వద్ద నుండి తీసుకొని అనుభవించే రాజు ఆ ప్రజల కోసం ఎంత శ్రమించాలి? రాజుగారి సమయం, బుద్ధి, శక్తి ప్రజలకు స్వంతమేగాని, రాజుకు స్వంతం కాదు. ప్రజల సౌకర్యం కోసమే రాజ్యాంగం ఏర్పడి ఉందిగాని, తన సౌకర్యం కోసం ఏర్పడలేదు అనేది రాజు ఎల్లప్పుడూ మనస్సులో గుర్తించుకోవాలి. రాజు ప్రజల కష్టసుఖాలే తన కష్ట సుఖాలుగా భావించాలి గాని, తనను ప్రజలను వేరు వేరుగా భావించకూడదు. (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 176)

రాజు నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తే, పరిశ్రమిస్తే రాజ్య వ్యవస్థ సుస్థిరంగా, సక్రమంగా ఉంటుంది. రాజుకు అధికారం ఉండేది అందరి శ్రేయస్సుకే గాని అయని సుఖభోగాలకు కాదు. కాబట్టి రాజు ప్రజల కష్టసుఖాలు తన కష్టసుఖాలుగా భావించాలి. తాను ప్రజలు అవిభాజ్యం అని గ్రహించాలి అని వివరించారు. అలా జరగాలంటే -

రాజు దుర్మార్గులను, యోగ్యత లేనివారిని ఉద్యోగాల నుండి తొలగించడమే కాక, యోగ్యులైన ఉద్యోగులను సదా గౌరవిస్తూ, అభిమానిస్తూ ఉండాలి. వాళ్లు వ్యాధి గ్రస్థులైనప్పుడుగాని, వేరే ఇతర కారణాల వలనగానీ

ఉద్యోగం చేయడానికి అశక్తులైనప్పుడు వాళ్లకు రా జు ఉపకార వేతనాలు ఇచ్చి ఆదరించాలి. వాళ్లు అకాల మరణం పొందినప్పుడు వాళ్ల పుత్రకళత్రాదులు అన్న వస్త్రాలకు దారి లేక నిర్గతులుగా ఉన్నప్పుడు వాళ్లను రాజు పోషించాలి (ప్రతాప ముదలియార్ చరిత్ర పుట 179) అని చెప్పారు. ఇలా తన న్యాయ పరిపాలన కాలంలో గమనించిన అనేక సామాజిక దుర్నీతులను శామ్యూల్ వేదనాయకం పిళ్లై తన ప్రతాప ముదలియార్ చరిత్రలో అక్షరబద్ధం చేయడమే కాకుండా వాటిని తీవ్రంగా నిరసించారు.

ఉపయుక్త గ్రంథసూచి :

తెలుగు పుస్తకాలు :

1. కుటుంబరావు, బి.వి. - ఆంధ్ర నవలా పరిణామము, గాయత్రీ ప్రచురణలు, హైదరాబాదు, 1971
2. రాధాకృష్ణ శర్మ, చల్లా - ఆధునిక తమిళ సాహిత్య నిర్మాతలు, దక్షిణ భాష పుస్తక సంస్థ, మద్రాసు, 1978
3. రాధాకృష్ణ శర్మ, చల్లా - తమిళ సాహిత్య చరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు, 1976
4. వీరేశలింగం, కందుకూరి - రాజశేఖర చరిత్రము, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1987
5. వేదనాయగం పిళ్లై, (అను) ఎస్. జయప్రకాశ్ - ప్రతాప ముదలియార్ చరిత్ర, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2008

ఆంగ్ల పుస్తకాలు :

1. Anitha, S - A Review-The First Novel in Tamil, Journal of Innovative Research and Solution (JIRAS), Volume1 Issue No.1, Jan–Jun 2014
2. George G.M. - Tamil Sahithyam, Kerala Sathithya Academy.Trissur: 1977
3. Pandurangan A. - Vedanayagam Pillai, Indiya Elakkiya Sirpikal, Sahithya Academy, New Delhi, 2009.
4. Vedanayagam Pillai - K.S. Venkitachalam (Trans) - Prathapa Mudaliar Charithram Kerala Bhasha Institute., Trivendrum, K.S. Venkitachalam, 2009
5. Vedanayagam Pillai, S - Prathapa Mudaliar Charithram,New Century Book House, Chennai. 2009

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నన్నయ దేవయాని ఒక పరిశీలన

- మినుకూరి శ్రీనివాసరెడ్డి

నన్నయ భారతంలోని ముఖ్యపాత్రలలో ఒకటి దేవయాని. నన్నయ ఈ పాత్రను మనోధర్మ పరిణామ నేపథ్యంలో భగ్నప్రేమికగా రూపొందించాడు. సాధారణ కన్యకల్లాగే దేవయాని తన తండ్రి శిష్యుడు, దేవగురుడు బృహస్పతి కుమారుడైన కచుని తనకు అనుకూలుడైన భర్తగా ఎంచుకుంది. కచుడు శుక్రాచార్యుల వద్దకు వచ్చినపని సఫలంగావటంతో వెనుతిరిగి తనలోకానికి వెళ్ళేసమయంలో దేవయాని తన ప్రేమను వ్యక్తం చేసింది. అతడిచే తిరస్కారం పొందడమేకాదు, కచుని రాజకీయపు టెత్తులో తాను పావు అయినానని గ్రహించింది. నిజానికి కచుని వల్ల దేవయాని పొందిన తిరస్కారం ఆమె మనసులో పెనుతుఫాను రేపింది. అప్పటిదాకా అమాయకురాలు, అనురాగవతిగా ఉన్న దేవయాని ఒక్కసారిగా లౌక్యురాలిగానూ, ఎత్తులకు పైఎత్తులు వేసే జాణగా మారిపోయినట్లు నన్నయ భారతంలో చిత్రించాడు.

కాగల కార్యం కాంత ద్వారానే సాధ్యమౌతుందని, దానికి మూలకంగా దేవయాని తోడ్పాటు ఎంతైనా అవసరమని, మృతసంజీవనీ విద్య నేర్చుకోవడంలో దేవయాని అనుకూలత అతిముఖ్యమని దేవతలు కచునికి చెప్పి, శుక్రాచార్యుని వద్దకు పంపిస్తారు. వ్యాసభారతం మూలంలో

దేవయానీం చ దయితాం సుతాం తస్య మహాత్మనః
దేవ్యాన్యాంహితుష్టాయామ్ విద్యా ప్రాప్స్యసి ధ్రువమ్
(మహాభారతం 1-76-15, 16)

అని ఉండగా నన్నయ గారు తన అనువాదంలో

బాలుండవు నియమవ్రత
శీలుండవు నిన్ను బ్రీతిచేకొని తద్వి
ద్యాలలనాదానము గరు
ణాలయుడై చేయునమ్మహాముని నాకున్.
(నన్నయ భారతం కచోపాఖ్యానం)

అని వర్ణించారు. శుక్రాచార్యుని గారలపట్టి దేవయాని ద్వారా నీవు మృతసంజీవని విద్యా సాధించ వీలగును. ఎందుకంటే శుక్రాచార్యునికి కూతురిపై గల ప్రేమ నీ కార్యసాఫల్యతకు ఒక ఘనశక్తిగా మారుతుంది అని నన్నయ వర్ణించాడు. ఈ అనువాదం ద్వారా దేవయానిని అమాయక కన్యగా (బేలగా) తెలియచేసినట్లు అవగత మౌతుంది.

కచుని సాధువర్తనునిగానూ, కార్యసాఫల్యతకై ప్రవర్తించువానిగా నన్నయ తెలియచేశాడు. అయితే అమాయకురాలైన దేవయాని అతగాడి ప్రవర్తనను తనపై మరులుగా భావించడం ఆమె అమాయకత్వానికి నాందిగా నన్నయ తెల్పాడు. కచుడు మృతసంజీవని విద్య నేర్చి, కార్యసాఫల్యత పొందాకా దేవయాని అతగాడిని వివాహం చేసుకోమనే సందర్భంలో నన్నయ ఒక గొప్ప పద్యాన్ని అందించాడు.

నీవును బ్రహ్మచారివి, వినీతుడవేను నూకన్యకన్, మహి
దేవకులావతంస, రవితేజ వివాహము నీకు నాకు వీలున్
భావజ శక్తినైనయది, పన్నుగనన్ను పరిగ్రహింపు సం
జీవని తోడ శుక్రదయ, జేయుము నాకు ప్రియాంబు నాపుడున్.

ఈ పద్యంలో దేవయాని ''వివాహము నీకు నాకుయున్ భావజ శక్తినైనయది'' అని చెప్పించడంలో నన్నయ్య దేవయాని అంతరంగావిష్కరణను ప్రేమపరంగా చేయించాడు. ఇక్కడ ఉన్న గమ్మత్తు ఏమిటంటే దేవయాని తాను కచుని ప్రేమించినట్లే, కచుడు కూడా తనని

ప్రేమిస్తున్నట్లు ఉన్న నమ్మకాన్ని ఆమె ద్వారా తెలియ జేయడం ద్వారా ఆమె 'స్మరశిలా ముఖశిఖజర్జిత గాత్రగా' దర్శింపచేశారు. అయితే వీరిరువురులో నమ్మకం దేవయా నికే అధికంగా వుంది. కాని కచుడికి ఆమెపై ఆమె అనుకున్న భావన లేదు. కేవలం విద్యాకాలంలో గురుసేవ ఎంత ముఖ్యమో, అతని పుత్రిక దేవయాని సేవ కేవలం కార్యసాధనకై మాత్రమే చేశాడు. కచ దేవయానుల మధ్య ఉన్న ఈ అగాధాన్ని మనం ఈనాడు 'కమ్యూనికేషన్ గ్యాప్' అంటున్నాం. నిజానికి యిది ఆనాడే వుంది. అదే నేటికీ కొనసాగుతోంది అనుకోవచ్చు.

ఇక దేవయానికి కచుని తిరస్కారం అఘాతమైంది. శాపమిచ్చింది, శాపం పొందింది. ఇక్కడే నన్నయ దేవయానిలో అప్పటిదాకా వున్న మార్దవం, అనుకంప పోయి కరుకుదనం, కాఠిన్యతలు చోటుచేసుకున్నట్లు వర్ణించాడు. ఈ వైరి గుణాలు తరువాత కాలంలో దేవ యానిలో శాశ్వతంగా నిలిచిపోయాయి.

తదనంతర కాలంలో దేవయాని యయాతి మహా రాజు పత్నియైన తరువాత ఆమె ప్రవర్తన విపరీతంగా ఉన్నట్లు నన్నయ వర్ణించాడు. దేవయాని శర్మిష్ఠ పట్ల చూపిన నైజం, ఆమె ప్రతీకార వాంఛకు పరాకాష్టగా నిల్చింది. అంతేకాక జీవితమంతా పొందిన అవమాన, తిరస్కారాలు ఆమెలో క్రోధాన్ని మరింత పెంచాయి. ఆమెను యయాతి రక్షించిన నేపథ్యంలో ఆమెను బావినుండి బైటపడేయడానికి ఆమె చేయి పట్టుకొన్న సందర్భాన్ని దేవయాని తన పాణిగ్రహణం చేసినట్లు భావించడం ఆమె పరిణిత మేధకు నిదర్శనం. అంతేకాక చెడుకాలపు సంఘటనను తనకు అనుకూలంగా మార్చు కున్న ఆమె తెలివిని అమోఘంగా వర్ణించాడు నన్నయ.

"నన్ను మున్నయెరుంగు, దిన్నాటినాకు
దాని, వృషర్వుజను మహాదానవేంద్రు
కన్య, నా యొద్ద నెపుడు గదలకుండు,
ననఘు, మిద్దాని శర్మిష్ఠ యండ్రు జనులు."

అనే ఈ సందర్భంలోని పద్యం దేవయాని హృదయంత రంగాన్ని ఆవిష్కరించింది. శర్మిష్ఠ రాచబిడ్డ అన్నదాని కంటే, తనకు ద్రోహం చేసిన సంఘటనను దేవయాని అంత త్వరగా మరిచిపోలేదు. పైగా శర్మిష్ఠను యయాతికి 'దాసిగా', ఎప్పుడు తనవద్ద కదలకుండా ఉండేదానిగా పరిచయం చేసింది. అయినా ఆమెలో పగ చావలేదు. అంటే ఆమె తన జీవితంలో జరిగిన సంఘటనలేవీ అంత త్వరగానూ, తేలికగాను మరచిపోలేదు అన్న విషయం పాఠకులకు అవగతమౌతుంది. ఇది తండ్రి గారాబంగా పెంచిన పెంపకమా? లేక ఆమె 'ఇద్' స్థితిలో (పుట్టుక నుండి వచ్చిన గుణమా) ప్రవర్తించడం ఇలా గూడా వుంటారా? అన్న సందేహాన్ని పాఠకులకు నన్నయ ఈ పాత్ర ద్వారా అందించాడన్నది నిజం. ఈ నేపథ్యంలో నన్నయ విశేష ప్రయోజనమున్న చోట విషయ వివరణ చేస్తూ పునరుక్తిని నిరోధించడం ద్వారా కథా సంగ్రహం చేసి ఈ ఘట్టంలో తన కవితా లక్షణాలలో ఒకటైన ప్రసన్న కవితార్థ యుక్తిని ప్రదర్శించాడు.

ఏది ఏమైనా నన్నయ దేవయాని తండ్రి గారాబంలో పెరిగి సహజమైన స్త్రీత్వం (బేలతనం, ప్రేమ) దాని తాలూకు గుణాలను పొందినప్పటికీ వాటిని జీవితాంతం నిలుపుకోలేదు. దానికి కారణాలు పరిశీలిస్తే ఆమెకు జరిగిన తిరస్కారాలు, అవమానాలు ఆమెను, ఆమెలోని ఆదరణీయ గుణాలను చంపివేశాయి అని చెప్పవచ్చు. ఫలితంగా స్త్రీగా పరిపూర్ణత కోల్పోయి వినూతన అవగుణాలతో తనను తాను పునర్ నిర్మించుకుంది. అందులో భాగంగా కుయుక్తులు పన్నింది. అన్ని పరిస్థితు లను తనకనుకూలంగా మార్చుకుని విజయాలు సాధిం చినా (దుర్మార్గవర్తనలో) అవి అమెకంతగా రుచించలేదు అనే విధంగా నన్నయ్య దేవయాని పాత్రను తీర్చిదిద్దాడు. దేవయాని నాయికగా కంటే ప్రతి నాయికగా మిగిలి పోయింది.

ఫ్రాయిడ్ మనో విశ్లేషణ సిద్ధాంతంలో పేర్కొన్న ఇద్, అహం, అలద్యహమ్ అనే మూడు గుణాల్లో దేవయాని ఇద్, అహం గుణాలలో మునిగిపోయింది. తనకు ఎవరూ

పోటీ, సాటి లేరన్నంతగా ప్రవర్తించిది. యయాతి, శర్మిష్ఠలకే కాదు తండ్రికి కూడా సుఖం లేకుండా చేసింది. వ్యాససంస్కృత భారతంలో కంటే నన్నయ తన ఆంధ్రీకరణ భారతంలో దేవయానిని అతి విష ప్రవర్తనాధురీణగా చిత్రణ చేశాడు. తన జీవితాన్ని తన అదుపులో పెట్టు కోవడమే లేకుండా, ఇతరుల జీవితాన్ని పాత్రగా దేవ యాని సాధించింది సమాజ ఆమోదయోగ్యమా అన్నది బదులులేని ప్రశ్న. "స్త్రీ బుద్ధి ప్రళయాంతక: " అన్న మాటకు దేవయాని ప్రత్యక్ష సాక్ష్యం. దేవయాని పాత్రను దానిలోని అంతర్, బాహ్య సంఘ ర్షణలను నన్నయ్య ఒక ప్రత్యేక కోణంలో చిత్రించాడన్నది చరిత్ర చెప్పిన సాక్ష్యం.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద సామెతల్లో స్త్రీ

- సోనభోయిన సతీష్, తెలుగు అధ్యాపకులు, శ్రీ విశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ & పి.జి. కళాశాల, వరంగల్.

ఒక జాతి తరతరాల సామాజిక, చారిత్రక అనుభవాలను అర్థం చేసుకోవడానికి సామెతలు మనకుపకరిస్తాయి. ముఖ్యంగా పురుషస్వామ్య ప్రధానమైన మన సమాజంలో స్త్రీల పరిస్థితిని అర్థం చేసుకోవడానికి, పురుషదృక్కోణంలో స్త్రీ ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవడానికి సామెతలను ఆధారంగా తీసుకొని పరిశీలించవచ్చు.

ఈ విశ్లేషణ నాటి, నేటి సమాజంలో స్త్రీల పరిస్థితిని వివరిస్తుంది. అయితే కేవలం నగరవాసుల, పండితుల సాహిత్యాన్నే గాక పల్లెల్లోని పామరుల సాహిత్యాన్ని కూడా స్త్రీ దృక్కోణంతో పరిశీలిస్తే తరతరాల స్త్రీల సామాజిక, ఆర్థిక పరిస్థితులు అర్థమవుతాయి. పామరుల సాహిత్యంలో పాటలు, కథలు, పొడుపు కథలు, సామెతలుంటాయి. వీరి మాటల్లో సామెతలు ధారాళంగా దొర్లుతుంటాయి. సామెతలు మాటలను శక్తివంతంగా, అర్థవంతంగా చేస్తాయి. అందుకే "సామెతలేని మాట అమెతలేని విందు" అని సామెత మీద సామెత వచ్చింది.

మన సమాజంలో స్త్రీల పైన నిబంధనలు, నిషేధాలు, అనంతం. స్త్రీ మాటపైనా, చూపుపైనా, అలంకరణపైనా, నడకపైనా, నడవడిక పైనా అనేక నియమాలు ఉన్నాయి. ఈ నియామలననుసరించే పురుషాధిపత్య సమాజం స్త్రీ జీవితాన్ని అడుగడుక్కి అణచివేయడానికి అనేక సామెతలను రూపొందించింది. మగవారు ఈ సామెతలను ఉదాహరిస్తూ స్త్రీ జీవితాన్ని శాసిస్తూ తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటారు. స్త్రీలు అమాయకంగా ఆ సామెతలను సత్యాలని నమ్మి తమ జీవితాలకు వర్తింపచేసుకుంటూ సామెతలనను సరించి నడుచుకోవడానికి ప్రయత్నిస్తుంటారు.

తమ జన్మకు మూలకారణం స్త్రీయే అన్న సంగతి మరచిపోయి, స్త్రీ శిశువు జన్మించిందనగానే "తోకలవడ్లు పిల్ల గొంతులో పోసి చంపకూడదా" అని పల్లెల్లో ఆడపిల్లల మీది అనహత్యంతో ఉచిత సలహాలను వెనుకటి తరం ఇచ్చేవారు. నేటికి రాజస్థాన్ ప్రాంతంలో కొన్ని కులాల్లో ఆడపిల్ల పుట్టిందనే వార్త వినగానే ఇంట్లోవారు, బంధువులూ శోకాలు పెడుతారు. మరికొన్ని తెగల్లో గొంతు పిసికి చంపివేస్తుంటారు.

"అమ్మాయి పుట్టిందంటే ఆయువు సగం కుంగినట్టే" - అని తల్లిదండ్రులు కుంగిపోతారు. సమాజంలో ఆడపిల్లలంటే ఉండే చులకన భావం, వారి పెళ్ళి, పెళ్ళి తర్వాత వారి జీవితం, ఇవన్నీ తల్లిదండ్రులకు సమస్యలే. అందుకనే ఆడపిల్ల అనగానే వారు ఆవేదననుభవిస్తారు.

పాపాలకు శిక్షగా ఆడపిల్లలు, పుణ్యానికి ఫలితంగా మగపిల్లలు పుడతారనే నమ్మకాన్ని బలపరుస్తాయి. అబద్దాలాడితే "ఆడపిల్లలు పుడతారనీ" ఆడపిల్లల పుట్టుకు హీనం చేస్తారు. "పూజ కొద్దీ పురుషుడు, పుణ్యం కొద్దీ పుత్రులు" అని మగపిల్లల పుట్టుకను పుణ్య ఫలితమని పొగుడుతుంటారు. మంచి మొగునికొరకు పూజలు, కొడుకుల కొరకు దానాలను చేస్తూనే ఉండాలి ఆడవారు. కానీ తమ సుఖం కొరకు తమ జీవితం కొరకు ఎలాంటి వ్రతాలు, నోములు, పూజలు చేసుకోని నిస్వార్థపరులు ఆడవారు.

"నెలతక్కువైనా మగపిల్లవాడే మేలు", "పుట్టి బతికే ఆడపిల్లకంటే పుట్టి చచ్చే మగపిల్లవాడే మేలు" "పుట్టి చచ్చినా పుత్రుడే మేలు" - బతుకుతున్న ఆడపిల్లలను చులకనచేస్తూ, పుట్టి చచ్చిన పుత్రుణ్ణి స్మరిస్తూ, మేము కూడా కొడుకును కన్న తల్లిదండ్రులమే అని గర్విస్తుంటారు. ఒక్క ఆడపిల్లను కన్నందుకే బాధపడే వారి తల్లిదండ్రులకు ఒక్క కొడుకు మాత్రం లెక్కలోనికి రాడు. "ఒక్క కన్ను కన్నుకాదు ఒక్క కొడుకు కొడుకు కాడు". -

అని సామెతను చెప్పుతూ మరికొంత మంది కొడుకులను కనమని బోధిస్తుంటారు.

పుట్టిన ఆడపిల్లనే కాక, ఆడపిల్లలను కన్న తల్లి దండ్రులకు కూడా సమాజం హీనంగా చూస్తుంది. "పెత్తనం చేసేవాడు, పెంటి సంతానం కలవాడు అందరికీ లోకువే" "ఆడపిల్లలు పుట్టిన ఇల్లు, ఎనుములు పడిన మడుగు, చేపలు తిన్న కడుపు ఒకటే" - వెనుకటి కాలంలో ఆడసంతానం పైన ఉండే భయంతోనే మగపెళ్ళివారు పెళ్ళికూతురు తల్లికీ, అక్కలకూ, మేనత్తలకూ, పిన తల్లులకూ, మగసంతానం ఉందా లేదా అని తెలుసుకొని సంబంధం కుదుర్చుకునేవారు.

సాముద్రిక శాస్త్రం ఆడపిల్ల అవలక్షణాలను పేర్కొంటుంది. పెళ్ళి చేసుకోబేయే పిల్ల అందంగా, సర్వగుణ సంపన్నురాలుగా ఉండాలనీ పెళ్ళికొడుకు అతని తల్లి దండ్రులు కోరుకుంటారు. పెళ్ళి కావాల్సిన పిల్లకు ఏ అవలక్షణాలు ఉండకూడదని కూడా సామెతలు తెలుపుతున్నాయి.

"హీనస్వరం ఇల్లాలు ఇంటికి చేటు"
"ఈడుపుకాళ్ళది ఇంటికి చేటు"
"దొడ్డి కాళ్ళది దోవకు చేటు"
"మాడుపుమొగముది మొగునికి చేటు"-

ఈ అవలక్షణాలన్నీ ఆడపిల్లలకే చూడాలి కాని మగపిల్లలకు చూడకూడదు. అసలు "మొగపుట్టుకనే మహారాజు పుట్టుక" - "మొగపిల్ల బంగారు పుల్ల" - ఏ అర్హత లేకున్న పెళ్ళిళ్ళ మార్కెట్‌లో డిమాండు తగ్గని బంగారం వంటిది మగజన్మ.

పెళ్ళికొడుకు అందవికారంగా, నల్లగా ఉన్న ఫర్వాలేదు కానీ కోడలు మాత్రం తెల్లగా, అందంగా ఉండాలి. ఎందుకంటే "కోడలు నలుపైతే కులమంతా నలుపు" అవుతుంది. భార్య అందంగా ఉండాలి కానీ మరీ అందంగా ఉండకూడదు. అందమైన భార్య ఉంటే భర్త అనుమాన పిశాచి అవుతాడు. తమ చంచలగుణమే ఆడవారికి కూడ ఉంటుందనే అనుమానంతో మగవారు భయపడుతుంటారు. అందుకే "భార్యా రూపవతీ శత్రువు" - అనే సామెత వాడుతూ రూపవతైన భార్య శత్రువు వంటిదని ఈర్ష్యతోనో, భయంతోనో హెచ్చరిస్తుంటారు.

పెళ్ళికూతురు పెళ్ళికొడుకుకంటే వయస్సులో, చదువులో, తెలివిలో, ఎత్తులో తక్కువగా ఉండాలి. తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి పురుష ప్రపంచ మేర్పరచిన నియమాలు ఇవి. మన సమాజంలో "మూడేండ్ల పిల్లకు ముప్పైఏండ్ల మొగుడు అయినా ఫర్వాలేదు" అని సామెతలను ఉదాహరిస్తుంటారు. ఇటువంటి పెళ్ళిళ్ళు చేసుకున్న భర్త ముసలితనంలోకి అడుగిడితే భార్య యవ్వనంలోకి అడుగిడుతుంది. "అయ్యకు వణుకు ప్రాయం అమ్మకు పలుకు కులుకు ప్రాయం" అనే సామెత ఆడ మగ మధ్య ఉండే వయోభేదాన్ని సూచిస్తుంది.

ఆడవారి జీవితంలోని వివిధ దశలే గాక ఆడవారి బుద్ధి, ఆడవారి మాటలు, ఆడవారి నవ్వు, ఆడవారి ఏడ్పు, అన్నీ అనర్థాలే అని పురుషదృక్కోణంలో సామెతలు బోధిస్తుంటాయి. "ఆడదాని బుద్ధి అపరబుద్ధి" "పడతుల బుద్ధి పెడతలనుండు" మగవారి దృష్టిలో ఆడవారి మాటలకు విలువ లేదు. "ఆడవారి మాట నీళ్ళ మూట" "ఆడవారి మాట ఆపదలకు మూలం" "ఆడవారి నోట నువ్వు గింజ నానదు". మన సమాజంలో ఆడవారు మనస్ఫూర్తిగా నవ్వకూడదు. సంతోషంగా నవ్వే ఆడదాన్ని అనుమానించే సమాజం మనది "నవ్వే ఆడది శీలవతి కాకపోవచ్చు" నవ్వే ఆడదాన్ని ఏడ్చే మగవాన్ని నమ్మకూడదు" ఈ సామెతలు మగవారి సంకుచిత దృష్టిని వెలువరిస్తున్నాయి.

"ఆలు ఏడ్చిన ఇల్లు ఎద్దు ఏడ్చిన సేద్యం ముందుకు రావు" "వాన కన్న ముందురిమే ఉరుమును, మాటకన్న ముందు ఏడ్చే ఆడదాన్ని నమ్మరాదు". ఈ సామెతలు ఆడవారి ఏడ్పును అసహ్యించుకుంటాయి. కాని ఏడ్పుకు కారణాన్ని తెలుసుకొమ్మని సూచించవు. మనలో తిరగడం

మగవారి జన్మ హక్కు, ఆడవారు మాత్రం ఇంటి బయట అడుగిడ రాదు. "ఆడది తిరిగి చెడును మగవాడు తిరగక చెడును" సామెత మంచి ఆడవారు ఇంట్లో ఉండాలనీ హెచ్చరిస్తుంది.

మగవారి తినడానికి తప్ప పనిచేయడానికి వంటింట్లోకి అడుగు పెట్టరాదు. ఆడవారు వంటింటిని విడచి పుస్తకం చేత పట్టుకోరాదనీ చదువు నేర్చుకోరాదనీ సామెతలు చెప్పుతున్నాయి. "చదువు నేర్చిన ఆడదానితోనూ వంట నేర్చిన మగవానితోనూ ఓపలేము." నేర్పరులైన ఆడవారి పైన మగవారు పెత్తనం చలాయించలేక చికాకు పడుతుంటారు. ఈ మగవారి మనస్తత్వాన్ని తెలపడానికే "ఆడవారి నేర్పు మగల చికాకు పర్చు అనే సామెత వచ్చింది" స్త్రీలలో పురుషులకు కావల్సింది నేర్పు తెలివి కాదు సిగ్గు, సౌందర్యం "స్త్రీకి సిగ్గే సింగారం" "రూపం చేత స్త్రీలు పరాక్రమం చేత పురుషులు రాణిస్తారు." అనే సామెతలు పురుషుల అభిప్రాయాన్ని సూచిస్తున్నాయి. ఆడవారిని అదుపులో పెట్టుకొని నిరంతరం అణచి వేయాలి. కానీ, వారితో ప్రేమతో చనువుగా ఉండకూడదు. "ఆడవారికి చనువిస్తే సంకెక్కుతారు "ఆడవారికి అలుసిస్తే తలకెక్కుతారు." "ఆడవారు పని చేయడానికే కాని చేతిలో పైస పట్టుకోవడానికి అనర్హురాలు." "ఆడదాని చేతి అర్థం మగవాడి చేతిబిడ్డ మనవు." ఆడవారి చేతిలో పిల్లలే కానీ పైసలుండకూడదనీ, మగవారి చేతిలో పిల్లలుండ కూడదనీ, సామెతలు బోధిస్తున్నాయి.

జానపద సామెతలు ఒక తరం నుండి మరొక తరానికి ప్రచారమై జీవిస్తుంటాయి. మనముందు తరాల వారు తమ అనుభవాలనన్నింటిని సామెతల్లో ఇమిడ్చి తరతరాల వారికి అందజేస్తూ వారికి మార్గదర్శకులై స్త్రీలనణచి వేయడంలో సఫలీకృతులైనారు. అయితే మారుతున్న సమాజపు విలువలననుసరించి గతంలోని, వర్తమానంలోని సాహిత్యాన్ని విశ్లేషించి సమాజ పురోగతికి తోడ్పడవలసిన బాధ్యత సాహితీ విమర్శకులపైన ఉంది. యుగయుగాల నుండి పురుషస్వామ్య వ్యవస్థలో వ్యక్తిత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని కోల్పోయిన స్త్రీలు ఈనాడు వాటిని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇన్ని రోజులు స్త్రీలను పురుష జాతి ఏ విధంగా అణచివేసింది, దానికి కారణాలు ఏమిటని పరిశోధించి ఆ పరిస్థితులు పునరావృతం కాకూడదనే కోరికతో స్త్రీవాదులు ప్రాచీన సాహిత్యాన్ని విశ్లేషిస్తున్నారు. ప్రాచీన సాహిత్యంతో పాటు మన సంస్కృతికి మూలమైన జానపద సాహిత్యాన్ని సేకరించి వింగడిస్తే స్త్రీవాదుల విశ్లేషణ పరిపూర్తి అవుతుంది.

ఆధారిత గ్రంథాలు :

జానపద విజ్ఞానంలో స్త్రీ - రావి ప్రేమలత.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు – వెలుగు

– డా॥. పెండ్యాల లావణ్య
తెలుగు అధ్యాపకులు, డా॥. కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాల, దుగ్గిరాల.

– డా॥. బూసి వెంకటస్వామి
శాఖాధిపతి, తెలుగు విభాగము,
పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, పెదనందిపాడు, గుంటూరు.

"తెలుగు భాష తీయదనం
తెలుగు భాష గొప్పదనం
తెలుసుకున్న వాళ్ళకు తెలుగే ఒక మూలధనం"

అని ఓ సినీకవి పేర్కొన్నారు. అమ్మా.. అనే పిలుపులో ఎంత మాధుర్యముందో తెలుగు మాటకు అంటే మాధుర్యముంది.

తెలుగు అంటే ఒట్టి భాష కాదు. తెలుగు భాష, తెలుగు సాహిత్యం, తెలుగు సంస్కృతి' ఇవన్నీ వెరసి ఒక సమగ్రమైన తెలుగుతనమే తెలుగంటే అని ఆచార్య ఎన్.గోపి పేర్కొన్నారు.

భాష వాగ్రూపమైనది. భావ ప్రకటన సాధనాల్లో భాష అతిముఖ్యమైనది. అత్యంత శక్తివంతమైంది. మానవులు తమ భావాల్ని ఇతరులకు తెలియజేయడానికీ, ఇతరుల భావాల్ని తాము తెలుసుకోవడానికి నిత్యం వ్యవహరించే ఉచ్చారణ సాధనమే భాష. ప్రపంచంలో భాషలేని మానవ సమాజం లేదు.

మనసులోని భావాల్ని తేలికగా చెప్పాలి అంటే అందుకు మాతృభాషే అవసరం. మాతృభాషలోనే భావ వ్యక్తీకరణ చేయగలం. తెలుగు అజంతా భాష. అజంత భాష దాదాపు ప్రతిపాదము ఒక అచ్చుతో అంత మౌతుంది. తెలుగుభాష ద్రావిడ భాష నుండి ఎలా పుట్టింది. ఎలా వ్యాప్తి చెందింది అని చెప్పడానికి ఆధారాలు లేవు. కాని తెలుగు భాష అమ్మభాష.

దేశవ్యాప్తంగా ఉన్న జనాభాని బట్టి తెలుగు భాష భారతీయ భాషల్లో ద్వితీయ స్థానాన్ని పొందింది. హిందీ భాష ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. ఆంధ్ర రాష్ట్రానికి ఈశాన్య దిశలో ఒరిస్సా, ఉత్తరాన మధ్యప్రదేశ్, పశ్చిమాన మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలూ, దక్షిణంలో తమిళనాడు, తూర్పున బంగాళాఖాతం ఎల్లలుగా ఉన్నాయి. తెలుగు భాషకు ఒరియా, హిందీ, కన్నడం, తమిళం, మహారాష్ట్ర భాషలు పొరుగు భాషలుగా ఉన్నాయి.

తెలుగు భాషమీద సంస్కృత భాష ప్రభావం బాగా కలనిపిస్తుంది. ఈ భాష సంస్కృతం నుండి పుట్టిందనే వాదన పూర్వం ఉండేది. పాశ్చాత్యులు తెలుగు భాషపై విస్తృతంగా విశేషమైన పరిశోధనలు చేసి సంస్కృత భాష నుండి తెలుగు భాషపై అధ్యయనం చేసిన పాశ్చాత్య భాషా వేత్తల్లో ఎల్లిస్, రాస్కు, కార్వ్రెటీ, గ్రియర్సన్, స్టైనోకోనో మొదలైనవారు ప్రముఖులు.

మధ్య ద్రావిడ భాషా కుటుంబంలో 12 భాష లున్నాయి. ఈ పన్నెండు భాషల్లోను తెలుగు భాషదే అగ్ర స్థానం. ఈ భాషల్లో తెలుగు భాష ఒక్కటే నాగరిక భాష. మధ్య ద్రావిడ భాషలో ఒక్క తెలుగు భాషలోనే సాహిత్యం, వ్యాకరణాలు, నిఘంటువులు చోటుచేసుకున్నాయి. నిర్మాణ విశేషాల్ని బాగా పరిశీలిస్తే తెలుగు భాషకు గోండి, ముండ, పెంగో, కుయి, కువి మొదలగు మధ్య ద్రావిడ భాషలతో ఎన్నో పోలికలు సుస్పష్టంగా కన్పిస్తాయి. అందు చేతనే నిర్మాణాన్ని బట్టి తెలుగు భాష మధ్య ద్రావిడ భాషా కుటుంబానికి చెందుతుంది.

ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల అధికార భాష తెలుగు భారతదేశంలో తెలుగు మాతృభాషగా మాట్లాడే ప్రజలు 7.4 కోట్ల మంది. 201 జనాభా లెక్కల ప్రకారం ప్రాంతీయ భాషలలో మొదటి స్థానంలో ఉంది. ప్రపంచంలోని ప్రజలు అత్యధికంగా మాట్లాడే భాషలలో మన తెలుగు 15వ స్థానంలో ఉంది. సంస్కృతంలోని తియ్యదనం,

తమిళంలోని అమృతత్వం, కన్నడంలోని సుమధుర పరిమళం ఈ మూడు కలగలిపిన కమ్మనైన భాష తెలుగు భాష. భారతదేశంలో అతి ప్రాచీన భాషల్లో తెలుగు భాష కూడా ఒకటి. భారత ప్రభుత్వం తెలుగుతో పాటు సంస్కృతం, తమిళం, కన్నడ భాషలకు 2008 అక్టోబర్ 31వ తేదీన ప్రాచీన భాష హోదానిచ్చి గౌరవించింది.

అమ్మ పిలుపు ఎంత కమ్మగా ఉంటుందో తెలుగు నుడి అంత హాయినిస్తుంది. ప్రాచీనకాలం నుండి ఆధునిక కాలం వరకు అనేక పురాణాలు, కావ్యాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, కథలు, నాటకాలు, నానీలు, హైకులు ఒకటేమిటి ఎన్నో సాహిత్య ప్రక్రియలు వెలువడ్డాయి. మొదట సంస్కృత శ్లోకాలతో ప్రారంభమైన మన తెలుగు సాహిత్యం శుద్ధ వ్యవహారంలోకి ప్రవేశించింది. ఎప్పుడైతే వ్యవహారం వాడుకలోకి వచ్చిందో చదువులేని వాళ్ళు కూడా సాహిత్య సారాన్ని తెలుసుకుని ఆనందిస్తున్నారు. వేమన పద్యాలు అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వేమన పద్యాలు రాని తెలుగు వాళ్ళు లేరు. తాతముత్తాతల కాలం నుండి నేటి వరకు వేమన పద్యాలు ప్రజల నాటకాల మీద నానుతూనే ఉన్నాయి.

చక్కని పలుకు బడులకు, నుడికారాలకు తెలుగు భూమే పుట్టిల్లు. 'దేశభాషలందు తెలుగులెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు తన 'అముక్త మాల్యద'తో ఆంధ్ర మహా విష్ణువుచే చొప్పించాడు. ఈ మాట ప్రతి తెలుగువాడి గుండెల్లో నిరంతరం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ఆకోణంలో చూస్తే తెలుగు భాషకి అగ్రతాంబూలం ఇవ్వచ్చు. ఛందోబద్ధమైన పద్యం తెలుగు భాషలో పరిణితి చెందినంతగా ఇతర భాషల్లోనో లేదని చెప్పవచ్చు. తెలుగులో ఒక్క పద్యంలో ఒకే అలంకారం కాకుండా రెండు, మూడు పైగా అలంకారాలు చోటుచుసుకుంటాయి. శబ్దాలంకారాల చమత్కారాలకీ చేమకూర వేంకటకవి 'విజయ విలాసం', భాషా సౌందర్యం కోసం రామరాజ భూషణుని వసు చరిత్ర, తెలుగు భాష లాలిత్వం, సౌకుమారత్వం తెలియాలంటే అల్లసాని వారి మను చరిత్ర, పద గుంఫనం, విరుపుల కోసం తెనాలి రామకృష్ణ 'పాండురంగమ మహత్మ్యం', భాషా మాధుర్యం భక్తి భావాల కోసం పోతన భాగవతం ఒక్కసారి తిరగేస్తే చాలు. తెలుగులో పదాలు అజంతాలు అనగా అచ్చులతో అంతమౌతాయి. అందుకే తెలుగు వినడానికి శ్రావ్యంగా ఉంటుంది. మన పురాణాల్లోనూ, కావ్య ప్రబంధాల్లోనూ వాడబడిన తెలుగుభాష ఎంత ఉత్కృష్టంగా, మహోన్నతంగా ఉంటుందో మనకందరికీ తెలిసిందే.

తెలుగు భాష గొప్పతనం భావప్రకటనలో, చిన్న చిన్న తేలికపాటి పదాలతో ఇమిడి ఉంటాయి. చిన్నచిన్న వాక్యాలలోనే జీవిత పరమార్థాన్ని తెలియజేస్తాయి. తెలుగు భాష సస్యశ్యామలమైనది.

"తరిపి వెన్నెల! ఆణిముత్యాల జిలుగు
పునుగు జివ్వాజి! ఆమని పూల వలపు
మురళి రవళులు! కస్తూరి పరిమళములు
కలిసి ఏర్పడే సుమ్మమా తెలుగు భాష"

అని నండూరి వారు చెప్పిన తీరు అద్భుతం. 1907 సంవత్సరం నుండి గిడుగు రామ్మూర్తి పంతులు శుద్ధ వ్యవహారిక భాషాద్యమానికి నాంది పలికారు. అప్పటి జె.ఎ. ఏట్స్ దొర ఆధ్వర్యంలో గురజాడ, గిడుగు, శ్రీనివాస అయ్యంగార్ ఈ నలుగురు ఆలోచనల వలన వ్యావహారిక భాషోద్యమం ప్రారంభమైంది. వీరికి వీరేశలింగం పంతులు ఊతం కూడా లభించింది. 1919-20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కోసం 'తెలుగు' అనే మాసపత్రిక ఈ గిడుగు నడిపించాడు. ఈ పత్రికలో తన ఉపన్యాసాలను ప్రచురిస్తూ పోరాటం సాగించాడు. 1906 సంవత్సరంలో విశాఖ జిల్లా పర్యవేక్షణాధికారిగా వచ్చిన జె.ఏ. ఏట్స్ ఆలోచనలు గిడుగుని శిష్ట వ్యవహారికం వైపు నడిపించాయి.

నాటి పాఠశాలల్లో బోధిస్తున్న తెలుగు, రాసిన పుస్తకాలు పరీక్షలు అన్నీ కూడా ఒక కృతక గ్రాంధికంలో ఉన్నాయని, వాటి స్థానంలో వ్యావహారిక భాషను ప్రవేశపెట్టాలని

గిడుగు వాదించాడు. ప్రామాణిక భాషగా వెలుగొందుతున్న పండితుల భాష జీవరహితమైన ఒక కృతక భాష అని చెప్పడానికి వారి పుస్తకాల నుంచీ ఉదాహరణలు ఎత్తి చూపుతూ గిడుగు పెద్ద ఎత్తున పోరాటమే చేశారు. ఆ ఉద్యమంలో భాగంగా 'బాలకవి శరణ్యము, ఆంధ్ర పండితాభిషక్కుల భాషా భేషజము గద్య చింతామణి వంటి రచనలు చేశారు. వారి రచనల్లో వెలిబుచ్చిన భావాల ఫలితంగా 1912 సంవత్సరంలో 'A memorandum of Modern Telugu' వెలువరించి ప్రభుత్వానికి సమర్పించారు. పట్టువదలని విక్రమార్కుడిగా వ్యవహారిక మహోద్యమమే నడిపించారు. గిడుగు ఆరి ఉద్యమ ఫలితంగానే నేడు మనం పాఠశాలల్లో, సమాచార ప్రచార సాధనాల్లో తెలుగు సాహిత్యంలోను వాడుక భాషను ఉపయోగించుకోగలగుతున్నాము.

గిడుగు వారి పుణ్యమాని వాడుక భాషగా విలసిల్లుతున్న తెలుగుభాష నేడు ఎన్నో మార్పులకు చేర్పులకు లోనై తన ఉనికిని కోల్పోతుంది. తెలుగులో మాట పొందిక కరువైంది. తేట తెలుగు మాటల అల్లిక, స్వరమాధుర్యం కనుమరుగైంది. ఆంగ్ల వ్యామోహం వలన ప్రాథమిక స్థాయి నుండే బోధనా మాధ్యమంగా ఆంగ్లం ప్రైవేటు పాఠశాలల్లో బలపడింది. ఆధునిక ప్రసార మాధ్యమాలు, సినిమాలో వాడే తెలుగు మాటలకు ఆంగ్ల పదాలు జోడించి ప్రయోగిస్తున్నారు. భాషోద్యమంతో ప్రత్యేక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడినా ప్రభుత్వ కార్యకలాపాల్లో తెలుగుకి ప్రాధాన్యత రాలేదు. ఈ స్థితిని చక్కదిద్దటానికి మనమంతా కృషి చేయాలి.

మొట్టమొదట మనం చెయ్యవలసింది మనం తెలుగు వాళ్ళం అనే స్పృహ కలిగి ఉండడం. సాధారణంగా తెలుగు వాళ్ళ మీద వాడే ఛలోక్తి ఇతర భాషలవాళ్ళు ఇద్దరు ఎదురైతే వాళ్ళు వాళ్ళ మాతృభాషలో మాట్లాడుకుంటారు. ఇద్దరు తెలుగువాళ్ళు ఎదురైనప్పుడు వాళ్ళు ఇంగ్లీషులో మాట్లాడుకుంటారు అన్నది ఇది నూటికి నూరుపాళ్ళు యదార్థం కాదుగాని మనం మాతృభాషా స్పృహలో వెనుకబడుతున్నాం అన్నది నిజం. ఆ స్పృహను పునరుద్ధరించుకుందాము. ఇంటా బయటా బంధువులతో, మిత్రులతో, పిల్లలతో చక్కగా తెలుగులోనే మాట్లాడుకుందాము. సహజంగా వచ్చి పడే ఇతర భాషా పదాలకు అలానే కలుపుకునే మాట్లాడదాం. మన భాషా సాంస్కృతిక చైతన్యం ఉండాలి. ఇక్కడే మనం ఒక విషయం స్పష్టం చేసుకోవాలి. మనం ఏ భాషనూ ద్వేషించవలసిన అవసరం లేదు. మనం ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. మన జీవితానికి పనికొచ్చే భాషను మరచిపోకుండా ఉంటే చాలు.

విద్యారంగంలో మాతృభాషకు ప్రాముఖ్యత కల్పించాలి. పాఠశాల స్థాయిలో మాతృభాషా మాధ్యమంలో బోధన జరగవలసిన అవసరాన్ని ఎందరో మేధావులు ఇదివరకే అభిప్రాయపడ్డారు. మాతృభాషా మాధ్యమంలో చదువుకుని మహానుభావులైన వాళ్ళు ఎందరో ఉన్నారు.

''శిశువు తల్లిపాలు ఎలాంటివో విద్యార్థికి మాతృ భాషలో బోధన అలాంటిదని'' రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు. అందువలన కనీసం అయిదవ తరగతి దాకా విద్యార్థులందరూ మాతృభాషా మాధ్యమంలోనే చదువుకుంటే విద్యార్థుల సాంస్కృతిక నేపథ్యం బలపడుతుంది. మాతృభాషా శక్తి సామర్థ్యాలు తెలుస్తాయి.

ప్రతి విద్యా దశలోనూ మాతృభాషను తప్పకుండా అందరు చదువుకోవడం అవసరం. అన్ని దశలలోనూ మాతృభాషను ప్రథమభాషగా అధ్యయనం చేసుకోవాలి. ప్రపంచం చాలా విశాలమైంది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం నలుమూలల నుంచి కమ్ముకుని వికసిస్తున్నది. అది ప్రపంచ ప్రజలందరికి చేరాలంటే అనువాదం చాలా అవసరం ప్రభుత్వం దేశవిదేశాల నుండి వచ్చే విజ్ఞానాన్ని తెలుగు ప్రజలకు, విద్యార్థులకు అందించడానికి అనువాదాన్ని బాగా ప్రోత్సహించాలి. అనువాదం వ్యక్తుల అభిరుచికి వదిలిపెట్టకుండా అనువాద అకాడమీని స్థాపించి, అనువాదాన్ని అభివృద్ధి చేయాలి. అనువాదం

అభివృద్ధి అయిన కొలది మన తెలుగు భాష కూడా శక్తివంతమౌతుంది. మన తెలుగు గ్రంథాలు ఇతర భాషల్లోకి అనువాదం అవుతాయి. భాష ఆదాన ప్రధాన మైతే పలుకుబడి పరిపుష్ఠమౌతుంది.

తెలుగు భాషా సంరక్షణ అన్నది కేవలం ఒకే సెంటిమెంట్ కాదు. అదొక సామాజిక అవసరం. 'దేశ క్షేమమునకు భాషా క్షేమము పునాది' అనే వ్యావహారిక భాషోద్యమకారుడు గిడుగు రామమూర్తి పంతులు అభిప్రాయాన్ని రాజకీయ నాయకుల నుండి సామాన్య పౌరుల దాకా అందరూ ఆలోచించి అర్థం చేసుకుంటే భాషా సమస్య పరిష్కారమౌతుంది.

మన తెలుగు భాషను మనమే కాపాడుకోవాలి. ప్రతి ఒక్కరు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించాలి. తెలుగు భాష పట్ల మమకారం అంకితభావం ఉండాలి. ప్రజల వద్దకు పాలన అన్నది పరిపాలనా భాషగా తెలుగు భాషను అమలు పరిచినపుడే సాధ్యమౌతుంది. అభిమానం మాటకే పరిమితమైతే 'దేశభాషలందు తెలుగు లెస్సా' అనే పరిహాసానికి గురికాక తప్పదు. తెలుగు భాష మన ఊపిరి. మన ఊపిరిని మన చేతులారా తీసేసుకోలేము కదా? కాబట్టి మనమంతా కూడా తెలుగు భాషకోసం తెలుగు నాడికోసం కృషి చేయాలి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు పున్నమి - ప్రపంచ తెలుగు రచయితల రెండవ మహాసభలు, కృష్ణా జిల్లా రచయితల సంఘం.
2. తెలుగు పసిడి - ఆంధ్రప్రదేశ్ అవతరణ స్వర్ణోత్సవాల నేపథ్యంలో 50 ఏళ్ల తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వికాస పరిణామాల సమీక్షగా 112 వ్యాసాల సంకలనం.
3. అంతర్జాల ఆధారంగా రూపొందించినవి.

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Neglecting Women's Human Rights in Kondapalli Koteswaramma's The Sharp Knife of Memory

- Dr. Venkata Ramaiah Gampa

The Sharp Knife of Memory originally Nirjana Vaaradhi is an autobiographical work written by Kondapalli Koteswaramma in 2012. Autobiography as a genre is deeply psychological as it provides the readers to delve in the memories of the writer. The entire process of narration can be seen as an entire personal account of the events and happenings encountered by the author. An autobiography has such power so much so that we as a reader can also visualize things happening in front of our eyes. In her text the entire journey of Koteswaramma's life from childhood to the old age is emphatically mentioned. First as a child widow and later as the wife of Kondapalli Seetharamaiah, Koteswaramma evolved as a strong character until she faced the betrayal. As an enthusiastic worker of her progressive party she confronted both recognition and discrimination. The process of enduring suffering, educating herself and earning a living out of it is the most strengthening incident in her memoir.

The present article deals with the issue of Women's Human Rights in The Sharp Knife of Memory. When we talk about human rights women's rights equips a very vital space. Also we need to understand that any rights should not be taken for granted. Universal Declaration of Human Rights too upholds women rights more than any other matter. The basic factor behind the idea of UDHR is to develop a human cohesion between both the sexes. The provision of women's rights solely rests on curbing the violence against women. At the same time, it provides the suffered victims (women) to raise their voice against the social injustice. The area covered by women rights includes abortion, rape, sex trafficking, sexual harassment etc. The most prominent issue of domestic violence is also addressed under this domain.

One of the major reasons behind why these rights have been overlooked so far is based on gender discrimination. The gender based discrimination may be considered as a deadly pandemic which is just not a nation bound disease, it prevails worldwide also. It is mentioned in Article 7 of UDHR that 'all are equal before the law and are entitled without any discrimination to equal protection of the law. All are entitled to equal protection against any discrimination in violation of this Declaration and against any incitement to such discrimination.'

The chances of development are lessened if this reason of discrimination continues to be practiced. This prominent issue of biasness which is no less than a constant threat is ubiquitously highlighted in Koteswaramma's text. The rights of Koteswaramma have been exploited at several levels. She becomes a helpless victim because she cannot exercise her rights due to the biasness prevailed in the society. On one hand Koteswaramma may feel empower thinking that she has a separate identity. Whereas on the other hand the

discrimination faced by Koteswaramma by her own party members acted as a destructive force at the same time for her mentality.

In The Sharp Knife of Memory the protagonist Koteswaramma turns out to be a prey at the dominion of male hands. Although she wholeheartedly worked for her progressive political party but she is not recognized properly for her services. Nobody cares about her sentiments when she is not allowed to carry her 'burdensome' unborn child. It is very sentimental how she has to abort her offspring so that the party continues to survive. Abortion in any circumstances is regarded as a criminalized form of atrocity. From the perspective of women's human rights, one may argue why is she persuaded to adopt such a heinous crime. Secondly, why her consent is not even asked? Thirdly, why the risk factor is avoided in the entire process of abortion of the foetuses?

Lastly, if we consider the notion of gender equality than is she not provided with the proper elementary health care facility? The rights of women empower them to control their own reproductive rights. Whereas the rights of Koteswaramma are entirely violated in the text. The coerced abortion changed her mindset and it left a negative impact in her memory. Her unsafe post-abortion phase is also spent in a gloom and as a consequence her health deteriorated badly. Due to this she lost her happy life on the other side there is no change in the daily routine of her party. Here, the writer wants to show how there is no difference between the mentality of a common man and a progressive man. Though it is expected that a progressive man would behave in an erudite manner but in the text, we find how he acts as an illiterate man.

The text also illustrates how the female subjects have been treated like slaves while they were in den. All the chores related to the preparation of food, washing of clothes and the basic cleaning are attributed to be done by Koteswaramma and her fellow lady co-workers. Whereas the male counterparts used to be at the frontier by attending all the external matter. One may raise a question if it is said that each and every one is equal irrespective of their gender than why the women are subjugated by their male party members? According to Article 4 of the Universal Declaration of Human Rights nobody should be kept in a state of servitude however in the text we have seen how women were kept in bondage like slaves. The rights of women have been manipulated at a mammoth degree in the den. Like unpaid workers women exhausted themselves in all kind of menial works.

Not only this the sexuality of women workers is also on a stake while they are hiding in the den. In one of the exampleKoteswaamma highlights how one of the male workers tries to harass a woman. Such kind of debase treatment received by women is clearly a violation of Article 5 of UDHR which asserts that 'No one shall be subjected to torture or to cruel, inhuman or degrading treatment or punishment.' Although the accused person should have been severely criticized and expelled from the party for his misbehavior but instead of it nobody paid heed to the certain act of misconduct. The writer wants us to know that the plight of women is very much pathetic and there are no safety measures for them. Moreover there is no

separate room and washroom for women which contributed in making the situation more grievous.

There is just not gender based discrimination in The Sharp Knife of Memory. Ample instances of the cast based discrimination are well illustrated in the text. As per the notion of human rights the dignity of a person is very important irrespective of his or her caste, creed or gender. But a lot of violation occurs in Koteswaramma's text. It brings us to the very first article of UDHR which asserts "All human beings are born free and equal in dignity and rights. They are endowed with reason and conscience and should act towards one another in a spirit of brotherhood." This reference to human dignity is completely ignored in The Sharp Knife of Memory.

The violation of this very foremost article is firstly suggested when the writer gives instances how different kind of people received different kind of respect in the society. The upper caste society is given undue respect as compared to the lower caste people. The discrimination is perceptible when the different caste people are served food on different kind of plates. It is argued what is the need of this marginalization between lower caste people and the other person belonging from the mainstream society. The exterior pretension of superiority is entirely worthless if one cannot treat other individual as equal.

The violation of human dignity is also seen when a tenant from a lower community cannot find a suitable home for himself. The discriminatory practice by the person belonging from upper caste community is totally criticized by the author. Not only this, the prejudiced behavior against the benevolent act of a lady doctor is also unseen by the so called members of progressive party. The extensive notion of violated dignity is also applied on the life of the protagonist. The heart rending scene where she is overlooked by her own children, ditched by her husband and given no respect by the party indicates an attack on Koteswaramma's self-respect. Though she deserves a lot of respect and honor but she could get none of these. The individual rights are missing here.

Koteswaramma's life becomes empty; there is no sign of happiness neither in her mind nor in her life. She is left isolated by everyone, even by the progressive party members she worked for. She is avoided hence she could not receive any pension from her political party despite this she kept on sending the membership amount for the welfare of her party. The double standards of the progressive party is clearly shown by the writer in her work. Despite all the negativities Koteswaramma appears as a powerful character who does not blame anybody for her misfortunes. Her silent and submissive nature is in actual sense more potential than any other thing.

Thus, it can be said that the notion of women rights in relation to human rights is important to understand. A broader shift in the mindset and open ideas are necessary to diminish the prevalent violation against women. The articles of UDHR can be understood as a way to defend the entire humanity in general. It creates an essential obligation for person of all sexes to respect the dignity of the other human beings.

References :

1. Koteswaramma, Kondapalli. The Sharp Knife of Memory. Trans.Sowmya V. B. New Delhi: Zubaan books. 2015.
2. Levin, Leah. Human Rights : Questions and Answers. Trans. Vikas Despande. New Delhi. National Book Trust.1998. (10th Edition 2019)

BHAVAVEENA
Vol. 18, Issue. 7, August 2021
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

